సహృదయ వైదిక సాహిత్య ప్రచురణల గ్రంథమాల : ౮౯

యోగమీమాంసా

ఓ౩మ్

గ్రంథకర్త

స్వామీ సత్యపతి పరివ్రాజక

అనుకర్త

మనస్వీ

సంపాదకులు

ఆచార్య వేద వ్రత మీమాంసక

ప్రకాశకులు

శ్రీ కోటికె లక్ష్మయ్య

ఆర్ష గురుకులము, పడ్లూరు, కామారెడ్డి

ద్వితీయ ముద్రణ　　　　మూల్యము రూ. ౩౦=౦౦

వైశాఖము ౨౦౫౭ వి. సం.

శ్రీ విద్యా బుక్ డిపో

సుల్తాన్ బజార్, హైదరాబాద్-195. ఫోన్ : 4656644

"సహృదయ వైదిక సాహిత్య ప్రచురణలు" వారు ప్రచురించిన నూతన గ్రంథములు

శ్రీ లోకామల్హరి గారి ప్రచురణలు

౧. మనుస్మృతి	7.00
౨. సామాజిక వ్యవహారము	2.00
౩. వైదిక ధర్మ విజయము	2.00
౪. ఈశ్వరావతారము	2.00
౫. దేవతానిరూపణము	2.00
౬. ఎవరి ఆరాధన ?	2.50
౭. నమస్తే	2.00
౮. వైదిక సామ్యవాదము	5.00
౯. వేదజ్ఞానము	3.00
౧౦. బంగారుబాట దయానందుని మాట	2.00
౧౧. పృథివీమాత	2.00
౧౨. ఆర్యసమాజ ఉద్దేశ్యములు	2.00
౧౩. మునివరుడు పండిత గురుదత్త విద్యార్థి	6.00
౧౪. వర్ణవ్యవస్థ	2.00
౧౫. పితృశ్రాద్ధము	2.00
౧౬. కర్మఫలము	20.00
౧౭. వైదిక సంధ్యాగ్నిహోత్రవిధి	3.00
౧౮. మూర్తిపూజ తత్సంబంధ భావములు	2.50
౧౯. వీరమాత	3.00
౨౦. మీకు తెలుసా ?	3.00
౨౧. శ్రీ గణేశుని రహస్యము	2.00
౨౨. ప్రాణస్వరూపము	2.00
౨౩. ఆర్యసమాజం - దివ్యస్వరూపం	2.00

భావజం కుమారస్వామి రచనలు

౨౪. గృహము - గృహస్థుడు	1.50
౨౫. బుద్ధి వికసించేదెలా?	1.50
౨౬. బ్రహ్మచర్యం	1.00
౨౭. తేనీరు (చాయ్) భయంకర విషము	1.00
౨౮. జీవిత సమస్యలకు సరియైన సమాధానము	1.50
౨౯. ముందడుగు	1.50
౩౦. ఆర్యసమాజ నిమంత్రణము	1.50

లోకమల్హరిగారి రచనలు

౩౧. వైదిక భక్తివాదము	2.00
౩౨. సంధ్యోపాసన విధి	3.00
౩౩. మర్యాదాపురుషోత్తముడు శ్రీరామచంద్రుడు	1.50
౩౪. గాయత్రిమాత	2.00
౩౫. మానవుడవగుము	2.00
౩౬. భక్తి	1.00
౩౭. సద్గురు దండి విరజానందులు	1.25
౩౮. మృత్యుంజయ మహామంత్రము	2.00
౩౯. ఆర్యుల ఆదిదేశము	2.00
౪౦. జిజ్ఞాసువుల ఆరుప్రశ్నలు ఆచార్య విష్ణుదయాల్	3.00
౪౧. మీ హితమేది	3.00
౪౨. సమిష్టి సుఖజీవనము	5.00
౪౩. దేవునకు మానవులకు మధ్య అడ్డుగోడలు	2.00
౪౪. శివరాత్రి రహస్యము	3.00
౪౫. తత్త్వవేత్త శ్రీ దయానందులు	2.00
౪౬. స్వామి శ్రద్ధానందులు	1.50
౪౭. యజ్ఞోపవీతము	1.00
౪౮. ఈశ్వరసిద్ధి	2.00
౪౯. గోమాత	1.50
౫౦. ధర్మాధర్మములు	1.50
౫౧. శివమహోత్సవము	2.00

సహృదయ వైదిక సాహిత్య ప్రచురణల గ్రంథమాల : ౮౯

యోగమీమాంసా

ఓ౩మ్

గ్రంథకర్త

స్వామీ సత్యపతి పరివ్రాజక

అనుకర్త

మనస్వీ

సంపాదకులు

ఆచార్య వేద వ్రత మీమాంసక

ప్రకాశకులు

శ్రీ కోటికె లక్ష్మయ్య

ఆర్ష గురుకులము, పడ్లూరు, కామారెడ్డి

ద్వితీయ ముద్రణ

మూల్యము రూ. ౩౦=౦౦

వైశాఖము ౨౦౫౯ వి.సం.

యోగమీమాంసా

శ్రీ స్వామి సత్యపతి పరివ్రాజక

సంపాదకులు : ఆచార్య వేదవ్రత మీమాంసక

ప్రథమ ముద్రణము ౨౦౦౦ ద్వితీయ ముద్రణము ౧౦౦౦

సృష్టి సంవత్సరము ౧౯౭౨౯౪౯౧౦౧

విక్రమ సంవత్సరము ౨౦౫౭

దయానందాబ్దము : ౧౭౭

క్రీ. సం. ౨౦౦౦

మూల్యము రూ॥ 30.00

ప్రాప్తిస్థానము :

౧. ఆర్షగురుకులము, పడ్లూరు, కామారెడ్డి, ౫౦౩౧౧౧ దూరభాష సంఖ్య: ౨౩౫౮౫, ౨౩౬౨౧

౨. శ్రీ కోటికె లక్ష్మయ్య, శ్రీ విద్యాబుక్ డిపో, భాగ్యనగరము ౧౯౫
దూరభాష సంఖ్య: ౪౬౫౬౬౪౪

౩. శ్రీ విద్యా బుక్ సిండికేట్, హరిద్వార్ బిల్డింగ్, కోఠి, భాగ్యనగరము.
దూరభాష సంఖ్య: ౪౬౦౮౭౯౫

౪. శ్రీ విద్యాబుక్ డిస్ట్రిబ్యూటర్స్, కుత్బిగూడ, భాగ్యనగరము.
దూరభాష సంఖ్య: ౪౬౫౧౮౨౪

౫. శ్రీ విద్యా బుక్ పాయింట్, రామాటాకీస్ ఎదురుగ, విశాఖపట్నం - 3.
దూరభాష సంఖ్య: ౫౭౫౭౦౩

౬. వైదిక సాహిత్య భండార్, సుల్తాన్ బజార్, భాగ్యనగరము.

౭. బ్రహ్మచారి మురళి, జూలమ్మ గుడిపక్క, రెజిమెంటల్ బజారు, సికింద్రాబాద్.

౮. బోగ సత్యనారాయణ, ఆర్య సమాజము, నిజామాబాద్

౯. మల్లి కృష్ణా రెడ్డి, ఉపదేశక విద్యాలయము, మలక్ పేట, భాగ్యనగరము.

★★★

శ్రీ స్వామీ సత్యపతి పరివ్రాజక పరిచయము

ఆచార్య షడ్దర్శన అధ్యాపన యోగ శిక్షణ శివిరము

ఆర్య వనవికాస, రోజడ్, సాగపూర్, జిల్లా సాబర్ కాంతా
అహమదాబాదు (గుజరాత్)

★ జననము దాదాపు ౭౩ సం. లకు పూర్వము ఫర్మానా, రోహతక్, హరయాణా.

★ ౧౭ సం. ల వయసువరకు నిరక్షరాస్యుడు, పశువులకాపరి, వ్యవసాయ కూలి.

★ ౧౮ వ ఏట భారత పాక్ విభజన భీకర ఘట్టములను విని తీవ్ర వైరాగ్యము.

★ ౧౯ వ ఏట గృహత్యాగము, సమాధిస్థితి కలిగియుండుట అది సమాధియని తెలియకున్నను దానిని అభ్యసించుచుండుట.

★ ౨౨ వ ఏట ఝజ్జర్ గురుకులములో చేరి ౧౨ సం. లు వేదవేదాంగముల అధ్యయనము.

★ తర్వాత రెండేండ్లు మీమాంసా, శతపథముల అధ్యయనము.

★ తర్వాత ౪ ఏండ్లు యోగాభ్యాసము, ఆర్షపాఠ్యవిధి ననుసరించి చదువు విద్యార్థులకు సహాయ మిప్పించుట.

★ ఆపైన నాలుగు సంవత్సరములు యోగమున విశేష కృషి, సంన్యాస గ్రహణము.

★ పిదప ౧౪ సంవత్సరములు భ్రమణము చేయుచు యోగప్రచారము దర్శనముల అధ్యాపనము.

★ తర్వాతి పది సంవత్సరములు విద్వాంసులైన ప్రౌఢ నైష్ఠిక బ్రహ్మచారులకు అహమదాబాదులో యోగ శిక్షణ సహిత షడ్దర్శన అధ్యాపనము.

★ తర్వాత దేశ విదేశాలలో నిరంతర యోగ విద్యాప్రచారము.

★ ★ ★

ప్రకాశకీయము

ప్రథమ ముద్రణ

ప్రచార సాధనములలో సాహిత్యప్రచురణ ఒకటి. సాహిత్యము నెంత వ్యాపింప జేసిన అంత ప్రచారము జరుగగలదు. ఈ విషయమును దృష్టియందుంచుకొని మేము పత్రిక సంచాలనముతో బాటు వైదిక సాహిత్యము ననువదించియు, రచించియు ''వేద ధర్మగ్రంథమాల'' అనుపేర ప్రచురణ ప్రారంభించినాము. ఇంతవరకు ౧. ఋషి దయానందుడు, ౨. వేదోక్త ఈశ్వరుడు- ఆధునిక విజ్ఞానము, 3. ఆర్యోద్దేశ్య రత్నమాల, ౪. వైదిక వృష్టివిజ్ఞానము మొదలగు ౧౦ పుస్తకములు ప్రచురింపబడినవి. చిన్నవి, పెద్దవి కనీసము వందపుస్తకములు వెలువరింప దలచినాము. సిద్ధాంతపరమైన పుస్తకములు రచించుట కఠినము. వానిని ముద్రించుట అంతకన్న కఠినము. వానిని విక్రయించుట ఇంకా కఠినము. విక్రయింపబడకున్న ధనము ఆగిపోయి ఇతర పుస్తకముల ప్రచురణ నిలిచిపోవును. పుస్తకములను విక్రయింప జేయుటకు ఉత్సాహవంతులైన వ్యక్తులు ప్రయత్నించవలసియుండును. అట్లు చేసినచో మేము అధికాధిక పుస్తకములను ముద్రించగలము.

భగవంతుని కృపవలన ఇంతపెద్ద పుస్తకమును ప్రచురింప గలుగుచున్నాము. లుప్తప్రాయమైన యోగ విజ్ఞానమును ఆవిష్కరించి, ప్రయోగించి, జన సామాన్యులకు అర్థమగు భాషలో యోగమీమాంసను రచించిన శ్రీ స్వామీ సత్యపతిగారికి మా కృతజ్ఞతలు.

ఆశ్వీయుజము, లో ౨౦౪౪ వి. సం. ప్రకాశకులు

ద్వితీయ ముద్రణ

ప్రతులు అయిపోయిన కారణమున కొరత ఏర్పడినది. దీనిని పూర్తి చేయుటకు శ్రీ కోటికె లక్ష్మయ్య, శ్రీ విద్యాబుక్ డిపో వారు ద్వితీయ ముద్రణ గావించినారు.

గురుకులము ద్వారా మొత్తము ముప్పదికి పైననే పుస్తకములు ముద్రింపబడినవి. ఈ పుస్తకము లన్నియు **శ్రీ విద్యాబుక్ డిపో** వారి వద్ద లభించును.

వైశాఖము ౨౦౫౭ వి. సం. ప్రకాశకులు

విషయసూచిక

★★★

అనువాదకుని మాట

దాదాపు ఎనమిది సంపత్సరముల క్రితము శ్రీ ఆచార్య వేద వ్రత మీమాంసకులు ''యోగభ్రాంతులు'' అను పేర ''దయానంద సందేశ్'' అను మాసపత్రికలో ప్రకటింపబడిన పూజ్య శ్రీ స్వామీ సత్యపతి పరివ్రాజకుల వ్యాసములను అనువదింప ప్రేరేపించిరి. యోగము గురించిన పరిజ్ఞాన మేమాత్రము లేకున్నను నేనా వ్యాసముల తెనిగింప సాహసించి పూర్తి చేసితిని. భాషపైనను, విషయముపైనను అధికారము లేమి, శబ్దానువాదమునే ఆశ్రయించితిని. మూడేండ్ల క్రితము 'యోగమీమాంస' పూర్వార్ధమును గూడ తెనిగింప సాహసించుటకు శ్రీ ఆచార్యులవారి సాన్నిధ్యమున నివసించుచుండుటయే కారణము. వారికి నే జేసిన యనువాదము నామూలాగ్రముగ పరిష్కరింప వలసి వచ్చినది. అందుకు వారు మిక్కిలి శ్రమించి భాషను, అనువాదశైలిని మార్చి, దానికి క్రొత్త రూపము నొసగినారు. ఐనను అనువాదకునిగా నా పేరునే యుంచుట వారి యౌదార్యమును వెల్లడించుచున్నది. గురుస్థానమున నున్న వారికి నే నెంతయు ఋణపడియున్నాను.

వారికి తీరిక యుండనందునను, ముద్రణ శీఘ్రముగా జరుగవలసి యున్నందునను గ్రంథమును పరిష్కరించుటలో తొందరపడవలసి వచ్చినది. కావున నిందేవైన పొరపాటు లున్న నవి నావి, గుణములు వారివి అగుట సహజమే గదా! పాఠకు లట్లే గ్రహింతురు గాక! పొరపాటు లున్న, సూచించినచో సత్యమును గ్రహించుటకు సర్వదా సిద్ధమే.

ఆశ్వీయుజము సం.౯/౨౧౧ సం.. మనస్వీ

సంపాదకీయము

మనుష్యుడు సుఖము నభిలషించును. అతనికి సుఖముతో బాటు దుఃఖము లభించును. ఒక్కొక్కసారి దుఃఖమే లభించును. జన్మము దుఃఖమే. ★ జరా (ముసలితనము) దుఃఖమే. మరణము దుఃఖమే. మరణమే కాదు, దాని స్మరణము కూడ దుఃఖమే. ★★ సంయోగ వియోగ ములు, నానాబాధలు దుఃఖములే. దుఃఖములేని కేవల సుఖము ప్రపంచమున ఎచ్చటను లేదు. ★★★

ఒక దుఃఖము మరొకదానికన్న మిన్న. మృత్యువు అన్నిటికన్న ఘోరమైన దుఃఖము. దానికి మించిన దుఃఖ ముండదు. ధనము దొంగిలింపబడినచో మనుష్యుడు బాధపడును. ఐనను జీవించును. కాళ్లు చేతులు విరిగినను బాధపడును. ఐనను జీవించియే యుండును. రోగములతో బాధపడుచున్నను జీవించును. జీవితమే సుఖము. కొన్ని కష్టములతో బాటు సుఖముగూడ తప్పక లభించును. కాని మరణము సమస్త సుఖములను హరించును. నామ మాత్రమునకైనను మిగుల్చదు. కావున మరణము నెవ్వరును ఇష్టపడరు. ఒకవేళ మానవుడు మరణమును నిర్మూలించగలిగెనేని అతనికి ప్రపంచములో మహాదుఃఖము లేవియు మిగులవు. మరణమునుండి తప్పించు ఉపాయము ఇంతవరకు కనుగొనబడ లేదు. మరణము తప్పదు. ''జాతస్య హి ధ్రువో మృత్యుః''.

మృత్యువును లంఘించు ఉపాయమును వేద మీ విధముగ తెలిపినది.

వేదాహమేతం పురుషం మహాంతమాదిత్యవర్ణం తమసః పరస్తాత్।
తమేవ విదిత్వాఽతిమృత్యుమేతి నాన్యః పంథా విద్యతేఽయనాయ ॥యజు.౩౧-౧౮॥

తాత్పర్యము : 'ప్రకాశస్వరూపుడు, అంధకారమున కతీతుడు, సర్వవ్యాపకుడునైన ఆ భగవంతునినే నెఱుగవలయును. అతని నెఱిగియే మృత్యువును (మానవుడు) లంఘించును, మృత్యు దుఃఖము నుండి విడిపోవును. ప్రపంచములో ముందు కేగుటకు ఇదిగాక వేరొక మార్గము లేదు.' భగవంతుని తెలిసికొను ఉపాయమును యోగ మందురు.

అవిద్యయా మృత్యుం తీర్త్వా విద్యయాఽమృతమశ్నుతే (యజు.౪౦-౧౪)

శుద్ధమైన కర్మోపాసనలచే మానవుడు మృత్యువును జయించును. జ్ఞానముచే మోక్షమును సంపాదించును.

జ్ఞానకర్మోపాసనలద్వారా భగవంతుని తెలిసికొనుపద్ధతి ప్రముఖముగా యోగదర్శనములో ప్రతి పాదింపబడినది. మహర్షి పతంజలి, మహర్షి వ్యాసుడు ఈ పరమ విజ్ఞానమును మానవుల

★ '' వివిధ బాధనాయోగాద్ దుఃఖమేవ జన్మోత్పత్తిః'' (న్యాయ. ౪-౧-౫౫)

★★ మనుష్యుడు మరణము అను శబ్దమును విననొల్లడు. అంతేకాదు మరణశబ్దమునే అపశకునముగా భావించును.

★★★ 'కుత్రాపి కోఽపి సుఖీ న' (సాంఖ్య. ౬-౭); 'న దృష్టాత్ తత్సిద్ధిః' (సాంఖ్య.౧-

కందించినారు. యోగముద్వారా మానవుడు మృత్యువును లంఘించి మోక్షమును సంపాదించగలడు. దీని నాధారముగా జేసికొని అనేకులు తమ జీవితములను తరింపజేసికొన్నారు.

యోగము అతిపవిత్రమైన దని జనులు దీనియెడ శ్రద్ధను ప్రదర్శింతురు. దీని నండగా గొని కొందరు స్వార్థులు, అజ్ఞానులు ప్రజలను మోసగించుచున్నారు. భ్రమింపజేయుచున్నారు. ఒక విధముగ గాక, అనేక పేర్లతో అనేక విధములుగ భ్రాంతులను వ్యాపింపజేయుచున్నారు. పరివ్రాజక శ్రీ స్వామీ సత్యపతి ఈ భ్రాంతులను నిర్మూలించుటకు అనేక వ్యాసములు వ్రాసెను. వాటిని ఒకచోట్ల చేర్చి ప్రచురింప దలచెను. ''యోగభ్రాంతులు'' అను నీ వ్యాసములవలన యోగమునకు సంబంధించిన భ్రాంతులు తెలియగలవు. ''దానికి పూర్వము యోగమును గురించి వ్రాసినచో పాఠకులకు అధిక లాభ మగు'' నని నేనాయనతో నంటిని. ఆయన దాని నంగీకరించెను. యోగమున తెలిసికొన వలసిన విషయములను సంక్షిప్తముగా పూర్వార్ధరూపములో వ్రాసెను.

యోగమనగా చిత్తవృత్తులను నిరోధించి భగవంతుని యందు తన ఆత్మను నిమగ్నము చేయుట. ప్రస్తుతము ఈ యర్థమును మరుగున పడవేసి యోగమనగా అనేక కల్పిత మాన్యతలను పేర్కొను చున్నారు. యోగమనగా పైన పేర్కొనబడిన అర్థమొకటే. కాని ఇప్పుడు రాజయోగమని, జ్ఞానయోగమని, భక్తియోగ మని, సాంఖ్యయోగ మని, విషాదయోగ మని, సంన్యాస యోగమని, కర్మసంన్యాస యోగ మని, ధ్యానయోగ మని, హఠయోగ మని, మంత్రయోగ మని, లయయోగ మని, సరళయోగ మని అనేక నామములతో అనేకులు అనేక విధములుగ ప్రచారము చేయుచున్నారు.

శ్రీ స్వామీ సత్యపతి స్వానుభవపూర్వకముగా రచించిన ఈ గ్రంథములో రెండుభాగము లున్నవి. పూర్వార్ధమున యోగము యొక్క వాస్తవిక స్వరూపము వర్ణింపబడినది. ఉత్తరార్ధమున యోగము పేర వ్యాపించిన అనేక భ్రాంతులు పేర్కొనబడినవి. వాటివలన యోగాభ్యాసమునకై ప్రయత్నించువారు యోగమునకు విముఖులగుచున్నటుల నిరూపించబడినది. ఈ పుస్తకమును చదివి యోగసాధకులు వేదసిద్ధాంతమునకు, ఋషుల సిద్ధాంతమునకు అనుకూలమైన యోగము ననుసరించగలరు.

యోగసాధకు లనేకులు యోగము ఒక జన్మలో సాధ్యముగాదని, గృహస్థులకు సాధ్యము గాదని నమ్ముదురు. ఆర్యసమాజములో యోగులు లేరని, స్త్రీలు యోగాభ్యాసము చేయుట కర్హులు కారని నమ్మువా రనేకులు గలరు. ఆర్యసమాజకులలో కొందరు యోగము గురించి బుద్ధివిరుద్ధము, సృష్టివిరుద్ధము, ప్రమాణవిరుద్ధము లైన అభిప్రాయములు కలిగి యున్నారు. వాటి నన్నిటిని వేద, శాస్త్ర, ప్రమాణవిరుద్ధములని స్వామీ సత్యపతి నిపుణముగా నిరూపించినాడు.

కొందరు యోగమనగా ప్రపంచమునకు పనికిరానివారు, అడవులలో కూర్చుండి ముక్కు మూసికొని చేయు కర్మ యని యనుకొందరు. మరికొందరు యోగము జనసామాన్యమునకు నిరుపయోగ మని నమ్ముదురు. స్వామీ సత్యపతి ఈ పుస్తకములో వేదాది శాస్త్రప్రమాణములద్వారా ప్రపంచములోని ప్రతిమానవుడు యోగాభ్యాసము చేయగలడని, చేసి తీరవలయునని, చేయు టవసర మని తెలిపినాడు. యోగాభ్యాసమును పదలి పశుపాలనము, కృషి, గోరక్ష, వ్యాపారము, రాజ్య సేవ మొదలగు

కర్మలన్ని సక్రమముగా చేయబడజాలవని దృష్టాంతముల ద్వారా ప్రతిపాదించినాడు.

నేడు యోగముపేర ఎన్నియో పద్ధతులు ప్రచలితమైనవి. వానివలన యోగము యొక్క వాస్తవిక స్వరూపము మరుగున పడిపోయినది. యోగముపేర వ్రాయబడిన వందలాది గ్రంథములు ఇట్లే యున్నవి. యోగదర్శనభాష్యము పేరుతో, వ్యాస భాష్యము యొక్క వ్యాఖ్య, టీక, టిప్పణుల పేర్లతో, వ్రాయబడిన పెక్కు గ్రంథములు, వ్యాసములు వెలువడినవి. ఇవి మౌలిక విషయములందు పతంజలి సూత్రములకును, వ్యాసభాష్యమునకును అతిదూరముగ నున్నవి. స్వామీ సత్యపతి సాహచర్యమున నుండి, వారు చూపిన యోగము ననుసరించి చదువుదును. యోగము నభ్యసింతును. కావున పతంజలి సూత్రముల పేర, వ్యాసభాష్యము పేర ప్రచలితమైన గ్రంథములు మానవులను యోగమునుండి దూరము చేయున వని చెప్పగలను. యోగమీమాంసను చదివినవారికి ఈ సత్యము విదితము కాగలదు. నేడు వాస్తవిక యోగము లుప్తప్రాయమైన దనవచ్చును. వేదములో, ఆర్షగ్రంథములలో వ్రాయబడిన వాస్తవిక యోగమును 'యోగమీమాంసా' ప్రతిపాదించును. యోగముపేర ప్రచలితమైయున్న వందలాది భ్రమలను నివారించును. వాస్తవిక యోగమును, దాని సాధనములను తెలియజేయును. యోగాభ్యాసము పేర చేయబడు దేశ విదేశములలోని వ్యక్తుల ప్రయత్నములు యోగమునకు సర్వథా విరుద్ధము లైన వని దీనిని చదివిన ప్రతివ్యక్తి తెలిసికొనును.

భాషాంతరీకరణము రెండు రకములు. ఒకటి శబ్దానువాదము. రెండవది అర్థానువాదము. శ్రీ మనస్వీ శ్రమించి తత్పరతతో 'యోగమీమాంసా'ను తెనిగించినాడు. దానిని సమయము లభించినంతలో పరిష్కరించితిని. శబ్దానువాదముతో బాటు అర్థానువాదము గూడ ఉండునటుల సవరించితిని. మూలపుస్తకము యొక్క అభిప్రాయమును సురక్షితముగా నుంచ యత్నించితిని. అవసర మని తోచిన చోట టిప్పణులను వ్రాసితిని. ఈ గ్రంథములో ఎక్కడనైన ఏవైన పొరపాట్లు కనిపించిన సూచించ గలరు. సత్యము అంగీకరింపబడును.

పాఠకు లీపుస్తకమును చదివి వాస్తవిక యోగమును తెలిసికొని, అనుసరించి కృతార్థులై, ఇతరులను కృతార్థుల జేయుదురు గాక!

ఆచార్య వేదవ్రత మీమాంసక
ఆర్షగురుకులము
వడ్లూరు కామారెడ్డి,
జిల్లా ఇందూరు

గ్రంథ సంకేతములు

ఋగ్.	-	ఋగ్వేదము (మండలము, సూక్తము, మంత్రము)
యజు.	-	యజుర్వేదము (అధ్యాయము, మంత్రము)
అథర్వ.	-	అథర్వవేదము (కాండము, సూక్తము, మంత్రము)
యోగ.	-	యోగ దర్శనము (పాదము, సూత్రము)
యోగ. వ్యా. భా.	-	యోగ దర్శనము వ్యాసభాష్యము (పాదము, సూత్రము)
సాంఖ్య.	-	సాంఖ్య దర్శనము (అధ్యాయము, సూత్రము)
న్యాయ.	-	న్యాయ దర్శనము (అధ్యాయము, ఆహ్నికము, సూత్రము)
వైశే.	-	వైశేషిక దర్శనము (అధ్యాయము, ఆహ్నికము, సూత్రము)
వేదాంత.	-	వేదాంత దర్శనము (అధ్యాయము, పాదము, సూత్రము)
చరక.	-	చరక సంహిత (స్థానము, అధ్యాయము, శ్లోకము)
బృహ.	-	బృహదారణ్యకోపనిషత్తు (అధ్యాయము, బ్రాహ్మణము, ఖండిక)
ముండ.	-	ముండక ఉపనిషత్తు (ముండకము, ఖండము, శ్లోకము)
కేన.	-	కేన ఉపనిషత్తు (ఖండము, శ్లోకము)
కఠ.	-	కఠ ఉపనిషత్తు (వల్లీ, శ్లోకము)
మను.	-	మనుస్మృతి (అధ్యాయము, శ్లోకము)
నిరు.	-	నిరుక్తము (అధ్యాయము, పాదము, ఖండము)
శతపథ.	-	శతపథ బ్రాహ్మణము
స. ప్ర.	-	సత్యార్థ ప్రకాశము (సముల్లాసము)
ఋ. భా. భూ.	-	ఋగ్వేదాది భాష్యభూమిక (విషయము)
ఆర్యో.	-	ఆర్యోద్దేశ్యరత్నమాల
సంస్కార.	-	సంస్కారవిధి
గీత.	-	భగవద్గీత
పంచ.	-	పంచతంత్రము
ఆర్య స. ని.	-	ఆర్యసమాజ నియమములు

★★★

భూమిక

యోగము విశ్వమానవ కల్యాణమునకు ఆధారము. యోగ ప్రచార ప్రసారమొనర్చుట, దానిని జీవితములో అనుసరించుట ప్రతి మనుష్యుని ముఖ్య కర్తవ్యము. కావున యోగ విషయమున వ్రాయ బూనితిని. ఈ గ్రంథరచనకు ముఖ్యోద్దేశ్యము వైదిక యోగమువలన నాకు కలిగిన లాభమును ఇతరులకు అందజేయుట మరియు యోగము పేర వ్యాపించిన భ్రమలను తొలగించుట.

దీని పూర్వార్ధమున యోగదర్శనము ననుసరించి యోగముయొక్క వాస్తవ స్వరూపము, దాని ఫలము, సాధనములు, బాధకములు మున్నగు విషయములను తెలుప యత్నించితిని. ఈ పూర్వ భాగము యొక్క అధ్యయన మననాదులవలన యోగ జిజ్ఞాసువు సులభముగా యోగ మార్గమున నడచి సఫలతను పొందగల్గును. ఇతరులకు గూడ మార్గదర్శనము చేయగల్గును. దీని ఉత్తరార్ధమున యోగ భ్రాంతుల సమీక్ష గలదు. ఇవి రచనలద్వారా ఉపదేశములద్వారా ఆచరణద్వారా దేశ విదేశములలో ప్రచారము చేయబడుచున్నవి.

ఈ యోగ భ్రాంతులను చక్కగా తెలిసికొనకుండ యోగమార్గము ననుసరించుట అతి కఠినము. అందరి హితముకొరకే వీటిని ఖండించుచున్నాను. హానికొరకు కాదు. పక్షపాతము వీడి సత్యమును సత్యమని, అసత్యమును అసత్యమని తెలుపుటయే నా ముఖ్యోద్దేశ్యము. వేదము, వేదానుకూల గ్రంథముల అధ్యయనము మరియు క్రియాత్మక యోగాభ్యాసము వలన నేను నిర్ణయమునకు వచ్చిన దేమన మానవుని సమస్త దుఃఖములను తొలగించి మోక్షానందమును కలుగజేయు సాధనము వైదిక యోగము తప్ప మరొకటి లేదు. ఈ గ్రంథమున ఏదైన పొరపాటున్నచో సప్రమాణముగ తెలియపరచిన సరిచేయబడును.

మొదట పరమాత్మునికి నా కృతజ్ఞతలు. అతని అపారకృపవలననే నేనీ గ్రంథమును వ్రాయ సమర్థుడనైతిని. ఏయే ఋషుల మహర్షుల గ్రంథములను చదువుటవలన యోగముయొక్క వాస్తవిక స్వరూపమును తెలిసికొనగలిగితినో ఆయా ఋషులకు మహర్షులకును కృతజ్ఞుడను. ఎవరెవరి వద్ద నేను విద్యనభ్యసించితినో ఆ విద్వాంసులకును ఋణపడియున్నాను. ఈ గ్రంథ రచనలోను సంశోధనలోను సహాయపడిన విద్వాంసులకును, మహానుభావులకును ధన్యవాదములు.

ఇట్లు

స్వామీ సత్యపతి పరివ్రాజక

అభినందన

డా॥ మసన చెన్నప్ప

ఎం.ఏ., ఎం.ఫిల్., పి.హెచ్.డి.

ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాదు.

''శైశవేఽభ్యస్త విద్యానామ్
యౌవనే విషయైషిణామ్
వార్ధకే మునివృత్తీనామ్
యోగేనాంతే తనుత్యజామ్''

రఘువంశంలో కాళిదాసు రఘువంశ రాజుల విషయంలో చెప్పిన ఈ శ్లోకం సమస్త మానవకోటికి వర్తిస్తుంది. బాల్యంలో వేదాధ్యయనంతోపాటు సమస్త విద్యలను గ్రహించాలి. బ్రహ్మ చర్యం పాటించాలి. గృహస్థుడుగా ఉండి సాంసారిక సుఖాలను అనుభవించాలి. అతిథి సత్కారాలను నిర్వహించాలి. వార్ధక్యం సమీపంచగానే వానప్రస్థుడై ముని వృత్తిని అవలంబించాలి. చివర యోగం చేత శారీరాన్ని పరిత్యజించి అమృతత్వాన్ని సిద్ధింప చేసుకోవాలి. ఇదీ కాళిదాసు చెప్పిన చతురాశ్రమధర్మం.

ఒక్క యోగం మాత్రమే మానవుణ్ణి దుఃఖాలనుండి దూరంగా ఉంచే సాధనం! శాశ్వతంగా దుఃఖాన్ని తొలగించి మోక్షాన్ని సాధింపజేసే విద్య! ఇట్టి యోగం పేర మనకు అనేక గ్రంధాలు లభిస్తున్నాయి. ఏ గ్రంథమైనా లేదా ఏ రచన ఐనా పతంజలి యోగ దర్శనాన్ని అనుసరించినప్పుడే అది మనకు యోగ సాధనలో ప్రవేశాన్ని కల్గించగల్గుతుంది. ఒక మాటలో చెప్పాలంటే యోగం అనుభవ పూర్వకంగా తెలుసుకొని ఆచరించవలసిన ప్రక్రియ. పుట్టిన మానవుడు యోగ సాధనచేత మాత్రమే పరిపూర్ణుడౌతాడు.

హిందీలో స్వామీ సత్యపతి పరివ్రాజకులు రచించిన 'యోగ మీమాంస'ను యోగ సాధనకుశలురైన శ్రీ మనస్వీగారు తెనిగించి మనకందిస్తున్నారు. మనస్వీ వైదిక వాఙ్మయంతో, దర్శన గ్రంథాలతో బాగా పరిచయం ఉన్నవారు. పరివ్రాజకులుగా ప్రసిద్ధి చెందిన వారు. యోగం గురించి మాట్లాడాలన్నా, వ్రాయాలన్నా దాన్ని అనుభవపూర్వకంగా తెలుసుకొన్న వారికి మాత్రమే అది సాధ్యమవుతుంది. మనస్వీ ఎంతోకాలంగా యోగ సాధనలో నిమగ్నమై

ఉన్నవారు. వారు ఈ గ్రంథాన్ని తెనిగించడానికి అన్ని విధాల యోగ్యత ఉన్నవారు. వారి తెలుగు సేతను గమనించినప్పుడు వారికి యోగ విషయం మీదనే కాక భాష మీద కూడ మంచి పట్టు ఉన్నట్లు బోధపడుతుంది.

ఈ సందర్భంగా జితేంద్రియులు, పరివ్రాజకులు, మంచి మనసున్న మనస్వీగారి కృషిని అభినందిస్తూ, ఇంతమంచి గ్రంథాన్ని ముద్రించి మన కందిస్తున్న, వైదిక గ్రంథ ప్రకాశకులు ధార్మిక వ్యాపార వేత్త శ్రీ కోటికె లక్ష్మయ్య గారికి నా సంతోషాన్ని ప్రకటిస్తున్నాను.

యోగం విషయంలో సామాన్యులకు గాని, సాధకులకు గాని ఉన్న సందేహాలను చీకట్లను సూర్య కాంతివలె ఈ గ్రంథం పటాపంచలు చేస్తుంది. ఉత్తమ యోగ సాధకులకు ఉత్తమ గ్రంథం ఈ యోగ మీమాంస. దీన్ని పఠించి తమ జీవితాలను ధన్యం చేసుకోవలసిన బాధ్యత ఇక పాఠకులదే కాని దేనని భావిస్తూ విరమిస్తున్నాను.

బుధ జన విధేయుడు

ఎం. చెన్నప్ప

(మనన చెన్నప్ప)

ఓ౩మ్

యోగమీమాంసా

యోగము యొక్క వాస్తవిక స్వరూపము

మానవజీవన కల్యాణమునకు యోగము ఆధారము. యోగములేకున్న ఇతర సాధనములెన్ని యున్నను అవి పూర్ణానందమును కలిగింపజాలవు. ప్రతి ప్రాణి సమస్త దుఃఖములను విడిచి దుఃఖమిశ్రితముకాని శాశ్వతమైన పూర్ణసుఖమును పొందగోరును. ఈ కోరిక యోగమువలననే నెరవేరును. కావున యోగముయొక్క వాస్తవ స్వరూపమును తెలిసికొనుట, తెలుపుట మరియు యథాశక్తి దానిని అనుసరించుట, అనుసరింపజేయుట ముఖ్యోద్దేశము. యోగస్వరూపము తెలియక, దానిని అనుసరింపక మానవ జాతి దుఃఖసంతప్తమై యున్నది. ఈనాడు యోగము పేర ఎన్నియో ప్రయత్నములు చేయబడుచున్నవి. కాని యోగ స్థానమున అయోగము నేర్పబడుచున్నది. ఈ అసత్య యోగమును అరికట్టకున్నచో దాని ఫలితము అతి భయంకరముగ నుండును. ఈ అంధపరంపర వలన వాస్తవమైన యోగము గూడా కలంకిత మువును. కావున యోగము యొక్క వాస్తవిక స్వరూపమును తెలిసికొనుట మిక్కిలి అవసరము. ఏది యోగమో ఏది కాదో మనుష్యుడు తెలిసికొనుటకు, ఆత్మ కల్యాణముతో బాటు ఇతరుల కల్యాణమునుగూడ చేయగల్గుటకు యోగమును గూర్చి వ్రాయబూనితిని. ఈ గ్రంథములో పూర్వభాగమున యోగస్వరూపము, యోగఫలము, యోగ సాధనములు మరియు యోగమార్గమున సంభవించు విఘ్నముల స్వరూపమును తెలుప యత్నించితిని. యోగము పేర ప్రచలితమైన భ్రాంతుల గురించి ఉత్తరభాగమున వ్రాయబడినది. ఈ రెండు భాగములను చదివినచో వాస్తవికయోగమేదియో, యోగము పేరనేర్పబడుచున్న అయోగమేదియో తెలిసిపోవును. బుద్ధిమంతులు, యోగజిజ్ఞాసువులు దీనిని చదివి, చదివించి స్వపరహితకారకులగుదు రని ఆశించుచున్నాను.

యోగశబ్ద వివేచనము

''యుజ్ సమాధౌ'' కు 'ఘఞ్' ప్రత్యయము చేర్పుటవలన యోగశబ్ద మేర్పడును. ఇతర ధాతువులచే ఏర్పడిన యోగశబ్దము యోగదర్శనమున గ్రహింపబడదు. ఏలన వ్యాసభాష్యమున ''యోగః సమాధిః'' (యోగ. ౧-౧) యోగమనగా సమాధి. ఇది అన్ని అవస్థలలో నుండునట్టి చిత్త ధర్మము- అని కలదు. చిత్తమునకు ఐదవస్థలు గలవు. **''క్షిప్తం మూఢంవిక్షిప్తమేకాగ్రంనిరుద్ధమితి చిత్తభూమయః''** (యోగ. వ్యా. భా. ౧-౧) క్షిప్తము= అతిచంచలము; మూఢము = మోహము, మూర్ఛవంటిస్థితి; విక్షిప్తము = చిత్తము ఏకాగ్రమై ఏదేని కారణమున భంగముగుట; ఏకాగ్రము = చిత్తము ఒక విషయముపై దీర్ఘకాలమువరకు నిలిచియుండుట, మధ్యన అన్యవిషయమేదియు రాకుండుట. యోగదర్శనమున ఇది సంప్రజ్ఞాత సమాధి అనబడును. నిరుద్ధము = సంప్రజ్ఞాత సమాధి గూడ నిలిపివేయబడుట. యోగదర్శనమున ఇది అసంప్రజ్ఞాత సమాధి- నిర్బీజ సమాధి అనబడును. ఈ నిరుద్ధావస్థయందే ఈశ్వర సాక్షాత్కారము జరుగును.

ప్రశ్న:- ఇది జ్ఞానములేని స్థితియా?

ఉత్తరము :- కాదు. ఇది ఉన్నతమైన జ్ఞానావస్థ. యోగవిద్య తెలియనివారే దీనిని జ్ఞానహీన స్థితి

అనుకొందురు. ఈ స్థితిలో జీవుడు ప్రకృతి వికృతుల యథార్థ స్వరూపమును తెలిసికొని ఈశ్వర స్వరూపమున నిమగ్నుడగును. ఈశ్వరోపాసన వలన జ్ఞానము మిక్కిలి పెంపొందును. ఈ స్థితిని జ్ఞాన శూన్య మనుకొనుట సరికాదు. చిత్తము, దాని ఐదు అవస్థలవాస్తవిక జ్ఞానము సంపాదించుట యోగ జిజ్ఞాసువునకు మిక్కిలి అవసరము. యోగము నభ్యసించువారు సామాన్యముగ చిత్తమును చేతన మను కొందురు. కావున వారు చిత్తమును వశపరుచుకోలేక పోవుచున్నారు.

యోగ స్వరూపము

యోగ స్వరూపము:- నేడు యోగ స్వరూపము అనేక విధములుగా వర్ణింపబడుచున్నది. బ్రహ్మలో కలియుట యోగమని ఒకరు, గోతిలో పూడ్చబడి కూర్చుండుట యోగమని మరొకరు, వివిధ ఆసనములు వేయుట యోగమని వేరొకరు, భంగు మొదలగు మత్తు పదార్థముల సేవించి మత్తులో మునిగి యుండుట యోగమని ఇంకొకరు అనుచున్నారు. ఒకనిని కొన్ని దినములు ఉపవాసముంచి అతని నాడిని అదిమి మూర్ఛితుని జేసి దానిని యోగమనుచున్నారు. జ్ఞానహీన స్థితినే యోగమని కొందరనుచున్నారు. మరికొందరు హఠయోగమందలి నేతి, ధౌతి మున్నగు షట్కర్మలను యోగమను చున్నారు. ఏకాంతమున మౌనముగా కూర్చొనుటచే యోగమని కొందరు, తాము నమ్మిన ఇష్టదేవతకు పశువుల బలి యిచ్చుట యోగమని మరికొందరు అనుచున్నారు. ఇట్టి మూఢాచారము లెన్నియో యోగము పేర ప్రచలితమైనవి. ఇందేదియు నిజమైన యోగము కాదు.

మహర్షి పతంజలి యోగము యొక్క వాస్తవ స్వరూపమును ఇట్లు పేర్కొన్నారు.

౧. సమాధి పాదము

యోగ శ్చిత్తవృత్తి నిరోధః (యోగ.౧-౨)

చిత్తవృత్తుల నిరోధమును యోగమందురు. చిత్తమనునది సత్వగుణ, రజోగుణ, తమోగుణముల మూడింటి కలయిక వలన ఏర్పడిన జడపదార్థము. చిత్తము జడమనుటకు ప్రమాణము.

''చిత్తం హి ప్రఖ్యాప్రవృత్తిస్థితిశీలత్వాత్ త్రిగుణమ్'' (యోగ.౧-౨ వ్యా.భా.). జీవుని ప్రేరణచే చిత్తమున నానావిధ తరంగము లుత్పన్నమగును. వీనినే వృత్తులందురు. అద్దమున బింబము వలె చిత్తమున వృత్తు లేర్పడును. ఆ వృత్తులను తెలిసికొని వైరాగ్య అభ్యాసముల ద్వారా వానిని నిరోధించుటయే యోగము. యోగమున సంప్రజ్ఞాతము, అసంప్రజ్ఞాతము అను రెండు ముఖ్య భేదములు గలవు.

మనుష్యుడు తన చిత్తముపై పూర్ణాధికారము సంపాదించినప్పుడు చిత్తమును తాను తలచు కొన్న విషయముపై దీర్ఘకాలముపరకు నిలుపగల్గును. ఇదియే సంప్రజ్ఞాత సమాధి. ఈ దశలో వాచ్య వాచక సంబంధము తెలిసికొని జపము చేయబడును. 'ఓ౩మ్' ఈశ్వరుని వాచకము (= పేర్కొను నది). ఈశ్వరుడు ఒక వస్తువు. అతడు ఓ౩మ్ శబ్దము ద్వారా పేర్కొనబడును. ఈ వాచ్యవాచక సంబంధమును తెలిసికొని ఒక వ్యక్తి అర్థసహితముగ జపము చేయును. జపముచేయు సమయమున

మనస్సులోనికి ఏ యితర విషయమును రానీయడు. ఇది ఏకాగ్రత- అనగా సంప్రజ్ఞాత సమాధి. దీనినే సబీజ సమాధి యందురు. సంప్రజ్ఞాత సమాధి పరిపక్వమైనపుడు ఋతంభరా ప్రజ్ఞ లభించును. ఆస్థితి యందు యోగము నభ్యసించువాని బుద్ధి అసత్యమును వదలి సత్యమునే అవలంబించును. ఈ స్థితి లభించిన తర్వాత యోగి ప్రాపంచిక వ్యక్తులను ఎత్తైన కొండ శిఖరమునుండి కొండ క్రిందగల మనుష్యు లను మామువ్యక్తివలె చూచును. అతడు అజ్ఞానము మరియు కష్టములనుండి ముక్తుడై వాస్తవిక స్వేచ్ఛను అనుభవించును. ప్రాపంచిక వ్యక్తులను క్లేశపడితులై యున్నట్లు కనుగొనును. ఈశ్వరానుభూతివలన పరవైరాగ్య ముత్పన్న మగును. దానివలన సంప్రజ్ఞాత సమాధి గూడ నిరోధింపబడును. ఇది అసం ప్రజ్ఞాత సమాధి. ఇదియే నిర్బీజ సమాధి యనబడును. ఈ స్థితిలో పరమాత్ముడు ప్రత్యక్షమగును. దానివలన విశేష జ్ఞానము, ఆనందము కలుగును. అగ్నిచే కాల్చబడిన ఇనుపగోళములో అంతట అగ్ని కనిపించును. అట్లే సమస్త ప్రపంచమున పరమాత్మ ప్రత్యక్షమగును. తేనెను త్రాగిన లౌకిక మానవుడు సుఖానుభూతిని పొందినట్లే పరమాత్మ ప్రత్యక్షము కాగానే యోగి ఆనందానుభూతిని పొందును.

లౌకికసుఖము మరియు మోక్షసుఖమున గల భేదము

లౌకిక సుఖము క్షణికమైనది. పరమాత్మద్వారా లభించు సుఖము శాశ్వతమైనది. లౌకిక సుఖ మున దుఃఖము ఇమిడియుండును. పరమాత్మ సుఖమున దుఃఖము ఏమాత్ర ముండదు. లౌకిక సుఖము నుండి వ్యక్తి విసుగు జెందును. కాని ఈశ్వరుని సుఖమునుండి విసుగు జెందడు. లౌకిక సుఖమువలన వ్యక్తి రోగిగూడ యగును. పరమాత్ముని సుఖమువలన రోగి కానేరడు. లౌకిక సుఖముల ననుభవించు వ్యక్తి మనస్సునకును, ఇంద్రియములకును లొంగిపోవును. పరమాత్ముని ఆనందము ననుభవించు వాడు వీనిని అదుపులో నుంచుకొనును. ★ ఇట్టి భేదము లనేకములు గలవు. మానవుడు జీవితమున తాను పొందవలసిన దంతయు పొందితినని ఇంక పొందవలసిన సుఖము మరియు సుఖసాధనముల అవ సరమేమియు లేదని భావించుస్థితి ఈశ్వర సాక్షాత్కారమొక్కటే. లౌకిక వ్యక్తి దుఃఖమును వీడి సుఖమును పొందుటకు సర్వస్వము నర్పించి చక్రవర్తి రాజ్యమును సంపాదించినప్పటికిని యోగివంటి ఆనంద మును అనుభవింపజాలడు. మానవ జీవితము పూర్ణముగా సఫల మగుటకు యోగమొక్కటే ఆధారము, ప్రాపంచిక వస్తువులు కావు. అని దీనివలన తెలియుచున్నది. కావున ప్రతి మనుష్యుడు తను మనో ధనములతో యోగమును సాధింప యత్నించవలెను. యోగవిరుద్ధ మార్గమును పూర్తిగా వదలివేయవలెను.

యోగమునకు మూలము వేదము

యుంజానః ప్రథమం మనస్తత్త్వాయ సవితా ధియః।
అగ్నేర్జ్యోతిర్నిచాయ్య పృథివ్యా అధ్యాభరత్ ॥ యజు. ౧౧-౧॥

★ లౌకిక సుఖము ననుభవించువానికి అంతకన్న అధిక సుఖము కావలెనను కోరిక యుండును. పరమాత్ముని సుఖము ననుభవించువానికి ఏ కోరిక ఉండదు. (సంపా.)

''(యుంజానః) యోగము నభ్యసించువారు (తత్త్వాయ) తత్త్వము = బ్రహ్మ జ్ఞానము కొరకు (ప్రథమం) (మనః) తమ మనస్సును పరమేశ్వరునిలో నిమగ్నము చేసినప్పుడు (సవితా) పరమేశ్వరుడు వారి (ధియం) బుద్ధిని కృపతో తనలో చేర్చుకొనును. (అగ్నేర్జ్యోతి...) ఆపైన వారు పరమేశ్వరుని ప్రకాశమును నిశ్చితముగా తెలిసికొని (అధ్యాభరత్) దానిని యథాతథముగ ధారణమొనర్చుకొందురు. (పృథివ్యా...) పృథివిలో ఇదియే యోగియొక్క ప్రసిద్ధమైన లక్షణము''.

(ఋ. భా. భూ. ఉపాసనా విషయము)

వేదాహమేతం పురుషం మహాన్తమాదిత్యవర్ణం తమసః పరస్తాత్।
తమేవ విదిత్వాఽతిమృత్యుమేతి నాన్యః పంథా విద్యతేఽయనాయ॥ (యజు. ౩౧-౧౮)

సారాంశము :- ఒక విద్వాంసుడు పరమాత్ముని తెలిసికొని 'మహాగుణములతో ఒప్పు ఆ పురుషుని = పరమాత్ముని నేను తెలిసికొన్నాను. అతడు పరిపూర్ణ జ్ఞానవంతుడు. అజ్ఞాన రహితుడు, అతనిని తెలిసికొనియే మనుష్యుడు జన్మమరణ దుఃఖము నుండి వైదొలగును. ముక్తికి ఇంతకన్న వేరొక మార్గ మేదియు లేదు'. అని ఇతరులకు తెలుపవలెను. దీనివలన యోగమునకు వేదము ఆదిమూల మని ఋజువగుచున్నది. ఈ వైదిక యోగమునే యోగులు సృష్ట్యాదినుండి బోధించుచు వచ్చుచున్నారు. దీనినే మహర్షి పతంజలి యోగదర్శనమున ప్రదర్శించినాడు.

యోగఫలము :- '' **తదా ద్రష్టుః స్వరూపేఽవస్థానమ్** '' ॥ యోగ. ౧-౩॥ వృత్తులన్నియు నిరోధింప బడినప్పుడు సర్వద్రష్టయైన ఈశ్వరుని స్వరూపమున జీవుని ఉనికి ఏర్పడును. జీవుడు తన స్వరూపమును పరమాత్ముని స్వరూపమును ఉన్నదున్నట్లుగ తెలిసికొని భౌతిక పదార్థముల ఉపాసనను వదలి పరమాత్ముని స్వరూపమున మగ్నుడగును. దానివలన జ్ఞానము, ఆనందము లభించును. ఈ స్థితి యందు జీవుడు మోక్షమువంటి అనుభూతిని పొందును. ఇది చిత్తముయొక్క నిరుద్ధావస్థ లేదా అసంప్రజ్ఞాత సమాధి. ఈ స్థితిలో ఈశ్వర సాక్షాత్కారము జరుగును. అగ్ని, వాయువు మున్నగు పదార్థములు వాని విశేష గుణములద్వారా ప్రత్యక్షమగునట్లే ఈశ్వరుడుగూడ అతని జ్ఞానము, ఆనందము మొదలగు గుణములద్వారా ప్రత్యక్షమగును.

'స్వరూపప్రతిష్ఠా తదానీం చితిశక్తిర్యథా కైవల్యే' (వ్యాసభాష్యము) వృత్తి నిరోధము జరిగి నంతనే మోక్షమునందువలె జీవుడు తన స్వరూపమున స్థితుడగును.

ఋషి దయానందుడు వ్రాసిన అర్థము :- '' చిత్తము ఏకాగ్రము మరియు నిరుద్ధము అయినపుడు సమస్తమును చూచు ద్రష్టయైన ఈశ్వరుని స్వరూపమున జీవాత్మ స్థితుడగును.'' (స. ప్ర. ౯వ సము). ఇచట ఒక విషయము గమనింపవలసి యున్నది. వ్యాసభాష్యమందు మరియు ఋషి దయానందుని వ్యాఖ్యయందు విరోధ మున్నట్లు కనుపించును. నిజమునకు విరోధ మేమియు లేదు. ఏలయన వ్యాసభాష్యమున '' **యథా కైవల్యే!** '' అని పేర్కొనబడినది. మోక్షమున పరమాత్ముని స్వరూపమున జీవునకు ఏర్పడునట్టి స్థితి ఈ శరీరముండగనే సమాధి దశలో ఏర్పడును. ఋషి దయానందుడుగూడ దీనినే అనగా ఈశ్వరుని స్వరూపమున జీవుడు స్థితుడగును అని వ్రాసినాడు. కైవల్య

దృష్టాంతము వలన వ్యాసమహర్షిగూడ సర్వద్రష్టయైన ఈశ్వరుని స్వరూపమున జీవుని ఉనికినే సూచించుచున్నాడని ఋజువగుచున్నది.

వృత్తి సారూప్యమితరత్ర ॥ యోగ. ౧-౪॥ సమాధి కంటె భిన్నమైన స్థితియందు జీవుడు తనను వృత్తులకు అభిన్నముగ భావించును. వృత్తులు, ఇంద్రియములు, శరీరము మరియు తాను ఒకటే యని అనుకొనును. ఇది అజ్ఞాన దశ. సమాధిలో వాస్తవిక జ్ఞానముండుటచే ఆనందము ననుభవించును. సమాధిలో లేనప్పుడు నానావిధ దుఃఖముల ననుభవించును. ఇదియే బంధనము. ఋగ్వేదాది భాష్య భూమిక ఉపాసనా విషయమందు మహర్షి దయానందుడు ఈ సూత్రమునకు వ్యాఖ్య వ్రాసినాడు. సమాధికన్న భిన్నమైన స్థితిలో యోగి స్థితి ఎట్లుండును? ప్రాపంచిక మనుష్యుని జీవితము కన్న యోగి జీవనమునగల విశేషమేమి? అనుదానిని సూచించుటయే అతని ఉద్దేశము. అతడు ఈ సూత్రమునకు సంపూర్ణ అర్థము వ్రాయలేదు. కావున ఇందు దోషమేమియు లేదు.

చిత్తవృత్తుల భేదములు :- '' వృత్తయః పంచతయ్యః క్లిష్టాక్లిష్టాః '' ॥ యోగ. ౧-౫॥ వృత్తులు ఐదు విధములు. అవి క్లిష్టములు, అక్లిష్టములు. మనుష్యుని అజ్ఞానము, అధర్మము, అనీశ్వరత్వము వైపు తీసికొనిపోవు వృత్తులు క్లిష్టములు. జ్ఞానము, ధర్మము, ఈశ్వరునివైపు మరల్చు వృత్తులు అక్లిష్టములు అనబడును. ప్రతివృత్తి రెండు రకములుగా నుండును. ప్రతి వృత్తి సుఖమును దుఃఖమును రెండింటిని కలిగించును. **ప్రమాణవృత్తి**- ఒకడు ప్రత్యక్షముగ తన మిత్రుని చూచినపుడు అతనికి సుఖము కలుగును. దుఃఖదాయక వ్యక్తిని చూచి నంతనే అతనికి దుఃఖము కలుగును. ఇట్లే అనుమాన, శబ్దప్రమాణముల విషయములోను గ్రహింపవలెను. **విపర్యయవృత్తి** - ఒకడు చీకటిలో పడియున్న రజ్జు = త్రాడును చూచును. దానిని పాము అనుకొని దుఃఖము ననుభవించును. అట్లే త్రాడును వెదకుచు చీకటిలో సర్పమును త్రాడుగా భావించి సంతసించును. **వికల్పవృత్తి** :- వంధ్యాపుత్రుడు సుఖదాయకుడు అని వినగానే సుఖము కలుగును. అతడు దుఃఖదాయకుడని విన్నప్పుడు దుఃఖము కలుగును. **నిద్రావృత్తి**- సాత్త్విక నిద్రవలన సుఖము, రాజసిక తామసిక నిద్రవలన దుఃఖము కలుగును. **స్మృతివృత్తి** - సుఖదాయక విషయ స్మృతి వలన సుఖము దుఃఖదాయక విషయ స్మృతివలన దుఃఖము కలుగును. కావున వృత్తులైదును ఒక్కొక్కటి క్లిష్టము, అక్లిష్టము అను భేదముచే రెండేసి రకములు.

చిత్తవృత్తుల స్వరూపము

ప్రమాణ విపర్యయ వికల్ప నిద్రా స్మృతయః ॥ యోగ. ౧-౬॥

ప్రమాణము, విపర్యయము, వికల్పము, నిద్రా, స్మృతి అనునవి ఐదు వృత్తులు. వీనిని నిలిపివేయుటవలన యోగము సిద్ధించును.

ప్రత్యక్షానుమానాగమాః ప్రమాణాని ॥ యోగ. ౧-౭ ॥

ప్రత్యక్షము, అనుమానము, ఆగమము అను మూడింటిని ప్రమాణవృత్తి యందురు. ఐదు జ్ఞానేంద్రియములకు రూపము, రసము మొదలగు విషయముల సంబంధమువలన కలుగు జ్ఞానము ప్రత్యక్షము. అది శాబ్దికము, అసత్యము మరియు సందేహాత్మకము కాగూడదు. ఉదాహరణకు - ఒకడు

అగ్నిలో చేయి ఉంచగా కాలెను. దీనివలన అగ్ని కాల్చేగుణముగల పదార్థ మని నిశ్చయమైన జ్ఞానము కలిగినది. ఇదియే ప్రత్యక్ష ప్రమాణము. అగ్నిని ప్రత్యక్షముగా చూచిన తర్వాత పొగను చూచినపుడు అగ్ని జ్ఞానము కలుగును. ఇది అనుమాన ప్రమాణము. వేదము లేదా సత్యవాది మాటలవలన కలిగే జ్ఞానము ఆగమ ప్రమాణము ఉదా:– ''సత్యమేవ జయతే'' సత్యమే జయించును. సమాధి స్థితియందు ఈ మూడు ప్రమాణములు నిలిపివేయబడును. కాని వ్యవహారకాలమున వీనివలన అనేక ప్రయోజనములు సిద్ధించును.

విపర్యయో మిథ్యాజ్ఞానమతద్రూపప్రతిష్ఠమ్ ॥ యోగ. ౧–౮ ॥

విపర్యయము = మిథ్యాజ్ఞానము. పదార్థ స్వరూపమున దీని అస్తిత్వముండదు. ఉదా: ఒక వ్యక్తి చీకటిలో త్రాడును చూచి పాము అనుకొనును. ఇది విపర్యయవృత్తి. ఇట్లే అనిత్య శరీరమును నిత్యము, నిత్యజీవుని అనిత్యుడు అనుకొనుట; అసత్య భాషణము, దొంగతనము మున్నగు అశుద్ధ వ్యవహారము లను శుద్ధము, సత్యభాషణము వంటి శుద్ధ వ్యవహారములను అశుద్ధ మనుకొనుట; ఇంద్రియముల ద్వారా విషయ భోగములను అమితముగా అనుభవించుటను సుఖము, సమాధివలన కలుగు ఆనంద మును దుఃఖము అనుకొనుట; జడములైన శరీరము, మనస్సు, ఇంద్రియములను చేతనము అని, చేతన ఆత్మను జడ మని అనుకొనుట విపర్యయవృత్తి. ఈ మిథ్యాజ్ఞాన మున్నంతవరకు సమాధి లభింపదు. లోకమున యోగసాధకులు సామాన్యముగ మనస్సును చేతనమని, ప్రయత్నించినను వశము కాదని తలంతురు. ఇది విపర్యయ వృత్తి పరిణామమే.

శబ్దజ్ఞానానుపాతీ వస్తుశూన్యో వికల్పః ॥ యోగ. ౧–౯ ॥

శబ్దమువలన జ్ఞానము కలుగును. కాని ఆ శబ్దము తెలిపే వస్తువు ఉండదు. అట్టి జ్ఞానము వికల్ప వృత్తి. ఉదా :– వంధ్యాపుత్రుడు, ఆకాశ పుష్పము మున్నగునవి. ఈ శబ్దములను విన్నవ్యక్తి వంధ్యా పుత్రుడు, ఆకాశపుష్పము గూడ ఉండునని అనుకొనును. ఈ శబ్దములను వినుట వలన వంధ్యా పుత్రుడు, ఆకాశ పుష్పము ఉండునని కలుగు ఆలోచనాతరంగములే వికల్పవృత్తి. ఇటువంటి స్థితి ఎక్కడ కనిపించునో అక్కడ వికల్పవృత్తి కలదని తెలిసికొనవలెను. ఒక యోగాభ్యాసి ధ్యానమున కూర్చున్న పుడు ఆ స్థలమున భూతము లున్న వని, అవి మనుష్యులను చంపి తినునని ఎవరైన అన్నచో ఆ మాట లను విని ధ్యానము చేయువ్యక్తి వానిని నిజమని నమ్మి ధ్యానమును వదలి అచటినుండి వెళ్లిపోవును. ఇట్టి వికల్పవృత్తి జ్ఞానము కలిగియుండుట అవసరము. ఏలన ఇదిగూడ సమాధిలో బాధకమే.

అభావప్రత్యయాలంబనావృత్తిర్నిద్రా ॥ యోగ. ౧–౧౦ ॥

జాగ్రత్ స్వప్నావస్థల అభావమే విషయముగాగల వృత్తి నిద్ర. ఈ నిద్రావృత్తి గూడ సమాధియందు బాధకము. కావున దీనిని గూడ నిరోధించు టవసరము.

ప్రశ్న :– ఇరవైనాల్గు గంటలు నిద్రను ఆపుకొనుటవలన సమాధి సిద్ధించునా?

ఉత్త :– సిద్ధింపదు. సమాధి సమయమున మాత్రమే నిద్రను నిరోధించుట అవసరము. ఋషి దయానందుడు సత్యార్థప్రకాశము ౯వ సముల్లాసమున ''ముముక్షువు ప్రతిదినము కనీసము రెండు

గంటల కాలము తప్పక ధ్యానము చేయవలెను'' అని తెలిపినాడు. ఈ కాలమును రెండుగా విభజించి ఉదయ మొకగంట, సాయంకాల మొక గంట చేయవచ్చును. ఎవరైనను ఇంకా ఎక్కువ కాలము ధ్యానము చేయదలచినచో చేసికొనవచ్చును. అంతేగాని ౨౪ గంటలు యోగాభ్యాసము చేయు అవసరములేదు. సమాధి కొరకు ౨౪ గంటలు నిద్ర లేకుండు టవసరమని నమ్మువారికి యోగ స్వరూప మేమాత్రము తెలియదు. ఆరోగ్య రక్షణకు ఆహారము, నిద్ర, బ్రహ్మచర్యము అవసరము. ఇవి లేకున్నచో వ్యక్తి రోగియై యోగాభ్యాసము చేయజాలడు. కొందరు రాత్రి ౧౨ గంటలకే లేచి ధ్యానములో కూర్చుందురు. అది సమాధి స్థితి కాక నిద్రా స్థితి యగును. అట్లు వారు నిద్రయందెన్నియో గంటలు గడిపి, అన్ని గంటలు సమాధిలో నుంటిమని అందురు. ఇది యోగులుగా ఋజువుచేసికొనుటకు అవలంబించిన ఆడంబరము మాత్రమే. కావున సకాలమున నిద్రించి సకాలమున మేల్కొని, నిద్రను వదలి యోగాభ్యాసము చేయుటయే నిద్రను జయించుట యగును. ౨౪ గంటలు మేల్కొని యుండుట గాదు.

అనుభూతవిషయాసంప్రమోషః స్మృతిః ॥ యోగ. ౧-౧౧॥

అనుభవించిన విషయము మళ్లీ స్మరణకు వచ్చుటయే స్మృతి. సాధకుడు ధ్యానము చేయునప్పుడు ఇదివరకు అనుభవించిన విషయములు జ్ఞాపకము వచ్చును. ఆ స్మృతివలన సమాధి భంగమగును. ఈ స్మృతిని ఆపలేని యోగసాధకుడు నిరాశుడై యోగాభ్యాసమును వదలివేయును. ధ్యాన సమయముననే ఈ భావములు మనస్సున కలుగుచుండునని పలుమార్లు అనిపించును. కాని ఇది నిజము కాదు. భావతరంగములు ధ్యానములేని కాలమునగూడ నడచుచుండును. కాని సాధకుని ధ్యానము వానివైపు ఉండదు. స్మృతివృత్తిని నిరోధించవలెనన్న స్మృతులు వాటంతట అవే రావని, జీవుడే వానిని స్మరించునని తెలిసికొను టవసరము. ధ్యానముచేయువాడు అజ్ఞానము వలన 'మనస్సు చేతన పదార్థము. అదియే ఈ స్మృతులను రప్పించును. కావున నేను ఈ యాలోచనలను నిరోధింపజాలను' అని భావించును. మనస్సు, ఇంద్రియములు, శరీరము ఇవన్నియు జడపదార్థములని, వీనిని మంచి, చెడు పనులలో నియమించునది తానే యని తెలిసికొన్నచో సాధకుడు స్మృతివృత్తిని త్వరలోనే నిరోధింప గల్గును.

వృత్తులను నిరోధించు ఉపాయములు :- ''అభ్యాసవైరాగ్యాభ్యాం తన్నిరోధః'' ॥యోగ. ౧-౧౨॥
అభ్యాసము మరియు వైరాగ్యము ద్వారా ఈ వృత్తులు నిరోధింపబడును. వివేకము, వైరాగ్యము, అభ్యాసము - ఇవి వృత్తినిరోధమునకు అనివార్య సాధనములు. ఈ మూడు సాధనములు లేకున్న వృత్తులను నిరోధించుట సంభవము కాదు. వివేక మనగా ఈశ్వరుడు. జీవుడు, ప్రకృతి వికృతుల వ్యావహారిక జ్ఞానము. కేవలము శబ్దజ్ఞానము వలన వివేకము సిద్ధింపదు. మనస్సును వశపరచుకొనుటకు ఎంత అధికముగా ప్రయత్నించిన అది అంత ఎక్కువగా చంచలమగునని, దానిని స్వేచ్ఛగా వదలిన దానంతటదే వశమగునని కొందరందురు. ఇది వాహనమును నడుపువాడుదానినిఅదుపులో వుంచక స్వేచ్ఛగా వదిలివేసి నటులున్నది. చాలకుడు దానిని అదుపులో ఉంచనిచో దుర్ఘటనవలన అనర్థము జరుగును. అట్లే మనస్సును స్వేచ్ఛగా వదలినచో మనుష్యుడు అనర్థమును పొందును. వాహనము జడవస్తువు. దానిని మనము అనుకొన్న చోటికి తీసుకపోవచ్చును. మనస్సుగూడ జడ పదార్థము. దానిని అదుపున నుంచ

కానియే అభీష్టకార్యమున ఉపయోగింపగల్గుదుము. మరొక విధముగ కాదు.

అభ్యాస స్వరూపము :- తత్ర స్థితౌ యత్నోఽభ్యాసః ॥ యోగ. ౧-౧౩॥

అభ్యాసవైరాగ్యములలో చిత్తస్థితి కొరకు చేయబడు ప్రయత్నము అభ్యాసము. స్థితియన చిత్తముయొక్క ఏకాగ్రత. ఆ చిత్తస్థితిని కాపాడుటకు చేయు ప్రయత్నమే అభ్యాసము. యమ నియమ ప్రాణాయామ ప్రత్యాహార ధారణ ధ్యానము లన్నింటిని మనోవాక్కర్మణా పాటించుటే అభ్యాసము. మనస్సును సంపూర్ణముగ వశపరచుకొనుట అసంభవ మనిపించును. కాని వివేక-వైరాగ్య-అభ్యాసములను చక్కగా ప్రయోగించుచుండిన మనస్సు వశమగును.

స తు దీర్ఘకాలనైరంతర్యసత్కారాసేవితో దృఢభూమిః ॥ యోగ. ౧-౧౪॥

అభ్యాసము దీర్ఘకాలమువరకు నిరంతరము సత్కారభావనతో చేసిన దృఢస్థితి గలదగును. దీర్ఘకాలము అనగా అశుభవాసన లన్నియు కాలిన విత్తనములవలె అగునంతవరకు అభ్యాసము చేయుచునే యుండవలెను. నిరంతరము చేయుచుండవలెను. మధ్యమధ్యన వదలినచో వాసనలు మళ్లీ పెల్లుబికి బాధకము లగును. సత్కార మనగా - తపస్సు, బ్రహ్మచర్యము, విద్యాపూర్వకముగ అభ్యాసము చేయుట. ఇట్టి అభ్యాసము అశుభసంస్కారములకు లోనుగాకుండును. వైరాగ్యము కలిగినప్పటికి అభ్యాసము సరిగా చేయనిచో యోగసాధకుడు యోగమార్గమునుండి వేరైపోవును.

వైరాగ్యలక్షణము :- దృష్టానుశ్రవికవిషయవితృష్ణస్య వశీకారసంజ్ఞా వైరాగ్యమ్ ॥ యోగ.౧-౧౫॥
జ్ఞానేంద్రియములద్వారా అనుభవించిన విషయములు దృష్టములు. శాస్త్రములద్వారా, ఆచార్యుల ద్వారా తెలిసినవి ఆనుశ్రవికములు. ఈ రెండు రకముల విషయములందు కోరిక లేనివానికి కలుగు వశీకారానుభూతియే వైరాగ్యము. ఈ స్థితిలో లౌకిక సుఖమందు, సుఖసాధనములందు; దుఃఖమందు, దుఃఖసాధనములందు రాగ ద్వేషము లుండవు. వైరాగ్య సంపాదనకు లౌకిక సుఖములందుగల నాల్గు విధములైన దుఃఖముల అనుభూతిని పొందుట అనివార్యము. ప్రతి లౌకిక సుఖమున పరిణామ దుఃఖము, తాపదుఃఖము, సంస్కారదుఃఖము మరియు గుణవృత్తి విరోధ దుఃఖము కలిసియుండును. లౌకిక సుఖము లన్నింట ఈ నాల్గురకముల దుఃఖము లున్నట్లు నిరంతరము తెలిసికొనుచున్నప్పుడే వైరాగ్య ముత్పన్నమగును. ఈశ్వరోపాసన యందు అభిరుచి యేర్పడును.

పరవైరాగ్య స్వరూపము :- తత్పరం పురుషఖ్యాతేర్గుణవైతృష్ణ్యమ్ ॥యోగ. ౧.౧౬॥ ఈశ్వర స్వరూపజ్ఞానము కలుగుటవలన సత్త్వాదిగుణములందు తృష్ణలేకుండుట ఉన్నతవైరాగ్యము. సాధకుడు సంప్రజ్ఞాత సమాధిని అభ్యసించుచుండగా ఉన్నతస్థితిని పొందినప్పుడు అతనిలో పరమాత్మని తెలిసికొను యోగ్యత కలుగును. పరమాత్మానుభూతి కలిగినప్పుడు సంప్రజ్ఞాత సమాధియందే గాక దానివలన లభించిన సుఖము, జ్ఞానములందు గూడ వైరాగ్యము కలుగును. సంప్రజ్ఞాత సమాధిలో సత్త్వగుణము ప్రధానముగ నుండును. ఎప్పుడైతే యోగి సత్త్వగుణ ప్రధానస్థితియందుగూడ దోషమును మాచునో అప్పుడతనికి దానియందును వైరాగ్య మేర్పడును. ఈ పరవైరాగ్యము అసంప్రజ్ఞాత సమాధికి సాధనము. అపరవైరాగ్యము సంప్రజ్ఞాతసమాధికి సాధనము.

ప్రశ్న:- కొందరు వివేకము, వైరాగ్యము, అభ్యాసము లేకయే యోగము సిద్ధించునందురు. అది నిజమా ?

ఉత్త:- ప్రత్యక్షాది ప్రమాణములకు విరుద్ధమగుటచే ఇది నిజము కాదు. నేడు అనేకులు యోగాభ్యాసము చేయుచు చేయించుచున్నారు. కాని వారందరు వివేక-వైరాగ్య-అభ్యాసములను యోగసాధనములుగా అంగీకరింపరు. అందుచే యోగము కొరకు ప్రయత్నించు లక్షలలో ఒకడు గూడ నిజమైన యోగి కాకున్నాడు. కావున వివేకవైరాగ్య అభ్యాసములను ముఖ్య సాధనములుగా గైకొని యోగము కొరకు ప్రయత్నించవలెను.

ఈశ్వర ప్రణిధానము - ''ఈశ్వరప్రణిధానాద్వా'' ॥ యోగ. ౧-౨౩॥ ఈశ్వరుని యందు భక్తివిశేషమువలన గూడ శీఘ్రముగ సమాధి లభించును. ప్రణిధాన మనగా భక్తివిశేషము. సాధకుడు ఈశ్వరుని విశిష్టగుణములను తెలిసికొన్నప్పుడు అతనికి ఇతర పదార్థములందు ఆకర్షణ తొలగి ఈశ్వరుని యందు విశేషప్రేమ కలుగును. ఆ స్థితిలో ఈశ్వరు డతనిని పాత్రుడని భావించి సంకల్ప మాత్రమున అనుగ్రహించును. ఈశ్వర సహాయమువలన అతనికి సమాధి సిద్ధించును. యోగదర్శనము ౨-౧ సూత్ర భాష్యమున వ్యాసుడు ''సర్వక్రియాణాం పరమగురావర్పణం తత్ఫలసంన్యాసో వా'' అనగా సమస్త కర్మలను పరమగురువు పరమాత్మునికి సమర్పించి వాని లౌకిక ఫలమునందు కోరిక యుంచకుండుట ఈశ్వరప్రణిధానము అని తెలిపినాడు.

ఈశ్వర స్వరూపము - ఈశ్వరుని వాస్తవస్వరూపము తెలియక ఈశ్వర ప్రణిధానము సిద్ధింపదు. మహర్షి పతంజలి ఈశ్వరుని లక్షణము నిట్లు తెలిపినాడు.

క్లేశకర్మ విపాకాశయైరపరామృష్టః పురుషవిశేష ఈశ్వరః ॥ యోగ. ౧-౨౪॥

సర్వకాలముల సర్వవిధములైన అవిద్యాదిక్లేశములు, శుభాశుభకర్మలు, ఆ కర్మల ఫలము, ఫలానుభవముచే ఏర్పడు సంస్కారములు వీటన్నిటితో ఎల్లప్పుడు ఏ విధమైన సంబంధములేని విశిష్టపురుషుడు ఈశ్వరుడు. ఈశ్వరుని ఈలక్షణమువలన శరీరధారులైన సమస్త కల్పిత ఈశ్వరుల ఖండన మగుచున్నది. ఏలన శరీరధారి క్లేశరహితుడు కాజాలడు. ఈశ్వరుని ఒప్పుకొననివారి మతముగూడ ఈ సూత్రము ద్వారా ఖండిత మగుచున్నది. జీవుడే ఈశ్వరుడని అనుకొనువారి మతము, ఈశ్వరుడు జీవుడు ఒకటే యనుకొనువారి నమ్మకముగూడ ఖండిత మగుచున్నది. విశేష పురుషుడే ఈశ్వరుడు. ఏ జీవుడు ఈశ్వరుడు కాడు. సూత్రకర్త ఈశ్వరుని కర్మరహితుడని పేర్కొన్నాడు. దీని అభిప్రాయము ఈశ్వరుడు ఏ కర్మ చేయడని కాదు జీవుడు చేయునట్లు శుభాశుభకర్మలు ఈశ్వరుడు చేయడనియే దీని తాత్పర్యము. ఈశ్వరుడు కేవలము శుభకర్మలనే చేయును. అశుభకర్మలను చేయడు. సృష్టి ఉత్పత్తి, స్థితి, ప్రళయములను చేయుట, జీవులకు వారి కర్మల ననుసరించి ఫలము నొసగుట ఇవి ఈశ్వరుని కర్మలు. ఈశ్వరుని కర్మరహితు డనుకొనువారు ఈశ్వరుని స్వరూపమును అర్థము చేసికొనలేరు.

తత్రనిరతిశయం సర్వజ్ఞ బీజమ్ ॥ యోగ. ౧-౨౫॥ ఈశ్వరుని యందు నిరతిశయమైన సర్వజ్ఞత్వ కారణము గలదు. త్రికాలములందుగల జ్ఞానమంతయు ఈశ్వరునిలో గలదు. ఈశ్వరునికి

సమానమైన విద్వాంసుడు ఇంతవరకు ఎన్నడు కాలేదు. ఇప్పుడు లేడు. ఇకముందు కాజాలడు.

స ఏష పూర్వేషామపి గురుః కాలేనానవచ్ఛేదాత్ ॥ యోగ. ౧-౨౬॥ ఈశ్వరుడు గురువులకును గురువు. ఏలన అతడు ఏ కాలమునను నశింపడు. ఋషులు, మునులు, గొప్పగొప్ప వైజ్ఞానికులు కాలప్రవాహమున నశింతురు. అనగా ఏ శరీరము నాధారముగా జేసికొని వారు విద్యనభ్యసింతురో ఆ శరీరము నశించును. కావున శరీరము నశించినప్పుడు వారు ఎవ్వరికిని విద్య నేర్పలేరు. శరీర మున్నంతవరకు ఇతరులకు విద్య నేర్పి గురువు లగుదురు. శరీరము లేకున్న కాజాలరు. సర్వవ్యాపకుడు, సర్వశక్తిమంతుడు, సర్వజ్ఞుడు కావున ఈశ్వరునికి శరీర మవసరము లేదు. అందువల్ల అతడు ఎల్లకాలములందు గురువు కాగల సమర్థుడు. ఈశ్వరుని సహాయముననే జీవుడు ఇతరులకు విద్యనేర్పుటకు సమర్థుడగును. లేకున్న కాజాలడు. ఈశ్వరుని తెలియక జీవుడు స్వయముగనే విద్వాంసు డగు నని కొందరు, ఈశ్వరుని కన్న గురువే గొప్పవా డని మరికొందరు నమ్ముదురు. వాస్తవమున సమస్త గురువుల, విద్వాంసుల, ఋషుల జ్ఞానము ఈశ్వరుని జ్ఞానము ముందు నామ మాత్రమే. గురువు లందరును ఈశ్వరోక్త వేదజ్ఞానమును ★ పొంది అతనిచే నిర్మింపబడిన శరీర- ఇంద్రియముల సహాయమున శిష్యులకు విద్య నేర్పగల్గుచున్నారు. కావున గురువు పరమాత్మునికన్న గొప్పకాదు.

ప్రశ్న :- ఈశ్వరు డొక పదార్థమా ?

ఉత్త :- ఔను, ఈశ్వరుడు పదార్థమే. భూమి మున్నగువాని వలెనే ఈశ్వరుడుగూడ సత్తాత్మక పదార్థము. భేద మేమన భూమి మొదలగునవి అవయవముల కలయికవలన ఉత్పన్న మగును. కాని ఈశ్వరుడు ఎన్నడును ఉత్పన్నము కాడు. పదార్థములో రంగు, ఆకారము, బరువు, పొడవు మున్నగునవి ఉండవలె నను నియమము లేదు. జ్ఞానము, ఆనందము, బలము మొదలగు గుణము లుండునది గూడ పదార్థమే. ఇందులకు ప్రమాణములు - ''ఏది కేవలము చేతన పదార్థమో'' (ఆర్యో-౧) ''అనాది పదార్థములు మూడు, మొదటిది ఈశ్వరుడు, రెండవది జీవుడు, మూడవది ప్రకృతి....'' (స.ప్ర. స్వమం...) ఋషి దయానందుడు ఇందు ఈశ్వరుని పదార్థమని పేర్కొన్నాడు. పదార్థమని నమ్మినపుడే ఈశ్వరప్రణిధానము సిద్ధించును. లేనిచో సిద్ధింపదు. ఈశ్వరుని శరీరధారియని కొందరు, ప్రత్యేక స్థానమును నుండువాడని కొందరు, సర్వవ్యాపకుడని మరికొందరు భావించి భక్తి యొనర్తురు. కాని అతనిని పదార్థముగా నంగీకరింపరు. ఇట్లు కోట్లకొలది జనులు ఈశ్వర స్వరూపమును చక్కగా తెలిసికొనక చేయుచున్న భక్తి నిష్ఫల మగుచున్నది. ఈశ్వరుని వాస్తవిక స్వరూపమును తెలిసికొని జనులు అతని భక్తి యొనర్చియుండినచో అజ్ఞానము, అన్యాయము, దుఃఖము ఉండెడివి కావు.

ఈశ్వరుని వాచకము :- '' తస్యవాచకః ప్రణవః'' ॥యోగ.౧-౨౭॥ ఈశ్వరుని వాచకము = పేరు ప్రణవః = ఓమ్. ఈశ్వరు డొక సత్తాత్మక పదార్థము. అతని పేరును తెలుపు శబ్దము ఓమ్.

★ సృష్టి ద్వారా లభించిన జ్ఞానముగూడ ఈశ్వరునిదే. (సంపాదకుడు)

ఈశ్వరుని స్వరూపమును అతని నామమును సరిగా తెలిసికొనినప్పుడే సాధకునికి యోగమార్గమున సఫలత లభించును. మహర్షి పతంజలి మొదట ఈశ్వరుని స్వరూపమును, పిదప ఈ సూత్రమున అతని నామమును తెలిపినాడు. ఈశ్వరప్రణిధానమున నామము మరియు నామి అనగా వాచకము మరియు వాచ్యము యొక్క పరిజ్ఞానము అనివార్యము. ఈశ్వరుని నామము అతని స్వరూపమును ప్రకటించునదై యుండవలెను. కొందరు ఈశ్వరుని నామమును స్మరింతురు. కాని వారికి దాని యొక్క అర్థము తెలియదు. ఒకవేళ తెలిసినను ఈశ్వరుని స్వభావమునకు విపరీతముగా తెలియును. ఈశ్వరుని నామమునకు అర్థము తెలిసినవారు గూడ జపము చేయునప్పుడు మనస్సు ఇటునటు పోవు నందురు. జపము చేసినచో అర్థము మనసున ఉండదు. అర్థమును మనస్సున నిలుపుకొన్నచో జపము కాదు అని యందురు. ఈ సమస్య లన్నిటికి సమాధాన మొక్కటే. ఏమన- ఈశ్వరుని స్వరూపము, అతని నామము ఈ రెండింటి జ్ఞానము పరిపక్వము కావలెను. జ్ఞానము పరిపక్వమైనపుడు జపము చేయుచు అర్థమును మనస్సున నిలుపుకొనుటలో ఎట్టి ఆటంక ముండదు.

<u>జపముచేయు విధి</u> :- ''తజ్జపస్తదర్థభావనమ్'' ॥ యోగ. ౧-౨౮ ॥ ఆ ప్రణవము = ఓమ్‌ను జపించవలెను. ప్రణవముయొక్క అర్థమును = ఈశ్వరుని మనస్సులో తలంచవలెను. ఉదాహరణకు 'ఈశ్వరుడు సర్వరక్షకుడు'. దీనిని మనస్సున నుంచుకొనవలెను. జపమునకు పూర్వము యోగదర్శనమున, యజుర్వేదము ౪౦వ అధ్యా. ౮వ మంత్రమున ''సపర్యగాత్...'' ఆర్యసమాజపు ౨వ నియమమున ''ఈశ్వరుడు సచ్చిదానంద స్వరూపుడు...'' అని తెలుపబడిన అతని స్వరూపమును చక్కగా గ్రహించి ఓమ్‌ను జపించవలెను. ఆరంభమున నోటితో ఉచ్చరించుచు జపము చేయుట సులభము. జపము చేయు అభ్యాసము దృఢమైనపుడు మనస్సుతో జపముచేయుట కఠినము కాదు. అభ్యాసము దృఢము కాగానే మనస్సులో జపించుట ఉత్తమము. నోటితో ఓమ్ నుచ్చరించి జపించునట్లే మనస్సులో ఉచ్చరించుచు అర్థసహితముగ జపించవలెను. మనస్సున ఓమ్ నుచ్చరించినపుడు దానితోబాటు ఓమ్‌యొక్క అర్థము మనసున నుండవలెను. అర్థసహిత జపమువలన మనస్సు స్వాధీన మగును. ఈశ్వరుని యందు ప్రేమ దృఢమగును. నిమ్మకాయ అనగానే నోట నీరూరును. అట్లే అర్థసహితముగ జపించినచో ఈశ్వరునియెడ ఆకర్షణ కలుగును. నిమ్మకాయను ప్రత్యక్షముగా తినియుందురు. కాని ఈశ్వరుని ఆనందమును ప్రత్యక్షముగా చూడలేదుగదా! యను ప్రశ్న ఉదయించును. దీనికి సమాధానము- సత్యవాదులు, సత్యమానులు, సత్యాచారపరులు నైన యోగులు ఈశ్వరుని ఆనందమును అనుభవించి అతడు ఆనంద సాగరుడని తెలిపినారు. వారి మాటలను సత్యమని నమ్మి జపము చేయవలెను. ఋషుల మాటలు పూర్ణ సత్యములని నమ్మి జపము చేసినచో మనస్సున ఈశ్వరునియెడ ఆకర్షణ కలుగును. ఈ దశలో బాహ్య విషయములు మనసును ఆకర్షింపవు. కావున వేదములు, ఉపనిషత్తులు, దర్శనములందుగల ఈశ్వరస్వరూపమును పూర్ణ విశ్వాసముతో జపించినచో సఫలత లభించును. లేకున్న లభించదు. సామాన్యముగా సాధకులు 'మనస్సు స్వాధీనము కాదు' అని అనుచుందురు. ఈశ్వరుని సత్యస్వరూపమును తెలిసికొనకపోవుటయే దీనికి ముఖ్యకారణము. జపించునప్పుడు అర్థము మనస్సులో ఉండదని, అర్థమును ఆలోచించిన జపము ఆగిపోవునని కొందరందురు. జపించువాని జ్ఞానము మరియు అభ్యాసము రెండును పరిపక్వము గాకుండుటయే

దీనికి కారణము. ఈ రెండును దృఢమైనంతనే జపముతోబాటు అర్థము నాలోచించుటలో నెట్టి కాస్య
ముండదు. అర్థములేని జపమువలన విశేషలాభముండదు. వ్యావహారిక జీవితమున యమనియమాదుల
పాటింపకున్న జపమున సఫలత లభింపదు. కొందరు వేల సంఖ్యలో నామ జపము చేయుదురు. వారికి
అర్థము తెలియదు. వారు యమనియమాదులను పాటింపరు. ఇటువంటి జపమువలన జ్ఞానము,
బలము, ఆనందము లభింపదు. జపించువారు మనసు స్వాధీనమందుండ దని బాధపడుదురు. ఈ
సమస్యకు సమాధానము- జపముచేయు వ్యక్తి శరీరము, ఇంద్రియములు, మనస్సు ఇవన్నియు జడపదా
ర్థములే యని వీనిని నడుపుచున్నది తానే యని గ్రహించుటయే. మనుష్యుడు మనస్సు మొదలైనవానిని
చేతనము లనుకొనినప్పుడు మనస్సును స్వాధీనపరచుకొనజాలడు. కావున మనస్సు జడపదార్థమని
అది తన ప్రేరణ లేకుండ చెడును గాని మంచిని గాని చేయజాలదని మాటిమాటికి అభ్యాసము చేయు
చుండవలెను. ఈ విధమైన అభ్యాసమువలన మనస్సును జయించుట సులభమగును. మనస్సు జడము.
ఇందుకు ప్రమాణములు - "అట్లే మనస్సు జడము" (స. ప్ర. ౯వ సము.); "పురుషోపకరణే వా
మనస్యనాత్మన్యాత్మఖ్యాతిరితి" (యోగ. ౨-౫ వ్యా. భా.) - జీవుని ఉపకరణము అచేతనము= జడము
ఐన మనస్సునందు ఆత్మభావము కలిగియుండుట అవిద్య. జపము చేయునపుడు ఎదురగు మరొక
సమస్య - సాధకుడు జపించుచు తనను ఈశ్వరార్పణము చేసినపుడు తన లోపములను గాంచి అతనికి
భయము కలుగును. ఈశ్వరుని భయము వలన ఈశ్వరునినుండి దూరముపోవుటకు ప్రయత్నించును.
కాని యోగసాధకుడు ఈశ్వరుడు సర్వవ్యాపకుడు, సర్వజ్ఞుడు, సర్వహితైషి యని తెలిసికొనినపుడు
ఈ సమస్యగూడ తొలగిపోవును.

జపించువాని మరొక ముఖ్య కర్తవ్యము :- జపము ప్రారంభించుటకు పూర్వము ఈశ్వరుడు,
జీవుడు, ప్రకృతి, వికృతి= ప్రకృతిచే నిర్మితమైన పదార్థములు- వీటన్నిటి స్వరూపములగూర్చి గంభీ
రముగా నాలోచింపవలెను. సమస్త పదార్థములను మూడు భాగములుగ విభజించుకొనవలెను. మొదటిది
సాధ్యము. రెండవది సాధకుడు. మూడవది సాధనము. ఈశ్వరుడు సాధ్యము=పొందదగినవాడు.
జీవుడు సాధకుడు=పొందువాడు. ప్రకృతి=ఏ సామగ్రిచే ఈ ప్రపంచము నిర్మితమైనదో అది సాధనము.
చింతన చేయునపుడు తనను ఈశ్వరుని ఎదుట నుంచుటకు పూర్ణప్రయత్నము చేయవలెను. బుద్ధి
మంతుడు, ధర్మాత్ముడునైన పుత్రుడు తల్లిదండ్రుల యెదుట తనను ప్రకటించుకొనునట్లే సాధ
కుడు తనను ఈశ్వరుని ఎదుట ప్రకటించుకొనవలెను. ఈశ్వరుని సమస్త పదార్థములకు స్వామిగా
తెలిసికొనవలెను. యోగాభ్యాస సమయమున ఈశ్వరసాక్షాత్కారము తప్ప మరొక వస్తువు మనస్సున
నుండగూడదు. ఇట్లు విధిపూర్వకముగ జపించుటవలన మనుష్యుడు కృతకృత్యు డగును. విధిపూ
ర్వకముగ జపించక విరుద్ధముగా జపించుటవలన మానవ జీవనము విఫలమగును. కావున నియమ
పూర్వకముగ విధి ననుసరించి జపించుట మనుష్యమాత్రుని ముఖ్య కర్తవ్యము. జపించనివ్యక్తి గొప్ప
దోషి యగుచున్నాడు. జపించనిచో సమస్త దుఃఖముల నివృత్తి, పూర్ణానందప్రాప్తి సంభవము కాదు.

జపము యొక్క ఫలము :- "తతః ప్రత్యక్చేతనాధిగమో౽ప్యంతరాయాభావశ్చ" ॥
యోగ.౧-౨౯ ॥ విధిపూర్వకముగ జపించుటవలన ఈశ్వరసాక్షాత్కారము జరుగును. వ్యాధి మున్నగు
తొమ్మిది అంతరాయములు తొలగిపోవును. ఈశ్వర సాక్షాత్కార సమయమున పూర్ణానందము

ప్రాప్తించును. సమస్తక్లేశములు తొలగును. సమాధి భంగమైనపుడు క్లేశములు మళ్లీ తలెత్తును.

అంతరాయముల స్వరూపము :- ''వ్యాధిస్త్యానసంశయప్రమాదాలస్యావిరతి భ్రాంతిదర్శనాలబ్ధభూమికత్వానవస్థితత్వాని చిత్తవిక్షేపాస్తే௨న్తరాయాః'' ॥ యోగ. ౧-౩౦॥ వాత పిత్త కఫములు, ధాతువులు, ఆహార రసము మరియు ఇంద్రియముల విషమత్వము వ్యాధి. యోగసాధనకు తగిన సామర్థ్యము లేకుండుట స్త్యానము. తాను తెలిసికొన యత్నించుచున్న ఈశ్వరు డున్నాడో లేడో అను సందేహము సంశయము. సమాధి సాధనములను అనుసరింపకుండుట, వాటిని ఉపేక్షించుట ప్రమాదము. శరీరము మరియు మనస్సు బద్ధకముగా నుండుటచే యోగాభ్యాసమును వదలివేయుట ఆలస్యము. వైరాగ్యము లేకుండుట= విషయభోగములందు రతి అవిరతి. జడమును చేతనము మరియు చేతనమును జడము అనుకొనుట భ్రాంతిదర్శనము. ఉదా: విగ్రహమును చేతన మనుకొని మ్రొక్కుట. సమాధి లభింపకుండుట అలబ్ధభూమికత్వము. సమాధి లభించియు స్థిరముగా నుండకుండుట అనవస్థితత్వము. ఇవి యోగమునకు అంతరాయములు = బాధకములు. యోగము నభ్యసించువాడు విధిపూర్వకముగా ఈశ్వర ప్రణిధానము చేసినచో ఈ విఘ్నములు తొలగిపోవును.

ఉపవిఘ్నముల స్వరూపము -''దుఃఖదౌర్మనస్యాంగమేజయత్వశ్వాసప్రశ్వాసా విక్షేపసహభువః'' ॥ యోగ. ౧-౩౧॥ ప్రాణులు దేనివలన పీడితులగునో, అద్దాని నాశనమునకై ప్రయత్నించుచుండునో అది దుఃఖము. ఆధ్యాత్మికము, ఆధిభౌతికము, ఆధి దైవికము అని దుఃఖము మూడు విధములు. కోరిక తీరనందున మనసులో కలిగెడు క్షోభ= అప్రసన్నత దౌర్మనస్యము. శరీరావయవములను కంపింపజేయునది అంగమేజయత్వము. శ్వాసప్రశ్వాసలు ఇష్టానుసారము నడువకుండుట= స్వాధీనమున లేకుండుట అనునవి ఉపవిఘ్నములు. ఇవి విక్షేపము లున్నప్పుడే ఉండును. విక్షేపములు లేకున్న ఇవియు నుండవు.

యోగవిఘ్నములను తొలగించు ఉపాయము :- ''తత్ప్రతిషేధార్థమేకతత్త్వాభ్యాసః'' ॥యోగ. ౧-౩౨॥ ఆ విఘ్నములను తొలగించుటకు అన్యపదార్థమిశ్రణలేని ఏకతత్త్వమును- ఈశ్వరుని మాటిమాటికి ఉపాసించుచుండవలెను. ఈ విఘ్నములను తొలగించుటకు మరొక ఉపాయమే లేదు. ఈ సూత్రమునగల ఏకతత్త్వ శబ్దమునకు ఋషి దయానందుడు 'ఈశ్వరుడు' అను అర్థమును గ్రహించినాడు. కొందరు భాష్యకారులు ఏకతత్త్వమునకు 'ఏదో ఒక జడతత్త్వము' అని అర్థము వ్రాసినారు, కాని ఏకతత్త్వమున ఈశ్వరుడని గ్రహించుటే సమంజసము. ఏలన ఈ విఘ్నములను తొలగించు సామర్థ్యము కేవలము ఈశ్వరునందే గలదు. ఇతర ఏ జడతత్త్వమందును లేదు. ఏకతత్త్వమునకు ఈశ్వరుడను నర్థము గ్రహించుటకు మరొక కారణము ఇది ఈశ్వరప్రణిధాన ప్రకరణ మగుట మరియు ఇచట దాని ఉపసంహారము జరుగుటయే. ౨౯వ సూత్రమున జపమువలన ఈశ్వరసాక్షాత్కార మగునని తెలుపుట ముఖ్యము. ఈ సూత్రమున ఈశ్వరోపాసనవలన విఘ్నములను తొలగించు ఉపాయమును సూచించుట ముఖ్యము. అందువలన ఏకతత్త్వమున ఈశ్వరుడనియే గ్రహించవలెను. జడతత్త్వము గ్రహింపరాదు.

<u>యోగసాధకుని వ్యవహారము</u> - ''మైత్రీకరుణాముదితోపేక్షాణాం సుఖదుఃఖ పుణ్యాపుణ్య విషయాణాం భావనాతశ్చిత్తప్రసాదనమ్'' ॥ యోగ.౧-౩౩॥ యోగి సుఖముగానున్న ప్రాణులయెడ మైత్రీభావమును, దుఃఖితుల యెడ దయ కలిగి యుండవలెను. పుణ్యాత్ములయెడ హర్షము, అపుణ్యాత్ములయెడ ఉపేక్ష (=మైత్రిగాని ద్వేషముగాని లేకుండుట) కలిగియుండవలెను. ఇటువంటి వ్యవహారమువలన చిత్తము ప్రసన్నమగును. చిత్తము ప్రసన్నమగుటవలన ఏకాగ్రత చేకూరును. సుఖసంపన్నులైన వారితో మైత్రి చేయవలెనని సూత్రము తెలుపుచున్నది. ఎందుకన సుఖసంపన్నులను గాంచిన మనుష్యునియందు వారియెడ ద్వేషము ఉత్పన్న మగును. దానివలన అతని మనస్సు అప్రసన్న మగును. అప్రసన్నతవలన చిత్తము చంచల మగును. కావున సుఖసంపన్న ప్రాణులను చూచి ప్రసన్నతను అనుభవించవలెను. మహాత్ములను చూచినపుడుగూడ ఈర్ష్య కలుగును. ఈర్ష్యకు గురికాకుండ తప్పించుకొనుటకు వారిని చూచి హర్షించవలెను. దుఃఖితులను చూచి వారిని సుఖింపజేయుటకు ప్రయత్నించవలెను. ఏలన పరోపకారము చేయుటవలన మనస్సున ఈర్ష్య, ఘృణ (ఏవగింపు), ఉపేక్ష ఉత్పన్నము కావు. అపుణ్యాత్ములయెడ మైత్రిగాని ద్వేషముగాని కలిగియుండుటయు హానికరమే. కావున వారి యెడ ఉపేక్షవహించవలెను. సూత్రకారుడు తెలిపిన విధముగానే యోగసాధకుడు వ్యవహరింపవలెను. లేకున్న యోగమార్గమున సఫలత లభించదు.

<u>ప్రాణాయామమువలన ఏకాగ్రత</u>- ''ప్రచ్ఛర్దనవిధారణాభ్యాం వా ప్రాణస్య'' ॥యోగ.౧-౩౪॥ మహర్షి దయానందుడు ఋగ్వేదాది భాష్య భూమికలో ఉపాసనా విషయమున ఈ సూత్రమునకు అర్థము ఇట్లు వ్రాసినాడు - ''భోజనముతర్వాత వాంతియై అన్నజలములు వేగముగా బయటకు వచ్చునట్లు వాయువును బలపూర్వకముగా బయటకు తీసి సుఖపూర్వకముగ సాధ్యమైనంతవరకు బయటనే నిలిపి యుంచవలెను. పిదప నెమ్మదినెమ్మదిగా లోనికి పీల్చుకొని మరల అట్లే చేయవలెను. ఈ విధముగా మాటిమాటికి అభ్యాసము చేయుటవలన ఉపాసకునికి ప్రాణము వశమగును. ప్రాణము స్థిరపడినచో మనస్సు స్థిర పడును. మనస్సు స్థిరపడినచో ఆత్మగూడ స్థిరపడును. ఈ మూడు స్థిరపడినపుడు తన ఆత్మలోనున్న ఆనందస్వరూపుడైన అంతర్యామి వ్యాపక పరమేశ్వరుని స్వరూపమున నిమగ్నము కావలెను. మనుష్యుడు నీటిలో మునిగి పైకి వచ్చి మరల మునుగునటుల తన ఆత్మను మాటిమాటికి పరమేశ్వరునిలో నిమగ్నము చేయవలెను.'' యోగదర్శనమున చూపబడిన నాల్గురకముల ప్రాణాయామమును విధిపూర్వకముగ చేయుటవలన చిత్తము ఏకాగ్ర మగును. అని ఈ సూత్రార్థము. ప్రాణాయామ స్వరూపము, దాని పద్ధతి, లాభము మున్ముందు తెలుపబడును.

యోగదర్శనమందలి సమాధిపాదమున యోగపరిభాష, దాని భేదములు, యోగముపలన, లాభము, వృత్తులస్వరూపము, వానిని నిరోధించు ఉపాయములు జపము చేయు విధి, దాని ఫలము; యోగసాధకుని వ్యవహారము మున్నగు విషయములు తెలుపబడినవి. బుద్ధిమంతులు, యోగజిజ్ఞాసువులు దీని వలన లాభము పొందగలరు.

౨. సాధనపాదము

ఇపుడు యోగదర్శన సాధనపాద విషయము ప్రారంభింపబడుచున్నది. ఈ పాదమున అనేక

విషయములు ప్రతిపాదింపబడినప్పటికి యోగసాధనములగూర్చి విశేషముగా వర్ణింపబడినందున ఇది సాధనాపాద మని పేర్కొనబడినది.

ప్రతిప్రాణి సమస్త దుఃఖములనుండి ముక్తినొంది పరిపూర్ణ, శాశ్వత సుఖమును పొందగోరును. కాని మనుష్యునికి సుఖమన నేమి? సుఖసాధనము లేవి? దుఃఖమన నేమి? దుఃఖకారణము లేవి? అను విషయము తెలియనంతవరకు అతడు దుఃఖములనుండి ముక్తుడై వాస్తవిక సుఖమును పొంద జాలడు. దుఃఖములనుండి ముక్తుడై సుఖమును పొందుటకు నాల్గు విషయములను తెలిసికొనుట మిక్కిలి అవసరమని మహర్షి పతంజలి సూచించినాడు. ఆ నాల్గువిషయము లివి- హేయము, హేయహేతువు, హానము, హానోపాయము- అనగా దుఃఖము, దానికి కారణము; సుఖము, దానికి ఉపాయము.

<u>దుఃఖ నిర్వచనము</u> :- **''యేనాభిహతాః ప్రాణినస్తదుపఘాతాయ ప్రయతంతే తద్దుఃఖమ్''** (యోగ.౧-౩౧కి వ్యాసభాష్యము). దేనిచే పీడుతులై ప్రాణులు దాని వినాశముకొరకు ప్రయత్నిం చునో అది దుఃఖము. **''బాధనా లక్షణం దుఃఖమ్''** (న్యాయ.౧-౧-౨౧). బాధ, పీడ, కష్టము, బంధనము ఇవి దుఃఖమునకు సమానార్థకములు. ప్రపంచమున ఐదువిధములైన దుఃఖము లున్నవని మహర్షి పతంజలి తెలిపినాడు. వీటిచే ప్రతి ప్రాణియు పీడింపబడుచున్నది. **''అవిద్యాఽస్మితారాగ ద్వేషాభినివేశాః పంచక్లేశాః''** (యోగ.౨-౩) అవిద్యా, అస్మితా, రాగము, ద్వేషము, అభినివేశము అనునవి పంచక్లేశములు. అనిత్యవస్తువును నిత్యము, నిత్యమును అనిత్యము, అశుద్ధమును శుద్ధము, శుద్ధమును అశుద్ధము, దుఃఖమును సుఖము, సుఖమును దుఃఖము, జడమును చేతనము, చేతనమును జడము అనుకొనుట అవిద్య. బుద్ధి, ఇంద్రియములు, శరీరము జీవునికన్న వేరని తెలిసికొనకపోవుట అస్మిత, అనుభవించిన సుఖమును, సుఖసాధనములను మళ్లీ పొందగోరుట రాగము. అనుభవించిన దుఃఖమును, దుఃఖసాధనములను ఏవగించుకొనుట ద్వేషము. మరణభయము అభినివేశము.

ఈ ఐదువిధములైన దుఃఖములను మహర్షి పతంజలి హేయము= త్యజింప దగినవి అని తెలిపినాడు. **''హేయం దుఃఖం అనాగతమ్''** (యోగ. ౨-౧౬) రానున్న దుఃఖము విడువదగినది. అనుభవిం చిన దుఃఖము విడిచిపెట్టుటకు వీలుకానిది గదా! వర్తమానకాలమున అనుభవించుచున్న వాటిని తొల గింప యత్నించునంతలోనే అవి భూతకాలమున చేరిపోవును. కావున మరుక్షణమున రానున్న దుఃఖమే విడువదగినది. ఈ సందర్భమున క్షణమును ప్రమాణముగా గ్రహించియే భూత, వర్తమాన, భవిష్యత్ కాలములను లెక్కించవలెను. అట్లని ఇప్పుడు జ్వరము వచ్చిన, అది తొలగింప యోగ్యమైనది కాదని అనుకోగూడదు. ఏక్షణమున జ్వరమును దూరము చేయుటకు ఉపాయము ప్రారంభింపబడునో ఆ క్షణములో కలుగు దుఃఖము అనుభవమునకు వచ్చియే యుండును. రానున్న క్షణములోని దుఃఖమును దూరము చేయుటకే జ్వరమును తొలగించుటకు యత్నించవలెను.

దుఃఖమునకు కారణము :- **''ద్రష్టృదృశ్యయోః సంయోగో హేయహేతుః''** (యోగ.౨-౧౭) ద్రష్టయన జీవుడు. ప్రకాశ, క్రియా, స్థితి స్వభావమును భూతేంద్రియ స్వరూపమును గలిగి భోగమును అపవర్గ (=మోక్ష) మును సిద్ధింప జేయునది దృశ్యము. సత్త్వరజస్తమస్సులచే నిర్మితములైన వస్తువు

లన్నియు దృశ్యములే. జీవునికి దృశ్యమునకు కలుగు సంయోగమువలన స్వస్వామి సంబంధము ఏర్పడును. అదియే దుఃఖమునకు కారణము. అజ్ఞానమువలన వ్యక్తి తాను ఎన్ని వస్తువులకు స్వామియైన అంతే అధికముగ సుఖము లభించునని అనుకొనును. కాని పరిణామము దీనికి పూర్తిగా విరుద్ధము. వ్యక్తి లౌకిక వస్తువులకు స్వామియగుచున్న కొలది అతని దుఃఖము పెంపొందుచుండును. కాని ఈ వస్తువులకు స్వామి ఈశ్వరుడే అని తెలిసికొని వానిని సంపాదించి, రక్షించి, తగినట్లు ఉపయోగించుచున్న కొలది సుఖము పెంపొందుచుండును. వాస్తవిక జ్ఞానము లేకపోవుటవలననే మనుష్యుడు ఈ వస్తువు లన్ని ఈశ్వరునివే యనుకొన్నచో తన సర్వస్వము నాశనమగునని తలంచును. నిజమునకు ఇది మిథ్యా భావనయే. ఎందుకన పక్షపాతములేని విద్వాంసులు స్వస్వామి సంబంధమే దుఃఖమునకు కారణమని తెలిపినారు. కావున హాని కలుగుటకు వీలులేదు. లోకమున పోట్లాటలు, వివాదములు, పక్షపాతము మున్నగు ననేక దోషములకు స్వస్వామి సంబంధమే కారణము. లోకమున ఈ స్వస్వామి సంబంధమును తొలగించుకొన్నవారి సంఖ్య అధికమైనచో లౌకిక సుఖము, అధ్యాత్మిక సుఖము రెండును పెంపొంద గలరు.

ప్రశ్న :- సమస్త వస్తువులు ఈశ్వరునివే యని భావించినచో లోకవ్యవహారము లెట్లు జరుగును?

ఉత్త:- వ్యవహారమున ఏ చిక్కు ఉండదు. న్యాయపూర్వకముగ ఎవనికి ఏ వస్తువు లభించునో దానిని అతడు రక్షించి, పెంపొందించి తన సుఖమునకును ఇతరుల సుఖమునకును దానిని ఉపయోగింపవలెను. దానిని ఉపయోగించుకొనుటకు మాత్రమే తాను అధికారి అని తలంచవలెను. సమస్త పదార్థములకు ఆదిమూలము పరమేశ్వరుడు. న్యాయముగ సంపాదించిన వస్తువులను తగినట్లు ఉపయోగించుకొనుటకు మాత్రమే మనుష్యుడు అధికారి. ఇట్లు చేయుటవలన ఎటువంటి సంకటము ఎదురుకాదు. **"సమస్త సత్యవిద్యలకును, విద్యవలన తెలియు సమస్త పదార్థములకును ఆదిమూలము పరమేశ్వరుడు"** అను ఆర్యసమాజపు మొదటి నియమము. దీనిని బలపరచుచున్నది. సమస్త సత్య జ్ఞానమునకు, ప్రకృతినుండి ఉత్పన్నములైన సమస్త వస్తువులకును ఆదిమూలము పరమేశ్వరుడు. ప్రకృతి నుండి ఉత్పన్నమగు పదార్థములన్నిటికి నిమిత్తకారణము పరమేశ్వరుడే. కావున అతనినే సమస్త పదార్థము లకు స్వామి యనుకొనుట సమంజసము.

<u>స్వస్వామి సంబంధమునకు కారణము:-</u> "తస్య హేతురవిద్యా" (యోగ.౨-౨౪) ఆ స్వస్వామి సంబంధమునకు కారణము అవిద్య, మనుష్యుడు అవిద్యకు గురియైనపుడు అతడు స్వస్వామి సంబంధమును ఏర్పరచుకొనును. జన్మజన్మాంతరముల స్వస్వామి సంబంధ వాసనలు అత్యంత ప్రబల ముగా నుండును. అవి అజ్ఞానమును ఉత్పన్నము చేయుచుండును. ఈ వాసనల కారణమున మనుష్యుడు స్వస్వామి సంబంధమును స్థిరముగా నిలుపుకొనుటకు ఎంతయో ప్రయత్నించును. కాని సత్యజ్ఞానము ఉత్పన్నమైనపుడు ఈ స్వస్వామి సంబంధమునకు గల కారణము తెలియును. కావున ఈ స్వస్వామి సంబంధమును తొలగించు అవిద్యను నశింపజేయవలెను. అవిద్యను ఉత్పన్నము చేయునవి కుసంస్కారములు. ఈ కుసంస్కారములను తొలగింపనిచో అవిద్యను నిర్మూలింపజాలము.

ఈ యవిద్యకు కారణ మేమి? దీనికి సమాధానము "ఇంద్రియదోషాత్సంస్కార

దోషాద్విద్యా'' (వైశేషిక. ౯-౨-౧౦) ఇంద్రియముల దోషమువలన, సంస్కారముల దోషము వలన అవిద్య ఉత్పన్నమగును. అందుచే అవిద్యను తొలగించుటకు ఇంద్రియదోషములను, సంస్కార దోషములను దూరము చేయవలెను. ఈదోషములు తొలగినంతనే అవిద్యగూడ తొలగును. అవిద్య నశించగనే స్వస్వామి సంబంధముగూడ తొలగిపోవును. స్వస్వామి సంబంధము తొలగినంతనే దుఃఖనివృత్తి, ఆనందోపలబ్ధి యగును. అందువలననే మహర్షి పతంజలి ''అవిద్య నశించినచో సంయోగాభావము ఏర్పడును. సంయోగాభావము ఏర్పడినంతనే జీవునికి మోక్షము లభించును'' అని తెలిపినాడు.

<u>మోక్షోపాయము</u>:- ''వివేకఖ్యాతిరవిప్లవా హానోపాయః'' (యోగ.౨-౨౬) అచలమైన వివేక ఖ్యాతియే మోక్షప్రాప్తికి ఉపాయము. ఈశ్వర జీవ ప్రకృతుల, ప్రకృతి నుండి ఉత్పన్నమైన వస్తువుల స్వరూపజ్ఞానము వివేకఖ్యాతి యనబడును. కాని ఆ వివేకఖ్యాతి అవిచ్ఛిన్నమై యుండవలెను. అదియే మోక్షమునకు ఉపాయము.

వివేకఖ్యాతికి ఉపాయము:- ''యోగాంగానుష్ఠానాదశుద్ధిక్షయే జ్ఞానదీప్తిరా వివేకఖ్యాతేః'' (యోగ.౨-౨౮) యమ నియమాది యోగాంగములను అనుష్ఠించుట వలన అశుద్ధి-అవిద్య నశించును. అప్పుడు వివేక ఖ్యాతి పర్యంతము జ్ఞానము వికసించును.

<u>యోగాంగము</u>:- ''యమ నియమాసనప్రాణాయామప్రత్యాహారధారణా ధ్యానసమాధయో ఽష్టావంగాని'' (యోగ.౨-౨౯) యమములు, నియమములు, ఆసనము, ప్రాణాయామము, ప్రత్యాహారము, ధారణా, ధ్యానము, సమాధి అనునవి ఎనిమిది యోగాంగములు. వీని ననుసరించి వ్యవహరించినపుడే మనుష్యుడు ఈశ్వరుని సాక్షాత్కరించుకొన గలుగును. మరొక విధముగా వీలు లేదు. యోగి యగుటకు యమనియమాదులను పాటించవలసిన అవసరము లేదని కొందరందురు. పతంజలి పేర్కొన్న యమనియమాది యోగసాధనములకన్న భిన్నమైన యోగసాధనము లుండవచ్చునని వారి భావము. అట్లైనచో వారు పేర్కొను యమనియమాదులకు భిన్నమైన సాధనములు యమనియమాదులకు అనుకూలములా, ప్రతికూలములా? అను ప్రశ్న ఉదయించును. అనుకూలములే యైనచో కేవలము శబ్దభేదమే యగును. గాని అర్థభేదము కాదు. ప్రతికూలము, విరుద్ధములైనచో అహింస స్థానమున హింస, సత్యాచరణము చోట అసత్యాచరణము, దొంగతనము విడిచిపెట్టవలసినచోట దొంగతనము చేయుట, బ్రహ్మచర్యము పాటించవలసిన చోట వ్యభిచారము చేయుట-ఇట్లు ఎనిమిది అంగములకు విరుద్ధముగా వ్యవహరించుటను యోగసాధనములుగా అంగీకరింప వలసి యుండును. ఇట్టి విపరీతాచరణ మూలమున యోగియగుట సంభవముకాదు. కొందరు అమాయక జనులను వంచించుటకు వారికి అనుకూలముగా మాట్లాడుదురు. సామాన్యముగ మానవునికి పంచేంద్రియముల విషయసేవనయందు ప్రీతి యుండును. విషయసేవనకు సంబంధించిన ప్రసంగము అతనికి రుచించును. కాని ఇంద్రియములను వశమందుంచుకొను మాటలు చెప్పినపుడు వాటిని అతడు వినగోరడు. ఈ కారణముననే స్వార్థపరులు లక్షలాది జనులను యోగము పేర భోగములలో ముంచి వేయుచున్నారు. యోగమునకు మిక్కిలి సులభమైన క్రొత్త పద్ధతిని కనిపెట్టినామని కొంద రందురు. ఈ క్రొత్త పద్ధతి

యందు అన్నపానాదుల నియమములుగాని ఆచార విచారముల నియమములు గాని పాటించు అవసరము లేదు. దొంగతనము, వ్యభిచారము అసత్యము, కపటము, మోసములను వదులుకొను అవసరము లేదు. ఇష్టమున్నట్లు చేయవచ్చును. యోగి యగుటకు అవేవియు అడ్డురావు అని అనుచుందురు. ఇట్లు వారు మానవ జాతిని సత్యమైన యోగమార్గమునకు దూరముచేసి విరుద్ధ మార్గమున నడుపు చున్నారు. వీరి వలలో చిక్కుకొనక పాతంజలి యోగమార్గమున పయనించుచు ఇతరులను అదే మార్గమున నడిపించ వలయును.

<u>మొదటి యోగాంగము</u> - **''అహింసాసత్యాస్తేయబ్రహ్మచర్యాపరిగ్రహా యమాః''** (యోగ. ౨-30) అహింసా, సత్యము, అస్తేయము, బ్రహ్మచర్యము, అపరిగ్రహము - ఈయైదు కలిసి యోగమున మొదటి అంగము. సర్వవిధముల, సర్వకాలములందు వైరభావము త్యజించి సమస్త ప్రాణులయెడ ప్రీతితో వ్యవహరించుట అహింస. వైరమును వదలివేసినంత మాత్రమున అది అహింస కాజాలదు. వైరము వీడి హింసను నిరోధింపకున్నను అహింస కాజాలదు. ఈ విధముగనే సమస్త విషయముల గూర్చి తలంచవలెను. ఎట్లన- ఒకవ్యక్తి అసత్యము పలుకడు. కాని సత్యము పలుకవలసిన అవసరమెంతయో యున్నప్పుడును సత్యము పలుకడు. ఇట్టివ్యక్తి సత్యవాది కాడు. సత్యముయొక్క లక్షణము. **''యథా దృష్టం యథాఽనుమితం యథా శ్రుతం తథా వాఙ్మనశ్చేతి''** (యోగ.౨-30 కువ్యాసభా.) ప్రత్యక్ష ప్రమాణముద్వారా గ్రహించినట్లు, అనుమానముద్వారా తెలిసికొన్నట్లు, చెవులతో విన్నట్లు మనస్సులోను వాక్కులోను ఉండుట సత్యము అనబడును. ఋషి దయానందుడు సత్యార్థ ప్రకాశ భూమికలో ''ఒక పదార్థము ఎట్లున్నదో దానిని అట్లే పేర్కొనుట, వ్రాయుట, విశ్వసించుట సత్యమనబడును'' అని సత్యమునకు నిర్వచనము వ్రాసినాడు. మొదట వస్తుస్వరూపమును తెలిసికొనుట, తెలిసికొన్న దానిని విశ్వసించుట, ఆ పిదప మధురముగ, హితకరముగ, అవసరమున్నంత పేర్కొనుట, తక్కువగా గాని ఎక్కువగా గాని తెలుపకుండుట, సత్యమువలన లాభముపొందని అయోగ్యుడు ఎదురైన మౌనముగ నుండుట మరియు వాక్కు ననుసరించి కర్మచేయుట సత్యముయొక్క వాస్తవిక స్వరూపమని దీనివలన తెలియుచున్నది.

ప్రశ్న:- **ఒకరు సత్యమనినదానిని మరొకరు అసత్యమన్నప్పుడు సత్యాసత్యము నెట్లు నిర్ణయించవలెను?**

ఉత్త :- సత్యాసత్యమును తెలిసికొనుటకు మహర్షి దయానందుడు దిగువ పేర్కొన్న ఐదు గీటురాళ్లను సూచించినాడు-

౧. ఈశ్వరుని గుణ కర్మ స్వభావములకును, వేదములకును అనుకూలములుగ నున్నవి **సత్యములు. వాటికి విరుద్ధములుగా నున్నవి అసత్యములు.**

౨. సృష్టిక్రమమునకు అనుకూలములైనవి సత్యములు. విరుద్ధములైనవి అసత్యములు.

3. ఆప్తులు- అనగా ధార్మికులు, విద్వాంసులు, సత్యవాదులు, నిష్కపటులు నైనవారి సాంగత్యము, ఉపదేశములకు అనుకూలమైన వన్నియు సత్యములు (గ్రాహ్యములు). విరుద్ధములైనవి

అసత్యములు (అగ్రాహ్యములు).

౮. తన ఆత్మ పవిత్రత, జ్ఞానమునకు అనుకూలత అనగా తనకు సుఖము ప్రియము, దుఃఖము అప్రియమైనట్లే అందరియెడ భావించుట- ఏమన నేనుగూడ ఎవరికైనను దుఃఖముగాని సుఖముగాని కలిగించిన వారుగూడ అప్రసన్నలు, ప్రసన్నులు అగుదురని భావించుట.

౯. ఎనమిది ప్రమాణములు - అనగా ప్రత్యక్షము, అనుమానము, ఉపమానము, శబ్దము, ఐతిహ్యము, అర్థాపత్తి, సంభవము, అభావము.

మనువు మాటలలో సత్యాసత్య నిర్ణయ సోపానములు-

వేదః స్మృతిః సదాచారః స్వస్య చ ప్రియమాత్మనః।
ఏతచ్చతుర్విధం ప్రాహుః సాక్షాద్ధర్మస్య లక్షణమ్ ॥ మను. ౨-౧౨॥

న్యాయదర్శనకర్త గోతమ మహర్షి సత్యాసత్య నిర్ణయమునకు దిగువ ఉపాయములు పేర్కొన్నాడు - ''**ప్రమాణతర్కసాధనోపాలంభః సిద్ధాంతావిరుద్ధః పంచావయవోపపన్నః పక్షప్రతిపక్షప్రతిగ్రహో వాదః**'' (న్యాయ. ౧-౨-౧)

ఈ ఉపాయములద్వారా సత్యాసత్యమును నిర్ణయింపవచ్చును. మనుష్యుడు సత్యాసత్యమును గ్రహించు ఉపాయములను తెలిసికొననంతవరకు సత్యస్వరూపమును సరిగా గ్రహింపజాలడు. సత్యాసత్యమును సరిగా గ్రహింపనిచో సత్యము ననుసరింపజాలడు. సత్యవ్యవహారము లేకున్న యోగము సిద్ధింపదు. ఇట్లే ఇతర యమనియమాదుల విషయములోను గ్రహింపవలెను. మనుష్యుడు అసత్యము నెందుకు పలుకు ననువిషయము విశేషముగ గమనింపవలయును. దానికి మూలకారణము అబద్ధమాడువాడు అసత్యభాషణమువలన లాభము కలుగునని భావించుటయే. తనకు హాని కలిగించు కొనుటకు ఎవరును అసత్యము పలుకరు. అసత్యమువలన ఎప్పుడును లాభము కలుగ దనుటయే నిజము. లాభము కలిగినట్లనిపించుట అనిపించుటమాత్రమే కాని లాభము కలుగదు. ఉపనిషత్కర్త ''**సత్యమేవ జయతే నాఽనృతమ్**'' (ముండక. 3-౧-౬) -సదా సత్యమే జయించును, అసత్యము కాదు అని తెలిపినాడు. ఏదేని కార్యము సఫలమైనదా, అసఫలమైనదా అను విషయము దాని అంతిమ పరిణామము వలననే తెలియగలదు. పరిణామము దుఃఖక్షయము, సుఖవృద్ధియైనచో అది విజయ మనబడును. అట్లుగాక సుఖహాని, దుఃఖవృద్ధి యగుచో అది పరాజయ మనబడును. సత్యమును సరిగా ప్రయోగించినచో సుఖము పెంపొందును, దుఃఖము నశించును. కావున సత్యము జయించునని తెలియుచున్నది. శాస్త్రాదేశమునకు విరుద్ధముగా ఇతరుల వస్తువులను తీసికొనుట స్తేయము = దొంగతనము. దానిని వదలుకొనుట '**అస్తేయము**'. మనోవాక్కాయములతో దొంగతనము విడిచి పెట్టవలెను. శారీరకముగ దొంగతనము వదలివేయుట సులభము. కాని మనస్సుతో వదలివేయుట కఠినము. దొంగతనమును వదలివేయుట మాత్రమే అస్తేయము కాదు. తను మనోధనములతో ఇతరులకు సహకరించుటయు అస్తేయమే. ఒకడు దొంగతనము చేయడు. కాని యోగ్యునకు దానము కూడ చేయడు. అది అస్తేయము కాజాలదు. మనస్సును, ఇంద్రియములను వశపరచుకొని వీర్యమును

రక్షించుకొనుట, ఈశ్వరు నుపాసించుట, వేదమును పఠించుట 'బ్రహ్మచర్య' మనబడును. వస్తువుల ఉపార్జన-సంపాదన, రక్షణ, క్షయము, సాంగత్యము, హింసా- ఈయైదు దోషములను గమనించి అవసరముకన్న అధికముగా కూడబెట్టు కోరిక లేకుండుటయు, ఆ వస్తువులకు తాను అధిపతినను భావము లేకుండుటయు 'అపరిగ్రహము'. ఈశ్వర సాక్షాత్కారమున ఆటంకము కలిగించు వస్తువుల గాని, ఆలోచనల గాని సంగ్రహించుకొనుట 'పరిగ్రహము'. వాటిని త్యజించుట 'అపరిగ్రహము'. యోగసిద్ధిని పొందుటకు యమములను పాటించుట అనివార్యము. ఇవి యోగమునకు పునాది. పునాది లేకున్న భవనము నిలిచియుండునటుల యమములను పాటింపకున్న యోగము సిద్ధింపదు.

<u>యమములను పాటించు పద్ధతి</u> - ''జాతిదేశకాలసమయానవచ్ఛిన్నాః సార్వభౌమా మహావ్రతమ్'' (యోగ. ౨.3౧). జాతి, దేశ, కాల, సమయము (ఒడంబడిక) లచే భంగము చేయబడక సర్వావస్థల యందు పాటింపదగిన ఈ యమములు మహావ్రతము లనబడును. ౧. **జాతి:**- చేపలను చంపువాడు 'నేను చేపలను మాత్రమే చంపెదను. మరేదానిని చంపను' అనుట. ౨. **దేశము:**- విద్యా ధర్మముల ప్రచారము జరుగుచోట చంప ననుట. 3. **కాలము:**- అమావాస్య మున్నగు పర్వదినము లందు చంప ననుట. ౪. **సమయము :**- విశేషస్థితియందే చంపెదను. ఎల్లపుడు చంపననుట.

ఇట్లే సత్యము, అస్తేయము, బ్రహ్మచర్యము, అపరిగ్రహము మున్నగు యమముల విషయము లోను గ్రహింపవలెను. ఈ యమములపాలన జాతి, దేశ, కాల, సమయము లనెడు పరిధులకులోనై యుండదు. కావుననే ఇవి సార్వభౌమ మహావ్రతము లనబడును. ★

<u>రెండవ యోగాంగము - నియమము</u> :- ''శౌచసంతోషతపః స్వాధ్యాయేశ్వర ప్రణిధానాని నియమాః'' (యోగ. ౨-3౨) శౌచము, సంతోషము, తపస్సు, స్వాధ్యాయము ఈశ్వరప్రణిధానము అనునవి నియమములు. శరీరశుద్ధి, వస్త్రశుద్ధి, పాత్రశుద్ధి, అన్నపానాదులశుద్ధి, ధనోపార్జనశుద్ధి మున్నగునవి బాహ్యశుద్ధి అనబడును. అసత్యము, పరహాని మున్నగువాటిని మనస్సులోనికి రానీయకుండుట ఆంతరిక శుద్ధి యనబడును. శక్తికొలది ఉత్తమకర్మలు చేయుట, వాటికి లభించిన ఫలముకన్న అధికముగా కోరుకుండుట సంతోషము. హానిలాభములు, మానావమానములు, సుఖదుఃఖములు, శీతోష్ణబాధలు మొదలగునవి కలిగినను ధర్మాచరణమును వీడకుండుట తపస్సు. మోక్షశాస్త్రముల అధ్యయనము, ప్రణవజపము చేయుట స్వాధ్యాయము. పరమగురువైన పరమాత్మునికి సర్వకర్మలను సమర్పించుట, ఆ కర్మలకు లౌకిక ఫలమును కోరకుండుట ఈశ్వర ప్రణిధానము. ఈ యైదు నియమములు యోగమునకు రెండవ అంగము. యోగసిద్ధికొరకు యమములవలెనే వీటినిగూడ పాటించు టవసరము.

<u>యమముల పాలనలో కలుగు విఘ్నము, దానికి నివారణోపాయము</u> :- ''వితర్కబాధనే ప్రతిపక్షభావనమ్'' (యోగ.౨-33) వితర్కములు బాధించినపుడు సాధకుడు ప్రతిపక్షమును భావించవలెను. ప్రతిపక్షభావన అనగా యమనియమాదులను భంగముచేయవలెనను కోరిక కలిగినపుడు దాని

★(జాతి, దేశ, కాల, సమయ నిబంధనలేక పాటించిపుడే అహింస యనబడును. ఇట్లే మిగతా యమములను పాటించవలెను. -సంపాదకుడు)

వలన కలుగు అనర్థములను తెలిసికొని వాటిని భంగముచేయగూడదు. సంకల్పపూర్వకముగ ఆ కోరికను నిరోధించవలెను. సాధకుడు యమనియమములను సర్వవిధముల పాటించెదనని నిశ్చయించు కొన్నపుడు కుసంస్కారములవలనను, చెడు సహవాసమువలనను వాటిని (ఈ యమనియమములను) భంగము చేయు కోరిక కలుగును. అట్లు భంగము చేయుటలో తనకు లాభము కలుగునని అవిద్యవలన అతడు భావించును. అట్టి సంకటస్థితిలో సాధకుని కర్తవ్యమును ఋషి యిట్లు నిర్దేశించినాడు - హింస మున్నగునవి వితర్కములు. ఉదాహరణకు అహింసకు విరుద్ధమైన హింస వితర్కము. సత్యమునకు విరుద్ధమైన అసత్యాచరణము వితర్కము. ఇదేవిధముగ సమస్త యమనియమములకు విరుద్ధముగ నడచుట వితర్కము. స్వయముగా హింస చేయుట, ఇతరులచే హింస చేయించుట, హింస చేయువానిని బలపరచుటయు హింసయే. లోభము, క్రోధము, మోహము అనునవి ఈ వితర్కములకు కారణము. యమనియమములకు విరుద్ధాచరణ అల్పపరిమాణములో, మధ్యమ పరిమాణములో, అధికపరిమాణములో జరుగును. ఈ వితర్కముల ఫలము అత్యంత దుఃఖము మరియు అజ్ఞానము. ఇట్లే వితర్కములకు లోనగుటవలన కలుగు అనర్థములను ఆలోచించి సాధకుడు యమనియమములను ఉల్లంఘించగూడదు. విపరీత ఆలోచనలను అరికట్టవలెను. ఈ స్థితి సంభవించినప్పుడెల్ల ఇదేవిధముగ ఆలోచించుచుండవలెను. ఇట్లు చేయుటవలన విపరీత ఆలోచనలు ఆగిపోవును. సాధకునికి విజయము లభించును. అశుభ ఆలోచనలను దూరము చేయుటకు గొప్ప ప్రయత్నము చేయవలసియుండును. అట్లు చేసినప్పటికిని అనేక సార్లు పరాజయము కలుగును. అహింసాది వ్రతములను పాటించుటలో సఫలుడు కానప్పటికిని సాధకుడు నిరాశపడకుండుట ఎంతయో అవసరము. నిరాశచెందినచో నష్టమే కాని ఏమాత్రము లాభముండదు. ప్రయత్నము చేయుచుండగా ఎన్నడైనను తప్పక విజయము లభించును. కాని జ్ఞానము, వైరాగ్యము లేకున్న యోగమార్గమున సఫలత లభించదు. ప్రయత్నము చేసినంత మాత్రమున ఉన్నతి జరుగదు. జ్ఞాన పూర్వకముగా ప్రయత్నము చేసినపుడే ఉన్నతి చేకూరును. కావున వివేకము, వైరాగ్యము, అభ్యాసము అనునవి యోగప్రాప్తికి సాధనములు.

యమనియమముల ఫలము :- ''అహింసాప్రతిష్ఠాయాం తత్సన్నిధౌ వైరత్యాగః'' (యోగ.౨-౩౫). (అహింసా...) అహింసాధర్మము స్థిరమైనపుడు ★ ఆ వ్యక్తి మనసునుండి వైరభావము తొలగిపోవును. అంతేకాదు అతని సముఖమున లేదా అతని సాంగత్యమున ఇతరవ్యక్తుల వైరభావముగూడ తొలగిపోవును. (ఋ.భా.భూ.ఉపా.)

అహింసా సిద్ధించిన మీదట యోగియెడ సమస్త ప్రాణులు వైరభావమును త్యజించును అని కొందరు నమ్మెదరు. వాస్తవమున ఈ నమ్మకము సరియైనది కాదు. ప్రత్యక్షాది ప్రమాణములచే ఇది ఖండితమగును.

ప్రశ్న :- వ్యాసభాష్యమున ''సర్వప్రాణినాం భవతి'' - సమస్త ప్రాణుల వైరభావము తొలగిపోవును అని పేర్కొనబడినది గదా!

★ వితర్కములు లేకుండ అహింసను పాలించిన వ్యక్తి మనస్సునుండి వైరము తొలగిపోవును. (సంపాద.)

ఉత్త:-దీని భావము సమస్త ప్రాణులు వైరభావము త్యజించునని కాదు. అహింసను పాటించు వాని సాంగత్యముచేయు వ్యక్తులు అతని ఉపదేశములను పాటింతురు. ఎవరికిని చెరుపుచేయనట్టి అతని నడవడిని చూచెదరు. అతని సాంగత్యము చేయుటలో వారి స్వసంస్కారములు గూడ కారణము. ఇట్లు సత్సంగము చేయువారు ఉత్తమ సంస్కారవంతులైనచో వారి వైరభావము అధిక పరిమాణములో తొలగి పోవును. అశుభ సంస్కారములు కలిగియున్నవారి వైరభావము కొంత మాత్రమే తొలగును. అత్యంత విపరీత సంస్కారములు కలిగి అజ్ఞానము, స్వార్థ ప్రధానము ఐన జీవితముగలవారి వైరభావము ఏమాత్రము తొలగిపోదు. కావున అందరిపైన సమాన ప్రభావము ఎన్నటికిని పడజాలదు. వైరభావము తొలగుట యుంచి కొన్ని ప్రాణులు యోగులనే చంపివేసిన వనుటకు చరిత్రయే సాక్ష్యము. యోగివిషయమటుం చుడు, ఈశ్వరుని యెడనే ప్రాణులన్నిటి వైరభావము తొలగకుండుట ప్రత్యక్షమేగదా! ఈ విషయము ఉత్తరార్థములోని ౩వ వ్యాసమున చర్చించబడినది. అందు సమస్త ప్రాణులు వైరభావము త్యజించు నను విషయము ప్రమాణ విరుద్ధమని నిరూపించబడినది.

''సత్యప్రతిష్ఠాయాం క్రియాఫలాశ్రయత్వమ్'' (యోగ. ౨-౩౬) (సత్యప్రతి...) సత్యాచరణ ఫల మేమన - మనుష్యుడు మనో వాక్కర్మలచే సత్యమునే పాటించునప్పుడు అతడు ఏయే యోగ్య కర్మలు చేయునో, చేయతలపెట్టునో ఆయా కర్మలన్నియు సఫలములగును. (ఋ. భా. భూ. ఉపాస నా...) 'సత్యము' విషయమున గూడ ఎన్నియో భ్రమలు గలవు. సత్యవాదియైన యోగి అనినదెల్ల జరిగి తీరునని కొందరి నమ్మకము. ఉదాహరణకు- అతడు అగ్నిని 'శీతలమైపోవుగాక' అని అనేని అది శీతలమైపోవును. చేతనుడైన మనుష్యుని 'జడమగుగాక' యనేని అతడు జడముగా మారును. కాని ఇవి అసంభవములైన కార్యములు. ఒకవ్యక్తిని యోగి ''నీవు ధర్మాత్ముడవగుము'' అనగానే ఆ వ్యక్తి ధర్మాత్ముడగును అని కొందరు భావించుటయు నిట్టిదే. యోగి బాగుగా యోచించి, వివేచించి మాట్లా డును. అతడు అసంభవములైన వానిని సంభవములగునని అనడు. యోగి అన్నంతమాత్రమున అందరు ధర్మాత్ము లగుట అసంభవము. ఉత్తమ సంస్కారములు గలవారు యోగి మాటలను ధ్యానపూర్వక ముగ విందురు. వాటిని విశ్వసింతురు. ''బుద్ధి'' సరిగా పనిచేయువారి జీవితములను యోగిమాటలు ప్రభావితము చేయును. అంతేగాని అందరి పైనను యోగిమాటలు సమానముగ ప్రభావము చూప జాలవు. సత్యవంతుడు ''నీవు ధర్మాత్ముడవగుము'' అని ఎవరెవరి ననునో వారందరు ధర్మాత్ములగు దురేని యోగులు జనులందరికి ధర్మాత్ములగుటకే ఉపదేశముచేసినారు. గ్రంథములనుగూడ వ్రాసినారు. మరి జనులందరు ధర్మాత్ములెందుకు కాలేదు? ఈశ్వరుడు సత్యవాది. అతడు అందరిని ధార్మికుల గుటకు ఉపదేశించును. అట్టితరి అందరు ధార్మికులెందుకు కాలేదు? కావున అసంభవములైన విష యములను యోగుల కంటగట్టగూడదు. ఇట్టి అసత్య కథనము వలన యోగులు, యోగము రెండును నిందపాలగునే కాని పొగడ్తను పొందజాలవు.

''అస్తేయప్రతిష్ఠాయాం సర్వరత్నోపస్థానమ్'' (యోగ. ౨-౩౭) మనుష్యుడు మనోవాక్కర్మ లచే దొంగతనమును మానినపుడు అతనికి ఉత్తమపదార్థములు లభించును. బుద్ధిమంతుడు, ప్రయత్న శీలుడు మాత్రమే దొంగతనమును పూర్తిగా వదలగల్గును. ఇతరులు వదలజాలరు. కష్టపడినవానికి ఉత్త

మపదార్థములు లభించును. జనులుగూడ అతనికి ఉత్తమ పదార్థముల నిత్తురు. దొంగతనము వదలి ఈశ్వరాజ్ఞానుసారము ప్రయత్నముచేయువానిని ఈశ్వరుడు జ్ఞానముతో పరిపూర్ణు నొనర్చును. దొంగతనము వదలుటవలన యోగివద్దకు వెండి, బంగారము మొదలగునవి వాటంతటవే వచ్చిపడునని కొందరు తలంతురు. ఇది నిజముకాదు. ★

‘‘బ్రహ్మచర్యప్రతిష్ఠాయాం వీర్యలాభః’’ (యోగ. ౨.౩౮). బ్రహ్మచర్యమును పాటించుట వలన బలము కలుగును. అతి దీర్ఘకాల పరీక్షణ తర్వాత బ్రహ్మచర్యమును పాటించినవాని బుద్ధి తీవ్రమగునని, శరీరము ఆరోగ్యవంతము, బలిష్ఠము అగునని, దీర్ఘాయువు ప్రాప్తించునని యోగులు ప్రకటించినారు. ౪౮సం.ల వయసు వరకు బ్రహ్మచర్యమును పాటించినవ్యక్తి ౪౦౦ సం.లు సుఖపూర్వకముగ జీవించునని దయానందమహర్షి తెలిపినాడు.

‘‘అపరిగ్రహస్థైర్యే జన్మకథంతా సంబోధః’’ (యోగ. ౨-౩౯) (అపరిగ్రహ.....) అపరిగ్రహ ఫలము- మనుష్యుడు విషయాసక్తిని వీడి పూర్తిగా జితేంద్రియుడైనపుడు నేనెవనిని? ఎక్కడినుండి వచ్చినాను? నేనేమి చేయవలసియున్నది. అనగా ఏ కార్యము చేయుటవలన నాకు హితముచేకూరును? అను నిట్టి శుభగుణముల భావములు అతని మనస్సులో స్థిరపడిపోవును. (ఋ. భా. భూ. ఉపాసనా.)

నియమములఫలము :- ‘‘శౌచాత్స్వాంగజుగుప్సా పరైరసంసర్గః’’ (యోగ. ౨-౪౦) శౌచము వలన తన శరీరము నెడ ఏవగింపు కలుగును. ఇతరుల శరీరములను గూడ తాకనొల్లడు. తన శరీరమును చక్కగా శుద్ధిచేసికొని చూడనంతవరకు వ్యక్తి తన శరీరము చాల అందముగా, పవిత్రముగ నున్నదనుకొనును. ఈ అందము కొరకు ఈశ్వరోపాసన, సత్పురుషుల సాంగత్యము, స్వాధ్యాయము మొదలగు ఉత్తమ కర్మలనుగూడ వదలివేయును. అతడు ఇతరుల అందమైన శరీరములను చూచి మోహితుడగును. శరీర సౌందర్యమును చూచి తన కర్తవ్యమునే మరచిపోవును. మాటిమాటికి శరీరమును శుభ్రపరచుచు జాగ్రత్తగా గమనించినచో అది మలమూత్రముల నిలయమని అతనికి తెలియును. దీని పరిణామముగ అతనికి తన శరీరమునందుగాని, ఇతరుల శరీరములందుగాని ఆసక్తి లేకుండపోవును. శరీరము నెడ ఆసక్తి తొలగినపుడు ఈశ్వరోపాసనాది సత్కర్మలను ప్రారంభించును.

‘‘సత్త్వవృద్ధి సౌమనస్యైకాగ్ర్యేంద్రియజయాత్మదర్శనయోగ్యతాని చ’’ (యోగ. ౨-౪౧) బుద్ధి శుద్ధమగును. దాని వలన మానసిక ప్రసన్నత ఏర్పడును. దాని వలన ఏకాగ్రత, ఏకాగ్రత వలన ఇంద్రియ జయము, ఇంద్రియజయమువలన ఆత్మను తెలిసికొను యోగ్యత లభించును.

‘‘సంతోషాదనుత్తమ సుఖలాభః’’ (యోగ. ౨-౪౨). సంతోషమును పాటించు మనుష్యునికి విషయములందు కోరిక నశించును. విషయతృష్ణ తొలగినపుడు లభించు శాంతి లౌకిక సుఖము లన్నిటికన్న ఉత్తమమైనది.

★ ఆనందముతో పరిపూర్ణుడైన యోగి ఎవరినుండి ఏమియు అపేక్షించడు. పైగా మనుష్యులు అజ్ఞానము మరియు దుఃఖమునుండి విముక్తులై ఆనందమననుభవించుటకు రాత్రింబవళ్లు నిరపేక్షముగా ప్రయత్నించును. దానిచే ఉపకృతులైన (లాభము పొందిన) మనుష్యులు ధనైశ్వర్యములను యోగులకు సమర్పించుట సహజము. ఇదియు దానంతటదే వెండి బంగారము వచ్చిపడుట కాదు. (సంపాదకుడు).

''కాయేన్ద్రియసిద్ధిరశుద్ధిక్షయాత్తపసః'' (యోగ. ౨-౪౩) తపస్సువలన అశుద్ధి నశించును. ఇంద్రియములు రోగరహితములు, బలిష్ఠము లగును.

''స్వాధ్యాయాదిష్టదేవతాసంప్రయోగః'' (యోగ. ౨-౪౪), స్వాధ్యాయము వలన ఇష్టదేవత-పరమేశ్వరునితో సంబంధ మేర్పడును. ఈశ్వర సహాయము లభించును. వేదము, వేదానుకూల గ్రంథములు చదువుటవలనను, ప్రణవ (ఓ౩మ్) జపము వలనను ఈశ్వరుని గుణములు తెలియును. దానివలన ఈశ్వరునియందు అత్యంతప్రీతి కలుగును.

''సమాధిసిద్ధిరీశ్వరప్రణిధానాత్'' (యోగ. ౨-౪౫) ఈశ్వర ప్రణిధానము వలన సమాధి సిద్ధించును. ఆ సమాధివలన ఆనందము, జ్ఞానము లభించును.

ఆసన స్వరూపము :-''స్థిరసుఖమాసనమ్'' (యోగ. ౨-౪౬) స్థిరముగను సుఖపూర్వకముగను కూర్చుండ వీలైనది ఆసనము. దీర్ఘకాలమువరకు కదలకుండ, ఎటువంటి బాధలేకుండ కూర్చుండగల్గునట్టి ఆసనము సమాధిసిద్ధికి సాధన మగును. ఆసనములన్నియు సమాధికి సాధనములు కావు. అందువలన ఆసనములు చేయుట యోగాభ్యాసము కాదు. కొందరు ౫౦, ౬౦ ఆసనములు నేర్చుకొందురు. వాటినే చేయుచు, చేయించుచుందురు. ఈ ఆసనముల అభ్యాసమునే యోగాభ్యాసమని యనుచుందురు. అనేక ఆసనములు చాల కఠినమైనవి. వానిని వేయుటలో ఎగురుట, దుముకుట అవసరము. ఆ స్థితిలో క్రొత్త సాధకుడు తన వృత్తులను నిరోధింపజాలడు. ఈ యాసనములు ఒకరకమైన వ్యాయామము. శక్తికొలది నియమపూర్వకముగ అభ్యాసము చేసినచో ఇవి ఆరోగ్యమునకు ఉపకరించును. కాని ఆసనములనే యోగము అనుకొనుట, వాటిద్వారా ఈశ్వర సాక్షాత్కారము జరుగుననుకొనుట, ఈశ్వర సాక్షాత్కారము కొరకు ఆసనముల నభ్యసింపజేయుట వ్యర్థము. ఆసన సఫలతకొరకు తెలిసికొనవలసిన కొన్ని ముఖ్యవిషయములు గలవు. ఋషి ఇట్లు తెలిపినాడు - శరీరము ద్వారా చేయబడు సామాన్య చేష్టల నన్నిటిని నిలిపివేయవలెను. అనంతుడైన పరమాత్మని ధ్యానించవలెను. దీనివలన ఆసనము సిద్ధించును. అణువణువున వ్యాపించి ఏమాత్రము చలించక స్థిరముగానున్న పరమాత్మని ధ్యానించునప్పుడు సాధకునిలో గూడ స్థిరత్వమేర్పడును. ఆసనమున కూర్చొని శరీర చేష్టలన్నిటిని నిలిపివేయవలెను. అనంతుడైన ఈశ్వరుని ధ్యానించవలెను. సాధకులు సామాన్యముగ ఆసనమున కూర్చుండి కాళ్లచేతులతో ఏదో ఒక చేష్ట చేయుచునే యుందురు. అట్లు చేయగూడదు. వెన్నెముకను, మెడను నిటారుగా నుంచవలెను. వంగి కూర్చున్నచో మబ్బు, నిద్ర వచ్చును. దీర్ఘకాలము వంగి కూర్చుండుటవలన పొట్టగూడ చెడిపోవును. చేతులను మోకాళ్లపైన ఉంచిన నిటారుగా కూర్చుండుటలో తోడ్పడును. దీర్ఘకాలమువరకు ఒకే ఆసనమున కూర్చుండలేకపోయినచో మధ్యన ఆసనము మార్చుకొనవలెను. ఇట్లు ప్రయత్నించుటవలన ఆసనము సిద్ధించును. మూడు గంటలలో, ఆరుగంటలలో ఆసనమున స్థిరముగా కూర్చుండ గలిగిననే సమాధి సిద్ధించుననుట సరికాదు. 3 లేక ౬ గంటల ఆసనసిద్ధి లభించనంతవరకు సమాధి సిద్ధించదని కొండరందురు. వీరియీ మాటలు ప్రమాణ విరుద్ధము లైనందున త్యాజ్యములు. ఋషి దయానందుడు స. ప్ర. ౯ వ సముల్లాసమున ''ముముక్షువు ప్రతిదినము కనీసము రెండుగంటలు తప్పక ధ్యానము చేయ

వలె'' నని వ్రాసినాడు. ఈ రెండు గంటలను రెండుగా విభజించిన ఒక్కొక్క సమయమున ఒక్కొక్క గంట అగును. మోక్షప్రాప్తికి ప్రతి దినము రెండు గంటల ధ్యానము సరిపోవునని దీనివలన తెలియుచున్నది. ఎక్కువ సమయము వరకు ఆసనము నభ్యసింపదలచినవారు అభ్యసింపవచ్చును. కాని ఆరు గంటల ఆసనము సిద్ధింపకున్న సమాధి లభించదనుకొనుట నిరాధారము. ఆసనము సిద్ధించినపుడు శీతోష్ణములు, ఆకలి దప్పులు మున్నగునవి అంతగా బాధించవు. చిత్తము ఏకాగ్రతమగును.

<u>ప్రాణాయామము-దానిఫలము</u> :- ''తస్మిన్సతి శ్వాసప్రశ్వాసయోర్గతివిచ్ఛేదః ప్రాణాయామః'' (యోగ.౨-౪౯). ఆసనము సిద్ధించిన పిదప శ్వాసగతిని శక్తి కొలది నిలిపివేయుట ప్రాణాయామ మనబడును. బయటి గాలిని లోనికి పీల్చుకొనుట శ్వాస. లోపలిగాలిని బయటకు వదలివేయుట ప్రశ్వాస. ఈ రెండింటి గతిని యథాశక్తి నిరోధించుటయే ప్రాణాయామము.

బాహ్యాభ్యంతరస్తంభవృత్తి దేశకాలసంఖ్యాభిః పరిదృష్టో దీర్ఘసూక్ష్మః'' (యోగ. ౨-౫౦). బాహ్య, ఆభ్యంతర, స్తంభవృత్తి అని ప్రాణాయామములు మూడు రకములు. దేశ, కాల, సంఖ్యలచే చక్కగా ప్రయోగింపబడినప్పుడు ప్రాణము దీర్ఘమును, తేలికయు నగును. ప్రాణమును బయటకు వదలిన తర్వాత, లోపల నింపిన తర్వాత ఏ స్థానమున ప్రాణము నిలిచియుండునో దానినే దేశము అందురు. ప్రాణమును బయటగాని లోపలగాని నిలిపి యుంచుటకు పట్టు సమయమే కాలము. ఒక ప్రాణాయామము చేయుటలో ఎన్నిశ్వాస ప్రశ్వాసల సమయము పట్టునో అదియే సంఖ్య. ఉదాహరణకు- ఒక ప్రాణాయామము చేయుటకు పది శ్వాసప్రశ్వాసలకు పట్టునంత సమయము పట్టుట. ఎన్ని ప్రాణాయామములు చేయబడునో వాని సంఖ్యను గూడ లెక్కించవలెను. వ్యక్తి తన సామర్థ్యమును బట్టియే ప్రాణాయామము చేయవలెను.

ప్రాణమును బయటకు వదలి శక్తికొలది బయటనే దానిని నిలిపివేయుట బాహ్యప్రాణాయామ మనబడును. ప్రాణమును లోనికి పీల్చుకొని శక్తికొలది లోపలనే నిలిపి యుంచుట ఆభ్యంతర ప్రాణాయామ మనబడును. ప్రాణమును బయటకు వదలక, లోపలికి పీల్చుకొనక ఎక్కడిదాని నక్కడనే నిలిపివేయుట స్తంభవృత్తి యనబడును.

<u>ప్రాణాయామవిధి</u> :- మొదట కాలకృత్యముల నెరవేర్చుకొని ప్రాణాయామము చేయవలెను. ఆసనమున కూర్చుండి నాసికద్వారా ప్రాణమును బయటకు వదలవలెను. మూలేంద్రియమును పైకి లాగియుంచవలెను. మనస్సున 'ఓమ్' నామమునుగాని, ప్రాణాయామ మంత్రమునుగాని, అర్థసహితముగ గాయత్రీ మంత్రమునుగాని జపించవలెను. వ్యాకులత కలిగినపుడు ప్రాణమును ధైర్యముతో నెమ్మదిగా లోనికి పీల్చుకొనవలెను. ప్రాణమును పూర్తిగా నింపుకొనిన తర్వాత మళ్లీ దానిని బయటకు వదలివేయవలెను. ఇది ఒక ప్రాణాయామము మరియు రెండవ ప్రాణాయామమునకు ఆరంభము.

<u>ఆభ్యంతర ప్రాణాయామము</u> :- మొదట ఒకసారి ప్రాణమును బయటకు వదలి మళ్లీ లోపలికి పీల్చుకొనవలెను. మనస్సున జపము చేయుచుండవలెను. వ్యాకులత కలుగునంతవరకు ప్రాణమును నిలిపియుంచి తర్వాత దానిని వదలివేయవలెను. ఇది రెండవ ప్రాణాయామము. ఋషిదయానందుడు బాహ్యప్రాణాయామమునందే మూలేంద్రియమును పైకి లాగియుంచు నియమమును విధించినాడు.

స్తంభవృత్తి - ప్రాణము లోపలికి వచ్చునపుడు లేదా బయటకు వెళ్లునపుడు లేదా లోపలికి వచ్చిన పుడో, బయటకు వెళ్లిపోయినపుడో దానిని ఎక్కడున్నదాని నక్కడనే నిలిపి వేయవలెను. తిరిగి శ్వాస ప్రశ్వాసలు జరుగదొడగనేని వాటిని ఆపివేయవలెను. ప్రాణాయామము చేయువ్యక్తి యమనియమము లను పాటించవలెను. స్వసామర్థ్యము, ఆహారము, ఋతువు, అనుభూతి వీనినన్నిటిని గమనించియే ప్రాణాయామము చేయవలెను. ప్రాణాయామమున నిపుణుడు, విశ్వాసపాత్రుడు నైన విద్వాంసుని నుండియే ప్రాణాయామము నేర్చుకొనవలెను. ప్రాణాయామము చేయునపుడు నోరు ఎండుకపోసాగిన, తల బరువు అనిపించిన వెంటనే ప్రాణాయామము మానుకొనవలయును. విశేషరుగ్ణావస్థలోగూడ ప్రాణా యామము చేయగూడదు. కొందరు చేతితో ముక్కును పట్టుకొని ప్రాణాయామము చేయుదురు. కాని ఋషిదయానందుడు ''సంస్కారవిధి గృహాశ్రమప్రకరణము''లో చేతితో ముక్కును పట్టుకొని ప్రాణాయామము చేయుటను నిషేధించినాడు.

''బాహ్యాభ్యంతర విషయాక్షేపీ చతుర్థః'' (యోగ. ౨-౫౧) బయట ఆపివేయబడునట్టి మరియు లోపల ఆపివేయబడునట్టి రెండురకముల ప్రాణాయామములను అతిక్రమించునదే బాహ్యా భ్యంతర విషయాక్షేపీ ప్రాణాయామము అనబడును. ఈ ప్రాణాయామము చేయువిధి - మొదట ప్రాణమును బయటకు వదలి బయటనే నిలిపివేయవలెను. లోపలికి తీసికొను కోరిక కలిగినపుడు దానిని లోనికి రానీయగూడదు. పైగా లోపలనున్న ప్రాణమును ఇంకను బయటకు వదలవలెను. ఇట్లు ఒకసారి రెండుసార్లు శక్తియున్నన్ని సార్లు బయటకు వదలి వేయవలయును. తిరిగి ప్రాణమును నెమ్మదిగ ధైర్యపూర్వకముగ లోపలికి పీల్చుకొనవలెను. దానిని లోపలనే శక్తికొలది నిలిపియుంచవలెను. ప్రాణమును లోపల నిలుపుటకు వీలుగాని స్థితిలో దానిని బయటకు వెళ్లనీయక బయటనుండి ఇంకను ప్రాణమును లోనికి పీల్చుకొన యత్నించవలెను. ఈ విధముగ ఒకటి, రెండు సార్లు లేదా సాధ్యమైనన్ని సార్లు బయటినుండి ప్రాణమును లోనికి పీల్చుకొనవలెను. కాని ఇట్లు చేయుటలో హఠము ఎన్నడును చేయగూడదు. వ్యాకుల మనిపించినచో ప్రాణమును వదలి వేయవలెను. ఇది ఒక బాహ్యాభ్యంతర విష యాక్షేపీ ప్రాణాయామము. బాహ్య, అభ్యంతర, స్తంభవృత్తి అను మూడురకముల ప్రాణాయా మములు పరిపక్వమైన పిదపనే దీనిని చేయవలెను. హఠముతో ప్రాణమును అధికముగా నిరోధించి నచో మూర్ఛరావచ్చును. బుద్ధి, శరీరము రెండును వికృతి జెందును. అందుచే బుద్ధిపూర్వకముగా శక్తి కొలదియే ప్రాణాయామము చేయవలెను.

ప్రాణాయామఫలము :- ''తతః క్షీయతే ప్రకాశావరణమ్'' (యోగ. ౨-౫౨) :- విధిపూర్వ కముగ ప్రాణాయామము చేసినచో జ్ఞానముపైన గల ఆవరణము క్షీణించును. శరీరము, మనస్సు స్వచ్ఛ ములగును. ఈ రెండును స్వచ్ఛములైనచో జ్ఞానము వికసించును. శరీరము రోగమునకు గురియైన బుద్ధి క్షీణించునటులనే ఆరోగ్యవంతమైన శరీరమున బుద్ధి పెంపొందును. మనస్సు, ఇంద్రియములు స్వాధీనములగును. ఆపైన కుసంస్కారములు తొలగును. అవి తొలగుటవలన సుసంస్కారములు ప్రబలము లగును. అపుడు జ్ఞానము పెంపొందును. ఏలన కుసంస్కారములవలన అవిద్య ఉత్పన్న మగును. అజ్ఞానమును నశింపజేయుటకు ఈశ్వరోపాసన రెండవ సాధనము. సాధకుడు ప్రాణాయామ

ముద్వారా మనస్సును వశపరచుకొని ఈశ్వరుని ఉపాసించినప్పుడు జ్ఞానము వికసించును. అజ్ఞానము నశించును. మహర్షి దయానందుడిట్లు వ్రాసినాడు - (క) ''ఇట్లు ప్రాణాయామపూర్వకముగ ఉపాసించినచో ఆత్మయొక్క జ్ఞానమును ఆవరించిన అజ్ఞానము ప్రతిదినము నశించుచు క్రమముగా జ్ఞాన ప్రకాశము పెంపొందును. (ఋ. భా. భూ. ఉపాసనా విషయము) (ఖ) ఇట్లు పరస్పర విరుద్ధచర్యవలన రెండింటిగతి నిలిచిపోయి ప్రాణము స్వాధీనమగుటవలన మనస్సు, ఇంద్రియములు గూడ స్వాధీనములగును. బలము, పురుషార్థము పెంపొంది బుద్ధి తీవ్రము, సూక్ష్మము నగును. అది అత్యంత కఠినము మరియు సూక్ష్మ విషయమును శీఘ్రముగా గ్రహించును. దీనివలన శరీరమున వీర్యము వర్ధిల్లును. స్థిరమైన బల పరాక్రమములు, జితేంద్రియత ప్రాప్తించును. అల్పకాలముననే సమస్త శాస్త్రములను చదివి గ్రహించ గలడు. ఇదే విధముగ స్త్రీగూడ యోగము నభ్యసించవలెను.'' (స. ప్ర. ౩ వసము.)

''ధారణాసు చ యోగ్యతా మనసః'' (యోగ. ౨-౫౩) - ధారణలందు మనస్సు సమర్థమగును. ఏవిషయమందైనను ఇష్టానుసారముగ మనస్సును నిలుపవచ్చును. ఇట్లు విధిపూర్వకముగ ప్రాణాయామము చేయుటవలన అనేక ప్రయోజనములు సిద్ధించును. కాని హఠముతో ప్రాణాయామము అధికముగ చేసినయెడల లాభమునకు మారుగ హానిగూడ కలుగును. కనీసము మూడు. అధికాధికము ౨౧ ప్రాణాయామములు చేయవలయునని మహర్షి దయానందుడు సంస్కారవిధిలో గృహాశ్రమ ప్రకరణమున తెలిపినాడు. కాని 'హఠయోగ ప్రదీపిక'లో★ ప్రతిదినము ౩౨౦ ప్రాణాయామములు చేయవలెనని విధింపబడినది. ఇది అయుక్తము. ఏలన అధిక ప్రాణాయామమువలన రూక్షత పెంపొందును. బుద్ధి క్షీణించును. మూర్ఛగూడ వచ్చును. కొందరు కేవలము ప్రాణాయామమువలననే సమస్తము సిద్ధించుననుకొందురు. జ్ఞానమును, శుభకర్మలను, యమనియమముల పాలనను అవసర మనుకొనరు. అనుచిత ప్రాణాయామమువలన వేలాది జనుల శరీరములును, బుద్ధియు చెడి పోవుట గమనించుచునే యున్నాము. కావున ప్రాణాయామమును విధిపూర్వకముగ, శక్తికొలది, స్వానుభవపూర్వకముగ చేయవలెను.

''స్వవిషయాసంప్రయోగే చిత్తస్వరూపానుకార ఇవేంద్రియాణాం ప్రత్యాహారః'' (యోగ. ౨-౫౪) - ఇంద్రియములు తమతమ విషయములతో సంబంధము వీడి చిత్తమునకు అనుకూలములగుట ప్రత్యాహారము అనబడును. సాధకుడు 'ఓమ్' మున్నగు నామముల జపమునందు తనమనస్సును నిలిపినపుడు ఇంద్రియములు అతనిని బయటి విషయములవైపు ఆకర్షించవు. మనసునే వెన్నంటియుండును. తేనెటీగలలో రాణి ఈగ కూర్చున్న శాఖపైననే మిగతా ఈగలన్నియు కూర్చుండును. అది అచటినుండి లేచి పోయినచో అవిగూడ దానిని వెన్నంటియే వెళ్లిపోవును. ఇదే విధముగ ఇంద్రియములు చిత్తమును అనుసరించును. దీనినే ప్రత్యాహార మందురు. చిత్తముపైన ఆధిపత్యమే ప్రత్యాహారము. చిత్తమును వశపరచుకొనుటకు అనేక ఉపాయములు గలవు. చిత్తము జడపదార్థమని పూర్వమే తెలుపబడినది. మనుష్యుడు చిత్తమును జడము అనుకొని దానిని వశపరచుకొనయత్నించినచో సఫలత లభించును. లేనిచో లభించదు. పలువురు సాధకులు ఈ విషయమును

★ హఠయోగపుస్తకమున భ్రమలోకూడిన సిద్ధాంతములు ప్రతిపాదింపబడినవి. వాటిని గురించి వ్రాసిన ప్రత్యేక వ్యాసమును ఈ పుస్తకములో ఉత్తరార్థమున చదువగలరు. (రచయిత)

వించురు. చదువుదురు కాని ధ్యానము చేయునపుడు చిత్తమును చేతనమనుకొందురు. అట్టివారు దానిని ఏదేని విషయమున నిలుపదలచినను నిలుపజాలరు. మనస్సును ★ చేతనమనుకొని వ్యవహరించు వారి స్థితి నల్లమందుమత్తులో విమానము నడుపు చాలకునివలె నుండును. మత్తులో మునిగిన చాలకుడు 'విమానము తనంతకుతానే దుర్ఘటనా స్థలమునకు పోవుచున్నది. నేనేమియు చేయజాలను' అని భావించును. అట్లే మనుష్యుడు అజ్ఞానమువలన 'చిత్తము స్వయముగనే పరుగులిడుచున్నది. నేనేమి చేయగలను?' అని అనుకొనును. సంధ్యా, జపము మున్నగువానిని చేయునపుడు మనుష్యుల స్థితి ఇట్లే యుండును. ఈశ్వరుడే సమస్త పదార్థములను అధిపతి యని నమ్మి సాధకుడు అతనికి సమర్పితుడైనచో మనస్సు = చిత్తము సులభముగా వశమగును.

సాధకుడు ప్రాపంచిక సుఖము లన్నింట దుఃఖము కలిసి యున్నదని తెలిసి కొన్నపుడు అతని మనస్సు ప్రాపంచిక సుఖములవైపు ఆకర్షింపబడదు. కావున యోగ సాధకుడు ప్రాపంచిక సుఖములను సదా దుఃఖమిశ్రితములుగనే చూచుచుండవలెను. ధ్యాన స్థితియందు పూర్వము తాను చూచిన రూపము గల పదార్థములను జీవుడు స్మరించును. వాటి స్మృతిని తొలగించుటకు ఇట్లు భావించవలెను. ఈ ప్రాపంచిక వస్తువు లన్నియు ఉత్పత్తి, వినాశధర్మము గలవి. ఈ జగత్తు నిర్మాణమగుటకు పూర్వము ఇవి లేకుండెను. కాలాంతరమున ఇవన్నియు నశించును (=కారణమున లయమగును). ఇట్లు ప్రలయస్థితి స్వరూపమును మనస్సున నిలుపుకొనుటవలన ధ్యానావస్థలో ప్రాపంచిక వస్తువుల రూపాదిగుణములు విఘ్నము కలుగజేయవు. ఈ విధముగ నిరంతరము ఈ సాధనములను ప్రయోగించుటవలన మనస్సు స్వాధీనమగును. అప్పుడు మనుష్యునికి కలిగే స్వేచ్ఛానుభూతి ఏ ప్రాపంచిక స్థితిలోను కలుగజాలదు.

''తతః పరమా వశ్యతేంద్రియాణామ్'' (యోగ. ౨-౫౫) ప్రత్యాహారము సిద్ధింపగనే ఇంద్రియములు పూర్తిగా స్వాధీనమగును. ఈ స్థితిలో ఇంద్రియములు చిత్తమును విషయములవైపు మరల్పవు.

రెండవ పాదమున అవిద్యా స్వరూపమును, హేయము, హేయహేతువు, హానము, హానోపాయము, యోగముయొక్క ఐదు అంగములు, వానిఫలము మున్నగునవి సంక్షిప్తముగ తెలుపుటకు ప్రయత్నించబడినది. జిజ్ఞాసువులు వీని అధ్యయనమువలన తాము లాభము పొంది ఇతరులకుగూడ యోగ మార్గమున నడచుటకు ప్రేరణ నివ్వగలరు.

3. విభూతి పాదము

ఇప్పుడు యోగదర్శనమున తృతీయపాద విషయము ఆరంభించబడును. దీనికి విభూతిపాదమని పేరు. ఇందు ముఖ్యముగ విభూతుల వర్ణన గలదు. అంతరంగ యోగముయొక్క మూడు అంగముల వర్ణనగూడ కలదు. ఇంకను అనేక విషయము లిందు గలవు.

<u>ధారణా</u>:- **''దేశబంధశ్చిత్తస్య ధారణా''** (యోగ. 3-౧) - చిత్తమును ఏదేని ఒక స్థానమున

★ యోగదర్శనమున మహర్షిపతంజలి మనసును, చిత్తమును పర్యాయశబ్దములుగ ప్రయోగించినాడు. (రచయిత)

స్థిరపరచి అభీష్ట విషయమును ధ్యానించుట ధారణ యనబడును. ఉదాహరణకు- తన శరీరములో లలాటము, హృదయము మున్నగువానిలో ఏదేనొక స్థానమున మనస్సును స్థిరపరచి 'ఓమ్' లేక గాయత్రీ మంత్రమును జపించుటయే ధారణ. ఏదేనొక స్థానమున మనస్సును నిలుపుట మాత్రమే ధారణ కాదు. మహర్షి దయానందుడిట్లు వ్రాసినాడు - ''(దేశబంధ...) ఉపాసనా యోగపు పూర్వోక్త ఐదంగములు సిద్ధించినపుడు దాని ఆరవ అంగము 'ధారణ' యథాతథముగ ప్రాప్తించును. (ధారణ) మానసిక చాంచల్యమును తొలగించి నాభి, హృదయము, లలాటము, నాసిక, నాలుకయొక్క అగ్రభాగము మున్నగు స్థానములందు మనస్సును నిలిపి ఓమ్‌కార జపమొనర్చుట మరియు దాని అర్థమగు పరమేశ్వరునిగూర్చి ఆలోచించుట ధారణ యనబడును.'' (ఋ. భా. భూ. ఉపాసనా విషయము)

ధ్యానము :- ''తత్ర ప్రత్యయైకతానతా ధ్యానమ్'' (యోగ. 3-2) - ఈ సూత్రమునకు ఋషి దయానందుడు వ్రాసిన వ్యాఖ్య- ''(తత్ర ప్రత్యయై...) ధారణ తర్వాత అదే స్థానమున ధ్యానింపదగు, ఆశ్రయింపదగు అంతర్యామియైన వ్యాపక పరమేశ్వరుని ప్రకాశమున, ఆనందమున అత్యంత వివేకముతో, భక్తి ప్రేమలతో సముద్రమధ్యమున నది ప్రవేశించునట్లు ప్రవేశించవలెను. ఆ సమయమున ఈశ్వరుని తప్ప ఇతర పదార్థములను స్మరింపగూడదు. కేవలము ఆ అంతర్యామి స్వరూపమునందును, అతని జ్ఞానమునందును లీనము కావలెను. ఇదియే ధ్యానము. ఈ ఏడంగములకు ఫలము సమాధియే.'' (ఋ. భా. భూ. ఉపాసనా.) ''ఒక విలువైన వస్తువు అగాధజలమున పడిపోయినది. నీటిలో మునిగి దానిని వెలికి తీయు'' మని ఒక సత్యవాది వేరొకనితో ననగా ''నేనా వస్తువును ఎన్నడును చూడలే'' దని అతడనును. ధ్యానము ఇట్టిదే.

అప్పుడు ఆ సత్యవాది '' ఆ వస్తువు ఈ యీ ఆకారప్రకారము, ఇంత పొడవు, వెడల్పు గలది'' అని వర్ణింపగా ఆ వ్యక్తి నీటిలో మునిగి ఆ వస్తువును వెదకును. అప్పుడు ఆ వస్తువుయొక్క ఆకారప్రకారము మున్నగు గుణములు తప్ప ఇతర విషయములను మనస్సులోనికి రానీయడు. ఇదియే ధ్యానము. వేదము, వేదానుకూల గ్రంథములలో ఇదే విధముగ ఈశ్వరుని వాస్తవిక స్వరూపము వర్ణింపబడినది. ఆస్వరూపమునే మనస్సునందిడుకొని ఈశ్వరునిధ్యానించవలెను. ఆ అన్వేషణాకాలమున ఈశ్వరుని స్వరూపమును వదలి మరొక ఆలోచనను మనస్సులోనికి రానీయకుండుట ఈశ్వర ధ్యానము. ఉదాహరణకు ఈశ్వరుడు సర్వరక్షకుడు. సర్వవ్యాపకుడు, సర్వజ్ఞుడు, ఆనందస్వరూపుడు, సర్వశక్తిమంతుడు. ఏదేని రూపము, ఆకారము, పొడవు, వెడల్పు మున్నగునవి లేకున్న ధ్యానము సాధ్యము కాదని కొందరందురు. ఇందే మాత్రము సత్యములేదు. ఏలన సుఖమునకు రంగు, రూపము ఏదియు కనిపించదు. ఐనను లక్షలాది ప్రాణులు రాత్రింబవళ్లు సుఖమునే ధ్యానించును. దుఃఖమునకు కూడ కాళ్లు చేతులు ఏవియు కనిపించవు. అయినను ప్రాణులన్నియు సదా దుఃఖము రాకూడదని ధ్యానించును. జనులు శత్రువును ధ్యానింతురు. వారికి ఆశత్రువు లభించును. దానివలన వారికి అనేక ప్రయోజనములు సిద్ధించును. రూపముగల వస్తువునే ధ్యానించగల రనుట, రూపములేని వస్తువును ధ్యానింపజాలరనుట అయుక్తము. ఈశ్వరునియందు జ్ఞానము, బలము, ఆనందము మొదలగు గుణములు గలవు. వాటిద్వారా అతనిని ధ్యానింతురు. ఆ ధ్యానముద్వారా సమాధి, సమాధిద్వారా ఈశ్వర సాక్షాత్కారము జరుగును. వస్తువులోగల గుణములద్వారా వస్తువు ధ్యానింపబడును. వేరొక విధముగ సాధ్యము

కాదు. ఈశ్వరునికి రూపము. ఆకారము, కాళ్లు, చేతులు మున్నగున వేవియు లేవు. అట్టిచో అతనికి రూపము, చేతులు మున్నగునవి కలవని నమ్మి అతనిని ధ్యానించుట వ్యర్థమే. ఇట్టి ధ్యానమువలన ఈశ్వరప్రాప్తి ఎన్నటికిని సంభవము కాదు. ఎందుకన ఈశ్వరునిలో ఆ గుణములు లేనేలేవు అది ధ్యానమే కాదు. లక్షలాది జనులు ఈశ్వరుని పొందగోరుదురు. కాని ఈశ్వరుని స్థానమున ఇతర వస్తువులను ధ్యానింతురు. ఈ యశుద్ధ జ్ఞానమువలన ప్రపంచమున కెంతయో హాని కలుగుచున్నది. ఈశ్వరుని పొందగోరువారు నిజముగా ధ్యానించియుండినచో బుద్ధిమంతులు, బలవంతులు, సదాచారులునై ఆనందమున నోలలాడుచుండెడివారు. అంతేగాదు ఈశ్వరుని నమ్మువారి మధ్య కనిపించు కలహము లుండెడివి కావు. కావున ఈశ్వరుని సత్యస్వరూపమును తెలిసికొని ధ్యానము చేయవలెను. చేయించ వలెను. అట్లు చేయుటవలన అందరికి శుభము కలుగును. ఇంతకన్న వేరే మార్గము మేదియు లేదు.

''ధ్యానం నిర్విషయం మనః'' (సాంఖ్య. ౬-౨౫) అను సూత్రమువలన మనస్సు సంపూర్ణ ముగ విషయరహిత మగుట- అనగా మనస్సునందు ఏ విషయముగూడ లేకుండుటయే ధ్యానము అని తోచుచున్నది. కాని దీని వాస్తవమైన అభిప్రాయము ''ధ్యానమేక విషయం మనః'' అనియే. అనగా మనస్సుద్వారా దీర్ఘకాలము వరకు ఒక అభీష్టస్థానమున కేవలము పరమాత్మునే అన్వేషింపబడును. ఇతర విషయము లన్నియు నిరోధించబడును. దీనినే ధ్యానమందురు. జీవుడు నిజముగా ఈశ్వరుని అన్వే షించినపుడు ఇతర విషయములను మనస్సులోనికి రానీయడు. అదియే ఈశ్వర ధ్యానము. మనస్సులో ఏ విషయము లేకుండుట ధ్యానము కాదు. యోగసిద్ధిని పొందుటకు ధ్యానస్వరూపమును చక్కగా గ్రహించవలెను. ఆ పైన దానిని సరిగా ఆచరించవలెను.

<u>సమాధి స్వరూపము</u> :- ''తదేవార్థమాత్రనిర్భాసం స్వరూపశూన్యమివ సమాధిః'' (యోగ. 3-3) ఈ సూత్రమునకు మహర్షిదయానందుని వ్యాఖ్య- (తదేవార్థ...) అగ్నిలోనున్న ఇనుము అగ్ని రూపమైపోవునటుల పరమేశ్వరుని జ్ఞానమున ప్రకాశమయుడై తన శరీరమును గూడ మరచిపోయి పర మేశ్వరుని ప్రకాశస్వరూపముతో, జ్ఞానముతో ఆత్మను పరిపూర్ణమొనర్చుకొనుటయే సమాధి. (ఋ.భా.భూ. ఉపాసనావిషయము). అర్థము (వస్తువు)ను మాత్రమే ప్రకటించి స్వరూపశూన్యము వలె మారుధ్యానమే సమాధి యనబడును.

ప్రశ్న :- స్వరూపశూన్యము అనగా సమాధిలో మనుష్యుడు శూన్యుడుగా నగును. అతనికి ఏవ స్తుజ్ఞానము గూడ ఉండదు అందురు గదా!

ఉత్త:- సూత్రార్థమది కాదు. ఏలన అందు ''అర్థమాత్రనిర్భాసం'' అని కలదు. సమాధిలో అర్థము = వస్తువు ప్రకాశితమైనపుడు మనుష్యుడు జ్ఞానశూన్యుడెట్లగును? జ్ఞానము లేకున్న వస్తుసాక్షా త్కారము కాజాలదు. సాక్షాత్కారమగునేని జ్ఞానశూన్యుడు కాజాలడు. జ్ఞానశూన్యస్థితిని సమాధి యందు రేని మత్తు పదార్థముల వలన కలుగు మూర్ఛను గూడ సమాధి యనవలసియుండును. కావున జ్ఞాన శూన్యమును సమాధియనుట అసంగతము. కావున సమాధిలో జీవుడు ఈశ్వరుని సాక్షాత్కరించు కొన్నపుడు తనను మరచిపోయినట్లుండును. ఈశ్వరుడు సర్వవ్యాపకుడుగా ప్రత్యక్షముగుట వలన తన స్వరూపమును మరచినట్లగును. ఎట్లన ఒకవ్యక్తి ఒకానొక మహాపురుషుని దర్శించినపుడు అతని గుణము

లను తెలిసికొని తనను మరచిపోవును. జ్ఞానశూన్యుడు మాత్రము కాడు. సమాధి పరిపక్వమైనపుడు జీవుడు ఈశ్వరుని, ప్రపంచమును తనను వేరు వేరుగా గుర్తించును. అపుడు జ్ఞానము పరిపక్వమగును. పరమాత్మడే ఉపాసించదగినవాడని, ప్రపంచము కాదని గ్రహించును. ఈశ్వరసాక్షాత్కారమువలన జ్ఞానము ఆనందము, నిర్భయత్వము ప్రాప్తించును. సమాధి భంగమైనపుడు అజ్ఞానము, దుఃఖము, భయము కలుగును. ఇట్లు సమాధి స్థితిలో జీవుడు జ్ఞానముతో, ఆనందముతో నిండిపోవును. జ్ఞాన శూన్యుడుగా నుండడు. కావున జ్ఞానశూన్యుడని నమ్ముట భ్రాంతియే.

యోగవిభూతులు:- ఈ పాదమున అనేక విభూతులు పేర్కొనబడినవి యోగాభ్యాసము వలన లభించిన జ్ఞానము, బలము, సుఖము మొదలగువాటిని విభూతి లందురు. ఈపాదమున ప్రత్యేకముగ సంయమమువలన లభించు విభూతులు పేర్కొనబడినవి. ధారణా, ధ్యానము, సమాధి అను నీ మూడును ఒకే విషయమున కేంద్రితమగుట సంయమమనబడును. ఇది ఒక పరిభాష, ధారణా, ధ్యానము, సమాధి- మూడింటిని పేర్కొనక వీటిస్థానమున సంయమ శబ్ద మొకటే వాడబడును. ఈవిభూతులను పొంద కుండ యోగి కాగల్గునా? అని కొందరి జిజ్ఞాస. విభూతులను పొందకున్నను యోగి కాగలడు. **''తే సమాధావుపసర్గా వ్యుత్థానే సిద్ధయః''** (యోగ.3-3౭) ప్రాతిభము, శ్రావణము, వేదన, ఆదర్శము, ఆస్వాదము, వార్తా అనునవి లౌకిక స్థితి యందు సిద్ధులే కాని సమాధియందు ఉపసర్గములు = విఘ్నములు అని సూత్రకర్త తెలిపినాడు.

''తద్వైరాగ్యాదపి దోషబీజక్షయే కైవల్యమ్'' (యోగ. 3-౫౦) ఆ సిద్ధుల యెడ కూడ వైరా గ్యము కలిగినపుడు దోషముల బీజము నశించి మోక్షము లభించును.

''సత్త్వపురుషయోః శుద్ధిసామ్యే కైవల్యమితి'' (యోగ. 3-౫౫) మహర్షి దయానందుడు దీని నిట్లు వ్యాఖ్యానించినాడు- '' (సత్త్వపురుషః-) సత్త్వము= బుద్ధి, పురుషుడు = జీవుడు - ఈ రెండును శుద్ధము లగుటవలన ముక్తి కలుగును. లేనియెడల కలుగదు.'' (ఋ.భా.భూ. ముక్తి విష యము). **''ఏతస్యామవస్థాయాం కైవల్యం భవతీశ్వరస్యానీశ్వరస్య వా వివేకజ్ఞానభాగిన ఇతరస్యవా''** **(వ్యాసభాష్యము)** - సిద్ధులను సంపాదించినవాడైనను, సంపాదించనివాడైనను; వివేకజ్ఞానము కల వాడైనను, లేనివాడైనను ఈ స్థితిలో మోక్షమును పొందును. సంయమము ద్వారా లభించిన సిద్ధులు మోక్షప్రాప్తికి అనివార్యములు కావని దీనివలన విదితమగుచున్నది. కొందరు సిద్ధులను చూచి మోక్షము కొరకు ప్రయత్నించుటయే మానుకొందురు. కారణమేమన వారు మోక్షముకొరకు ఇవన్నియు అవస రమని, తాము వాటిని సాధింపలేమని అనుకొందురు. ఇది వారి పొరపాటు. మోక్షప్రాప్తికి ఈ సిద్ధులు అనివార్యములు కావు. మోక్షముకొరకు కావలసినవి శుద్ధమైన జ్ఞానము, శుద్ధమైన కర్మలు మరియు శుద్ధమైన ఉపాసన- ఇవి లేకున్న ఏ వ్యక్తియు యోగికాజాలడు. ముక్తిని పొందజాలడు.

౪. కైవల్యపాదము

ఈ పాదమున ముఖ్యముగా కైవల్యవర్ణన గలదు. కావున దీనికి కైవల్యపాదమని పేరు. కైవల్యము గాక అనేక ఇతర విషయములుగూడ ఇందు గలవు. ఉదాహరణకు చిత్తమును కైవల్యమునకు తగినట్లు

చేసికొను మార్గము, నాల్గురకముల కర్మల స్వరూపము మొదలగునవి.

చిత్తమును కైవల్యమునకు తగినట్లు చేసికొను మార్గము :- **''తత్ర ధ్యానజమనాశయమ్''** (యోగ. ౪.౬) - విభిన్న స్థితులతో కూడుకొన్న చిత్తము ధ్యానముద్వారా చక్కగా సంస్కరింపబడును. అపుడది అనాశయము = వాసనారహితము అగును. వాసనారహిత మగుటవలన అది ముక్తికి సాధనమగును. ఈ సూత్రమున ''ధ్యానజం'' అను శబ్దమును చూచి ధ్యానమువలన క్రొత్తచిత్తము ఉత్పన్నమగునని తలంపరాదు. ''ధ్యానజం'' అనగా ధ్యానముచే సంస్కరింపబడిన చిత్తము అని అర్థము. ధ్యానము ద్వారా చిత్తములోని అశుభ వాసనలు తొలగింపబడును అందు మోక్షప్రాప్తికి అవసరమగు అర్హత ప్రవేశ పెట్టబడును. నిష్కామకర్మలు గూడ. మోక్షమునకు సాధనములే. కావున సూత్రకారు డిట్లన్నాడు-

''కర్మాశుక్లాకృష్ణం యోగినస్త్రివిధమితరేషామ్'' (యోగ. ౪-౭) - కర్మలు నాల్గురకములు. కృష్ణకర్మలు = పాపకర్మలు; శుక్లకర్మలు=పుణ్యకర్మలు; శుక్లకృష్ణకర్మలు=పాపపుణ్య మిశ్రితములు; అశుక్ల అకృష్ణ కర్మలు= నిష్కామకర్మలు. ఒకడు వేదమును చదివి విద్వాంసుడగును. ఇతరులకు విద్యనేర్పును. ఈ కర్మవలన ఎవరికిని ఎట్టి హాని కలుగదు. కావున ఇది శుక్లకర్మ. ఒకడు ఒక మహాపురుషుని దూషించును. ఇది కృష్ణకర్మ. వేరొకని కర్మవలన హానిలాభములు రెండును కలుగును. ఉదాహరణకు- వ్యవసాయము వలన ఎన్నియో ప్రాణులకు దుఃఖము కలుగును. కాని ఉత్పన్నమైన పంట విద్యావృద్ధికి, ధర్మప్రచార మునకు తోడ్పడును. కావున ఇది కృష్ణశుక్లకర్మ. ప్రాపంచిక కోరికలను వీడి ఈశ్వరప్రాప్తి కొరకు చేయ బడునవి అశుక్ల అకృష్ణకర్మలు. మోక్షాధికారము పొందుటకు తప్పనిసరిగా నిష్కామ కర్మలు చేయవలసి యుండును. అందుకే సూత్రకారుడు యోగుల కర్మలు అశుక్ల అకృష్ణము లని తెలిపినాడు. ''పవిత్ర కర్మలు, పవిత్ర ఉపాసన, పవిత్ర జ్ఞానము వలననే ముక్తి కలుగును.'' అని ఋషి దయానందుడు సత్యార్థ ప్రకాశము ౯ వ సముల్లాసమున వ్రాసినాడు. కావున కేవలము జ్ఞానమువలనగాని, కేవలము కర్మలవలనగాని, కేవలము ఉపాసనవలనగాని ముక్తి లభింపదు. ఈ మూడును శుద్ధములగు నపుడే ముక్తి లభించును. లేకున్న లభింపదు.

అశుభవాసన ప్రవాహముతో అనాది. ఆవాసన ఉండగా మోక్షము లభించదు. వాసనలకు ఆధారము అవిద్యాదులు. ఆ ఆధారమును తొలగించుట వలన వాసనలు తొలగిపోవును. వాసనలు తొలగుటవలన మోక్షము లభించును. అని మహర్షి పతంజలి తెలిపినాడు.

మోక్షస్వరూపము:- **''పురుషార్థశూన్యానాం గుణానాం ప్రతిప్రసవః కైవల్యం స్వరూపప్రతిష్ఠా వా చితిశక్తిరితి''** (యోగ. ౪.౩౪) లౌకిక సుఖము, మోక్షసుఖము అనుజీవుని ప్రయోజనమును సిద్ధింపజేయు బుద్ధి, అహంకారాదులు ప్రకృతిలో లీనమగుట మోక్షము. జీవుడు తన స్వరూపము ప్రకృతి వికృతులకన్న భిన్నమైనదని తెలిసికొని ఈశ్వరుని స్వరూపమున మగ్నుడగును. దీనిని కైవల్యము=మోక్షము

అందురు. ఈ సూత్రమును మహర్షి దయానందుడు ఇట్లు వ్యాఖ్యానించినాడు– ''(పురుషార్థ...) కారణములోని సత్త్వరజస్తమో గుణములును, వాని సమస్త కార్యములును పురుషార్థమువలన నశించును. ఆత్మయందు విజ్ఞానము, పవిత్రత యథాతథముగ కలుగును. స్వరూపప్రతిష్ఠా= జీవుడు తన స్వాభావిక శక్తులతోను, గుణములతోను కూడినవాడై శుద్ధస్వరూపుడైన పరమేశ్వరుని స్వరూపమగు విజ్ఞానము, ప్రకాశము, నిత్యానందములో నుండును. ఆ స్థితినే కైవల్యము= మోక్షము అందురు.'' (ఋ.భా.భూ.ముక్తి విషయము)

స్వరూప ప్రతిష్ఠకు అర్థము కేవలము జీవుడు తనస్వరూపమున ప్రతిష్ఠితుడగు ననుటయే కాదు. జీవుడు ప్రకృతి వికృతులను, తనస్వరూపమును చక్కగా తెలిసికొని పరమాత్ముని స్వరూపమున స్థితుడగును. ఆతని ఆనందమును అనుభవించును అని దీని అర్థము. ఈ విషయము యోగదర్శనము, ప్రథమపాదములోని మూడవ సూత్రమున స్పష్టము చేయబడినది. జీవుడు మోక్షము ననుభవించి మరల ప్రపంచమున జన్మించునా లేదా? అను ప్రశ్నకు జీవుడు మోక్షానంతరము పునర్జన్మను పొందుననియే సమాధానము ఇందుకు ప్రమాణము–

''ప్రశ్న:- జీవుడు ముక్తిని పొంది మళ్లీ జన్మమరణరూప దుఃఖమునకు గురి యగునా లేదా? ఉపనిషత్తు '' న చ పునరావర్తతే న చ పునరావర్తత ఇతి'' అని తెలుపు చున్నది. శారీరక సూత్రము ''అనావృత్తి: శబ్దాదనావృత్తి: శబ్దాత్'' అనుచున్నది. భగవద్గీత ''యద్ గత్వా న నివర్తంతే తద్ధామ పరమం మమ'' అనుచున్నది. వీటి వలన ముక్తిని పొందిన జీవుడు మళ్లీ ప్రపంచమునకు తిరిగి రాదనియే విదితమగు చున్నది–

ఉత్త:- ఇది సరికాదు. ఏలన వేదము దీనిని నిషేధించుచున్నది.

కస్య నూనం కతమస్యామృతానాం మనామహే చారు దేవస్య నామ।
కో నో మహ్యా అదితయే పునర్దాత్ పితరం చ దృశేయం మాతరం చ॥ ఋ.౧-౨౪-౧॥

అగ్నేర్వయం ప్రథమస్యామృతానాం మనామహే చారు దేవస్య నామ।
స నో మహ్యా అదితయే పునర్దాత్ పితరం చ దృశేయం మాతరం చ ॥ ఋ.౧-౨౪-౨॥

మేము ఎవరిపేరును పవిత్రమని తెలిసికొనవలెను? నాశరహిత పదార్థములందు విద్యమానుడై సదాప్రకాశస్వరూపుడై యున్న దేవుడెవడు? మాకు ముక్తి సుఖము ననుభవింపజేసి మరల ఈ ప్రపంచమున జన్మనొసగి మాతాపితరుల దర్శనము చేయించువాడెవడు? ।౧॥

మేము స్వప్రకాశస్వరూపుడు, అనాది, సదాముక్తుడునైన ఆ పరమాత్ముని పేరును పవిత్రమని యెరుగుదుముగాక! అతడే ముక్తి యందు మాకు ఆనందము ననుభవింపజేసి భూమిపై మాతాపితల

సంబంధమున జన్మనొసగి వారి దర్శనము చేయించును. ఆ పరమేశ్వరుడే ముక్తి వ్యవస్థను చేయును. అందరికి స్వామి అతడే. ॥౨॥

'' ఇదానీమివ సర్వత్ర నాత్యంతోచ్ఛేదః'' (సాంఖ్య. ౧-౧౫౯) - ఇప్పుడు బద్ధులు, ముక్తులు ఉన్నటులనే ఎల్లప్పుడు ఉందురు. బంధ ముక్తికి అత్యంత విచ్ఛేదము ఎన్నడును కాదు. అట్లని బంధమే కాని ముక్తియే కాని ఎల్లప్పుడు ఉండదు'' (స. ప్ర. ౯ సమ.)

ప్రశ్న:- **ఉపనిషత్తులు. వేదాంతము, గీత మొదలగు వాటిలో మోక్షానంతరము జీవునికి పునర్జన్మ లేదని వ్రాయబడియున్నది గదా?**

ఉత్త:- ముక్తి కాలము ౩౧౧౦౪౦౦౦౦౦౦౦౦౦౦ సంవత్సరములు. ముక్తి కాలము ముగియనంతవరకు జీవుడు ముక్తిని వదలి జన్మనెత్తడు అని ''న చ పునరావర్తతే...'' మొదలగు వాక్యముల అభిప్రాయము. ముక్తి కాలము ముగియగానే జన్మనెత్తవలసి యుండును. కారణమేమన శుద్ధజ్ఞానకర్మోపాసనల వలన ముక్తి లభించును. జీవుని జ్ఞానకర్మోపాసనలు పరిమితములు. వాని ఫలముగూడ పరిమితముగనే ఉండవలెను. అపరిమితము కారాదు. ఈశ్వరుడు పరిమిత జ్ఞానకర్మోపాసనలకు అపరిమిత ఫలము నొసగనేని అన్యాయమే అగును. మంచి, చెడు కర్మలు ఎవరు ఎంతగా చేయుదురో వారికి అంతే సుఖ దుఃఖరూప ఫలము నొసగుట న్యాయమగును. పశుపక్ష్యాది యోనులలో గల జీవులకు దుఃఖ మధికము. ఒకవేళ జీవులను ఏదోషము లేకయే పశుపక్ష్యాది యోనులలో ప్రవేశ పెట్టినచో ఈశ్వరుడు దోషికాగలడు. కావున ఈశ్వరుడు జీవులకు బంధమోక్షములను వారి కర్మలను బట్టియే ఒసగును. ఆ కర్మలు పరిమితములు. కావున వాటి ఫలముగూడ పరిమితమై యుండదగును. పరిమిత కర్మలకు అపరిమిత ఫలము ఉండరాదు. కావున మోక్షము తరువాత జీవుడు తిరిగి జననమరణముల ననుభవించును. ఒకవేళ మోక్షానంతరము జీవుడు ప్రపంచమున జన్మించకున్నచో ప్రపంచమే ఉండదు. ఇది అపసిద్ధాంతము. ఏలన మోక్షమునకు వెళ్లిన జీవులందరు తిరిగి ప్రపంచమునకు రారు. జీవుల సంఖ్య నిశ్చితము. క్రొత్తజీవులు ఉత్పన్నము కారు. అట్లైనచో ఈ ప్రపంచమే సమాప్తము కావలసియుండును. కావున మోక్షకాలము ముగిసిన పిదప జీవులు తిరిగి జన్మింతు రనుటయే సమంజసము.

ముక్తికాలము తర్వాత జీవుడు ప్రపంచమున జన్మించుటకు కారణ మేమి? అను ప్రశ్నకు సమాధానము ఋషిదయానందుడు ''అగ్నేర్వయం...'' (ఋ.౧-౨౪-౨) అనుమంత్రవ్యాఖ్యలో నిట్లు వ్రాసినాడు- ''**అయమేవ ముక్తానామపి జీవానాం మహాకల్పాంతే పునః పాపపుణ్యతుల్యతయా పితరం మాతరం చ మనుష్య జన్మ కారయతీతి చ** - అనగాముక్తజీవులకు మహాకల్పాంతమున తిరిగి వారి పాప పుణ్యముల సమానతను బట్టి మాతాపితరుల మూలమున మానవజన్మ నిచ్చును.'' మానవుడు ముక్తిని పొందినపుడు సాధారణ మానవ జన్మకు కారణభూతములైన పాపపుణ్యములు మిగిలి యుండును.

మోక్షము కలుగజేయు నిష్కామకర్మలు మోక్షఫలము నొసగి సమాప్త మగును- అని ఋషిదయానందుని ర॰ వచనములవలన ఋజువగుచున్నది. కావున మోక్షము తర్వాత లభించు జన్మకు మిగిలియున్న సమాన పాపపుణ్యములే కారణము.

ఇట్లు సంక్షిప్తముగ యోగ స్వరూపము, దానిఫలము, యోగములో సాధక బాధకములు, వాటి స్వరూపములను తెలుపుటకు యత్నించితిని. సాధకుడు యోగము నభ్యసించుచు ఈశ్వరుని సాక్షాత్కరించుకొను పద్ధతిని మరియు ఇతరులకు సాక్షాత్కరింపజేయు పద్ధతిని స్పష్టపరచుటకు యత్నించితిని. బుద్ధిమంతులైన యోగజిజ్ఞాసువులు దీనిని చదివి జీవితములో ఆచరించి స్వపరహిత మును సాధించగలరని ఆశించుచున్నాను.

★★★

యోగము - భ్రాంతినివారణ

౧. ఈశ్వరజీవప్రకృతులు వేరు వేరని తెలియనివాడు యోగి కాగలుగునా?

నేడు యోగవిషయములో అనేక భ్రాంతులు వ్యాపించియున్నవి. అవి దినదినాభివృద్ధి నొందు చున్నవి. అజ్ఞానము మరియు స్వార్థమువలననే ఈ నమ్మకములు సృష్టించబడినవి. వీటిని అరికట్ట నిచో అజ్ఞానము పెరుగుచునేయుండును. ప్రాణులకు మహాదుఃఖము ప్రాప్తించును. యోగస్వరూప మును తెలిసికొనుటకు నేను 3౫ సం.ల నుండి (ఇప్పటికి దాదాపు ౪౨ సం.ల నుండి - సంపా.) మిక్కిలి ప్రయత్నించుచున్నాను. యోగానుష్ఠానమువలన నాకు గొప్పలాభము కలిగినది. ఇందేమాత్రము సందేహము లేదు. ఈ కాలమున నేను యోగవిషయమున గడించిన అనుభవమును వేదాదిశాస్త్రముల అధ్యయనమువలన తెలిసికొన్న జ్ఞానమును సకలజనుల హితము గోరి ప్రకటించుచున్నాను.

నా యీవ్రాత సత్యాసత్యమును తెలిసికొనుటకును, తెలియజేయుటకును మాత్రమే ఉద్దేశింప బడినది. పక్షపాతముతో ఎవరిని ఖండించుటకు కాదు. యోగ జిజ్ఞాసువులు, శిక్షకులు పక్షపాతము వీడి శ్రద్ధతో ఈ వ్యాసమును చదివినయెడల తప్పక గొప్ప లాభము కలుగును.

ప్రశ్న:- **'ఈశ్వర జీవ ప్రకృతులు అనాది, నిత్యము లని నమ్మువాడైనను జీవుడు, ప్రకృతి అనాది, నిత్యములని నమ్మువాడైనను, కేవలము ప్రకృతినే అనాది నిత్యమని నమ్మువాడైనను యోగి కాగ ల్గును. ఇట్టి నమ్మకములతో యోగమునకు ఎట్టి సంబంధము లేదు' అని అందురు గదా?**

ఉత్త:- ఈశ్వర జీవ ప్రకృతులను అనాదియని నమ్మువాడే నిజమైన యోగి కాగలడు. ఇతరులు కాజాలరు. ఈ నమ్మకములతో యోగమునకు ఎట్టి సంబంధము లేదనువారు అజ్ఞానాంధకారములో మునిగియున్నారు. త్రైతవాదము తప్ప ఇతర వాదనలను నమ్మువారు ఎన్నటికిని యోగులు కాజాలరు. ఏలన అవి యుక్తి ప్రమాణములకు విరుద్ధములు.

యోగముయొక్క వాస్తవిక స్వరూపమును ప్రకటించునది పాతంజల యోగ దర్శనము. అందు ఈశ్వర జీవ ప్రకృతులు మూడును భిన్నములని అంగీకరింపబడినది. **''క్లేశకర్మ విపాకాశయైరప రామృష్టః పురుష విశేష ఈశ్వరః''** (యోగ.౧-౨౪) అను సూత్రములో **''పురుష విశేష ఈశ్వరః''** అను ప్రయోగమువలన ఈశ్వరుడు జీవుడు భిన్నములని స్పష్టమగుచున్నది.

ఈ సూత్ర (యోగ. ౧-౨౪) భూమికలో వ్యాసమహర్షి ఇట్లు వ్రాసినాడు- **''అథ ప్రధాన పురుషవ్యతిరిక్తః కోఽయమీశ్వరో నామేతి?''** - 'ప్రకృతి పురుషుల కన్న వేరైన ఈ యీశ్వరు డెవడు?' ఈ వాక్యమువలన ఈశ్వర జీవ ప్రకృతులు భిన్నములని స్పష్టమగుచున్నది. **''ప్రకాశక్రియా స్థితిశీలం భూతేంద్రియాత్మకం భోగాపవర్గార్థం దృశ్యం''** (యోగ. ౨-౧౮) అను సూత్రమున 'ఈశ్వర' 'జీవు' లకు భిన్నమైన 'ప్రకృతి' జీవుని భోగముకొరకును, మోక్షముకొరకును ఉద్దేశించబడినట్లు తెలుపబడినది. ''ద్రష్టా దృశిమాత్రః శుద్ధోఽపి ప్రత్యయానుపశ్యః'' (యోగ.౨-౨౦) అను సూత్రమున ఈశ్వర ప్రకృతులకు జీవుడు భిన్నుడని చూపబడినది. సూత్రకారుడు పూర్వసూత్రములలో

ఈశ్వర ప్రకృతులను గూర్చి తెలిపియున్నాడు. ఈ సూత్రమున జీవుని వర్ణన గలదు.

వేదాంతదర్శనములోను త్రైతవాద మంగీకరింపబడినది. ఎట్లన- "**అథాతో బ్రహ్మజిజ్ఞాసా**" (వేదాం. ౧-౧) అను సూత్రమున బ్రహ్మజిజ్ఞాస ఉపదేశింపబడినది. బ్రహ్మ తప్ప మరొక వస్తువే లేనిచో బ్రహ్మను తెలిసికొనగోరువాడెవడు? "**జన్మాద్యస్య యతః**" (వేదాం. ౧-౨) - ఎవనిద్వారా ఈ జగత్తు యొక్క సృష్టిస్థితి లయములు జరుగునో ఆ బ్రహ్మయే తెలిసికొనదగినవాడు.

ఈ సూత్రముల ద్వారా ఈశ్వర జీవ ప్రకృతులు మూడును భిన్నములని ఋజువగుచున్నది. ఈ సూత్రములందు ఒకడు తెలిసికొనగోరువాడు. అతడు తన కన్న భిన్న పదార్థమును తెలిసికొనగోరుచున్నాడు. ఆ పదార్థము ప్రకృతితో ఈ ప్రపంచమును నిర్మించి, పోషించి, లయము చేయును. కావున కేవలము బ్రహ్మ మాత్రమే అనాదియని నమ్మువారు ఎన్నటికిని యోగులు కాజాలరు.

మహాయోగి స్వామీదయానందసరస్వతి గూడ ఈశ్వర జీవ ప్రకృతులు త్రికాలములలోను భిన్నములుగా నుండునని అంగీకరించినాడు. సత్యార్థప్రకాశము ఎనమిదవ సముల్లాసమున "ద్వా సుపర్ణా సయుజా..." (ఋ.౧-౧౬౪-౨౦) అను మంత్రముద్వారా ఈశ్వర జీవ ప్రకృతులను అనాదియని నిరూపించినాడు. స్వామీ దయానందసరస్వతి యోగి కాడనువారు అజ్ఞులు. ఋషి దయానందుని గ్రంథములద్వారా, అతని వ్యవహారముద్వారా అతడు మహాయోగి యని ఋజువగు చున్నది. యోగ విషయమున అతని సిద్ధాంతము అంగీకరింపదగినది.

త్రైతవాదము నంగీకరించువాడే యోగి కాగల్గునని యుక్తి ద్వారా గూడ ఋజువగుచున్నది. కేవలము బ్రహ్మయే అనాదియని నమ్మినచో యోగము నభ్యసించి యోగి కావలసిన అవసర మేమి? అతడు స్వయముగా సచ్చిదానందుడు గదా! అతనికి ఏ వస్తువును అవసరము లేదు. ఈశ్వర ప్రకృతులను అనాదులని నమ్మువారి మాన్యత ననుసరించియు యోగి కావలసిన అవసరము లేదు. ప్రకృతి జడము. అది యోగాభ్యాస మెట్లు చేయును? జడమగుటవలన దానికి ఆ యవసరముగూడ లేదు. అట్లే కేవలము ప్రకృతియే అనాది యనువారి నమ్మకము ననుసరించియు యోగి కావలసిన అవసరము లేదు. జీవ ప్రకృతులను అనాదులని నమ్మువారి ననుసరించియు యోగి కాజాలడు. ఈశ్వరుడనే పదార్థమే లేకున్నచో యోగాభ్యాసముద్వారా జీవుడు ఎవరిని సాక్షాత్కరించుకొనును? యోగముచే జీవుడు తానే ఈశ్వరుడగునని నమ్మినచో ఆ సామర్థ్యము ఎక్కడినుండి వచ్చును? యోగము నభ్యసించి ఈశ్వరుడగుటకు పూర్వము జీవుడు బంధములో ఎందుకు చిక్కుకొన్నాడు? అను ప్రశ్నలు దయించును. కావున కేవలము త్రైతవాదము ననుసరించియే మనుష్యుడు నిజముగా యోగి కాగలడు. ఇంకే వాదము ననుసరించి కాజాలడు. యోగజిజ్ఞాసువులు మరియు శిక్షకులు త్రైతవాదము నంగీకరించియే యోగాభ్యాసము చేయవలెను. చేయించవలెను. లేనిచో వారు దుఃఖసాగరమున మునుగుదురు. వారిని నమ్మి యోగము నభ్యసించువారుగూడ తమ మానవ జన్మమును వ్యర్థము చేసికొందురు.

ప్రసిద్ధయోగి యనబడు ఒక స్వామీజీతో సాక్షాత్కారము :- ఒకనాడు మహాయోగియని పేరుగాంచి అనేక దేశములలో యోగశిక్షణ నొసగిన ఒక స్వామీజీతో సంవాదము జరిగినది ఆ ప్రశ్నోత్తరములలో కొన్నిటిని సర్వజనహితము కొరకు ఇట వ్రాయుచున్నాను.

ప్రశ్న:- మీరు వేదమును ఈశ్వరీయ జ్ఞానమని నమ్ముదురా లేదా?

ఉత్త:- నేను వేదమును ఈశ్వరీయజ్ఞానమని నమ్మను. అది ఋషుల హృదయములనుండి వెలువడినది.

ప్రశ్న:- ఈశ్వర ప్రకృతులకన్న జీవుడు వేరని మీరు నమ్ముదురా? లేదా?

ఉత్త:- జీవుని ఈశ్వర ప్రకృతులకన్న భిన్నమని నేను నమ్మను.

ప్రశ్న :- మన్వాది ఋషులు ఈశ్వరప్రకృతులకన్న జీవుడు వేరని అంగీకరించినారు గదా?

ఉత్త:- వారి మాన్యత ఏమైన నాకేమి? నేను మాత్రము జీవుని అస్తిత్వము లేదనియే నమ్ముదును.

ప్రశ్న:- ఈశ్వరునిలో ఏదైన గుణమున్నదా? లేదా?

ఉత్త:- ఈశ్వరునిలో ఏగుణమును లేదు. స్వామీ దయానందుడు ఈశ్వరుని సగుణుడు, నిర్గుణుడు అని నమ్మినాడు. అది సరికాదు.

ప్రశ్న :- మీ యీ నమ్మకములకు ప్రమాణ మేమి?

ఉత్త:- ప్రమాణ మేదియు లేదు. నేను మాత్ర మట్లే నమ్ముదును.

(ప్రమాణము అడిగినపుడెల్ల స్వామీజీ 'నేనిట్లు నమ్ముదును'. అనియే సమాధాన మిచ్చుచుండెను. అపుడు స్వామీ అగ్నిదేవ్ భీష్మ ''స్వామీజీ! మీరు వ్రాసిన పుస్తకములో మూడు పదార్థములను అనాది యని అంగీకరించినారు గదా?'' అని అడిగెను. అందుకు స్వామీజీ, ''అప్పుడు నేను మూడింటిని అనాదియని నమ్మితిని. కాని ఇప్పుడు నా నమ్మకము మారినది'' అనిరి.)

ప్రశ్న:- ఇప్పటి మీ మాన్యతలో గూడ మార్పు వచ్చినచో?

ఉత్త:- ఇక మార్పురాదు. ఇప్పుడు ఈశ్వరప్రకృతుల రెంటినే అనాదియని నమ్ముచున్నాను. జీవుని అస్తిత్వము నంగీకరించను. నాయీ నమ్మకము ఇక మారదు.

ఈ విధముగా ప్రపంచములో అనేకులు ప్రసిద్ధ యోగులుగా ప్రచలితులగు చున్నారు. వీరు 'ఇది నా నమ్మకము. ఇది నా అనుభవము' అనుచుందురు. యుక్తి ప్రమాణము లేవియు లేకయే తమ మాన్యతలను నెలకొల్పుదురు. వీరి యీ కల్పిత మాన్యతలను నిరోధించుటకే సాంఖ్యకారుడైన కపిలముని **''నాయౌక్తికస్య సంగ్రహో௨న్యథా బాలోన్మత్తాది సమత్త్వమ్''** (సాంఖ్య. ౧-౨౬) అనగా యుక్తి విరుద్ధ మాటలను అంగీకరించినచో అజ్ఞానుల, ఉన్మత్తుల మాటలనుగూడ అంగీకరించవలయును' అని అన్నాడు. యుక్తి ప్రమాణములు లేని స్వకల్పిత మాన్యతలను స్థాపించు వారు యోగు లెన్నటికిని కాజాలరు. ఈశ్వర జీవ ప్రకృతుల వాస్తవిక స్వరూపమును తెలిసికొని, అంగీకరించి, ఆచరించు వ్యక్తియే యోగి కాగల్గును. అన్యుడు కాజాలడు.

★★★

౨. వేదవేదాంగ ఉపాంగాదులను చదువక యోగియగునా?

'వేదవేదాంగ ఉపాంగాదులను చదువకయే మానవుడు యోగి కాగలడు. వీటిని చదువు అవసరమే లేదు' అనునది రెండవ భ్రాంతి. :- నేడనేకులు' యోగి యగుటకు వేదాది శాస్త్రముల పఠన పాఠనము అవసరము లేదు. యోగము నభ్యసించగ జ్ఞానవిజ్ఞానములు స్వయముగనే లభించును.' అని ప్రచారము చేయుచున్నారు. వాస్తవముగ ఆలోచించినచో పైన పేర్కొనబడిన మాన్యతలు నిరాధారములని ఋజువగును. ఈ మాన్యతల గురించి యుక్తి ప్రమాణములతో వివేచింపబడును. మనుమహర్షి ఇట్లన్నాడు.

చాతుర్వర్ణ్యం త్రయో లోకాశ్చత్వారశ్చాశ్రమాః పృథక్।
భూతం భవ్యం భవిష్యచ్చ సర్వం వేదాత్ప్రసిధ్యతి ॥ మను. ౧౨-౯౭॥

(చాతు...) నాలుగువర్ణములు, నాలుగాశ్రమములు, భూతభవిష్యద్వర్తమానముల సమస్త విద్యలు వేదమువలననే సిద్ధించును. (ఋ.భా.భూ.వేద విషయ విచారః). ఈ విషయములో స్వామీ దయానందు డిట్లు వ్రాసినాడు.

ప్రశ్న:- జగత్తును రచించు సామర్థ్యము ఈశ్వరునిలో తప్ప ఏ జీవునిలోను లేదు. కాని వ్యాకరణ శాస్త్రమును రచించు సామర్థ్యమున్నట్లే వేదముల రచించు సామర్థ్యము జీవునిలో నుండును?

ఉత్త:-''ఉండదు. మొదట ఈశ్వరుడు వేదములను రచించెను. వాటిని చదివిన పిదపనే ఏ మానవునికైనను గ్రంథముల రచించు సామర్థ్యము కలుగును. వాటిని చదువకుండగ, జ్ఞానములేకుండగ ఎవడును విద్వాంసుడు కాజాలడు'' (ఋ.భా.భూ. వేదోత్పత్తి విష.) స్వామీజీ వ్రాతవలన విద్వాంసుడు కానిదే ఎవడును యోగి కాజాలడనుట స్పష్టము. స్వామీజీ ఇంకను ఇట్లు వ్రాసినాడు- ''కాని ఆ స్వాభావిక జ్ఞానము ధర్మ, అర్థ, కామ, మోక్ష విద్యకు స్వతంత్ర సాధన మెన్నడును కాజాలదు.'' (ఋ.భా.భూ. వేదోత్పత్తి విషయము)

ప్రశ్న:- యోగదర్శనములో ''యోగాంగానుష్ఠానాదశుద్ధిక్షయే జ్ఞానదీప్తి రావివేకఖ్యాతేః'' (యోగ. ౨-౨౮) - ఎనిమిది యోగాంగముల పాటించుటచే అశుద్ధి నశించి వివేకఖ్యాతి పర్యంతము జ్ఞానము వికసించును - అని కలదు. కావున వేదాది శాస్త్రములను చదువు అవసరము లేదు.

ఉత్త:- వాస్తవముగ ఈ సూత్రార్థమును తెలియనివారే ఇట్లందురు. యోగ దర్శనము ననుసరించి యోగమున కెనిమిదంగములు గలవు. **''యమనియమాసన ప్రాణాయామప్రత్యాహారధారణా ధ్యాన సమాధయో ఽ ష్టావంగాని''** (యోగ. ౨-౨౯). అందు రెండవది నియమము. అనగా శౌచము, సంతోషము, తపస్సు, స్వాధ్యాయము, ఈశ్వరప్రణిధానము. వ్యాసమహర్షి స్వాధ్యాయము నిట్లు వ్యాఖ్యానించినాడు-'' **స్వాధ్యాయో మోక్షశాస్త్రాణామధ్యయనం ప్రణవజపో వా**'' (యోగ. ౨-౩౨ వ్యా. భా.) అనగా మోక్షశాస్త్రముల చదువుట మరియు ప్రణవము= ఓమ్‌ను జపించుట స్వాధ్యాయ మనబడును. దీనివలన యోగియగుటకు మోక్షశాస్త్రములను చదువుట అత్యంతావశ్యకమనిఋజువగుచున్నది. నాలుగు వేదములు, వానికి అనుకూలములైన ఋషుల గ్రంథములే మోక్ష

శాస్త్రములు. ఇతరములు కాజాలవు. ''నావేదవిన్మనుతే తం బృహంతం'' – వేదములను తెలియని వాడు పరమేశ్వరుని, ధర్మమును, విద్యా సమూహమును ఎఱుగజాలడు. (ఋ. భా. భూ. పఠనపాఠన విషయము)

ప్రశ్న:- ''**యోగ ఏవ యోగస్యోపాధ్యాయ:'' అనగా యోగమే యోగమును నేర్పించును'' అని కొంద రందురు. వేదమును చదువు అవసరముగాని, గురువును చేసికొను అవసరముగాని లేదు.**

ఉత్త:- ఇందెంత మాత్రము సత్యము లేదు. ఒక యోగభూమిని (స్థాయిని) సాక్షాత్కరించు కొనిన తర్వాత ఆ పైభూమిని సాక్షాత్కరించుకొను సామర్థ్యము పెంపొందును అని దీని అర్థము. ఒక భూమిని సాక్షాత్కరించుకొనిన పిదప దాని పైభూమిని సాక్షాత్కరింపజేయుటలో వేదజ్ఞానమే కారణ మగుచున్నది. స్వాభావిక జ్ఞానము కాదు. జ్ఞానము జ్ఞాతను ఆశ్రయించి యుండును. స్వాభావిక జ్ఞాన మువలన సమాధి లభింపనేరదు. ఈశ్వరీయ వేదజ్ఞానముద్వారానే యోగి ఉన్నత యోగస్థితిని పొంద గలడు. ''**యోగ ఏవ యోగస్యోపాధ్యాయ:**'' అను వాక్యమువలన అనేకులకు యోగమును తెలిసికొ నుటకు ఎవరిని గురువుగా చేసికొను అవసరము లేదు. యోగమే యోగమును నేర్పునను భ్రాంతి కలిగినది. దీని పరిణామముగ నిజమైన గురుపరంపర నష్టమైనది. అంధపరంపర ప్రచలితమైనది. దీనినే సాంఖ్య కారుడు-''**ఉపదేశ్యోపదేష్టృత్వాత్ తత్సిద్ధి:**'' (సాంఖ్య. 3-౭౯), ''**ఇతర థాఽంధపరంపరా**'' (సాంఖ్య.3-౮౧) అని పేర్కొన్నాడు. ముక్తిని తెలిసికొన్నవారును, వారి వద్ద విద్యను గ్రహించు ఉత్తమ శిష్యులును ఉన్నచో అనేకులు జీవన్ముక్త స్థితిని పొందగలరు. సద్గురువుల, ముక్తిని తెలిసికొని ఇతరులకు తెలియజెప్పువారు లేకున్నచో అంధపరంపర వ్యాపించును. ఈ అంధపరంపరలో చిక్కు కొని అనేకులు మిథ్యాయోగముపేర అమూల్యమైన తమ జీవితమును వ్యర్థము చేసికొనుచున్నారు. వీరి స్థితి ''గీతలోని ౧౮ అధ్యాయములను నూరిత్రాగితిని, కాని ఒక్కనిగూడా గురువును చేసికొనలేదు'' అన్నట్లున్నది. ఇట్లనేకులు వేదమును చదువరు. సద్గురువుద్వారా యోగము నభ్యసించరు. వీరు ''**యోగ ఏవ యోగస్యోపాధ్యాయ:**'' అను వాక్యమునకు విరుద్ధార్థము చేయుదురు. ఈ విరుద్ధ మాన్యతను నమ్మి వ్యవహరించువారు తాము లాభమునుండి వంచితులగుటయే గాక తమ అనుయాయులను గూడ అంధకారమున బడద్రోసి దు:ఖసాగరమున ముంచివేయుదురు.

ప్రసిద్ధయోగి యని పేరు గాంచిన యోగేశ్వరానందస్వామి తన జీవితచరిత్రలో ''నా గురువు నాతలపై తన చేయినుంచి నన్ను వ్యాకరణము చదువుట మానివేయుమని, యోగమున కది అనవసరమని అన్నారు'' అని వ్రాసికొన్నాడు. ఇట్టి వ్రాతల వలన, ఉపదేశములవలన వేదము నెడ ఘోరవిరోధ మేర్పడును. దీని పరిణామముగ అజ్ఞానము, అధర్మము పెంపొందును. దీనికి ఉదాహరణ ఇంతకు ముందు సూచించిన గురువు శిష్యుని తలపై చేయియుంచి యోగి యగుటకు వ్యాకరణము చదివే అవ సరము లేదను వ్రాతయే. ఆ యోగికి శిష్యప్రశిష్యులు పుష్కలముగా సమకూరినారు. అందు దయా

నందసరస్వతిని ఆప్తునిగా భావించుచు వైదిక ధర్మానుయాయులమని చెప్పుకొనువారనేకు లున్నారు. వీరు ఆర్య సామాజికులు, వేదధర్మానుయాయులు అట్లయ్యు వేద విరుద్ధ సిద్ధాంతములను నమ్మినట్టి (మునీకీరేతీవాలే) యోగేశ్వరానందస్వామిని పూర్ణయోగియని భావించి గురువుగా చేసికొనుట మహాశ్చర్యము. వీరు నిజమైన గురువని భావించు యోగేశ్వరనందస్వామి మాన్యతలు ఋషి దయానందుని మాన్యతలు పరస్పర విరుద్ధములు. ఉదాహరణకు- దయానందుడు ఈశ్వర, ప్రకృతులకంటె జీవుడు భిన్నమైనవాడని నమ్మెను. కాని ఈయన జీవునే అంగీకరింపడు - ఋషి దయానందుడు వేదమును ఈశ్వరీయజ్ఞానమని నమ్మెను. ఈయన ఋషులహృదయములో ఉత్పన్నమైనదని నమ్మెను. ఋషి దయానందుడు ఈశ్వరునిలో అనేక గుణములున్నవని నమ్మెను. కాని ఈశ్వరునిలో ఏ గుణమును లేదని ఇతని నమ్మకము. ఇరువురి మాన్యతలలో ఒకటి సత్యము మరొకటి అసత్యము. రెండును సత్యము కాజాలవు. కావున వేదవిరుద్ధముతాలో చేరి ఒక క్రొత్త సాంప్రదాయమును సృష్టించవలదని నేనా ఆర్య బంధువులకు చెప్పదలచినాను. ఏలన దీని పరిణామము అందరికి హానికరము కాగలదు.

ఈ విషయమునే యోగదర్శనకర్త ''తత్ర నిరతిశయం సర్వజ్ఞబీజం'' (యోగ.౧-౨౫) ''స ఏష పూర్వేషామపి గురుః కాలేనానవచ్ఛేదాత్'' (యోగ. ౧-౨౬) - 'ఆ పరమేశ్వరునియందు సర్వజ్ఞబీజము గలదు = అతడు సర్వజ్ఞుడు. ఈశ్వరుడు గురువులందరికిని గురువు. కాలముచేత నాశనము చేయబడడు (అవినాశి) అని పేర్కొన్నాడు. యోగదర్శనకర్త ఈశ్వరుడు సర్వజ్ఞుడని, సమాధి స్థితిలో ఈశ్వరునిలో నిమగ్నుడైన యోగికి జ్ఞానము లభించునని, ఆ జ్ఞానము వేద మనబడునని, దానిని తెలిసికొనక ఎవడును యోగి కాజాలడని తెలుపుచున్నాడు. కావున వేదాధ్యయనము చేయకున్నను యోగి కాగలుగునను సిద్ధాంతము అజ్ఞానజనితము.

ప్రశ్న:- వేదమును చదువకున్నను కొందరికి ఈ జన్మమున యోగజ్ఞానము కలుగుచున్నది గదా?

ఉత్త:- ఎవరికి ఎంత యోగజ్ఞానము కలుగునో అది వేదాధ్యయనమువలననే కలుగును. ఈ జన్మలోనే చదువనీ, పూర్వజన్మలోనే చదువని మానవుడు జన్మజన్మాంతరములనుండి గురువుల ద్వారానో పరమాత్మునిద్వారానో వేదమును చదువుచు, చదివించుచు వచ్చుచున్నాడు. అందుచేతనే ఈ జన్మమున విశేష అధ్యయనము చేయకున్నను కొందరికి పూర్వజన్మమున చేసిన శ్రమఫలితముగ యోగవిద్య లభించును. చదువకున్నచో ఎవరును విద్వాంసులు అగుట లేదుగదా! అట్లే ఈశ్వరుడు వేదజ్ఞానము నొసగకున్న ఎవరును విద్వాంసులు కాజాలరు. విద్యలేనిదే ఎవడును యోగి కాజాలడు.

ప్రశ్న:- ఈ మిథ్యా విశ్వాసమునకు కారణమేమి?

ఉత్త :- కొన్ని కారణము లివి- కొందరు యోగాచార్యులై జనులను భ్రాంతిలో పడవేసి విలాస జీవనము గడుపదలచినారు. వీరికి వేదముగురించి తెలియదు. కావున వీరు వేదమును విమర్శింతురు. వేదమును విమర్శించకున్నచో వీరికి శిష్యప్రశిష్యులు ఏర్పడరు. మరికొందరు వేదము ఈశ్వరీయ

జ్ఞానమును నమ్మకము లేనందున విమర్శింతురు. ఇంకా కొందరు పఠనపాఠన శ్రమ కోర్వక విమర్శింతురు. యోగము నభ్యసించుటకు వేదాధ్యయనము అవసరములేదని ఇట్టి కారణములెన్నియో చూపబడుచున్నవి. సత్యాసత్యమును నిర్ణయింపజాలనపుడు వేదమును మరియు ఆప్తపురుషుల వచనములను ప్రమాణములుగా గ్రహించవలెను. వేదమును చదువకయే యోగము సంభవమను అపసిద్ధాంతము నిరాధారముగుటచే బహిష్కరించుట ఎంతేని అవసరము.

★★★

3. అహింససిద్ధిని పొందిన యోగిపట్ల ప్రాణులన్నియు వైరమును వదలునా?

'అహింసాసిద్ధిని పొందిన యోగిపట్ల ప్రాణులన్నియు వైరభావమును వదలును' అనునది మూడవ భ్రాంతి. ఇది అపసిద్ధాంతమని యుక్తిప్రమాణములతో నిరూపింపబడును. **''అహింసాసత్యాస్తేయ బ్రహ్మచర్యాపరిగ్రహా యమాః''** (యోగ.౨-30) అను సూత్రమున అహింస మున్నగు ఐదు నియమములు పేర్కొనబడినవి. ఈ సూత్ర భాష్యమున వ్యాసమహర్షి అహింస యన **''తత్రాహింసా సర్వథా సర్వదా సర్వభూతానామనభిద్రోహః''** - సర్వవిధముల, సర్వకాలములందు సమస్త ప్రాణుల యెడ వైరభావమును వదలుట అని పేర్కొన్నాడు. యోగదర్శనకారుడు పతంజలి ముని **''అహింసా ప్రతిష్ఠాయాం తత్సన్నిధౌ వైరత్యాగః''** (యోగ. ౨-3౫) అను సూత్రమున అహింసయొక్క ఫలమును పేర్కొన్నాడు. స్వామీ దయానందసరస్వతి ఋగ్వేదాది భాష్యభూమిక ఉపాసనావిషయమున ఈ సూత్రమునకు ''అహింసా ధర్మము నిశ్చయమైన వ్యక్తి యొక్క మనస్సునుండి వైరభావము నశించును. అతని ఎదుట, అతని సాంగత్యమున నున్న వ్యక్తుల వైరభావముగూడ తొలగిపోవును'' అని అర్థము వ్రాసినాడు. ఆయన యభిప్రాయమేమన అహింసాధర్మము నిశ్చయమైన వ్యక్తికి సమస్త ప్రాణులయెడ వైరభావము తొలగును మరియు ఆతని సమీపమున నివసించువాని వైరభావముగూడ అతని యోగ్యత ననుసరించి- అనగా అతని పూర్వజన్మ మరియు వర్తమాన జన్మయొక్క సంస్కారముల ననుసరించి సత్సంగము వలన తొలగిపోవును. అందరికి సమానముగ ఎన్నటికిని తొలగజాలదు. ఒకనికి ఇరవై శాతము, మరొకనికి పది శాతము వైరభావము తొలగును. కాని ఒక శాతమైనను వైరభావము తొలగని వ్యక్తి గూడ ఉండును. అంతేకాదు అహింసను పూర్ణముగ పాటించువాని ప్రాణములనుగూడ హరించువారుందురు. దీనికి చరిత్రయే సాక్ష్యము. ఈ సూత్రమునకు సమస్త ప్రాణులు యోగియెడ వైరభావము వీడి అతని మిత్రములగునని అర్థమొనర్చుట నిరాధారము. కావున ఈ సూత్రమునకు అహింసను పాటించు వానికి సమస్త ప్రాణులయెడ వైరభావము నశించునను అర్థమే సరియైనది. యోగి యెడ సమస్త ప్రాణుల వైరభావము ఇంతవరకు పూర్తిగా నశించలేదు. ఇప్పుడు నశించుటలేదు. ఇకముందు నశించదు.

అహింస సిద్ధిని పొందిన యోగి పట్ల ప్రాణులన్నియు వైరమును వదలునా?

యోగేశ్వరానందస్వామి మహా యోగియని పేరుగాంచినాడు. కొందరు వైదిక ధర్మానుయాయులు గూడ అతనిని యోగియని నమ్మెదరు. ఆయన జీవుని సత్తాయే లేదనును. ఆయన తన పుస్తకములో మహాత్మాగాంధీ అహింసను సంపూర్ణముగా పాటించనందుననే కాల్చి చంపబడెనని, పాటించియుండి నచో హంతకుని చేతినుండి తుపాకి జారి క్రింద పడియుండెడిదని పేర్కొన్నాడు. మహాత్మాగాంధీ పూర్ణ అహింసా పాలకుడని నా అభిప్రాయము కాదు. ఇపుడది చర్చనీయాంశము కాదు. పూర్ణముగా అహింసను పాటించువ్యక్తిని ఎవడైనను కాల్చి చంపబోయిన అతని చేతినుండి తుపాకి జారి క్రిందపడు ననుమాట అజ్ఞానజనిత మని తెలుపుటయే నా ఉద్దేశ్యము. స్వామీ దయానంద సరస్వతిని ప్రపంచ మందలి అనేక విద్వాంసులు యోగిగా నంగీకరింతురు. నేనుగూడ ఆయనను యోగియని భావింతును. ఆయనకు అత్యున్నత యోగము సిద్ధించిన పిదపగూడ అనేకులు అతనియెడ మనోవాక్కర్మణా శత్రుత్వముతో వ్యవహరించిరి. తుదకు అతని శరీరమును నాశనము చేసిరి. అతనికి అహింస సిద్ధించ లేదా? అతడు యోగపు మొదటి మెట్టుపైననే అడుగిడలేదా? వైరభావమును త్యజింప లేకపోయెనా? అహింస యోగమున మొదటి క్రియ. దానితోనే ఉపాసన ప్రారంభమగును. ఆయన అహింసనే పాటిం చలేకున్న ఇందరు విద్వాంసులు అతనిని యోగిగా భావించుట నిరాధారమే యగును. రెండవ ఉదాహరణ- శ్రీకృష్ణుని గూడ జనులు పూర్ణయోగియని నమ్మెదరు. అతడు పూర్ణ అహింసకుడు. ఐనను దుర్యోధనునికి అతని యెడ వైరభావము ఎందుకు తొలగలేదు? యాదవవంశము పరస్పర కలహముల వలన సర్వనాశనమైనది. శ్రీకృష్ణుని సాంగత్యమువలన వారి వైరభావ మెందుకు తొలగలేదు? అట్లే జనులు వ్యాసమహర్షిని యోగియని నమ్మెదరు. మహర్షి దయానందుడు గూడ అతనిని యోగిగా నంగీకరించెను. వ్యాసుడు అహింసకుడేగదా! మరి కౌరవపాండవులకు యుద్ధ మేల జరిగెను? వ్యాసుడు యోగము మొదటిమెట్టు పైననే ప్రవేశించలేదా? విష్ణుశర్మ పంచతంత్రములో క్రింది శ్లోకము వ్రాసినాడు-

''సింహో వ్యాకరణస్య కర్తురహరత్ ప్రాణాన్ప్రియాన్పాణినేః।
మీమాంసాకృతమున్మమాథ సహసా హస్తీ మునిం జైమినిమ్॥
ఛందోజ్ఞాననిధిం జఘానమకరో వేలా తటే పింగలమ్।
అజ్ఞానావృతచేతసా మతిరుషాం కోఽర్థస్తిరశ్చాం గుణైః॥ పంచతంత్రము॥

దీని అభిప్రాయము :- పాణిని మునిని పులి చంపివేసెను. మహర్షి జైమినిని ఏనుగు చంపెను. పింగళ ఋషిని మొసలి హతమార్చెను. వీరియెడ వీటి హింసా = వైరభావము తొలగకుండెనా? ప్రపంచ ప్రసిద్ధ మహా విద్వాంసులందరు వీరిని యోగులని గుర్తించిరి. యోగియెడ ప్రాణులన్నియు వైరభావము త్యజించునెడు మిథ్యామాన్యత నంగీకరించినచో పైన పేర్కొన్న మహాపురుషులలో ఒక్కడును యోగియని ఋజువు కాజాలడు. వేదములలో ఈశ్వరుడు అహింసకుడని పేర్కొన బడి నది. **''యుంజంతి బ్రధ్నమరుషం....''** (ఋ ౧-౧౧-౧) అరుషం = **అహింసకం కరుణా మయం హింసాదిదోషరహితం** (ఋ. భా. భూ. ఉపాసనా విషయము). రుష హింసాయాం- రుష ధాతువు హింసార్థకము. దీనిని నిషేధిస్తూ ఈశ్వరుడు హింసారహితుడని పేర్కొనబడినది. అతనికి ఎవ్వరియెడను పూర్వమెన్నడును హింస- వైరభావము లేకుండెను. ఇప్పుడును లేదు . ఇకముందెన్నడును

నుండదు. ఐనను లోకమున ఈశ్వరుని యెడ సమస్త ప్రాణుల వైరభావము పూర్తిగా తొలగలేదు. ఇక ముందు తొలగదు. ప్రపంచమున ఎందరో వ్యక్తులు ఈశ్వరుని అస్తిత్వమునే అంగీకరింపరు. కొందరు ఈశ్వరుని అంగీకరించువారిని హతమార్తురు. మరికొందరు 'ఈశ్వరుడు నా కొడుకు నెందుకు చంపెను? రాళ్లవర్షము కురింపించి పంటలను నాశన మెందుకు చేసెను? సర్వనాశనముకొరకు వరదల నెందుకు సృష్టించెను?' అని యనుచు అతడు పట్టుబడినచో నాశనమే చేయుదుమని కోపముతో పండ్లు పట పట కొరుకుదురు.

ఈశ్వరుడు సదా వైర రహితుడు, ప్రాణులందరు పరస్పరము మిత్ర దృష్టి కలిగియుండవలెను. **''దృతే దృంహ మా..... మిత్రస్య చక్షుషా సమీక్షామహే''** (యజు. ౩౬-౧౮). సోదరీసోదరులు పరస్పరము వైరము కలిగియుండవలదు. **''మా భ్రాతా భ్రాతరం ద్విక్షన్ మా స్వసారముత స్వసా''** (అథ. 3-౬-30) అని అతడు వేదముద్వారా ఉపదేశించినాడు. కాని లోకమున ఈశ్వరునియెడ సమస్త ప్రాణుల వైరభావము తొలగినట్లు గాని, ఈశ్వరుని ఉపదేశమువలన ప్రాణులు పరస్పర వైర భావమును వీడినట్లుగాని కనుపించదు. త్రికాలములందు వైరములేనివాడైన ఈశ్వరునియెడనే ప్రాణు లన్నియు వైరమును త్యజింపలేకున్న వనిన యోగుల విషయము చెప్పవలయునా? యోగాభ్యాసి ఒక **ప్పుడు హింసకుడు. జీవుడు యోగము నభ్యసించి యోగియైనపుడు వైరము లేని వాడగును. అతడే** యోగమును మానుకొని అజ్ఞాన అధర్మములలో చిక్కుకొనినపుడు హింసకు డగును. ఇట్లతడు యోగ స్థితిలో వైరమును వదలును. యోగమును వదలినపుడు వైరము నవలంబించును. కాని ఈశ్వరుడు సదా, సర్వవిధముల పూర్ణ అహింసకుడే. అతనియెడనే జీవులన్నియు వైరమును వీడలేకున్న, యోగి యెడ ఎట్లు వీడగల్గును? ఇట్లు యుక్తిప్రమాణములవలన పూర్ణ అహింసకుని యెడ ప్రాణులన్నియు వైరభావమును సంపూర్ణముగ నెన్నడును వీడవని ఋజువగుచున్నది. ఈ మిథ్యా విశ్వాసములను వీడి సత్యము నంగీకరించుట సజ్జనులందరి కర్తవ్యము.

★★★

౪. తర్కము యోగమున బాధకమా?

తర్కము యోగములో బాధక మనునది నాలుగవ భ్రాంతి. నేడు ఎందరో యోగాచార్యు లనబడువారు, వారి శిష్యులు, యోగజిజ్ఞాసువులు తర్క మెన్నడును చేయగూడదని బహుళ ప్రచారము చేయుచున్నారు. తర్కము చేయువాడు ఎన్నటికిని యోగి కాజాలడని వారి యభిప్రాయము. ఇందెంత సత్యమున్నదో యుక్తి ప్రమాణము ద్వారా సమీక్షించబడును.

మహర్షి గోతముడు న్యాయదర్శనకర్త. అత డందు **''ప్రమాణప్రమేయసంశయ ప్రయోజనదృ ష్టాంతసిద్ధాంత అవయవతర్క...''** (న్యాయ. ౧-౧-౧) మొదలగు ౧౬ తత్త్వముల జ్ఞానమువలన

మోక్షము లభించునని పేర్కొన్నాడు. వాటిలో తర్కమొకటి. తర్కముయొక్క వాస్తవిక స్వరూపమును తెలిసికొని దానిని ప్రయోగింపకున్న మానవునకు ముక్తి లభించదని అతని అభిప్రాయము. ఉపాసన యొక్క ఎనిమిదంగముల ననుష్ఠించుటవలన ముక్తి లభించును. పదునారు పదార్థముల తత్త్వజ్ఞానము వలనను ముక్తి లభించును. కావున తర్కము యోగమునం దెన్నటికిని బాధకము కాజాలదు. న్యాయదర్శన భాష్యమున వాత్స్యాయన ఋషి ''ప్రమాణ ప్రమేయ...'' అను సూత్రమున ద్వంద్వసమాసమున్నదని తెలిపినాడు. ద్వంద్వ సమాసమున ప్రతిపదముయొక్క అర్థము ప్రధానమే. ఈ సూత్రమున తర్కశబ్దార్థము ప్రధానముగుటచే యోగమున సాధకమే యగును. బాధకము కాజాలదు. మహర్షి గోతముడు **''అవిజ్ఞాత తత్త్వేఽర్థే కారణోపపత్తి తస్తత్త్వజ్ఞానార్థమూహస్తర్కః''** (న్యాయ.౧-౧-౪౦) - వస్తువు యొక్క నిజస్వరూపమును తెలిసికొనుటకై 'ప్రమాణము' నాధారముగా గొని ఊహించుట- ఆలోచించుట తర్కమని పేర్కొన్నాడు. ప్రతి యోగ సాధకుడు వస్తుతత్త్వజ్ఞానముకొరకు మాటిమాటికి తర్కమును ప్రయోగింపవలసి యుండును. **''ఏతేన భూతేంద్రియేషు ధర్మలక్షణావస్థాపరిణామా వ్యాఖ్యాతా''** (యోగ. 3-౧3) ఈ సూత్రమున పేర్కొనబడిన ధర్మ లక్షణ అవస్థా పరిణామములను తర్కము లేనిదే తెలిసికొనజాలము.

సాంఖ్యదర్శనకారుడు ప్రకృతిపురుషుల స్వరూపమును విస్తారముగా వ్రాసినాడు. అందు విజ్ఞాన వాదము క్షణికవాదము, శూన్యవాదము మొదలగు మిథ్యావాదములను తర్కముద్వారా ఖండించి నాడు. కపిలాచార్యుడు తర్కము నాశ్రయింపకున్న ప్రకృతి పురుషుల స్వరూపమును తెలిసికొనలేక పోయెడివాడు, ప్రతిపాదింపలేక పోయెడివాడు. తర్కములేకున్న యోగము సిద్ధింపజాలదు. కపిలాచార్యుడు సాంఖ్యదర్శనమున **''అనియతత్వేఽపి నాయౌక్తికస్య సంగ్రహోఽన్యథా బాలోన్మత్తాదిసమత్వమ్''** (సాంఖ్య.౧-౨౬) - తర్కవిరుద్ధ కథనమును అంగీకరింపజాలమని పేర్కొన్నాడు.

న్యాయదర్శనము (౧-౧-౧) లో తెలిపిన౧౬ పదార్థములలో 'వాదము' ఒకటి. దాని లక్షణము - **''ప్రమాణతర్కసాధనోపాలంభః సిద్ధాంతావిరుద్ధః పంచావయవోపపన్నః పక్షప్రతిపక్షపరిగ్రహో వాదః''** (న్యాయ.౧-౧-౧) ఈ సూత్రమున తర్కమంగీకరింపబడినది. తర్కమును వదలినచో 'వాదము' యొక్క లక్షణము సిద్ధింపదు. అందు దోషము సంభవించును. 'వాదము' లేకున్న సత్యాసత్య నిర్ణయము కాజాలదు. సత్యాసత్యముల జ్ఞానము లేనిదే యోగాభ్యాసము సంభవము కాదు.

వ్యాసమహర్షి **''జ్ఞానస్యైవ పరాకాష్ఠా వైరాగ్యమ్''** (యోగ.౧-౧౬) జీవేశ్వరప్రకృతుల యథార్థ జ్ఞానము కలుగు స్థితియందే వైరాగ్యముదయించు నన్నాడు. ఇచట వాస్తవికజ్ఞానమునే వైరాగ్యమన్నాడు. కారణకార్యములను అభేదముగా భావించియే జ్ఞానమును వైరాగ్యమన్నాడు. వాస్తవమున జ్ఞానము కారణము. వైరాగ్యము దాని కార్యము. జ్ఞానము, వైరాగ్యము రెండు వేర్వేరు పదార్థములు. ఈ వైరాగ్యము వలననే అసంప్రజ్ఞాత సమాధి సిద్ధించును. వాదములేకున్న వైరాగ్యము కలుగదు. వాదమునుండి తర్కమును తొలగించినచో వాదముయొక్క లక్షణము సిద్ధింపదు. న్యాయ దర్శనమునుండి 'వాదము'ను తొలగించినచో తత్త్వజ్ఞానము కలుగనేరదు. జ్ఞానములేకున్న ఎన్నటికిని ముక్తిలభించదు. కపిలమహర్షి **''జ్ఞానాన్ముక్తిః''** (సాంఖ్య. 3-౨3) అన్నాడు. కావున తర్కమును యోగమున బాధకమనుట

నిరాధారమని స్పష్టమగుచున్నది. మను మహర్షిగూడ ధర్మాధర్మముల నెరుగుటలో తర్కము అత్యంత ఉపయోగకరమైనదని భావించినాడు.

ఆర్షం ధర్మోపదేశం చ వేదశాస్త్రావిరోధినా।
యస్తర్కేణానుసంధత్తే స ధర్మం వేద నేతరః॥ మను ౧౨-౧౦౬॥

అర్థము :- ఋషిప్రణీత వాక్యములను, ధర్మోపదేశములను వేదశాస్త్రానుకూల తర్కముద్వారా నిర్ణయించువాడే ధర్మమును తెలిసికొనును. అన్యులు తెలిసికొనలేరు. ధర్మమువలన ముక్తి, అధర్మము వలన బంధనము కలుగునని ఋషి దయానందుని విశ్వాసము. వైశేషికదర్శనకర్త కణాదమహర్షి గూడ **''యతోఽభ్యుదయనిఃశ్రేయస సిద్ధిః స ధర్మః''** (వైశే. ౧-౧-౨) - అభ్యుదయమును, నిః శ్రేయసమును కలుగజేయు నదియే ధర్మమని తెలిపినాడు. ఉపాసన యొక్క ఎనమిదంగములును ధర్మములే. వీని ననుసరించుటవలన ముక్తి లభించును. తర్కములేనిదే వీటి పరిజ్ఞానముగూడ ఎన్నటి కిని కాజాలదు. కాని ఆ తర్కము వేదము మరియు వేదానుకూల ఋషికృత గ్రంథములకు విరుద్ధముగ నుండగూడదు. తర్కము, కుతర్కము వీటికిగల భేదమును తెలియనందుననే జనులు భ్రాంతికి గురి యగుచున్నారు.

వ్యాకరణము చదువుటవలన పదునెనిమిది ప్రయోజనములు కలుగునని వ్యాకరణ మహాభాష్య మున పేర్కొనబడినది. వాటిలో ఐదు ముఖ్యమైనవి. అందు ఊహ★ ఒకటి. ఇది వేదమంత్రార్థ ములో ఉపయోగపడును. అట్టి ఊహ- తర్కము యోగములో బాధక మెట్లు కాగలదు? వేదజ్ఞానము లేకున్నచో ఏ వ్యక్తియు నిజమైన యోగి కాలేడని పూర్వమే వ్రాసినాము. మీమాంసాదర్శనకర్తగూడ నవమాధ్యాయమున సామగానమునకు ఆవశ్యకమైన ఈ 'ఊహ' యొక్క మహత్త్వమును చాటినాడు. సామ వేదము ఉపాసనతో దగ్గరి సంబంధముగలది. సామగానమందును ఊహ ఉపయోగపడుచుండ అది యోగమున బాధకమెట్లగును?

యోగదర్శనమున తర్కప్రయోగము - ''పరిణామైకత్వాద్వస్తుతత్త్వమ్'' (యోగ. ౪-౧౪) సూత్రభాష్యమున **''నాస్త్యర్థో విజ్ఞానవిసహచరః''** - విజ్ఞానమునకు భిన్నమైన ఏ వస్తు తత్త్వము లేదు అను విజ్ఞానవాదమును వ్యాసుడు ఖండించినాడు. తరువాతిసూత్రావతరణమున **''కుతశ్చైతదన్యాయ్యమ్''** - ఈ అన్యాయ (విరోధ)మేమిటి? అని ప్రశ్నించినాడు. **''వస్తుసామ్యే చిత్తభేదాత్త యోర్విభక్తః పంథాః** (యోగ. ౪-౧౫) భావము - ఒకే వస్తువువలన ఒకడు సుఖానుభూతిని పొందగా మరొకడు దుఃఖానుభూతిని పొందును. కావున జ్ఞానము మరియు వస్తువు భిన్నములైనవి. ఇవి కేవలము విజ్ఞానము కావు. ఇచట వ్యాసుడు తర్కముద్వారానే విజ్ఞానవాదమును ఖండించినాడు. వస్తువు ఒక చిత్తమున కాధీనమై యున్నదని నమ్మువారిని యోగదర్శనకర్త దిగువ సూత్రమున ఖండించినాడు. **''న చైకచిత్త తంత్రం వస్తు తదప్రమాణకం తదా కిం స్యాత్''** (యోగ. ౪-౧౬) - వస్తువు ఏదేనొక చిత్తమునకు

★ ఊహ అనెడి శబ్దమునకు తర్క మనికూడ అర్థము కలదు. 'వ్యాకరణమహాభాష్యములో', 'మీమాంస'లో 'ఊహ' శబ్దము తర్కార్థములోగాక భిన్నార్థములో వాడబడినది. (సంపా.)

లోబడిలేదని సూత్రార్థము. వస్తువు ఒక చిత్తమున కధీనమైయుండి ఆ చిత్తము మరొక స్థానమందు లగ్న మైయున్నచో అది అప్రామాణికము కాగలదు. సూత్రకారుడు, భాష్యకారుడు వస్తువు ఒక చిత్తమున కాధీనమున నున్నదని నమ్మువారి విశ్వాసమును తర్కముద్వారా ఖండించినాడు. ఇట్లే యోగదర్శన కారుడును, భాష్యకారుడును వ్యాసుడు అనేక మిథ్యావాదములను తర్కముద్వారా ఖండించినారు. తర్కము లేకున్నచో నాస్తికవాదమును ఖండింపజాలము. దానిని ఖండింపకున్న యోగము నభ్యసింప జాలము. నేడు తర్కమును విరోధించువారు స్వయముగా తత్త్వజ్ఞానముచే వంచితులగుటయేగాక తమ శిష్యులను గూడా అజ్ఞానాంధకారమున బడద్రోయుచున్నారు. తర్కమును ఖండించుచు, తమను ఈశ్వరభక్తులమనుకొను కోట్లాది జనులు తమ జీవితములను వ్యర్థము చేసికొనుచున్నారు. వారి తను మనోధనములు, సమయము యోగము పేర వ్యయమగుచున్నవి. కాని తర్కమును విరోధించుట వలన వారు దుఃఖసాగరమున మునిగియున్నారు. యోగఫలమునుండి వంచితులయ్యు సఫలతను పొంది నట్లుగనే భావించుచున్నారు. ఇది అత్యంత ఆశ్చర్యము.

ప్రశ్న:- తర్కము యోగములో సాధకమైనప్పటికి జనులు దీని నెందుకు ఖండింతురు?

ఉత్త:- అందు కనేక కారణములు గలవు. కొన్ని ఇవి- ౧. నేడు ప్రపంచమున అనేకులు అసత్యము,మోసము నాశ్రయించి తమను యోగులుగా ప్రకటించుకొని జనులచే పూజలందుకొనుచు న్నారు. వారి మాన్యతలు, వారి యోగము సత్యమునకు విరుద్ధము. వారి సిద్ధాంతములగూర్చి ఎవరేని తర్కించినచో వారు నిర్మించుకొన్న భవనము నేలగూలిపోవును. కావుననే వారు తర్కమును ఖండింతురు. తర్కమును ప్రయోగించినచో వారి భోగభాగ్యాదులన్నియు మట్టిపాలగునని వారికి బాగుగా తెలియును. ౨. కొందరకు యోగస్వరూపము తెలియదు. తర్కమన నేమో వారి కర్థము కాలేదు. వారు వినికిడి మాటలను బట్టి తర్కము యోగమున బాధకమని అనుచుందురు. వారిస్థితి 'నీవు చేయుచున్నట్లే నేను చేయుచున్నాను' అన్నట్లున్నది. వారు గ్రుడ్డిగా అనుకరింతురు. యోగమున తర్కము హేయమని తలచి నందున దానిప్రయోగము లోపించినది. అందుచే ఇష్టమువచ్చిన వారందరు యోగులై కూర్చున్నారు. వారి నెవరును ఏమియు అడుగకూడదు. ఎందుకన తర్కము యోగమున బాధక మనుకొందురు. దీని పరిణామముగ అజ్ఞానులు, మిథ్యావాదులు, ఆచార హీనులు యోగులై జనులచే పూజలనందుకొను చున్నారు. ౩. కొందరు తర్కము విలువ నెరుగుదురు. కాని శ్రమించుటకు భయపడెదరు. కావున తర్కించుట మంచిదికాదందురు. తర్కమునకు స్థానమొసగినచో జిజ్ఞాసువుల సందేహములను తీర్చు టకు కష్టపడవలసి వచ్చును. అది సామాన్యమైన పనిగాదు. ౪. యోగ విషయమున కొందరు కావలసి నంత తర్కము నుపయోగింతురు. కాని వారి ఆచరణమాత్రము యోగమునకు విరుద్ధము. కావుననే తర్కము ''హేయము''గ జూడబడుచున్నది. తర్కించువారు తర్కము ననుసరించి యోగము నభ్యసించి యున్నచో తర్కమున కీదుర్గతి కలుగకుండెడిది. తర్కమును వ్యతిరేకించుటకు ఇట్టి కారణము లనేక ములు గలవు. వీటివలననే తర్కము యోగమునందు బాధకమని భావింపబడుచున్నది. కఠోపనిషత్తులో గల ''నైషా తర్కేణ మతిరాపనేయా'' (కఠ.౨-౯) అనుదానికి అర్థము సరిగా గ్రహింపనందున జనులు

తర్కమును ఖండించుచున్నారు. అందుచే తర్కముయొక్క వాస్తవ స్వరూపమును తెలిసికొని యోగమున దాని నుపయోగించవలెను. తర్కము యోగమునందు బాధకమను మిథ్యాభావనను విడనాడవలెను.

★ ★ ★

౫. తలపై గురువు చేయినుంచిన శిష్యునికి సమాధి సిద్ధించునా?

యోగాచార్యులను బడువారు శిష్యులచేత ఆసనమువేయించి వారి తలలపై చేయినుంతురు, లేదా చేతితో సంకేతము చేయుదురు. తమ మనోబలము నుపయోగించి వారిలో జ్ఞానమును ప్రవేశింప జేయుదు మందురు. దీనివలన యోగ జిజ్ఞాసువులకు సమాధి సిద్ధించి ఈశ్వరసాక్షాత్కారమగునని, జిజ్ఞాసువులు ఇష్టానుసారముగ ఆనందము ననుభవింతురని యందురు. ఇందు వేదాంగోపాంగములే గాని, వేదోపవేదములేగాని, ఉపనిషద్ బ్రాహ్మణ గ్రంథములే గాని చదువవలసిన అవసర ముండదు. అసిధారావ్రతమువంటి యమనియమాదులను పాటింపవలసిన అవసరముకూడ ఉండదు. వాటిని పాలింపకయే గురుకృపచే సమాధి సిద్ధించును. ఇది మిథ్యాభావన యని యుక్తి ప్రమాణములతో నిరూపింపబడును.

''**యోగశ్చిత్తవృత్తినిరోధః**'' (యోగ. ౧-౨) - చిత్తవృత్తుల నిరోధించుటయే యోగమని పతంజలిఋషి యోగమునకు లక్షణము వ్రాసినాడు. ఐదువృత్తుల పేర్లను వాటి లక్షణములను తెలిపి ''**అభ్యాసవైరాగ్యాభ్యాం తన్నిరోధః**'' (యోగ. ౧-౧౨) అభ్యాసవైరాగ్యములద్వారా వృత్తులు నిరోధింపబడునన్నాడు. చిత్తమును వృత్తి రహితముగనుంచుటకు చేయు ప్రయత్నము - యమనియమాదుల అనుష్ఠానము అభ్యాస మనబడును. ''**జ్ఞానస్యైవ పరాకాష్ఠా వైరాగ్యమ్**'' (యోగ. ౧-౧౬ వ్యాసభా.) జ్ఞానము మరియు అభ్యాసము లేనిదే వృత్తినిరోధము కాదు. వృత్తినిరోధము కాకున్న సమాధి సిద్ధింపదు. వృత్తులస్వరూపమును తెలిసికొనుటకు, వాటిని వశపరచుకొనుటకు అభ్యాసవైరాగ్యములు అనివార్య సాధనలైయుండ తలపైన చేయి నుంచినంతమాత్రమున సమాధి సిద్ధించు ననుట మిథ్య.

యోగదర్శనములోని ''**తపః స్వాధ్యాయేశ్వరప్రణిధానాని క్రియాయోగః**'' (యోగ. ౨-౧) అను సూత్రమున సాధారణజనులకొరకు దైనిక క్రియాయోగము చెప్పబడినది. సమాధి సిద్ధికొరకు మానవుడు ప్రతిదినము తపస్సు, స్వాధ్యాయము, ఈశ్వరప్రణిధానము చేయుచుండవలెను. ''**తపో ద్వంద్వసహనం**'' (యోగ. ౨-౩౨ వ్యాసభా.) నానావిధ కష్టము లెదురైనను ధర్మాచరణమును వదల కుండుటే తపస్సు. ''ఓ౩మ్'' మున్నగు పవిత్రనామముల జపించుట, మోక్షశాస్త్రములైన వేదములను, వేదానుకూల ఋషికృత గ్రంథములను చదువుట స్వాధ్యాయము, మనోవాక్కర్మల నన్నిటిని పరమ గురువైన పరమేశ్వరున కర్పించుట, మరియు ఆ కర్మల ఫలమును ఆశింపకుండుటయే ఈశ్వర ప్రణిధానము. సమాధి సిద్ధికి ఈ కర్మలు చేయవలసి యుండును. ఈ సూత్రభాష్యమున వ్యాసమహర్షి ''**నాఽతపస్వినో యోగః సిధ్యతి**'' తపస్వికాని మానవునకు యోగము సిద్ధింపదని వ్రాసినాడు. అనేక

జన్మజన్మాంతరముల వాసనలు మనస్సునందు గలవు. ఈ జన్మలోని వాసనలు గూడ అనేకము గలవు. తపస్సు, స్వాధ్యాయము, ఈశ్వర ప్రణిధానము చేయకున్న ఇవన్నియు తొలగజాలవు.

యోగదర్శనమున దుఃఖము, దుఃఖమునకు కారణము; సుఖము, సుఖమునకు ఉపాయముల దెలుపుచు పతంజలి మహర్షి **''వివేకఖ్యాతిరవిప్లవా హానోపాయః''** (యోగ.౨-౨౬) - విచలితము కానట్టి వివేకఖ్యాతియే మోక్షమునకు ఉపాయమన్నాడు. వివేకఖ్యాతిని పొందుట కుపాయమును గూడ క్రింది సూత్రమున తెలిపినాడు. **''యోగాంగానుష్ఠానాదశుద్ధిక్షయే జ్ఞానదీప్తి రావివేకఖ్యాతేః''** (యోగ.౨-౨౮) - ఎనిమిది యోగాంగముల ననుష్ఠించుటవలన వివేకఖ్యాతిపర్యంతము జ్ఞానము పెంపొందును. అష్టాంగ యోగము ననుసరించుటవలన సమాధిసిద్ధించునా? లేక శిష్యుని తలపై చేయి నుంచుటవలననా? బుద్ధిమంతు లాలోచింతురు గాక! (తలపై చేయినుంచి పతంజలి మహర్షి ఇతరులకు సమాధి నెందుకు సిద్ధింపజేయలేదు?). త్రివిధ దుఃఖనివృత్తికి సమాధి సిద్ధికి కపిలమహర్షి అనేక ఉపాయములను తెలిపినాడు. కాని తలపై చేయినుంచినచో సమాధి సిద్ధించునని ఎచ్చటను సూచింపలేదు. వృత్తినిరోధప్రసంగమున **''వైరాగ్యాదభ్యాసాచ్చ''** (సాంఖ్య. 3-3) వైరాగ్యము, అభ్యాసమువలన వృత్తులు నిరోధింపబడునని సూచించినాడు. నాల్గవ అధ్యాయమున నిట్లు వ్రాసినాడు. **''నోపదేశశ్రవణేఽపి కృతకృత్యతా పరామర్శాదృతే విరోచనవత్''** (సాంఖ్య.౪-౧౭), **''దృష్టస్తయోరింద్రస్య''** (సాంఖ్య. ౪-౧౮) - విరోచనునకు సఫలత లభించనట్లే మనన నిదిధ్యాసన సాక్షాత్కారములు లేక కేవలం ఉపదేశ శ్రవణ మాత్రమున సఫలత లభించదు. ఇంద్రవిరోచను లిరువురును శ్రవణము చేసిరి. ఇంద్రుడు మననినిదిధ్యాసవాదు లొనర్చినందున అతడు సఫలుడాయెను. కాన్న తలపై చేయి నుంచిన సమాధి సిద్ధించుననుట నిరాధారమని స్పష్టమగుచున్నది. ఉపదేశము వినుటవలనగూడ సఫలత లభించదు. **'ప్రణతిబ్రహ్మచర్యోపసర్పణాని కృత్వా సిద్ధిర్బహుకాలాత్ తద్వత్'** (సాంఖ్య.౪.౧౯) ఈ సూత్రమున సమాధికి కావలసిన అనివార్య కర్మలు తెలుపబడినవి. ఉదాహరణకు - నిరభిమానము, బ్రహ్మచర్యపాలనము, సద్గురువుల సాంగత్యము, వారి సేవ మున్నగు కర్మల అనుష్ఠానమువలన సమాధి సిద్ధి సంభమగును. న్యాయదర్శనకర్త మహర్షిగోతముడు తలపై చేయినుంచు అంధపరంపరను ఎక్కడను పేర్కొనలేదు- అతడు మోక్షోపాయములను దిగువ సూత్రమున పేర్కొన్నాడు. **''తదర్థం యమనియమాభ్యామాత్మసంస్కారో యోగాచ్చాధ్యాత్మవిధ్యుపాయైః** (న్యాయ. ౪-౨-౪౬) - యమనియముల ద్వారా ఆత్మశుద్ధి చేసికొనవలెను. యోగదర్శనములో వర్ణించబడిన ఇతరోపాయములద్వారా అపవర్గము - మోక్షము సిద్ధించును. దీని తరువాతి సూత్రమున **''జ్ఞానగ్రహణాభ్యాసస్తద్విద్యైశ్చ సహసంవాదః** (న్యాయ. ౪-౨-౪౭) జ్ఞానమును- ఆత్మవిద్యాశాస్త్రజ్ఞానమును పొందుట, దానిని ధారణమొనర్చుకొనుట, దానిననుసరించి కర్మలు చేయుట, ఆత్మజ్ఞానము నెఱిగినవారితో చర్చించుట మున్నగు ఉపాయములద్వారా మానవుడు సమాధి సిద్ధిని పొంది మోక్షాధికారి యగునని తెలుపబడినది.

''స్వాధ్యాయేన వ్రతైర్హోమైస్త్రైవిద్యేనేజ్యయా సుతైః।
మహాయజ్ఞైశ్చ యజ్ఞైశ్చ బ్రాహ్మీయం క్రియతే తనుః॥ మను. ౨-౨౮॥

అర్థము - (స్వాధ్యాయ) సకలవిద్యలను చదువుట, చదివించుట (వ్రత) బ్రహ్మచర్య సత్య భాషణాది నియముల పాటించుట (హోమ) అగ్నిహోత్రాది హోమములు సత్యగ్రహణము, అసత్యపరిత్యాగము, సత్యవిద్యలదానము (త్రైవిద్యేన) వేదోక్త కర్మోపాసనా, జ్ఞాన, విద్యలను గ్రహించుట (ఇజ్యయా) పక్ష్యేష్టి మున్నగు హోమముల జేయుట (సుతైః) సుసంతానోత్పత్తి (మహాయజ్ఞైః) బ్రహ్మ, దేవ, పితృ, వైశ్వదేవ, అతిథిసేవారూప పంచమహాయజ్ఞముల మరియు (యజ్ఞైః) అగ్నిష్టోమాది, శిల్పవిద్యా విజ్ఞానాది యజ్ఞముల అనుష్ఠానము- ఈ కర్మలన్నిటి చేత ఈ శరీరము 'బ్రాహ్మీ' అనగా వేదము మరియు పరమేశ్వరభక్తికి ఆధారరూపమగు బ్రాహ్మణశరీరము అగును. ఇన్ని సాధనములులేనిదే బ్రాహ్మణశరీరము కాజాలదు.'' (సత్యార్థప్ర. ౩ వసము.)

చేతిని తలపైనుంచు టటుంచి ఈ విద్యను విన్నప్పటికిని అవిద్య తొలగజాలదు. మహర్షి కపిలుడు ''న శ్రవణమాత్రాత్ తత్సిద్ధిరనాదివాసనాయా బలవత్త్వాత్'' (సాంఖ్య ౨-౩) - ప్రకృతి దోషములను విన్నంతమాత్రమున మోక్షము లభించదు. ఏలన భోగమునకు సంబంధించిన అనాది వాసనలు బలమైనవి అన్నాడు. శిష్యుల అన్నపానములు, ఆచారవ్యవహారాదులు దూషితములు. అట్టి శిష్యులకు గురువులు తమ కృపచేతను మనోబలముచేతను సమాధిని సిద్ధింపజేయు గుత్త గైకొందురు. ఇది మన్వాదిఋషులకు పూర్తిగా విరుద్ధము. ఈ కల్పితమాన్యత అత్యంత ఘాతకము. దీని ప్రచారమువలన జనులు అజ్ఞానులు, ఆచారహీనులు, పరోపకారశూన్యులునైనారు. తమును నిజముగా యోగులనియే నమ్మదొడగినారు. దీని పరిణామముగ నిజమైన యోగులయెడ జనులలో అశ్రద్ధ యేర్పడినది. నిజమైన యోగులు చూపిన కర్మలను గూడ వీరు వదలివేయసాగినారు. మరొకవైపు మూఢులు తమకు తటస్థపడిన మూర్ఖులను, స్వార్థులను, మోసగాండ్రను యోగులని భావించి వారి పూజలు చేయసాగినారు. ఒకనాడు దిల్లీలో ఘంటాఘర్ సమీపమునుండి నగ్నవ్యక్తి పోవుచుండెను. చదువు కొన్నవారు అతనిచుట్టు మూగి అతని ఆదరసత్కారములలో మునిగియుండిరి. ఆ నగ్నవ్యక్తి ఎవరని అడుగ, అతనిచుట్టు మూగినవారు ''అతడొక పూర్ణయోగి + అతనిలో అజ్ఞానము, అధర్మము ఏమాత్రములేదు. అతనికృపకు పాత్రులైనవారు తరింతురు'' అని తెలిపిరి. మూఢులదృష్టిలో నగ్నముగ నున్న వాడే పూర్ణసిద్ధుడు. అజ్ఞానులు తనుమనోధనములతో అట్టి అయోగ్యులను మిక్కిలి ప్రోత్సహించుచున్నారు. అందువలన ఈ యంధపరంపర కొనసాగుచున్నది. ప్రపంచము అధోగతిపాలగుచున్నది.

+ శ్రీ స్వామీ సత్యపతిగారు, నేను ౨౪ సం॥ల క్రితము అజ్మీరులో 'మీమాంసా' చదువుచుంటిమి. మేమున్న చోటునుండి గురువుగారు శ్రీ యుధిష్ఠిర మీమాంసకులవద్దకు దాదాపు నాల్గుమైళ్ల దూరము ప్రతి దినము నడచి వెళ్లేవారము. మార్గములో దాదాపు ౭౦ సం॥ల ముసలివాడు కనిపించెడివాడు. ముసలితనము వలన చేతులు నడుముపై వేసికొని వంగి నడిచెడివాడు. శరీరముపైన బట్టలు లేకుండెను. ఇష్టమున్నచోట నెల్ల మలమూత్రములు చేసెడివాడు. దానివలన అతనిచుట్టు ఈగలు మూగియుండెడివి. అతడు సిద్ధయోగియని కొందరనెడివారు. ఎల్లప్పుడు అతనిచుట్టు ఎవరో కొందరు మూగియుండెడివారు. మేము నియమనిష్ఠలతో బ్రహ్మచర్యమును పాటించుచు శాస్త్రముల జదువుచున్నను జనులు మావైపు ఆకర్షితులైనట్లుగ, మమ్ము ఆశ్చర్యముతో చూచినట్లుగ ఎప్పుడును కనబడలేదు. (సంపాదకుడు)

తలపై గురువు చేయినుంచిన శిష్యునికి సమాధి సిద్ధించునా?

ప్రశ్న:-మీరు గురుపరంపరను నమ్మరా?

ఉత్త:- నేను నిజమైన గురువుల పరంపరను నమ్ముదును. మిథ్యాగురువుల పరంపరను నమ్మను. వేదములను చదువువారిని, చదివించువారిని, యమనియమాదులను పాటించువారిని, సత్యవాదులను, పక్షపాతము చూపనివారిని, ఈశ్వరుని గురువులకు గురువని నమ్మువారిని నిజమైన గురువులని నేనుగూడ నమ్ముదును. కాని తలపై చేయి ఉంచినంత మాత్రమున సమాధి సిద్ధించునని నమ్మువారు, వేదముల పఠనపాఠనములను ఖండించువారు, యమ నియమములు, వైరాగ్యము అవసరమే లేదని అనుకొనువారు, ఈశ్వరుని స్థానమున తామే పూజలనందుకొనువారు గురువు లనిపించుకొనుటకు యోగ్యులు కారు. ఇట్టి వారిని గురువులని భావించుట తమకాళ్లను తామే నరుకుకొనుట యగును.

ప్రశ్న:- నిజమైన యోగిగూడ ఒక అజ్ఞాని అధర్మాత్ముని తలపైన చేయినుంచి తన మనోబలముచే అతనికి సమాధిని సిద్ధింపజేయలేడా?

ఉత్త:- అట్లెన్నడును చేయజాలడు. నిజమైన యోగి ఒకవేళ అయోగ్యుడైన వానికి ఈ విధముగ సమాధిని సిద్ధింపజేయగలినచో కపిలమహర్షికి దిగువ సూత్రములు రచించు అవసరమే ఉండకుండెడిది. **''న మలిన చేతస్యుపదేశబీజప్రరోహోఽజవత్''** (సాంఖ్య. ౪-౨౯) - అజనామధారియైన రాజునకు కానట్లే మలినచిత్తము నందు ఉపదేశబీజాంకురము ఉత్పన్నము కాదు. **'నాభాసమాత్రమపి మలిన దర్పణవత్'** (సాంఖ్య.౪-30) మలినమైన అద్దమునందు ముఖము కనిపించనటులనే అజ్ఞానము, రాగద్వేషములతో కూడిన చిత్తమునందు ఉపదేశముయొక్క ప్రభావము ఏమాత్రము కనిపించదు. అట్టిచో మనోబలముచేతను, తలపై చేయి ఉంచుటచేతను సమాధి సిద్ధించునను మాటను గురించి చెప్పవలసినదేముండును? శాస్త్రోపదేశము చేసినప్పటికిని అయోగ్యునకు సమాధి సిద్ధిని కలుగజేయ వీలు కాదని కపిల మహర్షి వ్రాసినాడు. అట్లు చేయగల్గినచో నిజమైన యోగి ఎవరి తలపైనైనను చేయి నుంచినచో అతనికి సమాధి సిద్ధించునని కపిలమహర్షి తెలిపెడివాడు. అంతేగాదు తాను స్వయముగ కోట్లాది జనులను పిలిచి వారి తలలపై చేయి నుంచెడివాడు. దాని వలన వారందరికి యోగము సిద్ధించి ప్రపంచమునకు మహాకల్యాణము చేకూరెడిది. అతనికి శాస్త్రమును రచింపవలసిన అవసరమేర్పడకుండెడిది. ఏలన యోగి ఎవరి తలపైన చేయి యుంచునో అతడు గూడ యోగి యగును. ఇట్లు ప్రపంచమానవులందరు యోగులై ముక్తిని పొందియుండెడివారు.

మహాభారతకాలపు వ్యాసమహర్షి యోగియని ఋషి దయానందుని నమ్మకము. శ్రీ కృష్ణుడు గూడ యోగియని ప్రసిద్ధి. అతడు యుద్ధము జరుగకుండుటకై దుర్యోధనున కెంత నచ్చజెప్పినను వినకుండెను. తలపైన చేయి నుంచి సమాధిని సిద్ధింపజేయగలుగుట నిజమే యైనచో వ్యాసమహర్షి దుర్యోధనుని తలపై చేయి యుంచిన అతని అజ్ఞాన మంతయు తొలగి అతనికి సమాధి సిద్ధించెడిది. ఆర్యావర్త దేశము నాశనము కాకుండెడిది. ఋషి దయానందుడు యోగియే. ప్రపంచమున అనేకులు యోగులుకావలెనని అతని మిక్కుటమైన కోరిక. అట్లు కాగలిగిన అజ్ఞానము, అధర్మము నశించునని నమ్మెను. ఒకవేళ చేయి తలపైనుంచెడి పద్ధతి సార్థకమైనదే యగుచో అతడనేకుల తలపై తన చేయి నుంచి వారందరిని

యోగులుగా మార్చియుండెడివాడు. + దానివలన ప్రపంచమున నేడు కాననగు అవిద్య, అన్యాయముఖ ఉప్పెన రాకుండెడిది. ఏ వ్యక్తియు తనను అరక్షితునిగా భావింపకుండెడివాడు ఏలన నిజమైన యోగుల సంఖ్య అధికమైపోయెడిది. అందువలన విద్యాధర్మములు విస్తరిల్లి, అజ్ఞాన అధర్మములు నశించెడివి. ప్రపంచమున యోగులసంఖ్య తగ్గినపుడెల్ల మానవులకును ఇతర ప్రాణులకును దుఃఖము అధికమగును.

యాస్కాచార్యుడు నిరుక్తము ౨-౪లో అలంకారరూపమున నుడివిన మాటలు గమనింపదగి యున్నవి.

విద్యా హ వై బ్రాహ్మణమాజగామ గోపాయ మా శేవధిష్టేఽహమస్మి।
అసూయకాయానృజవేఽయతాయ న మా బ్రూయా వీర్యవతీ తథా స్యామ్॥
యమేవ విద్యాత్ శుచిమప్రమత్తం మేధావినం బ్రహ్మచర్యోపపన్నమ్।
యస్తేన ద్రుహ్యేత కతమచ్చనాహ తస్మై మా బ్రూయా నిధిపాయ బ్రహ్మన్॥

విద్య బ్రాహ్మణుని సమీపించి ''నేను మీ కోశమును. నన్ను రక్షింపుడు. నిందితునికి, గర్విష్ఠికి, అసంయమికి నన్నొసగకుడు అట్లైనచో నేను బలశాలిగానుండ గలుగుదును. పవిత్రుడు పురుషార్థపరుడు, బుద్ధిమంతుడు బ్రహ్మచర్యవ్రతధారియై మీకు ద్రోహము చేయనివానికి, విద్యాకోశమును రక్షించువానికి నన్నొసగుడు'' అనెను. అయోగ్యుడైనవానికి విద్యాభోధ చేయగూడదని దీని అభిప్రాయము. యాస్కాచార్యుడు తలపై చేయి నుంచెడి విధానమును నమ్మినచో అతడు విద్యనొసగుటకు పాత్రాపాత్రల పరీక్ష చేయవలసిన అవసర మేముండెను? తన కిష్టమున్నవారి తల పైన చేయినుంచి వారిని గొప్ప వైజ్ఞానికులను చేసెడివాడు. కావున తలపై చేయి నుంచియు, మనోబలమును ప్రయోగించియు ఎవరికైనను సమాధిని సిద్ధింపజేయగల్గుదు మనుట అసత్యము.

ప్రశ్న:- ఈ మూఢనమ్మకములకు కారణమేమి?

ఉత్త :- కారణము లనేకములు. కొన్నిటిని మాత్రమిట పేర్కొందును. మోసపు గురువు తన శిష్యునితో ''నేను నీ తలపైన చేయి నుంతును. గురుకృపచే నాకు సమాధి సిద్ధించె నను'' మనును. శిష్యుడట్లే యనును. అది విన్న కొందరు తాముగూడ గురుహస్తమును తమ తలలపై నుంచుకొని పరీక్షింపదలతురు. వారి తలలపై గురువు తన చేయి నుంచి సమాధిని పొందితిరా యని అడుగును. అప్పుడు ప్రతివ్యక్తి తన మనసులో ''సమాధి లభించనే లేదు. కాని నిజము చెప్పినచో గురువుగారికి నాయెడ సదభిప్రాయ మేర్పడదు. నన్నాత డయోగ్యునిగా భావించును. కావున నేనుగూడ గురుకృపచే సమాధిని పొందితి నని చెప్పుటయే లాభదాయక మగు'' ననుకొనును. ఇది ముక్కిడి వాని కథవలె నుండును. ఒక వ్యక్తి ముక్కు ఏదో కారణమున కోసివేయబడెను. తానొకడే కురూపిగా నెందు కుండవలెనని ముక్కిడివాళ్ల సంఖ్యను పెంచుటకు అతడొక పథకము వేసెను. తనకు ఈశ్వరుడు సాక్షాత్క

+ ఋషి దయానందుని శిష్యుడు, రామానంద బ్రహ్మచారీ వంటివాడు అతనిని మోసముచేసి రూపాయలు దొంగిలించుకొని పారిపోయెడివాడు కాడు. (సంపా.)

రించెనని, ఈశ్వరుని దర్శించుటలో ముక్కు అడ్డుగా నున్నదని ముక్కు కోయించుకొన్నవారికి ఈశ్వర దర్శనమగునని అతడు ప్రచారము చేసెను. ఈశ్వరుని దర్శించు ప్రలోభమున ఎందరో తమ ముక్కులను కోయించుకొనిరి. అట్లు ముక్కు కోయించుకొన్న ప్రతివాని చెవిలో ఈ ముక్కిడి గురువు "పోయిన మీ ముక్కు ఎట్లైనను రాదు. కావున మీరును ఈశ్వర దర్శన మైనదని యనుచుండుడు. లేనిచో మీకు సమాజములో అవమానము కలుగును." అనెను. వారట్లే చేయుచుండ ముక్కిడి వారి గుంపొక టేర్పడెను. ఇట్లే మోసగురువులు అజ్ఞానులు గుంపుల నేర్పరచుకొనిరి. గురుకృప వలన తమకు సమాధి లభించిన దని ప్రచార మొనర్చిరి. అట్లు ప్రచారము చేసినందువలన వారికిగూడ వారి గురువునకు జరిగినట్లే పూజలు జరుగును. ఇట్టి భ్రాంతికి మఱొక కారణము ఋషులు చూపిన సమాధిపద్ధతి అత్యంత కఠిన మైన దనియు మేము యమనియమాదులను పాటింపవలసిన అవసరమే లేనట్టి భోగసిద్ధి యనెడి నవీన పద్ధతిని కనుగొన్నామని కొందరు ప్రచారము చేయుటయే. ఈ విధముగా త్రాగుబోతులు, మాంసాహారులు, అసత్యవాదులు, దుర్మార్గులు మొదలగువారు ఎవ్వరైనను సమాధిని పొందగల్గుదురు. పక్షపాతము వీడి నిజముగ నాలోచించిన ఋషులు చూపిన మార్గమే సత్యమనియు, ఇతరులు చూపెడి మార్గము అసత్యమనియు స్పష్టమగును. మనుస్మృతికారుడు తెలిపినట్లు "**అర్థకామేష్వసక్తానాం ధర్మ జ్ఞానం విధియతే**" (మను.౨-౧౩) – ధనము మరియు ఇంద్రియభోగములందు ఆసక్తుడైనవానికి ధర్మజ్ఞానము కలుగజాలదు. నేడు నవీన యోగపద్ధతిని ప్రచారము చేయువారందరును ధనము మరియు విషయభోగములందు మునిగియున్నారు. కావున వీరు ధర్మాధర్మములను, సత్యాసత్యములను, యోగాయోగములను తెలిసికొనజాలరు. ఋషులు ధనము మరియు విషయభోగములకు దూరముగా నుండి యోగముయొక్క సత్యస్వరూపమును కనుగొన్నారు. కావున వారు చూపినపద్ధతిని అందరు అంగీకరింపవలయును. తలపై చేయి నుంచుటవలన సమాధి లభించునెడి మూఢ నమ్మకమును త్యజింపవలెను.

★★★

౬. ఈశ్వరు నెవడెఱుగును? ఎఱుగుదు ననువాడా? ఎఱుగ ననువాడా?

ఈశ్వరుని తెలిసికొన్నానను వాడు నిజముగా ఈశ్వరుని తెలిసికొనలేదని, తెలిసికొన్నవాడు తాను తెలిసికొన్నానని చెప్పడని నమ్ముట ఆలవ భ్రాంతి. ఈ నమ్మకము అనేకుల మనస్సులలో నాటుకపోయినది. ఈశ్వరు నెఱిగినవాని లక్షణ మిదియే యని వారి నమ్మకము. ఎవరెంత చెప్పినను వారీ మూఢనమ్మకమును వదలకున్నారు. ఈ మూఢనమ్మకమువలన మహానర్థము వాటిల్లినది. ఇక ముందును వాటిల్లగలదు. ఇట్టి యనర్థములు జరుగకుండ మానవజాతిని రక్షించు నుద్దేశ్యముతో ఈ విషయమున నా అభిప్రాయములను ప్రజలముం దుంచుచున్నాను.

ఈశ్వరుని తెలిసికొన్నవారి లక్షణములగురించి నానా అభిప్రాయములు గలవు. ౧. ఈశ్వరుని అనుభూతి కలుగునే కాని మాటలద్వారా చెప్పుటకు వీలు కాదని ఒకడనును. ౨. ఈశ్వరుని తెలిసి

కొన్నవాడు తాను ఈశ్వరుని తెలిసికొన్నానని చెప్పజాలడని మరియొక డనును. 3. మానవ సేవ చేయు వాడే ఈశ్వరుని తెలిసికొన్నవాడని ఇంకొక డనును. (४. ఇల్లుముంగిలి వదలి ఎవరితో సంబంధము లేక పిచ్చివాని వలె ఉండువాడే భగవంతుని తెలిసికొన్నవాడని మరియొక డనును. - సంపా.) ఇట్టి యనేక మూఢనమ్మకములందు చిక్కుకొని మానవుడు తన అమూల్యజీవితమును వ్యర్థము చేసికొనుచు న్నాడు. ఇచట పైన తెలిపిన రెండవరకపు నమ్మకమును గురించి విశేషముగా వర్ణింపబడును. ఈ మూ ఢనమ్మకమునకు క్రింది మంత్రము కారణము.

యస్యామతం తస్య మతం మతం యస్య న వేద సః।
అవిజ్ఞాతం విజానతాం విజ్ఞాతమవిజానతామ్॥ కేనోప. ౨-3॥

దీని అర్థము - 'బ్రహ్మను పూర్ణముగ- అవధిసహితముగ తెలిసికొనలేము' అనువాడే బ్రహ్మ స్వరూపమును తెలిసినవాడు. బ్రహ్మను అవధిసహితముగ, సాంతముగా తెలిసికొనవచ్చు నని భావించు వాడు బ్రహ్మస్వరూపము నెఱుగడు.

ఈశ్వరుడు అవధిసహితముగ తెలిసికొనబడగల డని నమ్మువానికి ఈశ్వరుడు అజ్ఞాతము - అనగా అతడు ఈశ్వరుని స్వరూపమును ఎఱుగలేదని అర్థము. 'ఈశ్వరుడు అవధిసహితముగా తెలిసికొన బడజాలడు, ఈశ్వరుని ఏక దేశమునే తెలిసికొనగలుగుదుము' అనువాడు ఈశ్వరుని స్వరూపమును సరిగా తెలిసికొన్నవాడు.

కొన్ని సంవత్సరముల క్రిందటి దీ సంఘటన- ఒకానొక యోగి తనకు ఈశ్వరుడు ప్రత్యక్షమైనా డని తెలిపెనని ఒక విద్వాంసునితో ఒక వ్యక్తి అనెను. ఆ విద్వాంసుడు వెంటనే "ఈశ్వరుడు ప్రత్యక్షమై నాడను వ్యక్తి అసత్యవాది. ఏలన ఈశ్వరుని తెలిసికొన్నానను వ్యక్తి ఈశ్వరుని తెలిసికొనలేదనియు, ఈశ్వరుని తెలిసికొనలేదనువాడే ఈశ్వరు నెఱిగినవాడని ఉపనిషత్తులలో కల" దనెను.

ఇదే విషయమున ఒకనాడు వార్తాలాపము జరుగుచుండెను. అప్పుడు ఈశ్వరుని తెలిసికొన్న వ్యక్తి తెలిసికొన్నానని చెప్పిన దోష మేమియని నేనంటిని. అది విని ఒక శాస్త్రిగారు అట్లనుట తప్పె యనెను. అతడు గూడ పైన విద్వాంసుడు తెలిపిన ఉపనిషన్మంత్రార్థమునే మా ముందుంచెను. ఇది యెంతవరకు సత్యమో యుక్తి ప్రమాణములతో సమాలోచింపబడును.

(క) - ఉపనిషత్తులోని "**యస్యామతం...**" అనెడి వాక్యములకు ఇప్పుడు అనేకులు చెప్పు అర్థము సరియైనది కాదు. మేము పైన వ్రాసిన అర్థము సరియైనది. కేనోపనిషత్తు ౨-౨లో (వేద చ) - 'తెలియును' అని కలదు. దీనికి అనేకులు చెప్పుచున్న అర్థమునే గ్రహించినచో ఉపనిషద్ వాక్యములు పరస్పర విరుద్ధము లగును. ఉపనిషత్కారుడు ఒక వాక్యములో నేను ఈశ్వరు నెఱుగుదు న్నాడు. అతడే మరి యొక వాక్యములో ఈశ్వరు నెఱుగుదు నన్నవాడు. ఈశ్వరు నెఱుగడు అని వ్రాసి నాడు. ఇది పరస్పర విరుద్ధము. ఈ యర్థము వేదవిరుద్ధముగూడ. వేదమున "నేను పరమాత్మ నెఱుగు దును" అని స్పష్టముగా తెలుపబడినది.

‘‘వేదాహమేతం పురుషం మహాన్తమాదిత్యవర్ణం తమసః పరస్తాత్।
తమేవ విదిత్వాఽతిమృత్యుమేతి నాన్యః పంథా విద్యతేఽయనాయ॥ యజు. ౩౧-౧౮॥

దీనికి దయానందసరస్వతి వ్రాసిన భాష్యమును గమనించుడు-పదార్థము : జిజ్ఞాసగల ఓ పురుషా! (అహం) నేను (ఏతం) పూర్వోక్త (మహాన్తం) గొప్పగుణములుగల (ఆదిత్యవర్ణం) సూర్యసమాన ప్రకాశస్వరూపుడు (తమసః) అంధకారమునకు, అజ్ఞానమునకు (పరస్తాత్) దూరముగనున్నవాడు (పురుషం) స్వస్వరూపముతో అంతట నిండియున్న పరమాత్మని (వేద) ఎఱుగుదును. (తం, ఏవ) అతనినే (విదిత్వా) తెలిసికొని, నీవు (మృత్యుం) దుఃఖదాయకమైన మృత్యువును (అతి, ఏతి) ఉల్లంఘింతువు. (అయనాయ) అభీష్ట మోక్షపదమును పొందుటకు (అన్యః) దీనికన్న వేరైన (పంథాః) మరొక మార్గము (న, విద్యతే) లేదు.

ఇట్లే మరొక స్థానమందును ‘‘నేను ఈశ్వరు నెఱుగుదు’’ నని చెప్పబడినది. **‘‘వేదాహమస్య భువనస్యనాభిం...’’** (యజు. ౨౩-౬౦) - పదార్థము- జిజ్ఞాసగల ఓ పురుషా: (అస్య) ఈ (భువనస్య) సర్వమునకు ఆధారమైన ప్రపంచముయొక్క (నాభిం) బంధనస్థానమును- కారణరూప మధ్యభాగమైన పరమేశ్వరుని (అహం) నేను (వేద) ఎఱుగుదును.

ఈ రెండు మంత్రములందు ముఖ్యముగా విద్వాంసుడు జిజ్ఞాసువునకు తాను ఆ మహాపురుషుని-పరమేశ్వరుని తెలిసికొంటినని ప్రకటింవలె నను ఉపదేశము నొసగినాడు. పైన పేర్కొన్న ఉపనిషద్వాక్యమునకు కొందరు చెప్పుచున్న అర్థమే నిజమైనచో దానికి విరుద్ధముగా ‘‘ **వేదాహమేతం పురుషం మహాన్తం...**’’ అని వేదములో నెందు కుండును?

(ఖ) నమో బ్రహ్మణే నమస్తే వాయో త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మాసి త్వామేవ ప్రత్యక్షం బ్రహ్మ వదిష్యామి ఋతం వదిష్యామి సత్యం వదిష్యామి...(తైత్తి. ఆ. ౭-౧) - (త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మాసి) నీవు ప్రత్యక్ష బ్రహ్మవు. (త్వామేవ ప్రత్యక్షం బ్రహ్మ వదిష్యామి) నేను నిన్ను ప్రత్యక్ష బ్రహ్మవని అందును. పరమేశ్వరు నెఱిగినవాడు పరమేశ్వరుని ప్రత్యక్ష బ్రహ్మ యని, తా నతనిని ప్రత్యక్ష బ్రహ్మగా పేర్కొందు నని అనుచున్నట్లు ఈ వాక్యములవలన ఋజువగుచున్నది.

(గ) జానామ్యహం శేవధిరిత్యనిత్యం నహ్యధ్రువైః ప్రాప్యతే హి ధ్రువం తత్। యో మయా నాచికేతోఽగ్నిరనిత్యైర్ద్రవ్యైః ప్రాప్తవానస్మి నిత్యమ్॥ కఠో. ౨-౧౦॥

(అనిత్యైః ద్రవ్యైః ప్రాప్తవానస్మి నిత్యం) అనిత్యద్రవ్యములు- అనగా శరీరము, ఇంద్రియములు, మనస్సు మున్నగు అనిత్య సాధనములద్వారా తాను పరమేశ్వరుని పొందితి నని యమాచార్యు డనుచున్నాడు. పరమేశ్వరు నెఱిగినవాడు తాను పరమేశ్వరు నెఱుగ ననుచో అనిత్య సాధనములతో నిత్యబ్రహ్మను పొందితి మని ఋషు లెందు కందురు? ★

(ఘ) ఈ సిద్ధాంతము యోగదర్శనమునకును విరుద్ధమే. ఏలన వ్యాసమహర్షి

★ ౧. తద్విష్ణోః పరమం పదం సదా పశ్యంతి సూరయః । దివీవ చక్షురాతతం॥ ఋ. ౧-౨-౭-౫॥

''యథా దృష్టం యథానుమితం తథా వాఙ్మనశ్చేతి'' – 'చూచినదానిని, అనుమాన ప్రమాణముచే గ్రహించినదానిని ఉన్నదున్నట్లుగా మనస్సుతో గ్రహించుట, వాక్కుతో నుచ్చరించుట సత్యము' అని తెలిపినాడు. ఈశ్వరుని తెలిసికొనియు తెలిసికొనలేదనువాడు వ్యాసుని వ్యాఖ్య ననుసరించి అసత్యవాది యగును. ఏలన అతడు ఈశ్వరు నెఱిఁగియు ఎఱుఁగ ననుచున్నాడు. మనస్సులో నున్నదానికి విరుద్ధముగా మాటాడుటచే అతడు దురాత్ముల కోవలో చేరుచున్నాడు. మనస్సులో నున్నదానినే వాక్కుతో నుచ్చరించువారు మహాత్ములు, యోగులు. దానికి విరుద్ధముగా వ్యవహరించువారు దురాత్ములు, అయోగ్యులు. యోగాభ్యాసి నిరంతరము యమనియమములను పాటించుచుండవలెనని యోగదర్శనకర్త

(ఋ. ౧-౨-౭-౫) సూర్యుని చూచునటులనే సర్వవ్యాపకుడైన భగవంతుని విద్వాంసులు, యోగులు ఎల్లప్పుడు చూచుచుందురు.

౨. **ప్రజాపతిశ్చరతి గర్భే అంతరజాయమానో బహుధా విజాయతే।**

తస్య యోనిం పరిపశ్యంతి ధీరాస్తస్మిన్హ తస్థుర్భువనాని విశ్వా ॥ యజు. ౩౧.౧౯॥

ప్రజాపతియైన పరమాత్మయే జడ చేతనము లన్నటి లోపల, బయట అంతట వ్యాపించియున్నాడు. అతనిలోనే సర్వలోకము లున్నవి. విద్వాంసు లతనిని ఎల్లెడల చూతురు. మోక్షసుఖమును పొంది ఆనందమగ్నులగుదురు.

౩. ''**యో విద్యాద్బ్రహ్మప్రత్యక్షం**'' (అథ. ౯-౬ (౧)-౧)-సంయమి యగు విద్వాంసుడు ఈశ్వరుని ప్రత్యక్షముగా చూచును.

౪. ''**న చక్షుషా గృహ్యతే నాऽపి వాచః నాన్యైర్దేవైస్తపసా కర్మణా వా। జ్ఞానప్రసాదేన విశుద్ధసత్త్వః తతస్తు తం పశ్యతే నిష్కలం ధ్యాయమానః**'' (ముండకో. ౩-౧-౮) – ఆ పరమేశ్వరుడు నేత్రాది ఇంద్రియములచే గాని, తపస్సు, అగ్నిహోత్రాదికర్మలచే గాని గ్రహింపబడడు. నిర్మలజ్ఞానముచే అంతఃకరణమును శుద్ధమొనర్చుకొనిన వ్యక్తి అవయవరహితుడైన ఆ పరమేశ్వరుని ధ్యానముద్వారా చూచును.

౫. '' **అణోరణీయాన్ మహతో మహీయాన్ ఆత్మాऽస్య జంతోర్నిహితం గుహాయాం। తమక్రతుః పశ్యతి వీతశోకః ధాతుప్రసాదాన్మహిమానమాత్మనః**'' (కఠో. ౨-౨౦) – పరమాత్ముడు లోకమందలి సూక్ష్మపదార్థములకంటె సూక్ష్ముడు. ఆకాశాది మహత్ పదార్థములకంటెను మిక్కిలి గొప్పవాడు. అంతట వ్యాపించియున్న పరమాత్ముడు ప్రాణులన్నిటి హృదయములందు దాగియున్నాడు. అట్టి పరమాత్మను అతని సర్వ వ్యాపకత్వమును శాంతచిత్తుడైన వ్యక్తి దుఃఖవిముక్తుడై చిత్తప్రసన్నతవలన చూచును.

౬. ''**భిద్యతే హృదయ గ్రంథిశ్ఛిద్యంతే సర్వసంశయాః।**

క్షీయంతేచాऽస్య కర్మాణి యస్మిన్ దృష్టే పరావరే॥'' (ముండకో. ౨.౨-౮)

జీవుని హృదయమందలి అవిద్య అజ్ఞానరూపమగు ముడి తెగి సమస్త సంశయములు ఛిన్న భిన్నములై దుష్టకర్మలన్నియు క్షీణించినపుడే తన ఆత్మ లోపలను వెలుపలను వ్యాపించియుండు ఆ పరమాత్మ గోచరించును.

ఇట్టి ప్రమాణములు వేదాదిశాస్త్రములలో విరివిగా నున్నవి. మచ్చున కిట కొన్నిటి నుదాహరించితిని. (సంపా.)

నిర్దేశించినాడు. ''జాతి దేశకాల సమయానవచ్ఛిన్నా: సార్వభౌమా మహావ్రతం'' (యోగ. ౨-౩౧) - జాతి దేశ కాల సమయములం దెట్టి పరిస్థితిలో నైనను యోగి సత్యమునే పలుకవలెను. అస త్యము పలుకరాదు. ఈశ్వరు నెఱిగినవాడు తన ఆత్మలో నున్న జ్ఞానమునకు భిన్నముగా తెలిపినచో అతడు యోగి ఎట్లగును?

ప్రశ్న:- యోగమున ఉన్నతస్థితిని పొందినపిదప అసత్యము పలికినను నష్ట మేమియు కలుగ దని కొంద రందురుగదా?

ఉత్త:- వేదవిరుద్ధ మగుటవలన ఇది అసత్యము. తమ అసత్యమును కప్పిపుచ్చు కొనదలచినవారే ఇట్టి అపసిద్ధాంతములను ప్రచార మొనర్తురు. అసత్యమును ప్రచారము చేయదలచిన వ్యక్తి తప్పక సత్య మును నిందించునని ఋషి దయానందుడు వ్రాసినాడు. గృహస్థుల విషయ మటుంచుడు. నేడు యోగులనబడువారుకూడ సత్యమును నశింపజేయుటకు నడుము బిగించినారు. కొందరు అసత్యము చెప్పుదురు. చెప్పింతురు. యోగి తనకు తెలిసినదానికి విరుద్ధముగా చెప్పినను నష్టము లేదందురు.

ప్రశ్న:- దీనివలన కలుగు నష్ట మేమి?

ఉత్త:- ఇది వేద విరుద్ధము. వేదానుకూల శాస్త్రములకు విరుద్ధము. ఇది మొదటి హాని. ఈశ్వరు నెఱుగువాడు ఈశ్వరు నెఱుగుదు ననును. ఎఱుగ ననడు. ఈ విషయమును పైన నిరూ పించితిని. ౨. ఈశ్వరుని తెలిసికొన్నవారు తమ ఆత్మకు విరుద్ధముగా మాట్లాడుదురని తెలిసినపుడు సామాన్యజనులు విచ్చలవిడిగా అబద్ధమాడుదురు. దానివలన జనులలో అవిశ్వాసము ప్రబలి దుఃఖ సాగరమున మునుగుదురు. నేటి పరిస్థితికి ఇదియే కారణము. ౩. నిజమైన యోగి ఈశ్వరునెఱుగుదు నని చెప్పినపుడు ఈ మిథ్యా పరంపరవలన జనులు అతడు ఈశ్వరు నెఱుగడనియే తలంతురు. ఈ యంధ విశ్వాసమువలన నిజమైన యోగిద్వారా కలుగు లాభమునుండి జనులు వంచితు లగుదురు. ప్రపంచమునకు గొప్ప నష్టము వాటిల్లును. ఇట్టి అంధవిశ్వాసమునకు లోనై జనులు ఋషి దయా నందుని గ్రహించలేదు. అందుచే ప్రపంచమున కెంతయో హాని కలిగినది. ౪. యోగాచార్యులనబడు ననేక వ్యక్తులు తమ శిష్యుల ముందు తాము ఈశ్వరు నెఱుగమని ప్రకటింతురు. ఇది విని శిష్యులు తమ గురువు ఈశ్వరుని సాక్షాత్కరించుకొన్నా డనుకొందురు. ఈశ్వరుని తెలిసికొన లేదనువారు తెలిసి కొన్నారని వారి నమ్మకము గదా! ఈశ్వరుని తెలిసికొనని వ్యక్తిని జనులు బ్రహ్మవేత్త యని భావిం తురు. అతడు చెప్పినదాని నెల్ల రాతిమీది గీతవలె భావింతురు. అనుసరింతురు. దుఃఖముల పాల గుదురు. ౫. మహావిద్వాంసులైన ఉపదేశకులుగూడ ఉపదేశములందు తమకేమి తెలియదని, ఆజ్ఞను పాటించుటకు చెప్పుచున్నామని అనుచుందురు. అట్లన్నచో జనులు వారిని మహా విద్వాంసులుగా గుర్తింతురు, గౌరవింతురు అని వారు భావింతురు. అట్లనెడివారు వాస్తవముగతమను మహా విద్వాం సులుగానే భావింతురు. కాని అందుకు విరుద్ధముగా ప్రకటించుకొందురు. ఎందరో విద్వాంసులు 'అభిమానము' మంచిది కాదని దానిని తీవ్రముగా ఖండించుచు గంటలతరబడి ఉపన్యసింతురు.

కాని వారు స్వయముగా అభిమానపూరితులై యుందురు. వారు ఇట్టి మూఢనమ్మకములలో పెరిగినవారే. నిజమేమున ఉన్నదాని నున్నట్లుగ చెప్పుట నిరభిమానము. దానికి విరుద్ధమైనది అభిమానము.

యోగాభ్యాసమువలన కొన్ని సిద్ధులు లభించును. వాటిని ఇతరులకు తెలిపినచో అవి నశించుననుకొందురు. అందువలననే యోగి తాను ఈశ్వరు నెఱుగుదునని తెలుపడందురు. (ఏలన ఇదిగూడ సిద్ధియే). దూరదర్శనము, ఆకాశవాణి మొదలగువాటి సిద్ధిని ప్రకటించినందున వాటిని కనిపెట్టినవారి సిద్ధి నశించలేదు గదా! మరి యోగి తన సిద్ధిని ఇతరులకు తెలిపిన, అది ఎందుకు నశించునో వీరి నడుగవలెను. భౌతిక ఆవిష్కారముల జ్ఞానమును ఇతరులకు తెలియపరచినను నశింపదు. అటులే ఆత్మపరమాత్మలకు సంబంధించిన జ్ఞానముగూడ ఎన్నడు నశింపదు. పైగా వృద్ధి పొందచునే యుండును. ★ కారణము (=సాధనము) ఉన్నంతవరకు కార్య మెట్లు నష్టమగును. ''బ్రహ్మచర్యప్రతిష్ఠాయాం వీర్యలాభః'' - ఋషి దయానందుడు బ్రహ్మ చర్యప్రచారము చేసెను. భీష్మాదులుగూడ అట్లే చేసిరి. వేదముగూడ ''బ్రహ్మచర్యేణ తపసా దేవ మృత్యుముపాఘ్నత'' అని ఘోషించుచున్నది. ఈ సిద్ధిని ప్రచారమొనర్చినందున ఋషి దయానందుని బ్రహ్మచర్యము లోపించెనా? ఎందరో ఋషులు, మహర్షులు ఆయుర్వేదము మున్నగువానిలో సిద్ధిని పొంది ప్రచారము చేసిరి, అట్టి వారి సిద్ధులు నశించెనా? నశించలేదు. పైగా వారి సిద్ధులవలన ఇతరులకు లాభము కలిగినది. సిద్ధిని ప్రకటించినచో అది నశించుననుట మూఢనమ్మకము. ఈ మూఢనమ్మకము ప్రబలినప్పటినుండి సిద్ధులను గుప్తముగా నుంచుట మొదలైనది. వ్యక్తి తన సిద్ధిని తన వెంటగొనియే మరణించుచున్నాడు. కాని ఎవరికిని తెలుపుట లేదు. ఇట్టి ప్రవృత్తి వలన ఎన్నియో విద్యలు గుప్తముగనే యుండిపోయినవి. అవి ఆవిష్కర్తలతో బాటే నశించినవి. దీనివలన దేశ ధర్మములకును, మానవ సమాజమునకును ఎంతయో నష్టము వాటిల్లినది. ఈ యంధవిశ్వాసము తొలగనంతవరకు మానవజాతికి కల్యాణము లేదు. కావున ఈ సత్యమును ప్రపంచమంతట నిస్సంకోచముగా వ్యాపింపజేయుట అత్యంతావశ్యకము. ' ఈశ్వర సాక్షాత్కారము పొందితి

★ గణితజ్ఞుడు ఇతరులకు గణితము నేర్పుటవలన అతని గణితవిద్య నష్టము కాలేదు. తమ భాషను ఇతరులకు నేర్పినవా రెవ్వరును తమ భాషను మరచిపోలేదు. ఈతగాండ్రు ఇతరులకు ఈదుట నేర్పి తమ విద్య (ఈదుట)ను కోల్పోలేదు. దారి తెలిసినవారు ఇతరులకు దాని చూపి తాము ఆ దారిని మరచిపోలేదు. ఇతరులకు నేర్పినచో వారి విద్య పెరుగునే గాని తగ్గదు. ధనమును, భూమిని ఇతరులకు దానముచేసిన అవి మనవద్ద ఉండవు. కాని విద్య అట్లు కాదు. ధనము, భూమి ఇవి - బయటి పదార్థములు. విద్య ఆత్మలో నుండునది. అది ఆత్మలోనే ఉండును. ధనము భూమి ఆత్మలో నుండునవి కావు. కావున ఇతరులకు సిద్ధులు నేర్పినచో అవి నశించుననుట అవిద్య. ఈ యవిద్యగలవారికి ఆత్మ పరమాత్మల జ్ఞానము లభించదు. భగవంతుడు తన జ్ఞానమును వేదరూపములో మానవున కొసగినాడు అతడు తనను సాక్షాత్కరించుకొన్న వాని ఆత్మలో తన ఆనందమును నింపివేయును. ఈశ్వరుని ఈ ప్రవృత్తిని అలవరచుకొననివానికి ఈశ్వరసాక్షాత్కారము అసంభవము. సిద్ధులతో యోగికి స్వస్వామి సంబంధ ముండుటవలన ఈశ్వరసాక్షాత్కారము, ముక్తి లభించదు. ఒకవేళ సిద్ధిని తనది అనుకొనడేని, దాచి పెట్టుట జరుగదు. తనది అనుకొనెనేని అది అజ్ఞానము. అందుకే ''తేన త్యక్తేన భుంజీథా'' (యజు. ౪౦-౧) - సమస్త పదార్థములను భగవద్దత్తములని ఆసక్తి లేకుండ అనుభవించవలెను. (సంపా.)

ననువాడు పరమేశ్వరు నెఱిగినవాడు కాడు. పరమేశ్వరసాక్షాత్కారము పొందలేదనువాడే పరమేశ్వరు నెఱిగిన వాడు' అను భ్రాంతిని యుక్తి ప్రమాణములతో ఖండించితిని. కావున సజ్జనులందరు ఈ భ్రాంత మాన్యతను వదలి సత్యసిద్ధాంతమును గ్రహించవలెను.

★★★

౭. పూర్ణయోగి ఈశ్వర సమాను డగునా?

"యోగము నభ్యసించుచు, ఉన్నతస్థితిని పొంది యోగి ఈశ్వరునివలె సర్వజ్ఞుడగును. సమస్త ప్రపంచములోని పదార్థముల గుణకర్మస్వభావములను ఈశ్వరుని వలెనే ఎఱుగును" అని కొందరు నమ్ముదురు. ఇది భ్రాంతియే.

ఈశ్వరుని సర్వజ్ఞత ఎట్టిదో మొదట తెలిసికొను టవసరము. వర్తమానమున ప్రపంచములోగల పదార్థములన్నిటి గుణకర్మ స్వభావములను ఏకకాలముననే తెలిసి కొనుట, భూతకాలమున జరిగిన దానిని, భవిష్యత్తున జరుగనున్న దానిని కూడ చక్కగా నెఱుగుట. ఇదియే ఈశ్వరుని సర్వజ్ఞత.

ప్రశ్న:- జీవుడు భవిష్యత్తులో చేయబోవునది-ఏ సమయమున ఏ జీవుడు ఎట్టి కర్మ చేయగల డో- ఈశ్వరునకు మొదలే తెలియునని కొందరందురు. ఇది ఎంత వరకు సత్యము?

ఉత్త:- ఈ నమ్మకము భ్రాంతియుక్తము. జీవునికి ఇంతవరకు తెలియకుండి, కొంతకాలము తర్వాత లభించనున్న జ్ఞానమును ఈశ్వరు డెట్లు తెలిసికొనుగల్గును?

యోగి ఈశ్వరసమాను డెందుకు కాడో ఆలోచింతము.

(క). "జీవుడు ముక్తిని పొందినను శుద్ధస్వరూపుడు, అల్పజ్ఞుడు, పరిమిత గుణకర్మ స్వభావములు గలవాడుగనే యుండును. పరమేశ్వరునివలె సర్వజ్ఞుడు ఎన్నటికిని కాజాలడు." (సత్యార్థ ప్ర.౯వ సము.)

(ఖ). "జీవుడు తనజ్ఞానమును, సామర్థ్యమును ఎంతపెంచుకొన్నను అతనిలో పరిమిత జ్ఞానము. పరిమిత సామర్థ్యమే ఉండగలదు." (సత్యార్థప్ర. ౧౨వ సము.)

(గ). "ఎంత గొప్ప సిద్ధుడైనను శరీరాదుల రచనను సంపూర్ణముగా తెలిసి కొనజాలడు." (సత్యార్థప్ర. ౧౨వ సము.)

(ఘ). "జీవుడు అల్పుడు, అల్పజ్ఞుడు. అతడు సర్వవ్యాపకుడు. సర్వజ్ఞుడు కాజాలడు. ఏక దేశి. పరిమిత గుణకర్మ స్వభావములు కలవాడు. అతడు విద్యలన్నిటిని యథార్థముగ ప్రకటింపజాలడు." (సత్యార్థప్ర. ౧౨వ సము.)

జైనులు జీవులను తప్ప సర్వవ్యాపకుడు, సర్వజ్ఞుడునైన ఈశ్వరుని నమ్మరు. జీవుడే సాధన జేసి

సర్వజ్ఞుడగునందురు. అతనినే పరమేశ్వరు డందురు. ఋషి దయానందుడు ఈ అపసిద్ధాంతమును ఖండించినాడు.

(ఙ). ''క్లేశకర్మవిపాకాశయై... (యోగ. ౧-౨౪) సూత్రమునకు ఋషిదయానందుడు వ్రాసిన అర్థము- 'అవిద్యాది పంచక్లేశములు, మంచి చెడు కర్మల వాసనలు- వీటికి సదా దూరముగా నున్నవాడు, బంధనము లేనివాడు. పూర్ణపురుషుడు ఈశ్వరుడు. అతని స్వరూప మేమి? తనకన్న మిన్నయైన, సమానమైన పదార్థము లేనివాడు. సదా ఆనందుడు. జ్ఞానస్వరూపుడు. సర్వశక్తిమంతుడు. అతడే ఈశ్వరుడు. ఏలన 'తత్ర నిరతిశయం సర్వజ్ఞబీజమ్' (యోగ.౧-౨౫) - అతనియందు నిత్యజ్ఞానము గలదు. అతని జ్ఞానాది గుణము లనంతములు. జీవుని సామర్థ్యము అంతము ప్రత్యక్షము ....'' (ఋ.భా.భూ. ఉపాసనావిధి)

దీనివలన జీవుడు సర్వజ్ఞుడు కాడని స్పష్టమగుచున్నది. అతని జ్ఞానాది గుణము లనంతము లెన్నటికిని కాజాలవు.

''యత్ర కాష్ఠాప్రాప్తిర్జ్ఞానస్య స సర్వజ్ఞః, స చ పురుషవిశేష ఇతి''. (యోగ. ౧-౨౫వ్యాస భా.) అనంతజ్ఞానముగలవాడు. సర్వజ్ఞుడు. పురుషవిశేషుడు.

ఈశ్వరునివలె యోగి సర్వజ్ఞుడు కాగల్గుచో వ్యాసమహర్షి 'జ్ఞానపరాకాష్ఠగల విశేషపురుషుడే ఈశ్వరుడు' అని వ్రాయకుండెడివాడు. జీవుడు యోగము నభ్యసించి ఈశ్వరునివలె సర్వజ్ఞుడు కాగల్గుచో అతడు పురుషవిశేష ఈశ్వరుడు అనబడడు. ఏలన అతనివలె సర్వజ్ఞులైన జీవు లనేకులుందురు. కావున వ్యాసమహర్షి యోగి ఈశ్వరుని వలె సర్వజ్ఞుడగునను విషయము నంగీకరింపడు.

(చ). ''వేదములకు వ్యాఖ్యారూపమున బ్రహ్మాది మహర్షులచే వ్రాయబడిన ౧౧౨౭ వేద శాఖలు పరతఃప్రామాణములు. అనగా వేదానుకూలము లైనంతవరకు ప్రమాణములని, వేదవిరుద్ధ విషయము లేవైన నున్నచో అప్రమాణములని యంగీకరింతును'' (సత్యార్థప్ర. స్వమంతవ్యామంతవ్యప్రకాశము)

బ్రహ్మాది ఋషులెందరో వేదములకు అంగోపాంగములను రచించినారు. వారు యోగులు. వేదాంతదర్శనకర్త వ్యాసమహర్షి యోగియని దయానందుడు పేర్కొన్నాడు. ఇట్టి సిద్ధయోగు లనేకులు గ్రంథముల రచించినారు. వారు ఈశ్వరునివలె సర్వజ్ఞులై యుండినచో ఋషిదయానందుడు వారి గ్రంథములలో వేదానుకూలములైనవి మాత్రమే ప్రమాణములని, అందు వేదవిరుద్ధ విషయములున్న, అవి అప్రమానములని వ్రాసెడివాడు కాడు. యోగులు ఈశ్వరునివలె సర్వజ్ఞులైనచో వారు రచించిన గ్రంథములలో వేదవిరుద్ధవిషయము లుండకుండెడివి. అంతే గాదు, వారి రచనలను ఋషి దయానందుడు వేదములవలెనే స్వతఃప్రమాణములని యంగీకరించెడివాడు. దీనివలన ఎంతటి సిద్ధయోగి యైనను ఈశ్వర సమాన సర్వజ్ఞుడు కాజాలడని స్పష్టమగుచున్నది.

ప్రశ్న:- జీవుడు ఈశ్వరునివలె సర్వజ్ఞు డెందుకు కాడు?

ఉత్త:- ఏకదేశి యగుటవలన జీవుడు ఈశ్వరునివలె సర్వజ్ఞుడు కాజాలడు. సత్యార్థప్రకాశము

ఏడవసముల్లాసములోని దిగువ ప్రశ్నోత్తరము ఇందుకు ప్రమాణము.

''**ప్రశ్న:- జీవుడు శరీరమున భిన్నముగానున్న విభుడా? పరిచ్ఛిన్నుడా?**

ఉత్త:- పరిచ్ఛిన్నుడు. విభుడే యైనచో జాగ్రత్స్వప్నసుషుప్తులు, జన్మ మరణములు, సంయోగ వియోగములు, రాకపోకలు ఎన్నడును సంభవింపవు''.

జీవుడు ఈశ్వరునివలె సర్వవ్యాపకుడైనచో జాగ్రత్స్వప్నసుషుప్త్యవస్థల యనుభవము కలుగకుండెడిది. ఏలన సుషుప్త్యవస్థలో మనస్సుతో, ఇంద్రియములతో జీవునకు సంబంధము లేకుండ నగును. ఆ సంబంధము లేనందున జీవునకు బాహ్యవస్తువుల జ్ఞానము కలుగదు. జీవుడు సర్వవ్యాపకుడైపోయిననో ఈ సంబంధము సదా వీడకుండును. అంతేగాక జీవునకు సమస్తవ్యవహారముల యథార్థజ్ఞానము ఎల్లపుడు నుండును. కాని వాస్తవమున సుషుప్త్యవస్థలో ఏజీవునకును బాహ్యజ్ఞాన ముండదు. కావున జీవుడు ఈశ్వరునివలె సృష్టియందంతట వ్యాపించియుండ డని బుజువగుచున్నది. అట్లే జననమరణములు, సంయోగవియోగములు, రాకపోకలు మున్నగు వ్యవహారములు సర్వవ్యాపకునియందు ఘటింపవు. ఇట్లు నమ్మినచో ఒక జీవునకు ఇతరజీవుల మనస్సులందు, శరీరములందు కలుగు సుఖదుఃఖములు తెలియవలెను. కాని తెలియవు. **ఉదాహరణకు- భారతదేశమునున్న మనుష్యునకు అమెరికా** మున్నగు దేశవాసుల సుఖదుఃఖములు తెలియవు. భారతదేశమునన్నున్న ఒకానొక జీవుడు సమస్తప్రపంచములోని జీవుల శరీరములందును విద్యమానుడై యున్నచో అతనికి సమస్త వ్యవహారముల జ్ఞానముండవలెను. కాని ఇట్లుండుట లేదు. కావున జీవుడు సర్వవ్యాపకుడు కాడు. అందుచే సర్వజ్ఞుడును కాజాలడు- అని బుజువగుచున్నది.

జీవునికి వాడబడిన సర్వజ్ఞశబ్దమును గాంచి జీవుడు గూడ సర్వజ్ఞుడు కాగలడని భ్రాంతి కలిగినది. ఉదాహరణ కు **''తత్రాఽఽత్మా సర్వస్య ద్రష్టా సర్వస్య భోక్తా సర్వజ్ఞః సర్వానుభవీ''** (న్యాయ.౧-౧-౯ వాత్స్యాయన భా.) ఇందు సర్వజ్ఞ శబ్దము వాడబడినది. దీని అభిప్రాయము జీవుడు విశ్వములోని సమస్త పదార్థములను సంపూర్ణముగా నెఱుగునని కాదు. జీవుడు సమస్త ఇంద్రియములయు మనస్సు యొక్కయు వ్యాపారమును పూర్ణముగా నెఱుగుననియే. అనగా ఏ యింద్రియము ద్వారా ఏ విషయము యొక్క జ్ఞానము కలుగును? విషయములెన్ని? భోగమునకు ఆయతనము ఈశరీరము అను విషయముల నన్నిటిని తెలిసికొనువాడు జీవుడు. కావున ఇతనిని సర్వజ్ఞుడన్నారు.

యోగదర్శనములోని కొన్ని శబ్దములను గాంచి కొందరికి జీవుడు యోగియై ఈశ్వరునివలెనే సర్వజ్ఞు డగునని భ్రాంతి కలిగినది. ఉదాహరణకు-

(క). **''సత్త్వపురుషాన్యతాఖ్యాతి మాత్రస్య సర్వభావాధిష్ఠాతృత్వం సర్వజ్ఞాతృత్వం చ''** (యోగ. 3-౪౯) ఇందలి 'సర్వజ్ఞాతృత్వ' శబ్దమునకు ''జీవుడు శాంత, ఉదిత, అవ్యపదేశ్య ధర్ముగల గుణములను ఏకకాలమున తెలిసికొనును. సత్త్వరజస్తమో గుణముల వ్యాపారములను బాగుగ నెఱుగును. ఈ జ్ఞానోదయ మైనట్లుగ నతడు తాను ప్రకృతికంటె భిన్నుడని తెలిసికొని గుణములపై

ఆధిపత్యము సంపాదించును.'' అని అభిప్రాయము. కావున ఈసూత్రమునగల 'సర్వజ్ఞాతృత్వము' నకర్థము గుణముల సంపూర్ణవ్యవహారముల నెఱుగుటయే యని తెలియవలెను. ఈ శబ్దవాస్తవికార్థమును తెలిసికొనుటకు పూర్వాపర సందర్భములను తెలిసికొనవలసి యుండును. ఈ శబ్దమునకు యోగి ఈశ్వరునివలె సర్వజ్ఞుడగునను నర్థము గ్రహించినచో సూత్రకారుడు ఆ సర్వజ్ఞతను వదలివేయుటకై ''తద్వైరాగ్యాదపి దోషబీజక్షయే కైవల్యమ్'' (యోగ. 3-౫౦) అను సూత్రమును రచింపకుండెడివాడు. తద్వైరాగ్యాదపి- ఆ సర్వజ్ఞాతృత్వమునెడయు వైరాగ్య ముత్పన్నమైనపుడు, దోషబీజము నాశనమైనపుడు మోక్షము సిద్ధించును. ఆ సర్వజ్ఞత ఈశ్వరసమానమే యగుచో దాని యెడ వైరాగ్యము కలుగు ప్రసక్తియే యుండదు.

(ఖ). ''తదా సర్వావరణమలాపేతస్య జ్ఞానస్యానంత్యాజ్ఞేయమల్పమ్'' (యోగ. ౪-3౧) అను సూత్రమున 'అనంత్య' శబ్దమున్నది. దీనిని చూచి కొందరికి యోగి జ్ఞానము ఈశ్వరుని జ్ఞానమువలె అనంతమగు ననిపించును. ఇచట అనంత్యశబ్దమునకు అధికమనియే అర్థము. సాధన చేయుచు యోగి ఉన్నతస్థితిని పొందినపుడు అతని జ్ఞానము పెరుగును. తెలిసికొనదగిన వన్నియు అతనికి అత్యంత సులభము లగును. లోకమునగూడ సామాన్య వ్యక్తులకు కఠినముగా నుండు పనులు బలవంతులకు సరళముగా నుండును. సామాన్యులకు కఠిమైన విషయములు యోగులకు తేలికగా అర్థమగును. యోగి తెలిసికొనదగినవి 'హేయము, హేయహేతువు, హానము, హానోపాయము' వీటిని యోగి సులభముగా తెలిసికొనును. దీనిని స్పష్టము చేయుటకు 'అనంత్య' శబ్దము ప్రయోగింపబడినది.

ప్రశ్న:- యోగి పరమాత్మునివలెనే సర్వజ్ఞుడని అంగీకరించిన నష్టమేమి?

ఉత్త:-ఒక అపసిద్ధాంతము నంగీకరించినచో దానిని నిరూపించుటకు మరొక మిథ్యాసిద్ధాంతమును సృష్టించవలసి వచ్చును. ఉదాహరణకు-'బ్రహ్మ తప్ప ఇంకేమియు లేదు' అనెడి అపసిద్ధాంతము నొకడు ప్రతిపాదించినాడు. దానిని నిరూపించుటకై అనేక అపసిద్ధాంతములను కల్పించినాడు. అనేక గ్రంథములను రచించినాడు. లక్షలాది జనులను భ్రాంతిలో పడవేసినాడు. మానవ జీవిత ఫలమునుండి వారిని వంచితుల నొనర్చినాడు. కొందరు యోగిని సర్వజ్ఞుడని నమ్మి అతని నుపాసింపసాగినారు. గురువునే ఉపాసించుము, ఇదియే ముక్తి మార్గ మనుకొనువారెందరో ఈ ప్రపంచమున నున్నారు.

కొందరు సిద్ధిని పొందిన గురువునే ఈశ్వరుడని భావింతురు. పరమేశ్వరుని అస్తిత్వమును వారంగీకరింపరు. ఇది 'జీవుడు సర్వజ్ఞుడు' అని యనుకొనుటవలన కలిగిన పరిణామమే. జీవుడే సాధన చేసి ఈశ్వరుడగునని వారి నమ్మకము. అందుచే వారు అతని ఉపాసన చేయుదురు, చేయింతురు. వారు అజ్ఞానాంధకారమున మునిగి యున్నారు. తమ అనుయాయులను గూడ అవిద్యాంధకారమున బడవేయుచున్నారు. యోగి పరమాత్మునివలె సర్వజ్ఞుడని నమ్ముటవలన ఇట్టి యనర్థము లెన్నియో సంభవించినవి. ఇకముందు సంభవింపనున్నవి. కావున సజ్జనులందరు నిరాధారమైన ఈ సిద్ధాంతమును త్యజించుటకు, త్యజింపజేయుటకు ప్రయత్నించిన విద్యావృద్ధి జరిగి అవిద్య నశింపగలదు.

★★★

౮. సమాధిలోనున్న యోగి అవయవములను నరికినచో అతనికి తెలియదా? బాధ కలుగదా?

'సమాధిలోనున్న యోగి కాలునో, చేయినో నరికినచో అతనికి ఎట్టి బాధగాని అనుభూతిగాని కలుగదు.' అని కొందరి నమ్మకము. చాల కాలమునుండి దీనిని వినుచున్నాము. పుస్తకములో చదువు చున్నాము. కాని అది భ్రాంతియే.

సమాధియన నేమో తెలిసికొను టవసరము. సమాధి విషయమున జనులలో అజ్ఞానముతో కూడిన నమ్మకము లెన్నియో వ్యాపించియున్నవి. ౧. గోతిని త్రవ్వి అందు కొన్ని దినములు అన్నపానములు లేక కూర్చొని యుండుట సమాధియని కొందరు నమ్ముదురు. ౨ వారము, రెండువారములు అన్నపానాదులు లేక జపము చేయుచుండు టే సమాధియని మరికొందరందురు. 3. అడవులందో, పర్వతములపైననో ఏకాంత స్థలములో మౌనముగా కూర్చుండుట సమాధి యని కొందరి విశ్వాసము. ౪. ప్రాణగతిని, నాడీగతిని నిలిపివేయుటనే సమాధియని మరికొందరు భావింతురు. ★

ఇట్లు సమాధి యనగా నానావిధములుగా నమ్ముచున్నారు. ఈ మిథ్యానమ్మకముల నుండి తప్పించుకొని వాస్తవసమాధిని పొందుట మానవునికి అత్యంత కఠినమై పోయినది. సర్వజనుల కల్యాణమునకై మహర్షి పతంజలి యోగదర్శనము (3-3) లో సమాధియొక్క వాస్తవ స్వరూపము నిట్లు తెలిపినాడు.

''తదేవార్థమాత్రనిర్భాసం స్వరూపశూన్యమివ సమాధిః'' (యోగ. 3-3)

దీనికి స్వామీదయానందుడు వ్రాసిన అర్థము- ''(తదేవార్థ...) అగ్నిలో తపించిన లోహము అగ్నిరూపము దాల్చును. అట్లే పరమేశ్వరునిద్వారా ప్రకాశవంతుడై స్వశరీరమును గూడ మరచినవాని వలె నగును. పరమేశ్వరునిలో గల జ్ఞానమును ఆనందమును పొందును. మహాదుఃఖము సంభవించినను భయపడడు. అన్నిటిని సహించుకొనును.'' దీనివలన 'యోగికిగూడ కష్టానుభూతి కలుగును. కాని అది ప్రాపంచిక మానవులకన్న తక్కువగా నుండును. లౌకిక మానవుల కన్నయోగిలో సహనశక్తి అనేక రెట్లధికముగ నుండును'. అని స్పష్టమగుచున్నది. ఋషిదయానందుని జీవితము ఇందుకు నిదర్శనము. అతడు అనేక కష్టముల నోర్చుకొనెను. తనకు విషమొసగిన వారికి గూడ కల్యాణమార్గ మునుపదేశించెను. అత్యంత రుగ్ణావస్థలో నున్నపుడు గూడ ఆరోగ్యవంతులవలెనే కనబడుచుండెను. యోగికి అయోగికి ఇదే భేదము.

★ కొన్ని దినములు ఉపవాసముండి బస్తి మొదలగు క్రియలద్వారా కోష్ఠశుద్ధి చేసికొని, స్పృహ తప్పి పడిపోవుటనే సమాధియని కొందరు భావింతురు. కొందరు తమ శిష్యులను ఉపవాసముంచి ఏదో ఒకనాడిని నులిమి మూర్ఛితుల జేయుదురు. ఆ మూర్ఛనే సమాధియని మరికొందరందురు (సంపా.)

సామాన్యవ్యక్తి ఏదేనొక విశేషకార్యమున నిమగ్నుడై యున్నపుడు అతని శరీరమున ముల్లుగ్రుచ్చు కొన్నను. ఏదోపురుగు లేక దోమ కుట్టినను అతని కా విషయము తెలియక పోవచ్చును. కాని అదే స్థితిలో విషపు తేలు కుట్టినచో అతడు బాధతో నరచును. అట్లే సమాధిలోనున్న యోగికి ఏదేని పురుగు, దోమ మున్నగువాని కాటు సామాన్యదుఃఖదాయకమైనందున కష్టము, అనుభూతి కలుగకుండుట సంభ వమే. కాని కాలు, చేయి, తల మొదలగు అవయవములను నరికినను కష్టము, అనుభూతి కలుగదనుట అసంభవము అజ్ఞానము.

పైన వివరించినట్లు సమాధిలోనున్న యోగికి సామాన్య బాధయొక్క అనుభూతి కలుగక పోవచ్చును. యోగి మనస్సును, ఇంద్రియములను అదుపులో నుంచుకొనును. విశేష అఘాతము కలిగినపుడు దుఃఖాను భూతిని నిరోధింపగల్గును. సమాధి లోనున్న యోగి కాలు, చేయి, తల మొదలైన వానిని నరికినచో కలి గెడు కష్టానుభూతిని నిరోధింపజాలడు. సమాధి యొక్క ఆనందానుభూతి యటుంచి, తానెక్కడు న్నది, పరమాత్మ డెక్కడున్నది గూడ అతనికి తెలియదు.

ప్రశ్న:- సమాధిలో యోగికి శరీరము, మనస్సు, ఇంద్రియములు, ప్రకృతి వీనితో సంబంధ ముండదు. అందుచే అవయవములను నరికినప్పటికిని అతనికి కష్టము, అనుభూతి ఉండగూడదు గదా?

ఉత్త:- శరీరాదులతో సంబంధము పోదు. సమాధిలోనున్న యోగిశరీరములోను అన్నపానాదులు రసముగా మారును. రసమునుండి ఇతర ధాతువు లేర్పడును. సదా మలమూత్రము లుత్పన్నముగుచుండును. సమాధిలో యోగికి శ్వాసక్రియ నియమ పూర్వకముగ జరుగుచుండును. సమాధిలోనున్న యోగికి శరీ రాదులతో సంబంధము లేకున్న ఈ క్రియలు జరుగనేరవు. శరీరము కుళ్లి నశించును. గాఢ నిద్రలో నున్న వానికి సామాన్యమైన దెబ్బ తగిలినచో కష్టానుభూతి కలుగదు. కాని అతని కాలునో చేయినో నరికి నచో అతనికి అత్యంత బాధ కలుగును. నిద్రలేకుండపోవును. సుషుప్త్యవస్థలో గూడ మనస్సు మరియు ఇంద్రియముల ద్వారా బాహ్య విషయముల జ్ఞానము కలుగదు. అట్లే సమాధిలోను బాహ్యవిషయ ముల జ్ఞాన ముండదు. కాని అవయవములను నరికినచో కష్టానుభూతి తప్పదు.

ప్రకృతితో సంబంధముండు ననుటకు మరొక ప్రమాణము- వ్యాసమహర్షి చిత్తమునకు ''క్షిప్తం మూఢం విక్షిప్త మేకాగ్రం నిరుద్ధమితి చిత్తభూమయః'' (యోగ.౧-౧వ్యాసభా.) క్షిప్తము, మూఢము, విక్షిప్తము, ఏకాగ్రము, నిరుద్ధము అను ఐదవస్థలు గలవని తెలిపినాడు. వీటిలో ఏకాగ్రము, నిరుద్ధము అను రెండవస్థలే సమాధిగా భావింబడినవి. చిత్తము ప్రకృతి నిర్మితము. సమాధిస్థితిలోను అది యుండును. కావున ప్రకృతితో సంబంధము తొలగదు. సమాధిలో జీవుడు పరమేశ్వరుని ఆనంద ములో లీనమగును. ప్రకృతి ఉపాసనను వదలివేయును. కాని అప్పుడును దానిని సాధనముల రూప మున నుపయోగించుచునే యుండును. సమాధిస్థితికిని, సమాధి రహితస్థితికిని గల ముఖ్యభేద మిదియే. సమాధిలో లేనప్పుడు జీవుడు శరీరాదులచే కర్మలు చేయును. వానికి వశుడైవికృతి నుపాసించును. సమాధిలో మనస్సు మొదలగువానిని వశ మందుంచుకొనును. పరమేశ్వరు నుపాసించును.

కొందరు యోగముగురించి విచిత్ర విషయములను తెలుపుదురు. వాటిని విని వారికి ఎందరో శిష్యులు, శిష్యురాండ్రు నగుదురు. ఆ వ్యక్తులే వారికి గురువులై లౌకిక వైభవముల ననుభవింతురు. ఒక యోగి గురించి ఒక వ్యక్తి చెప్పగా వింటిని. ఆ యోగి సమాధిలోనున్నపుడు అతని తొడపైన ఎవడో మేకు నాటెనట. ఐనను అతని కేమియు తెలియలేదట. బాధ కలుగలేదట. తొడపైన మేకు దిగవేసిన గుర్తు ఉండవలెను గదా! ఎచట నున్నదని అడుగ ఆ యోగి ఏమియు చెప్పలేకపోయెనట.

కొందరు యోగమును ప్రశంసించుచున్నా మనుకొనుచున్నారు. కాని వారు చేయు ప్రశంస యోగ నిందయే యగుచున్నది. ఏలన యోగము నభ్యసించుటవలన కలుగు గుణములను పేర్కొనుట యోగ స్తుతి. కలుగని గుణములను కలుగుననుట యోగనిందయే.

కొందరు రాముని, కృష్ణుని ఈశ్వరావతారములని భావించినారు. దీనినే వారి స్తుతి యను కొన్నారు. అది వారి నిందయే. అట్లే కొందరు యోగమును స్తుతించుచున్నా మనుకొనుచు నిందించు చున్నారు. దీని పరిణామము హానికరమని ఋజువైనది.

ఒకసారి కర్నాల్ నగరములో ఒక వ్యక్తి నాతో యోగము గూర్చి చర్చప్రారంభించెను. పలువురివలె అతడుగూడ 'ఆర్యసమాజములో యోగులే లేరు అన్య మతములలో యోగులున్నారు.' అను మిథ్యా నమ్మకమును వెలిబుచ్చెను. ఈమిథ్యానమ్మకమును 'రెండవ భ్రాంతి' వ్యాసమున ఖండించితిని. ఋషి దయానందుడు స్వీకరించిన మాన్యతలను, త్రైతవాదమును అంగీకరించనివాడు ఎన్నటికిని యోగి కాజా లడు. నేను ఆ వ్యక్తిని 'యోగిలక్షణము లేమి? అతడు అగ్నిని శీతలమొనర్చునా?' అని ప్రశ్నించితిని. అతడు ఔననెను. ఈ విశ్వాసము ఋషుల సిద్ధాంతమునకు విరుద్ధము. అజ్ఞానజనితము. అగ్ని యొక్క స్వాభావిక గుణమును పరమేశ్వరుడుగూడ తొలగింప జాలడని ఋషిదయానందుడు వ్రాసినాడు.

ప్రశ్న:- ఇట్టి భ్రాంతులకు కారణమేమి?

ఉత్త:- ౧. జీవన్ముక్తులైన యోగుల కొరత, ౨. వేదవేదాంగములను చదువక పోవుట, ౩. చది వించక పోవుట, ౪. అనృషుల (ఋషుల కానివారి) గ్రంథములను చదువుట, ౫. చదివించుట, ౬. వేదవిద్యా విరోధులు రాజ్యమేలుట, ౭. యోగమును ప్రశంసించువారి ఆచరణ యమనియమాను సారము లేకుండుట, మొదలగునవి ఇందుకు కారణము.

ప్రశ్న:- సమాధిలో నున్న యోగికి అంగములను నరికినను అతనికి తెలియదు, బాధ కలు గదు. అది యంగీకరించిన నష్టమేమి?

ఉత్త:- ౧- ఒక యోగి సమాధిలోనున్నా డనుకొనుడు. ఒక దుర్మార్గుడతని తలను నరికినా డను కొనుడు. అపు డాయోగి బాధను వెలిబుచ్చును. జనులతనిని యోగియని భావించరు★ .

★ యోగికాడనుకొన్నందున అతనివలన ఎవరును లాభము పొందరు. అతని జ్ఞాన విజ్ఞానములతో అందరు పండితులగుదురు. (సంపా.)

౨. పూర్వము తెలిపినట్లు అసత్యమును సత్యమని నిరూపించుటకు ఇంకను అనేక అబద్ధము లాడవలసి వచ్చును. ౩. ఇది ప్రత్యక్షవిరుద్ధము.

సమాధిలోనున్న యోగి అంగమును నరికినచో అతనికి బాధ, అనుభూతి కలుగదను భ్రాంతి నివారింపబడినది. ఇట్టి నిరాధార నమ్మకములను నిర్మూలించుటకు వేదాది శాస్త్రములను చదువుట, చదివించుట, యమనియమాది యోగాంగములను మనోవాక్కర్మణా ఆచరించుట అవసరము.

★★★

౯. యోగి వాయువును భక్షించియే జీవించ గలడా?

'యోగులు కేవలము వాయువును భక్షించియే జీవింతురు. అన్నజలములు పాలు పండ్లు భక్షించరు. ఆరోగ్యవంతులవలె, బలవంతులవలె అన్ని పనులు చేయుదురు'. అని కొందరు నమ్ముదురు.

ఈ నమ్మకము అంతట కాననగును. ఈ విషయములో నొక జీవిత చరిత్ర వ్రాయబడినది. అది ''మహాయోగిని శ్రీమాణికేశ్వరీ మాతా'' జీవిత చరిత్ర. దాని రచయిత శ్రీ శంకరదేవ్ విద్యాలంకార్. ప్రకాశకులు ''మహాయోగినీ శ్రీమాణికేశ్వరీ ట్రస్ట్ (ప్రైవేటు), మాణికగిరి, గురుమిట్కాల్ ద్వారా, గుల్బర్గా జిల్లా, మైసూరు రాష్ట్రము. దానిలో ప్రమాణవిరుద్ధములు, కల్పితములు అనేకము గలవు. ఉదాహరణకు - ౧. మాత మాణిక్యమ్మ ౧౫ (ఇప్పటికి దాదాపు ౪౦-సంపా.) సంవత్సరములనుండి వాయువునే భక్షించుచున్నది. మలమూత్రములు గూడ చేయలేదు. ౨. బావిలోని నీటి నంతటిని ముట్టియే నూనెగా మార్చును. ౩. సిమెంటు గోడను, రాతిగోడను గూడ సంకల్పమాత్రమున కూలగొట్టును. ఆమె ఒకసారి తానున్నగదిని సిమెంటు రాళ్లతో మూయించెను. ఈశ్వరుని కిష్టమున్నచో బయటకు తీయగలడని వెల్లడించెను. ఈ విషయములను యుక్తి ప్రమాణములతో పరీక్షింతము.

రచయిత యోగులు కేవలము వాయువునే భక్షించి జీవింతు రనుటకు యోగదర్శన సూత్రమును ప్రమాణముగా వ్రాసినాడు. మొద లీవిషయము నాలోచింతము.

''కంఠకూపే క్షుత్పిపాసానివృత్తిః'' (యోగ. 3-3) - కంఠకూపమున ప్రాణములను నిలిపినచో ఆకలి దప్పులు కావు. (పుట౭) అని వ్రాసినాడు. అతడు వ్రాసిన ఈ యర్థము యోగదర్శనములోని ప్రకరణమునకు విరుద్ధము. మూడవ పాదములో సంయమము గూర్చిన విషయము గలదు, ప్రాణ విషయము గాదు. సంయమ మనగా ధారణా, ధ్యాన, సమాధులు ఒకే విషయమున చేయబడుట.

''తదేతద్ధారణాధ్యానసమాధిత్రయమేకత్ర సంయమః। ఏక విషయాణి త్రీణిసాధనాని సంయమ ఉచ్యతే॥'' (యోగ. 3-౪ వ్యాసభా.) - మూడు సాధనములు ఒకే విషయమున నుండుట సంయమ మనబడును. ''కంఠకూపమున ధారణా ధ్యాన సమాధులను చేయుటవలన ఆకలిదప్పు లుండ''

వని ఈ సూత్రముయొక్క వాస్తవిక అర్థము. ''ప్రాణములను కంఠమున నిలుపుకొన్నందున'' అను నర్థము ప్రకరణవిరుద్ధ మైనందున కల్పితము.

ఈ సూత్రభాష్యమున వ్యాసుడు ''తత్ర సంయమాత్ క్షుత్పిపాసే న బాధేతే'' అచట సంయమము వలన ఆకలిదప్పులు బాధించవు'' అని వ్రాసినాడు. 'కంఠకూపమున సంయమము వలన ఆకలిదప్పులు ఎన్నటికి నుండవు' అని వ్రాయలేదు. అది సూత్రకారుని అభిప్రాయముగూడ కాదు. కంఠకూపమున సంయమమువలన కొంత సేపటి వరకు ఆకలిదప్పులు బాధించ వనియే దీని అభిప్రాయము.

ఇట్లే సూత్రకారుడు ''తతో ద్వంద్వానభిఘాతః'' (యోగ.౨-౪౮) - ఆసనము సిద్ధించినపుడు శీతోష్ణములు బాధింపవు - అని వ్రాసినాడు. ఈ సూత్రమునకు 'ఆసనము సిద్ధించిన పిదప యోగిని నిప్పులతో కప్పివేసినను, కాలుచున్న ఇటుకల వాములో నుంచినను అతనిని ఉష్ణము బాధించదు.' అని ఎవరైన అర్థము వ్రాసిన అది అనర్థమే కాగలదు. ఆసనము ఎంత సిద్ధించినను అగ్ని ప్రకోపము యోగిని తప్పక బాధించును. అతడు మరణించవచ్చును. ఆసనము సిద్ధించిన యోగిని శీతోష్ణములు ఒక పరిమితిలో నున్నంతవరకే బాధించవని తెలియవలెను. అట్లే కంఠకూపమున సంయమమువలన యోగిని ఆకలిదప్పులు కొంతసేపు బాధించవు.

ఈ నమ్మకము ఆయుర్వేదమునకును విరుద్ధమే. అందు ఆరోగ్యవంతుని లక్షణమిట్లు పేర్కొనబడినది.

సమదోషః సమాగ్నిశ్చ సమధాతు మలక్రియః।

ప్రసన్నాత్మేంద్రియమనః స్వస్థ ఇత్యభిధీయతే॥ సుశ్రుతము॥

ఎవనిలో త్రిదోషములు- వాతపిత్తకఫములు సమావస్థలో నుండునో, జఠరాగ్ని చక్కగా పని చేయుచుండునో, రసాదిసప్తధాతువులు సమస్థితిలో నుండునో, మలక్రియ చక్కగా జరుగునో- పొట్టలోని మలమూత్రములు తగురీతిలో వెడలుచుండునో, ఆత్మేంద్రియ మనస్సులు ప్రసన్నములై యుండునో అతడు ఆరోగ్యవంతుడు.

వాయుభక్షకుని శరీరమున కఫము ఎట్లు ఉత్పన్నమగును? రసరక్తాది సప్తధాతువు లెట్లేర్పడును? దేని ఆధారమున తగురీతిలో మలక్రియ జరుగును? వాయుభక్షణ వలన మల ముత్పన్నమగు ననుటే అసంగతము గదా! అన్నజలములు, పాలు, పండ్లు గైకొనడు. వాయువునే పీల్చుకొనును. అతని ఆత్మ, ఇంద్రియములు, మనస్సు ప్రసన్నములుగా నెట్లుండును? అతడు దుఃఖసాగరమునే మునిగియుండును. దీర్ఘకాలమువరకు వాయువునే భక్షించుచుండిన చనిపోవును. కేవలము వాయువునే భక్షించి యోగము నభ్యసింప జాలడు. యోగియై, ఆరోగ్యవంతుడై జీవించజాలడు.

ఆయుర్వేదమున - ''ధర్మార్థకామమోక్షాణామారోగ్యం మూలముత్తమమ్॥
రోగాస్తస్యాపహర్తారః శ్రేయసో జీవితస్య చ॥''

(చరకసూత్రస్థా. ౧-౧౫)

‘ధర్మార్థకామమోక్షములకు ఉత్తమారోగ్యము మూలము. రోగములు ధర్మార్థ కామమోక్షములకే గాదు మానవ జీవితమునకే శత్రువులు.’ అని తెలుపబడినది.

కేవలము వాయువును భక్షించువాడు ఆరోగ్యవంతుడు కాజాలడు, జీవించజాలడు. ఇవి లేకున్న యోగియై ధర్మార్థకామములను పొందజాలడు.

ప్రశ్న:- అన్నపానముల ద్వారా లభించుశక్తి వాయువుద్వారా లభించును గదా?

ఉత్త:- ఈ నమ్మకమునకు యుక్తిప్రమాణములు లేవు. ఇది నిరాధారము. కేవలము ప్రతిజ్ఞ వలన సత్యముకాని, అసత్యము కాని ఋజువు కాదు.

మాతా మాణిక్యమ్మ మహాయోగిని యని వ్రాసిన శంకరదేవ్ ౭, ౮ (ఆయన మరణించువరకు దాదాపు ౨౦-సంపా.) సంవత్సరములనుండి ఆమెతో సంబంధము ఏర్పరచుకొని యున్నారు. ఆమె వలె కేవలము వాయువునే ఎందుకు భక్షించ లేదు? ఆమె అందరి హితము గోరునేమో! ఆమెను తెలిసికొని ప్రపంచములోనున్న ఆహారసమస్యకు సమాధానము ఎందుకు చేయరు? భారతదేశము విదేశాల ముందు ఆహారమునకై భిక్షమెత్తుచున్నది. ఈ దారిద్ర్యము నెందుకు తొలగింపరు? ఆమె ఇంకను జీవించియే యున్నది. ఆమె నడిగి వాయువును భక్షించి జీవించు పద్ధతిని తెలిసికొనగలరు. అన్న, జల, అగ్ని సమస్యలకు సమాధానము చేయగలరు. దాని వలన విశ్వములో నున్న దుఃఖము దూరము కాగలదు. గాలికి కొరత లేదు. మీ యీ పద్ధతి వలన మానవ జీవితము సఫలము కాగలదు. ఈ వ్రాత వలన ప్రపంచమున కెంత హాని కలుగునో శంకరదేవ్ ఆలోచించవలసి యుండెను.

శంకరదేవ్ వ్రాత చూడండి-‘‘యోగి సంకల్ప శక్తి ద్వారా సమస్తమును చేయగల్గు నని ఈ విషయము నిట విరమించుచున్నాము’’ (పుట ౩౧). యోగి సంకల్ప శక్తిచే కారణము లేకుండ కార్యమును చేయగలడా? మట్టిలేకుండ కుండను, వెండి, బంగారములు లేకుండ నగలను చేయగలడా? అగ్నిలోని వేడిమిని నష్టము చేయగలడా? భావమును అభావము, అభావమును భావము చేయగలడా? వీటికి సమాధానమే లేదనుకొందును. సాధన వలననే ఈ విషయములు తెలియునని వ్రాసి శంకరదేవ్ కృతార్థుడనైతి ననుకొన్నాడు. అతడు స్వయముగానే సాధన చేయుడు. అతని వ్రాతలను ఋజువు చేయుటకు ప్రమాణములు లేవు. ఇట్టి నిరాధారమైన వ్రాత. అత్యంత హానికరము. ఈ నమ్మకము ప్రత్యక్ష విరుద్ధము. అన్నపానాదులు గైకొనువాడు ఆరోగ్యవంతుడు, బలవంతుడు, దీర్ఘజీవిగా నుండుట ప్రత్యక్షము. ఇవిగైకొననివాడు బలవంతుడు కాజాలడు. చచ్చి తీరవలసినదే. ఇది ప్రత్యక్షసత్యము.

౨౧ దినములు ఉపవాస మున్నపుడు మహాత్మాగాంధీ బరువు మొదటికన్న పెరిగిన దని శంకరదేవ్ వ్రాసినాడు. ఇది ప్రత్యక్షవిరుద్ధము. కావున అసత్యము. ఆరోగ్యవంతుడు ఉపవాసమున్నచో బలహీనుడగును. బరువు తగ్గును. ఇది అందరెఱిగినదే. ఉపవాసమువలన బరువు పెరిగినచో గాంధీజీ పాలు త్రాగుట వ్యర్థమని తెలియుచున్నది. ఇట్టి విద్య గాంధిజీ వద్ద నున్నచో అతడు భారతదేశపు ఆహారసమస్య నెందుకు పరిష్కరింపలేదో? ఉపవాసము వలన బలము, బరువు పెరుగదు. ఆహారము,

పాలు గ్రహింపకున్న గాంధీజీ తన హత్యకన్న ఎంతోకాలము ముందుగానే చనిపోయెడివాడు. ఉపవాసము వలన బరువు పెరిగెననుట అజ్ఞానము.

౧౫ సంవత్సరముల నుండి అన్నపానాదులు గ్రహించలేదని విని నేను మాతా మాణిక్యమ్మను చూడబోయితిని. అప్పటి కనిపించిన దృశ్యమును, నాపైన ఏర్పడిన ప్రభావమును జనుల హితము గోరి ప్రకటించుచున్నాను. ఒకసారి ప్రచారమునకై హైదరాబాదు వెళ్లితిని. అచట ఆమె యోగిని అని వింటిని. మేము ★ రెండు వాహనాలలో ఆమె ఆశ్రమమున కేగితిమి. ఆమెతో మాట్లాడి యోగములో ఆమె విశిష్టతను తెలిసికొనుటకు కొన్ని గంటలు నిరీక్షించితిమి. అపుడు 'మాతాజీ గుహ బయటకు వచ్చినది. దర్శనార్థులు చూడవచ్చును' అని ప్రకటించబడెను. మేము లోని కేగితిమి. మందిరపు గది పైకప్పు మీద కూర్చున్న ఆమెను చూచితిమి. జనులు ఇష్టానుసారము ఆమెకు నమస్కరించు చుండిరి. మేము గూడ నమస్కరించితిమి. 'రండి. కూర్చోండి. మీ రాకకు కారణ మేమి?' అనియైన అనలేదు. ఇట్టి కనీస శిష్టాచారమునైనను పాటింపని ఆమె యోగిని ఎట్లగునని నాకనిపించినది. సంన్యాసి, బ్రహ్మచారులు, ఉపదేశకులు, వయోవృద్ధులు క్రింద నిలబడియున్నారు. ఆమె గది కప్పుపైన కాకివలె కూర్చొనియున్నది. క్రిందికి వచ్చి వీరందరిని కూర్చొనుడని ఒక వాక్యమైనను ఉచ్చరించ లేదు. మేము చాల సేపటివరకు అట్లే నిలబడి యుంటిమి. ఆమె తన కార్యకర్తలతో మాట్లాడుచుండెను. ★★ ఆమె వారితో మాట్లాడు విషయమేమి టని నేనడిగితిని. ఆమె ఆశ్రమమునకు సంబంధించిన చిన్న విషయముల గూర్చి ముచ్చటించుచున్న దనిరి. అది విని నా కాశ్చర్యము కలిగినది. ఏలన ఢిల్లీ, హరయాణా మున్నగు ప్రాంతముల నుండి వచ్చిన మేము కావలివారివలె నిలబడి ఆమెను కలిసికొని మాట్లాడుటకు ఆశతో చూచుచుంటిమి. కాని ఆమెకు తన ఆశ్రమములోని నిలబడి వస్తువుల గూర్చిన చింతయే పీడించుచున్నది. ఇంతలో సూర్యుడస్తమించెను. జనులు ఆమె గదిముందుకు చేరుకొనిరి. ఆమె పైనుండి గుడిలోని కేగెను. ★★★ అప్పుడు ఆమెకు ఆరతివ్వడం మొదలాయెను. 'మాణిక్యమ్మా నమోనమః' అని పాడుచు స్త్రీపురుషు లందరు తన్మయు లగుచుండిరి. వీరు మాణిక్యమ్మ స్తుతిప్రార్థనోపాసనలనే చేయుచున్నారు. ప్రతిదినమిట్లే జరుగుచుండును అని తెలిసినది. ''మానవుని ఉపాసన జరిగినచో యోగి దానిని వ్యతిరేకించును. వ్యతిరేంచనివాడు యోగి కాడు. ఇచట జనులు మాణిక్యమ్మ స్తుతి ప్రార్థనోపాసనలోనే తల్లీను లగుచున్నారు. సచ్చిదానందేశ్వరుని మరచిపోవుచున్నారు. ఐనను మాతాజీ వారికి 'నేను ఉపాసనీయురాలను కాను. పరమేశ్వరుడే ఉపాస్య దేవుడు. అతని ఉపాసన వలననే ముక్తి లభించును'. అని ఉపదేశించుట లేదు. కావున ఆమె యోగిని కానేరదని నేను నిశ్చయించుకొంటిని.

★ నేను, పం. వ్రతపాల్, గయాప్రసాద్, వారి కుటుంబం స్వామీజీతో వెళ్లితిమి. (సంపా) ★★ 'అరే! ఆదర్వాజ చిన్నదైపోయిందిరా! అట్లెందుకు చిన్నదైందిర్రా!' మొద. (సంపా.) ★★★ ఆమె గుడిలో ఉండియే బయట ఆరతికొరకు వేచియున్న వారిలో ఒక యువకునితో - (మాణిక్యమ్మ) - అరేయ్! నీకు పెండ్లైనాదిరా? (భక్తుడు) -కాలేదమ్మా. మాణిక్యమ్మ - ఎందుకు చేసుకోలేదురా? భక్తుడు- (మౌనము) (సంపా.)

ఈ కార్యక్రమము జరుగుచుండగనే చీకటాయెను. ఆకాశమున మేఘములు క్రమ్మెను. మాతాజీ మమ్మెప్పుడు కలిసికొనునా? ఆమెతో మాట్లాడు అవకాశ మెప్పుడు లభించునా? అని మేము ఆశతో చూచుచుంటిమి. ఆమె గదిపైనగల ముందటి వసారలోనికి వచ్చి మావైపు చూచినది. మేము గూడ ఆమెను దగ్గరినుండి చూచితిమి. ఆమె శరీరము గూడ భోజనము చేయు ఇతర స్త్రీలవలెనే బలిష్ఠముగ నున్నది. అప్పుడు నేనిట్లనుకొంటిని – ౧౨ సంవత్సరములనుండి వాయువును మాత్రమే భక్షించువారి శరీరము ఇంత బలిష్ఠముగ నుండజాలదు. నాకు అర్థాపత్తి ప్రమాణము గుర్తుకు వచ్చినది. దానికి ఉదాహరణము–'బలిసియున్న దేవదత్తుడు పగలు భుజింపడు' అనగా రాత్రి భుజించునని అర్థము. అట్లే మాణిక్యమ్మ గూడ ఇతరుల ముందు ఏమియు తినదు. రహస్యముగ తప్పక భుజించును★. ఆమె తొందరగనే లోనికి వెళ్లిపోయెను. ఆమెను కలిసికొనగలమనెడి మాఆశ మట్టిలో కలిసిపోయెను. రాత్రి పదిగంటలాయెను. కాని ఆమె మమ్ము కలిసికొనుటకు రాలేదు. హతాశులమై మేము మాస్థానములకు వచ్చి నిదురించితిమి. రాత్రి ఆమె తన ప్రియభక్తులను పిలిపించుకొని మాట్లాడినదని జనులు తెలిపిరి. ఈ దృశ్యముల జూచి ఆమె యోగిని కాదు. ౧౨ సం. ల నుండి వాయువును మాత్రమే భక్షించి జీవించు చున్నదనునది మిథ్య. ఇది అజ్ఞానులు, స్వార్థపరులునైన వారి మోసము మాత్రమే. అని నేను నిశ్చయించుకొంటిని.

యోగులు వాయువును భక్షించియే జీవింతురను నమ్మకమును యుక్తిప్రమాణములతో ఖండించితిని. విద్వాంసులు సత్యాసత్యముల నెఱిగి సత్యమండనము అసత్య ఖండనము చేయగలరని ఆశించుచున్నాను.

★★★

★ ౧. ఒక (ఏర్పేడు వ్యాసాశ్రమము కావచ్చు) ఆశ్రమములో కొన్ని సం॥లు పని చేసి ఈ గురుకులానికి వచ్చిన ఒక వ్యక్తి మాణిక్యమ్మ గురించి కొన్ని విషయములు తెలిపియుండెను. ఆమెఅక్కగూడ ఆమె వెంటనే ఉండునని, మాణిక్యమ్మకు ఆమె జన్మస్థలమునుండి మధ్యరాత్రిలో భోజనపదార్థము లందించబడుచుండెనని తెలిపినాడు. ఒకనాడు మాణిక్యమ్మ ఉండు గుహలోనికి ఆమె అంతరంగ భక్తులు వెళ్లునపుడు తానుగూడ వెళ్లినాడని అక్కడ ఉన్న పండ్లను చూచి అవి అక్కడెందు కున్నవని అడుగ, వారు సమాధాన మివ్వక కోపమున అతనిని బయటకు గెంటివేసినారని తెలపినాడు. ౨. ఒకసారి దేవరకదర స్టేషనులో ఇద్దరు వ్యక్తులు పరిచయమైరి. వారు నారాయణపేటలో కుట్టుపని చేయుదురట. వారు యానగొందికి సమీపముననే ఉందురు. కావున వారికి తెలియునని మాణిక్యమ్మ గురించి సత్యమును తెలిసికొనుటకు అనేక ప్రశ్నలడిగితిని. ఆమెగురించి ప్రచారము చేయబడిన మాటలు బూటకములని వారనిరి. వారి చిరునామాలు వ్రాసికొనియుంటిని. ౩. కొడంగల్ నివాసియైన వెంకటరెడ్డి ఒకసారి నాతో మాణిక్యమ్మ గురించి ప్రచారము చేయబడిన మాటలు నిజము కావని అన్నాడు. అతని మేనమామయే ఆమెకు సంరక్షకుడని ఆమె గురించి ఏమి తెలిసికొనవలె నన్నను అతనిద్వారానే తెలియునని చెప్పినాడు. (సంపా)

౧౦. స్త్రీలు యోగసాధన కర్హులు కారా?

యోగము నభ్యసించుటకు స్త్రీకి అర్హత లేదని కొందరి అభిప్రాయము. ఈ నమ్మకము సత్యమా? అసత్యమా? అని నిష్పాక్షికముగా ఆలోచింతము. ఋషి దయానందుడు ఈ విషయమును పరీక్షించి పక్షపాతము వీడి ఇట్లు వ్రాసినాడు.

క– ''... వివాహము నిష్టపడనివారు మరణపర్యంతము బ్రహ్మచారులుగ నుండవచ్చును. కాని యిది పూర్ణవిద్వాంసులు, జితేంద్రియులు, నిర్దోషులు, యోగులునైన స్త్రీ పురుషులకే సాధ్యము. (సత్యార్థప్ర. 3వసము.)

ఖ– ''స్త్రీగూడ ఇట్లే యోగాభ్యాసము చేయవలెను.'' (సత్యార్థప్ర. 3వసము.)

గ– ''ఇంద్రియముల నిగ్రహింపజాలని వ్యక్తి బ్రహ్మచర్యమునుండి సంన్యాసము గ్రహింపగూడదు. నిగ్రహముగలవాడు, విషయదోషములను, వీర్యము యొక్క గుణములను ఎఱిగినవాడు ఎన్నడును విషయాసక్తుడు కాడు. అతని వీర్యము ఆలోచనాగ్నికి ఇంధనమువంటిది. అది దానియందే వ్యయ మగును. రోగికే వైద్యుడు, ఔషధము లవసరము, ఆరోగ్యవంతున కవసరము లేదు. అట్లే విద్యావృద్ధి, ధర్మవృద్ధి, ప్రపంచమునకు ఉపకారము చేయగోరు స్త్రీపురుషులు వివాహమాడగూడదు. పంచశిఖాది పురుషులు, గార్గ్యాది స్త్రీలు వివాహమాడలేదు. కావున యోగ్యులైనవారే సంన్యాసులు కాదగును. అయో గ్యులు సంన్యాసులైనచో తాము చెడెదరు. ఇతరులను చెఱిచెదరు.'' (సత్యార్థప్ర. ౫ వసము.)

పురుషునివలెనే స్త్రీగూడ యోగము నభ్యసించి ముక్తిని పొందగల్గు నని పై ప్రమాణములవలన స్పష్టమగుచున్నది. కావున యోగమును సాధించగల సామర్థ్యము స్త్రీపురుషు లిరువురి యందును గలదు. స్త్రీ శరీరమునగల జీవాత్మ యోగాభ్యాసము చేయజాలదనువారు అజ్ఞానులు, స్వార్థులు.

బృహదారణ్యకోపనిషత్తునందు మైత్రేయీ యాజ్ఞవల్క్యుల సంవాదము గలదు. అందు యాజ్ఞ వల్క్యుడు మైత్రేయితో ''ఓ మైత్రేయీ! నిస్సందేహముగ నేను ఉన్నతిని బడయనున్నాను. కావున మీ యిరువురి అనుమతిని కోరుచున్నాను'' అనెను.

''సా హోవాచ...'' ''హే భగవన్! ధనముతో కూడిన భూగోళమంతయు నాకు లభించిన యెడల మోక్షము ననుభవింపగలనా?'' – అని మైత్రేయి ప్రశ్నించెను.

అందుకు యాజ్ఞవల్క్యుడు ''లేదు. ధనసంపత్తి మున్నగు సాధనము లున్నవారి వలెనే నీ జీవి తముగూడ ఉండగలదు. ధనముద్వారా మోక్షము నాశించలేము.'' అనెను.

''సా హోవాచ...'' అది విని మైత్రేయి ''దేనివలన నేను అమరత్వమును పొందజాలనో దానిని నేనేమి చేసికొందును? భగవన్! మీకు తెలిసిన విషయమునే నాకు ఉపదేశింపుడు'' అని కోరెను.

అందుకు యాజ్ఞవల్క్యుడు ''ఆత్మా వా అరే...'' (బృహదా. ౪–౨) ''ఓ మైత్రేయీ! నిశ్చిత ముగా ఆత్మయే చూడదగినది. వినదగినది. ఆలోచించదగినది. నిదిధ్యాసము చేయదగినది. ఆత్మను

దర్శించుటవలన వినుటవలన, ఆలోచించుటవలన, విజ్ఞానమువలన ఇదంతయు నిశ్చయముగా తెలియును'' అనెను.

మైత్రేయి మోక్షమును గోరి యాజ్ఞవల్క్యుని మోక్షమార్గమును గూర్చి అడిగెనని ఈ సంవాదము వలన తెలియుచున్నది. అత డామెను మోక్షాధికారిణి యని గ్రహించెను. ''లౌకిక ధన సంపదలవలన మోక్షము లభించదు. భగవంతుని శ్రవణమనననిదిధ్యాసనసాక్షాత్కారముల వలన ముక్తి లభించును.'' అని ఉపదేశించెను. స్త్రీలు యోగమున కర్హులు కారేని మైత్రేయికి మోక్షమార్గము నుపదేశించుట వ్యర్థ మే కదా? ఏలన బుద్ధిమంతులు సంభవమగుదానినే ఉపదేశింతురు. అసంభవము నుపదేశింపరు.

బృహదారణ్యకోపనిషత్తు (3-౮-౧) లో గార్గీయాజ్ఞవల్క్యుల సంవాద మిట్లు గలదు- ''**అథ హ వాచక్నవ్యువాచ బ్రాహ్మణా...**'' పేరుగాంచిన వాచక్నవీగార్గి వాదానంతర మిట్లనెను. ''ఓ బ్రాహ్మణోత్తములారా! మీ యనుమతి యగుచో నేను వీరిని రెండు ప్రశ్న లడిగెదను.''

గార్గి యడిగిన రెండు ప్రశ్నలకు యాజ్ఞవల్క్యుడు సమాధాన మొసగెను. అప్పుడు ''**సా హోవాచ బ్రాహ్మణా...**'' (బృహ. 3-౮-౧౨) ''ఓ బ్రాహ్మణులారా! యాజ్ఞవల్క్యుడు నేనడిగిన రెండు ప్రశ్నలకు సమాధానమొసగినచో మీలో నుండి ఎవరును ఈ బ్రహ్మవేత్తను ఎన్నటికిని గెలువజాలరని అంటిని. ఈ మాటయే మీకు చాలు. కావున వీరికి నమస్కరించి వైదొలగుడు.'' అని వాచక్నవి మౌనము వహించెను. గార్గి యోగవిద్యలో అత్యంత నిపుణురాలని ఈ సంవాదమువలన స్పష్టమగు చున్నది. ఏలన అందరి విద్వాంసులమధ్య ''నేను రెండుప్రశ్న లడిగెదను. వాటి కీతడు సమాధాన మొసగినచో మీలో నెవ్వరును వీరిని ఓడింపజాల'' రని యోగ్యత లేనిదే నిర్ణయించజాలదు.

ప్రశ్న:- స్త్రీలకు వేదపఠనాధికారమే లేదని కొందరి యభిప్రాయము. వేదమును చదువకయే యోగము నెట్లభ్యసించగలరు? ఏలన నియమములందు స్వాధ్యాయము అనగా మోక్షశాస్త్రములను చదువుట, ఓమ్‌ను జపించుట విధింపబడినది గదా?

ఉత్త:- ★ ఋషి దయానందుడు సత్యార్థప్రకాశము మూడవ సముల్లాసమున ఇట్టి మూఢ నమ్మకములను ఖండించినాడు. అందు ''**యథేమాం వాచం...**'' (యజు.౨౬-౨) అను మంత్రమున కర్థము వ్రాసినాడు. దానిద్వారా స్త్రీలకే కాదు మానవులందరికి వేదము చదువు అధికారము కలదని నిరూపించినాడు. సామాన్యముగ స్త్రీలకు వేదాధికారము లేదనువారే స్త్రీలు యోగమునకు అర్హులు కారందురు. ఓమ్, గాయత్రీ మున్నగు మంత్రములను జపించుటవలన స్త్రీలు విధవలగుదు రందురు. స్త్రీలు వీనిని జపించగూడ దందురు. ఇవన్నియు ప్రమాణ విరుద్ధములు, నమ్మదగినవి కావు. యోగము, సాంఖ్యము, న్యాయము, వైశేషికము మొదలగు శాస్త్రములందు మానవులు యోగము నభ్యసింప

★ ఇటువంటివారే స్త్రీలలో ఆత్మలేదని, వారు ఎల్లప్పుడు దండన కర్హులని నమ్ముదురు. వారిని సమాజములో రానివ్వక గుప్తముగా నుంతురు. పురుషులకు కీలుబొమ్మలుగా భావింతురు (సంపా.)

వలెను విధానము కలదు. వాటి యందెచ్చటను స్త్రీలు యోగమునకు అర్హులుకారని వ్రాయబడలేదు.

ప్రశ్న:- శంకరాచార్యుడు "ప్రశ్నోత్తరి"లో "ద్వారం కిమేకం నరకస్య? నారీ", "కా శృంఖలా ప్రాణభృతాం హి? నారీ" - స్త్రీ నరకమునకు ద్వారము, ప్రాణులను బంధించు గొలుసు-అని వ్రాసినాడు. అతడు మహాయోగి. అతని వ్రాత ననుసరించి స్త్రీ యోగమును సాధింపజాలదు?

ఉత్త:- శంకరాచార్యుడు యోగి యనుటలో ప్రమాణము లేదు. యోగవిషయమున అతనిని ప్రమాణముగా గ్రహింపజాలము. అతడు జీవుడు, బ్రహ్మ ఒకటే యనును. ఈశ్వరుడు, జీవుడు, ప్రకృతి-మూడు స్వతంత్రపదార్థములు. వీటిని ఒకటిగా నమ్మువాడు ఇంతవరకు యోగమును సాధించలేదు. ఇప్పుడు సాధించుట లేదు. ఇక ముందు సాధింపజాలడు. ఇందెట్టి సందేహము లేదు. కావున శంకరాచార్యుని యోగి యనుకొనుట అజ్ఞానమే. ఇందుకు "విపర్యయో మిథ్యాజ్ఞానమతద్రూప ప్రతిష్ఠమ్" (యోగ.౧-౮) (దీని అర్థము పుట ౧౩లో చూడుడు) అను సూత్రము ప్రమాణము. జీవుని బ్రహ్మ యనుకొనుట అవిద్య. ఈ యవిద్య ఉన్నంతవరకు ఎవడును యోగి కాజాలడు. స్త్రీని నరకమునకు ద్వారమనుట, ప్రాణులను బంధించు గొలుసు అనుట శంకరాచార్యుని పొరపాటు. మనుమహర్షి స్త్రీ గౌరవము నిట్లు చాటినాడు-

యత్రనార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః।
యత్రైతాస్తు న పూజ్యంతే సర్వాస్తత్రాఽఫలాః క్రియాః॥ మను. 3-౫౬॥

అర్థము- స్త్రీలు గౌరవింపబడుచోట విద్వాంసులు విహరింతురు. గౌరవింపబడనిచోట సమస్త శుభకర్మలు నిష్ఫలము లగును.

ఇంకను తల్లి మహత్త్వము నిట్లు చాటినాడు-

ఉపాధ్యాయాన్దశాచార్య ఆచార్యాణాం శతం పితా।
సహస్రం తు పితౄన్మాతా గౌరవేణాతిరిచ్యతే॥ మను. ౨-౧౪౫॥

అర్థము- ఉపాధ్యాయునికంటె ఆచార్యుడు పదిరెట్లు గౌరవనీయుడు. ఆచార్యుని కన్న తండ్రి వందరెట్లు, తండ్రికన్న తల్లి వేయిరెట్లు గౌరవించదగినది.

శతపథ బ్రాహ్మణముగూడ తల్లికి ప్రథమస్థాన మొసగినది.
"మాతృమాన్ పితృమానాచార్యవాన్ పురుషో వేద"

ధార్మిక విద్వాంసులైన తల్లిని, తండ్రిని, ఆచార్యుని కలిగియున్న బాలుడు మహావిద్వాంసుడగునని తాత్పర్యము. ఇచట తల్లి ప్రథమ గురువుగా పేర్కొన బడినది. కావున స్త్రీ నరకమునకు ద్వారమనుట కల్పనయే.

ప్రశ్న:- స్వామీ విద్యానంద విదేహ 'పరమయోగము' అను పుస్తకము (పుటలు ౯,౧౦)లో 'స్త్రీ పరమయోగమును సాధించుట సర్వథా అసంభవము. ఏలన ఆమె శరీర రచనయే అట్లున్నది. పరమయోగ సాధనకు అవసరమగు కుండలినీ, వీర్యము, ఓజస్సు, బ్రహ్మ సూత్రము అను తత్త్వములు పురుషులందే గలవు. స్త్రీలలో లేవు'. అని వ్రాసినాడు.

ఉత్త:- పురుషుని శరీరములో 'కుండలిని' గలదనుటకు, స్త్రీ శరీరములో లేదనుటకు ప్రమాణము లేదు. విద్యోత్తమాదేవి (ఇపు డీమె సంన్యాసిని) తన 'కుండలిని' జాగృతమైన దని చెప్పినట్లు వింటిని. స్త్రీ శరీరమున కుండలిని ఉండదని విద్యానంద విదేహ వ్రాసినాడు. పరస్పర విరుద్ధములైన ఈ యిద్దరి మాటలలో ఏది సత్యమో బుద్ధిమంతులు నిర్ణయింతురు గాక! ఇద్దరి మాటలు అసత్యములే యని నాకు తోచుచున్నది. నేను యోగదర్శనమును, దాని వ్యాస భాష్యమును చదివితిని. ఈ కుండలిని వర్ణన గాని, యోగమునకు దాని అవసరము గాని అందెచ్చటను నాకు కనిపించలేదు. ★ కాని హఠ యోగ ప్రదీపికలో దాని వర్ణన గలదు. ఋషి దయానందుడు హఠయోగ ప్రదీపికను అనార్షగ్రంథ మని ఖండించినాడు. (దీనిని గురించి చివరి అధ్యాయమున విస్తారముగా వ్రాసినాను.)

ఓజస్సును గురించి ఆలోచింతము. ఆయుర్వేదమున నిట్లు గలదు.

యేనౌజసా వర్తయంతి ప్రీణితాః సర్వజంతవః॥
యదృతే సర్వభూతానాం జీవితం నావతిష్ఠతే ॥ చరక. సూత్ర. 30-౯॥

అర్థము-సమస్త జంతువులు ఓజస్తత్త్వము ద్వారా తృప్తిని పొంది జీవించును. అది లోపించి నపుడు జీవించజాలవు. ఈ శ్లోకమున స్త్రీపురుషప్రాణు లన్నిటి శరీరములలో ఓజస్సుండు నని, దాని సహాయముననే అవి జీవించియుండు నని, అది లేకున్న మృత్యువు సంభవించు నని స్పష్టముగా తెలుపబడినది.

''అష్టమే మాసి గర్భశ్చ మాతృతో గర్భతశ్చ మాతా రసవాహినీభిః సంవాహినీభిర్ముహుర్ముహురోజః పరస్పరత ఆదదాతే గర్భస్యాసంపూర్ణత్వాత్. తస్మాత్తదా గర్భిణీ ముహుర్ముహుర్ముదా యుక్తా భవతి ముహుర్ముహుశ్చ గ్లానా తథా గర్భః. తస్మాత్తదా గర్భస్య జన్మ వ్యాపత్తి మద్భవత్యోజసో ఽనవస్థితత్వాత్। తం చైవమభిసమీక్ష్యాష్టమం మాసమగణ్యమిత్యాచక్షతే కుశలాః॥ చరక. శారీర స్థానం ౪-౨౪॥

అర్థము - ఎనిమిదవమాసమున తల్లి హృదయమునుండి గర్భము (శిశువు) లోనికిని గర్భము నుండి తల్లి హృదయములోనికిని రససంవాహినీనాడులద్వారా ఓజస్సు వచ్చుచు పోవుచు నుండును. శిశువు శరీరము పూర్ణము కాకపోవుటవలన ఇట్లు జరుగును. కావుననే తల్లి ఎనిమిదవ మాసమున మాటిమాటికి సంతోషముగను అసంతోషముగను కాననగును. ఓజస్సు గర్భము (శిశువు) లోనికి పోయి

★ యోగమునకు సాధనరూపములో ఈ 'కుండలిని' పేరు యోగదర్శనములో, వ్యాస భాష్యములో ఎచ్చటను కనిపించదు. యమనియమాది యోగాంగములలో దీని గణనయే లేదు. మూడవ పాదములో అనేక విభూతుల వర్ణన గలదు. వాటిలోను కుండలిని, దాని జాగరణ అనబడు సిద్ధి ఎచ్చటను కనబడుటలేదు. (సంపా.)

సపుడు తల్లి అసంతోషముగ కనిపించును. ఓజస్సు తిరిగి తల్లి హృదయమున ప్రవేశించగానే ఆమె ప్రసన్నతను పొందును. అట్లే గర్భమున ఓజస్సు ఉన్నప్పుడు గర్భము ప్రసన్నముగ నుండును. ఓజస్సు తల్లిలో ప్రవేశించగనే గర్భము అప్రసన్నముగ నుండును. ఎనమిదవనెలలో జన్మించిన శిశువు జీవించుట కఠినము. కారణము- ఓజస్సు స్థిరముగా నుండకపోవుటయే. కావున నిపుణులైన వైద్యులు ఎనమిదవ నెలను ప్రసవమునకు తగినదిగా గుర్తింపరు. అనగా ప్రసవ యోగ్యము కాదని భావింతురు.

ఈ ప్రమాణమువలన స్త్రీ శరీరములోగూడ ఓజస్సుండునని ఋజువగుచున్నది. కావున స్త్రీలలో ఓజస్సు ఉండదను మాన్యత ప్రకరణవిరుద్ధము, అగ్రాహ్యము. ఈ మాన్యత నంగీకరించి నందున ఎన్నియో నష్టములు వాటిల్లినవి. అందులో కొన్ని-

౧. మానవజీవితమునకు ముఖ్యోద్దేశ్యమైన యోగసాధనను స్త్రీజాతి వదలివేసినది. ఏలన స్త్రీ యోగమును సాధింపజాలదను భావము ఆమె మనసులో స్థిరపడిపోయినది.

౨. స్త్రీ యోగవిద్యను ఎఱుగని కారణమున ఆమె సంతానమునకు యోగమును సాధించుట అతి కఠినమైపోయినది. దాని ఫలితముగ ఆమె సంతానముగూడ యోగము వలన కలుగు ఆనందమునకు దూరమైనది. విషయరూప దుఃఖసాగరమున మునిగి పోయినది. నేడిది ప్రత్యక్షము.

౩. స్త్రీలకు యోగ విద్యాజ్ఞానము లేదు. దీని నాధారముగా జేసికొని అజ్ఞానులు, స్వార్థులు స్త్రీలను సులభముగా మోసగించుచున్నారు. వారిని శిష్యులుగా జేసికొని వారి ధనసంపదలను దోచు కొనుచున్నారు. మహావైభవముగా జీవించుచున్నారు. నేడు భగవంతుని అవతారమను పేరుతో ప్రసిద్ధి కెక్కినవారికి స్త్రీలే ముఖ్య కారకులు.

(హంసావతారము; అతని కొడుకు సత్యపాల్ బాలయోగీశ్వరుడు; రజనీశ్ మొదలగువారు ఈ కోవకు చెందినవారే - సంపా.)

ఈ పరమయోగము ఏ వేదములో, ఏ శాస్త్రములో వర్ణింపబడినదో దీనిని పుట్టించినవారే తెలుప వలెను. మహర్షి పతంజలి యోగశాస్త్రములో దీనిని పేర్కొన లేదు. మరచిపోయినాడా? కొందరు తమను గొప్పగా ప్రకటించుకొనుటకు ప్రాచీన ఋషులు వీటిని తెలుప లేదని చాటుచుందురు. ఈ విషయములను నేను సూక్ష్మముగా పరిశీలించితిని. ఋషులు పొరపాటు చేసినారని వీరిట్లు మిథ్యా ప్రసారము చేయుదురు. అమాయక జనులను తమ వలలో చిక్కించుకొందురు. వారి ధన సంపదలను కొల్ల గొట్టుదురు. విలాసజీవితము ననుభవింతురు. ఇట్టి స్వార్థుల నిరాధారములైన మాటలను నమ్మవలదు. మోసపోవలదు. వేదము, వేదానుకూలములగు ఆర్షగ్రంథములను ఆధారముగా గొని యోగము నభ్యసించుచుండవలెను.

★★★

౧౧. ఈశ్వరుని సాక్షాత్కరించుకొన్నవారి లక్షణము లివియేనా?

శ్రీ రణవీర్ రచించిన ''శ్రీ ఆనందస్వామీ సరస్వతి జీవిత చరిత్ర''ను చదివితిని. అందు యోగము పేర వ్రాయబడిన అనేక విషయములు వేదమునకు, ఆర్ష గ్రంథములకు, ప్రత్యక్షాది ప్రమాణములకు విరుద్ధములు. దానిని చదివి ఇంత వరకే అనేకులు భ్రాంతికి లోనైనారు. ఇక ముందు ఇంక నెందరు కానున్నారో!

౧. శ్రీ ఆనందస్వామి ఈశ్వరసాక్షాత్కారము పొందినాడని, అతనివంటి యోగి ఆర్యసమాజమున మరొకడు లేడని కొందరు నమ్ముదురు. ఆయన ఈశ్వరసాక్షాత్కారము పొందెనా లేదా అని నిష్పాక్షికముగ పరిశీలింతము.

శ్రీ ఆనందస్వామికి ఈశ్వరసాక్షాత్కారము చేయించినవాడు బ్రహ్మచారీ వ్యాసదేవ (స్వామీ యోగేశ్వరానంద).

''నేను ప్రభునామమును వింటిని. అతని మహిమను తెలిసికొంటిని. ఇపుడు చూడదలచితిని'' అంటిని. బ్ర. వ్యాసదేవ చిరునవ్వుతో ''నేను చూపించగలను. నేటి రాత్రి మనమిరువురము కూర్చుందము. నీవు ప్రభువును ప్రత్యక్షముగ చూడగలవు'' అనెను.

అటుపైన ఏమిజరిగినదో... కాని ఆరాత్రి పూజ్య స్వామీజీ ''జన్మజన్మాంతరములలో నేను దర్శింపదలచినవానిని దర్శించితిని'' అని నాకు తెలిపెను. (పుట ౩౦౬).

సమీక్ష- దీనివలన స్వామీజీ ఈశ్వరసాక్షాత్కారము పొందెనని, అతనికి ఈశ్వరుని సాక్షాత్కారింపజేసినవాడు స్వామీ యోగేశ్వరానంద అని స్పష్టమగుచున్నది.

శ్రీ ఆనందస్వామి ఈశ్వరసాక్షాత్కారమును పొందిరనుట నిరాధారము. ఏలన ఇతనికి సాక్షాత్కారింపజేసిన గురువు స్వామీ యోగేశ్వరానందుడు యోగ విషయమున భ్రాంతిలో నున్నాడు. అజ్ఞానాంధకారమున మునిగి, ఈశ్వరజీవప్రకృతుల విషయమున విరుద్ధభావములు కలిగియున్నవారు ఇతరులకు ఈశ్వరసాక్షాత్కార మెన్నటికిని చేయించజాలరు. ఈ విషయమున ౪౭, ౪౮ పుటలలో కొంత వ్రాయబడినది.

ఈశ్వర జీవ ప్రకృతుల విషయమున స్వామీ యోగేశ్వరానందుని మాన్యతలు వాస్తవమున కెంత విరుద్ధములో గమనింపుడు.

కొంతకాలము (౨౪ సం.ల) క్రితము నేను వైదిక భక్తి సాధనాశ్రమము (రోహతక్, హరియాణా) యోగేశ్వరానంద స్వామితో మాట్లాడుటకు వెళ్లితిని. ★

అతనితో జరిగిన చర్చవలన, అతని ఉపదేశములవలన అతని మాన్యతలు తెలిసినవి. అవి-

---

★ నేను, స్వామీ యజ్ఞానంద, స్వామీ భీష్మ మొదలగువారము స్వామీజీతో కలిసి వెళ్లితిమి. యోగేశ్వరానందునితో అనేక విషయములు చర్చించితిమి. - (సంపా.)

౧. ఈశ్వరుడు, ప్రకృతి ఈ రెండే అనాది పదార్థములు. జీవుడను పదార్థ మేదియు లేదు. ★

౨. వేదము లీశ్వరీయ జ్ఞానము కావు. అవి ఋషుల హృదయములనుండి వెడలినవి.

౩. ఈశ్వరునిలో ఏ గుణము లేదు. ఈశ్వరుడు సగుణుడు, నిర్గుణుడు అని స్వామీ దయానందుని మాన్యత. కాని ఈమాన్యత అసత్యము.

౪. ఈశ్వరుడు సృష్టికర్త కాదు.

అతడు వేదములకు, ఋషుల గ్రంథములకు విరుద్ధభావములు కలిగియుండెను. అతడు ఈశ్వరుని తెలిసికొనుటకు, తెలుపుటకు ఎట్లు అర్హుడు? కావున శ్రీ ఆనంద స్వామికి ఈశ్వర సాక్షాత్కారము ఐనదనుట భ్రాంతియే.

ఋషి దయానందుడు గూడ యోగియే. ఈశ్వరునికన్న వేరైన జీవుని అస్తిత్వము నత డంగీకరించినాడు. పతంజలిగూడ ఋషియే. అతడు జీవుని అస్తిత్వమును ఈశ్వరునికి వేరుగా అంగీకరించినాడు. కాని ఆనందస్వామికి ఈశ్వరసాక్షాత్కారము చేయించిన వ్యక్తి జీవుని అస్తిత్వమునే అంగీకరింపడు. ఐనను యోగాచార్యుడైనాడు. ఆశ్చర్యము!

ఈశ్వర జీవ ప్రకృతుల గురించి విరుద్ధజ్ఞానము గలవాడు యోగి కాజాలడని మహర్షి పతంజలి ఉద్ఘోషించినాడు. ఈశ్వరుని సాక్షాత్కరించుకొననివాడు ఇతరులకు సాక్షాత్కరింపజేయ జాలడు. ''విపర్యయో మిథ్యాజ్ఞానమతద్రూప ప్రతిష్ఠమ్'' (యోగ. ౧-౮) విపరీత (=విరుద్ధ) జ్ఞానమును విపర్యయమందురు. ఉదాహరణ – త్రాడును సర్పమనుకొనుట. సర్పమును త్రాడనుకొనుట. ఈ విపరీతజ్ఞానమున్నంతవరకు ఏ మానవుడు ఈశ్వరసాక్షాత్కారము చేసికొనజాలడు. ఇతరులకు చేయించ జాలడు. స్వామీ యోగేశ్వరానందుడు జీవుని అస్తిత్వము నంగీకరింపడు. ఈశ్వరుని గుణరహితుడనును. ఇది అతని మిథ్యా జ్ఞానము. అట్టిచో అతడు ఈశ్వర సాక్షాత్కారము నెట్లు చేయించగల్గెను? ఏ వ్యక్తి

★ స్వామీ భీష్మ-స్వామీ (యోగేశ్వరానంద) జీ! మీరు మీ గ్రంథములలో ఈశ్వర జీవప్రకృతులు మూడు అనాది పదార్థములని వ్రాసినారు. ఇప్పుడు జీవుని నమ్మడం లేదు. పరస్పర విరుద్ధములైన మీ రెండు మాన్యతలలో ఏది నిజము?

స్వామీ యోగేశ్వరానంద - నేను మొదట మూడింటిని నమ్మితిని. ఇప్పుడు రెంటినే నమ్ముచున్నాను. ఇదే నిజము.

భీష్మ -దీనిలో ప్రమాణమేమి? యోగేశ్వ-నేను నమ్ముచున్నాను.

భీష్మ - స్వామీజీ! మీ రొకసారి మూడింటిని నమ్మినారు. ఇప్పుడు రెండింటినే నమ్ముచున్నారు. తర్వాత ఒక దానినే నమ్మ వచ్చును. ఆ తర్వాత ఒక దానిని గూడ నమ్మకపోవచ్చును. మీ నమ్మకమునకు ప్రమాణమేమి?

యోగేశ్వ- ఈశ్వరుడు, ప్రకృతి రెండే పదార్థము లున్నవి. వీటనే నేను నమ్ముచున్నాను. -(సంపా.)

తాను త్రోవ నెఱుగడో, తప్పుడు త్రోవ ననుసరించునో ఆ వ్యక్తి ఇతరుల కెన్నటికిని సరియైన త్రోవ చూపజాలడు. ఇవన్నియు అమాయకులను మోసగించుటకు, శిష్యులను చేసికొనుటకు, భోగభాగ్యముల ననుభవించుటకే.

కొందరు ఋషి దయానందుని యోగి యందురు. వారు యోగేశ్వరానందుని గూడ ఈశ్వరుని సాక్షాత్కరించుకొన్న పూర్ణయోగి యందురు. ఒకవేళ ఋషి దయానందుడు ఈశ్వరుని సాక్షాత్కరించుకొనెనేని స్వామి యోగేశ్వరానందుడు సాక్షాత్కరించుకొనియుండడు. యోగేశ్వరానందుడు సాక్షాత్కరించుకొనెనేని ఋషి దయానందుడు సాక్షాత్కరించుకొనియుండడు. దీనికి కారణము యోగవిషయమున వీరిద్దరి విరుద్ధమాన్యతలే★. స్వామీ యోగేశ్వరానందుని నిజమైన యోగిగా భావించి అతనికి శిష్యులైనవారు. తను, మన, ధనములతో అతని మాన్యతలను వ్యాపింపజేయు చున్నారు. వారు వైదికధర్మము గొంతును నులుముచున్నారు. స్వామీ యోగేశ్వరానందుడు అజ్ఞానములో మునిగి యున్నాడు. ఈశ్వరుని సాక్షాత్కరింపజేయజాలడు. ఆనందస్వామికి అతడే ఈశ్వరుని సాక్షాత్కరింపజేసెనట. కావున అదియును మిథ్యయే యని ఋజువగుచున్నది.

౨. సమాధిలో తొడకు మేకు దిగగొట్టినను తెలియదా? ''తొందరగ లేపలేదు. మీరివట కూర్చొని ౨౪గంటలైనది. నేడు రెండవ దినము. మీ కుడికాలును చూడుడు. మీ తొడకు ౬ అంగుళముల మేకు దిగగొట్టబడి ౨౪ గంటలైనది. ఐనను మీకు తెలియలేదు'' (పుట ౨౧౬)

సమీక్ష:-౬ అంగుళముల మేకు తొడకు పైనుండి క్రిందివరకు దిగగొట్టబడెను. రక్తముగూడ భీకరముగ ప్రవహించెను. ఆనందస్వామికి ఎటువంటి సమాధి సిద్ధించెనో! వారి కాసంగతే తెలియలేదు. సమాధిలో మనుష్యునకు జ్ఞానముండును. ౬ అంగుళముల మేకు తొడలో దిగవేసినను ఆ సంగతి తెలియకుండుట ఎన్నటికిని సంభవము కాదు. చనిపోయినవానికి, మూర్ఛితునికి ఇది సంభవమే. కాని సమాధిలో నున్న వానికి మాత్రము కాదు. ఆనందస్వామి ఈమాట అమాయకులను మోసగించునదే.

''ఈశ్వరోపాసకుడు మహా దుఃఖము నైనను సహించుకొనును. భయపడడు.'' అని ఋషి దయానందుడు సత్యార్థప్రకాశము, ఏడవ సముల్లాసమున వ్రాసినాడు. కాలు మొదలగు అవయవములను నరికినను తెలియదని ఎచ్చటను వ్రాయలేదు. తమను యోగులుగా ప్రచారము చేయించుకొనువారు. వారి శిష్యులు అసత్యమును కప్పిపెట్టుటలో అతి చతురులు. ఎవరైనా అడిగెదరేమో అని ''మేకు దిగగొట్టిన గాయపు గుర్తుగూడ వెంటనే మాసిపోయినది.'' అని వ్రాసినారు.

★పరస్పర విరుద్ధములైన రెండు మాటలలో రెండును సత్యము కాజాలవు. ఒకటి సత్యము, రెండవది అసత్యము కావచ్చును. లేదా రెండును అసత్యము కావచ్చును. ఈశ్వర జీవ ప్రకృతులను మూడింటిని స్వతంత్ర పదార్థములుగా ప్రతిపాదించిన మహర్షి పతంజలి, మహర్షి వ్యాసుడు, మహర్షి గౌతముడు మొదలగు ఆచార్యులను ప్రమాణముగా గొని ఆ సిద్ధాంతములను ప్రతిపాదించిన మహర్షి దయానందుడు ఆకోపకు చెందినవాడు. యోగేశ్వరానందుని మాన్యత సత్యమగునేని ఈ ఋషుల మాన్యతలు అసత్యము, ఋషుల మాన్యతలు సత్యమగునేని యోగేశ్వరానందుని మాన్యత అసత్యము. (సంపా.)

౩. ఆగిపొమ్మనగానే వర్షము ఆగిపోవునా? ''నేను స్వామి వద్దకు వెళ్లితిని'' 'మీరు ఈ మేఘములను వర్షింపకుండ ఆపలేరా?' అంటిని. వారు నవ్వుచు ఎందుకని అడిగిరి. కారణము తెలిపి 'వివాహమునకు ఏడు దినములు ముందు, రెండు దినములు తర్వాత వర్షము పడగూడదు' అని అనుమంటిని. వారు నవ్వుచు 'వర్షము పడదు పొ' మ్మనిరి. నిజముగానే ఆ తొమ్మిది దినములు వర్షము కురియలేదు.'' (పుట ౨౬)

సమీక్ష - '' ఆయన అన్నంత మాత్రముననే తొమ్మిది దినములు వర్షము ఆగి పోయినది గదా! మేఘములకు అతడొసగిన ఆజ్ఞ భాక్రా ఆనకట్ట కాదుగదా! మరి తొమ్మిది దినములవరకు వర్షము ఎట్లు ఆగిపోయినది? మేఘములు జడములు గదా? అవి ఆయన ఆజ్ఞను ఎట్లు వినెను? అనుకొన్నప్పుడు వర్షము కురిపించుటకును, ఆపి వేయుటకును ఈశ్వరుడే అతని ఆజ్ఞను పాలించెనా? ఈ వర్షాకాలముననే (౧౨ సం. ల క్రితము) భారతదేశమందలి అనేక రాష్ట్రములలో కుంభ వర్షము కురిసి వేలకొలదిజనులు ధనధాన్య సంపదలను, గృహములను కోల్పోయిరి. వందలకొలది మనుష్యులు పశువులతో సహా మరణించిరి. కాని ఆనందస్వామి మేఘములను ఆజ్ఞాపించి వర్షము నాపలేదు.

ఆనందస్వామి ఇంత పక్షపాతియా? తన కొడుకు కోరగానే వివాహమున కొద్ది పాటి ఆటంకము కలుగునని వర్షమును ఆపివేసెను. కాని ఇతరులకు మరణమువంటి ఆపద సంభవించినను వర్షము నాపలేదు. మిథ్యాయోగుల మహత్త్వము చూడుడు! మేఘములను ఆజ్ఞాపించినంతనే లేదా మంత్రము జపించినంతనే వర్షము ఆగిపోవుననుటకు ప్రమాణ మేమి? ఋషి దయానందుడు కూడ యోగి. అతడు 'మనుష్యుని మాట అటుంచుడు. ఈశ్వరుడు ఆజ్ఞాపించినను సృష్టినిర్మాణము కానేరదు అనెను'. అన్నంతనే వర్షము ఆగిపోయిన దనుట అసత్యము. ఆనందస్వామి మాట నిజమనుకొన్నచో మహమ్మదీయుల ఖుదా 'కున్' అనగానే సృష్టిజరిగె ననుట నిజము కాగలదు. మహమ్మదు చంద్రుని ముక్కలుగా చేసె ననుటయు నిజమే కాగలదు.

౪. గంగలో మునిగి చచ్చిన ముక్తి ★ లభించునా? (క) - ''ఇది పుణ్యతీర్థము ఇచట మరణించిన ముక్తి లభించును.'' (పుట ౨౫౧). (ఖ) - ''తీర్థస్థలమున లేదా తీర్థయాత్రలో మరణించుట కన్న మించిన దేది? దీనివలన ముక్తి లభించును.'' (పుట ౨౫౪)

సమీక్ష- చెఱువులలో, నదులలో దేవాలయముల చెంతగల నీటి గుండములలో స్నానముచేసిన, మరణించిన ముక్తి లభించునేని, ముక్తిని గోరువారు వాటిలో పడి చావవలెను. యమనియమాదులను పాటించు అవసరము లేదు. దీనిని నిజమనుకొనువారు తమ బంధువులతో బాటు నదులలో మునిగి చావవలెను. వెంటనే ముక్తి లభించును! ఆలస్య ముండదు! ఆ జలస్థలములందు మరణించినవారికి ముక్తి లభించునేని అచట చంపబడు లక్షలకొలది జంతువులకు గూడ ముక్తి లభించునా? ఋషి దయానందుడు మహా యోగి. అతడు ఈ జలస్థలములు మిథ్యాతీర్థములు. మనను ముంచివేయునవి

★ ఈశ్వరుని తెలిసికొన్న వారికే ముక్తి. కావున ముక్తుడనగా ఈశ్వరుని తెలిసికొన్నవాడని అర్థము - (సంపా.)

అని ఎందుకు విశ్వసించినాడు? ఆనంద స్వామి లోకైషణలో మునిగియుండనిచో ఇట్టి నిరాధారము లైన మాటలు వ్రాసెడి వాడు కాడు. ఉపదేశించెడివాడు కాడు. అంతేగాదు తన పేర ఇట్టి విషయములు ప్రచారము చేయనిచ్చెడివాడు కాడు.

౫౮. యోగి హస్తరేఖల ద్వారా మృత్యుకాలమును తెలుపగలడా? (ఆనంద స్వామి) - ''పాపము! ఆ బాలుడు చనిపోయెను గదా!'' (రణవీర్) - ''ఔను.'' (ఆనంద.) - '' అతని అరచేతిలో అట్లే వ్రాయబడియుండెను: కావున నేనేమియు అనజాలకపోయితిని. (పుట ౧౧౧)

సమీక్ష-హస్తరేఖలద్వారా మానవుని ఆయువు తెలియునని ఏ వేదములో, ఏ ఆర్షగ్రంథములో గలదో, ఆనందస్వామి తెలుపవలెను. హస్తరేఖలు ఆయువును తెలుపునను గ్రంథములలో పరస్పర విరుద్ధము లున్నవి. కావున అవి ప్రామాణికములు కావు.

మార్గశీర్ష పూర్ణిమ ౨౦౩౧ వి.సం. ఆదివారము నాటి ఆంగ్ల దినపత్రిక 'హిందుస్తాన్ టైమ్స్'లో ఇట్లు వ్రాయబడినది. -''అమెరికాలోని ఇద్దరు వైద్యులు ౫౧ మృతుల హస్తరేఖలను పరిశీలించి నారు. వారి రేఖలకు వారి ఆయువునకు సంబంధమున్నట్లు ఋజువు కాలేదు.'' ఇది ఆనందస్వామి మిథ్యాకల్పన. దీనిని సత్యమని అంగీకరించితి మనుకొనుడు. మరి ఆనందస్వామి ఇంటిపైనుండి జారిపడి చనిపోయిన బాలుని ఎందుకు రక్షించలేదు? యోగులు అత్యంత దయాళురు గదా! ఒక బాలుడు ఇంటిపైనుండి క్రిందపడియో, నీటిలో మునిగియో చనిపోవునని తెలిసినచో సామాన్య వ్యక్తిగూడ తనశక్తిని ప్రయోగించి ఆ బాలుని రక్షించును. కాని ఆనందస్వామి ఆ బాలుని రక్షించ లేదు. బాలుడు చనిపోయిన తర్వాత ''ఇట్లు జరుగునని అతని చేతిలో వ్రాయబడియున్నది. ఇది నాకు తెలిసినను ఇతరులకు తెలుపలేదు'' అని ప్రకటించుట తనను యోగియని ప్రసిద్ధిచేసికొను టకే. మృత్యుసమయమును ఈశ్వరుడు మొదటనే నిశ్చయించునని నమ్మినచో మేఘములను గూడ ఈశ్వరుడు నిశ్చిత మొనర్చి యుంచును గదా! అతడు వర్షము రాకుండ ఆపగల్గినచో మృత్యువును గూడ ఆపవలసి యుండెను. మృత్యువును ఆపలేదు. కావున మేఘములను గూడ వర్షింపకుండ చేయలేదని ఋజువగుచున్నది. మేఘముల నాపగల్గినచో మృత్యువును గూడ ఆపగలుగును. మృత్యు సమయము నిశ్చితమా? అనిశ్చితమా? అను విషయము తెలిసికొగోరినచో ''కాలాకాలమృత్యు మీమాంస'' అనెడు శాస్త్రార్థమును చదువగలరు. ప్రకాశకులు- ఆర్షసాహిత్య ప్రచార ట్రస్టు, ౨ ఎఫ్ కమలానగర్, నయీ దిల్లీ-౭. ప్రమాణ విరుద్ధమైనందున ఈ మాన్యత అసత్యమైనది. పై పుస్తకములో ఈ విషయము సప్రమాణముగ, బుద్ధి సంగతముగ ఋజువు చేయబడినది.

ఒక ఆవు జీవితకాలమున ౪౭౫౬౦౦ మనుష్యులు దానివలన ఉపకారము పొందుదురు. దానిని చంపి తినినచో ఒక తడవ కేవలము ఎనుబదిమంది కడుపు నిండును - అని ఋషి దయానందుడు విశ్వ సించినాడు. ఒకవేళ మృత్యువు నిశ్చితమే యైన లక్షలాది మనుష్యులకు లాభము చేకూరు విషయము నూహించలేము.

ఆనందస్వామి ఇప్పటికి సజీవులే. ★ అతడు కొందరి హస్తరేఖలను చూచి వారి ఆయుఃపరిమాణమును మరియు ఎవరు ఎప్పుడు మరణించనున్నది తెలుపవలెను. అతడు తెలిపినట్లుగనే ఆ వ్యక్తులు మరణించినచో అతని మాట నిజమని నమ్మవచ్చును. అతడు తాను స్వయముగా ఎన్ని సంవత్సరములు, మాసములు, దినములు జీవింపగలడో వెల్లడించవలెను. అతడట్లు చెప్పగలడని ఏ మాత్రము నమ్మకము లేదు. అతడు తనను ఈశ్వరసాక్షాత్కర్తగా ప్రకటించుకొనుటకే ఈవిధముగా ప్రయత్నించినాడు.

౬. ప్రపంచములో జరుగుచున్న సంఘటనలన్నియు సరియైనవేనా? " ఈశ్వరుని యీ ప్రపంచములో జరుగుచున్నదంతయు ప్రతివాని మేలుకొరకే. కీడుకొరకు గాదు." (పుట ౨౨౪).

సమీక్ష- ఎవని యింటనైన దొంగతనము జరిగినచో అది వాని మేలుకొరకు జరిగినట్లేనా? ఋషి దయానందుడు, స్వామీ శ్రద్ధానందుడు, పండిత లేఖరాం, శుకరాజశాస్త్రి, లాలాలాజపత్‌రాయ్, భగత్‌సింహ, రాంప్రసాద్ బిస్మిల్, హరదయాల్ మొదలగువారు హతమార్చబడిరి. వారి హత్య అందరి మేలుకొరకు జరిగి నట్లేనా? ప్రతిదినము ఆవులు, గొఱ్ఱెలు, మేకలు, కోళ్లు మున్నగు లక్షలకొలది ప్రాణులు మాంసాహారులచేత చంపబడుచున్నవి. ★★ ఇది గూడ అందరి మేలుకొరకేనా? ఆనందస్వామి ఈ ప్రశ్నల కెన్నటికిని సమాధాన మొసగజాలడు. యోగి యనిపించుకొనుటకు మిథ్యామాన్యతలను ప్రచారము చేయదగదు.

౭. ఆనందస్వామి భారతదేశములో కూర్చొని రణవీర్ చేసే విదేశయాత్రను చూచి వచ్చుట నిజమేనా? " నేను ధ్యానములో నుంటిని........నీవు (రణవీర్) క్షేమముగ నున్నట్లు చూచి తిరిగి వచ్చితిని." (పుట ౨౩౧, ౨౩౨)

సమీక్ష- ఆనందస్వామి భారతదేశములో ధ్యానము చేయుచుండెను. అతడు విదేశ యాత్ర చేయుచున్న రణవీర్‌ను చూచివచ్చెను. అతని నిట్లడుగవలెను- 'స్వామీ! మీ శరీరము భారతదేశములో నుండెను. మీరేమో ఇచటినుండి వెళ్లి విదేశములో నున్న రణవీర్‌ను చూచివచ్చితిరి. దీని ఉపాయమును మాకు తెలుపగలరా? ఒకవేళ మీరు సూక్ష్మశరీరముతో వెళ్లిపోయినచో మీ స్థూలశరీరము కుళ్లిపోయి నశించవలసి యుండెను గదా? అంతేగాక స్థూలశరీరము లేనిదే సూక్ష్మశరీరముతో కుమారుని ఎట్లు చూచితిరి? ఆ పద్ధతి ఏమిటో తెలుపగలరా? ప్రత్యక్షముగా చూపగలరా? మీరు అట్లు చేసి చూపజాలరేని

★ ఈ వ్యాసము ఆనందస్వామి జీవించియున్నపుడే వ్రాయబడియుండెను. ఇప్పుడు గతించినాడు. (సంపా.)

★★ పంజాబులో, ఇతరచోట్లలో తీవ్రవాదులద్వారా జరుపబడు హత్యలు అందరి మంచి కొరకేనా!? పదార్థములలో కలగలుపులు చేయబడుచున్నవి. శుద్ధమైన పాలు, నేయి, నూనె మున్నగునవి దొరకడం లేదు. ఇది అందరి మంచికొరకేనా? కలగలుపులు చేసేవారు సర్వప్రాణుల మేలుకొరకే చేయుచున్నారా? - (సంపా.)

ఇది మీ మిథ్యాడంబరమే యగును. దీనివలన ఆర్యసమాజమునకు గొప్పహాని కలుగుచున్నది. ★

౮. ఒక దేశములోనున్న వ్యక్తి మాటలు మరొక దేశములోనున్న వ్యక్తికి వినిపించునా? రణవీర్ విదేశములో నున్నాడు. ఆనందస్వామి భారతదేశములో, రణవీర్‌ను కాలువలో పడకుండ రక్షించుటకు ఆనందస్వామి ''రణవీర్! ఆగుము! ముందు కేగకుము!'' (పుట ౨౩౪) అని అన్నమాటలను విదేశములోనున్న రణవీర్ వినెను.

<u>సమీక్ష</u> - ఇది ఖుదా మరియు ఫరిస్తాలవంటిదే. రణవీర్ విదేశములో, ఆనందస్వామి భారతదేశములో, రణవీర్ కాలువలో పడకుండ ఆనన్దస్వామి హెచ్చరించు చున్నాడు. ఆ మాటలను రణవీర్ విన్నాడు. స్వామీజీ రణవీర్‌కు ఏ సాధనముద్వారా వినిపించినాడు? అతడు విదేశములో నున్న ఏ భారతీయునితోనైనను మాట్లాడి చూపవలయును. అట్లు చేసినచో అతని మాట సత్యము. లేనిచో అసత్యమే.

యోగము పేర వ్యాపించిన సిద్ధులు సత్యమేనా?

ఆనందస్వామి జీవిత చరిత్రలోని కొన్ని ఘట్టములను సత్యాసత్య నిర్ణయము కొరకు సమీక్షించితిని. ఆనందస్వామి గురువు యోగేశ్వరానందుడు గురుశిష్యుల మాన్యతలను ఇచట స్థాలీపులాక న్యాయముగా సమీక్షించితిని.

అజ్ఞానములో నున్న యోగేశ్వరానందుడు ఆనందస్వామికి ఈశ్వర దర్శనము చేయించెననుట నిరాధారమైనది. 'ఈశ్వరసాక్షాత్కారము పొందినవారు ఇట్టి మిథ్యా విషయములను వ్రాయజాలరు. ఉపదేశింపజాలరు.' అని ఋజువైనది. కావున ఆనంద స్వామికి ఈశ్వరసాక్షాత్కారమైనదనుమాట సర్వథా అసత్యమే.

★★★

౧౨. యోగము పేర వ్యాపించిన సిద్ధులు సత్యమా? మోక్షమున కవసరమా?

యోగముపేర ప్రచలితమైన సిద్ధులు సత్యమా? అసత్యమా? అవి మోక్షమున కవసరమా? కాదా? అను జిజ్ఞాస యోగసాధకులలో ఉదయించును. దాని గురించి ఇచట ఆలోచింతము-

---

★ ఈ విధముగా చేయుచు అనేక మతములను సృష్టించినారు. ఈనాడు మానవ సమాజమునకు ఈ మతములవలన ఎంతహాని కలుగుచున్నదో ఊహించలేము. ఆర్యసమాజములో గూడ కొన్ని మతములు తల యెత్తుచున్నవి. ఉదాహరణకు- స్వామీ యోగేశ్వరానంద శిష్యుల దొక మతము. మహాత్మా ప్రభుఆశ్రితుల శిష్యులది మరొక మతము. ఆనందస్వామి శిష్యుల దొక మతము. ఈశ్వరీ ప్రసాద్ ప్రేమ్ శిష్యుల దింకొక మతము - (సంపా.)

యోగము పేర వ్యాపించిన సిద్ధులు సత్యమేనా?

సిద్ధులన్నియు సత్యమని, మోక్షమున కవసరమని కొందరు నమ్మెదురు. (మరి కొందరు అన్ని సిద్ధులు సత్యము కావందురు. సత్యమైన అన్ని సిద్ధులు గూడ మోక్షమునకు అవసరము లేదందురు.) ఈ విషయము నాలోచించుటకు ముందు సిద్ధిశబ్దమునకు అర్థము తెలిసికొను టవసరము.

యోగదర్శనము ననుసరించి యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణా, ధ్యాన, సమాధులను నవి ఉపాసనకుగల ఎనమిదంగములు, ఈ యెనిమిదంగములలను విధిపూర్వక ముగ అనుష్ఠించినవానికి బహువిధ బలము, జ్ఞానము, సుఖము, సహనశక్తి మున్నగునవి ప్రాప్తించును. వీనిని యోగమున సిద్ధులు- విభూతులు అందురు. ఉదాహరణకు-

''బ్రహ్మచర్య ప్రతిష్ఠాయాం వీర్యలాభః (యోగ. ౨-౩౮).
బ్రహ్మచర్యపాలనవలన శరీరబలము, బుద్ధిబలము పెంపొందును.

''సమాధిసిద్ధిరీశ్వరప్రణిధానాత్'' (యోగ. ౨-౪౫)
ఈశ్వర ప్రణిధానమువలన సమాధి సిద్ధించును.

''యోగాంగానుష్ఠానాదశుద్ధి....'' (యోగ. ౨-౨౮) - ఎనమిది యోగాంగముల నను ష్ఠించుటవలన అవిద్య నశించును. వివేక పర్యంతము జ్ఞానము పెంపొందును.

''కంఠకూపే క్షుత్పిపాసానివృత్తిః'' (యోగ. 3-30) - కంఠకూపమున సంయమ★ మొన ర్చుటవలన కొంత సమయమువరకు ఆకలిదప్పులు నివృత్తి యగును.

ఇదేవిధముగ మనస్సు, ఇంద్రియములు వశమగుట; శీతోష్ణములను మానాపమానములను సహించు శక్తి మరియు మోక్షసుఖము లభించుట మొదలగునవన్నియు సిద్ధులు. ఇవి సత్యము. వీనిని సాధించుట ప్రతివానికి పరమధర్మము.

యోగసిద్ధుల పేర అనేక మూఢనమ్మకములు వ్యాపించినవి. ఉదాహరణకు:

౧. యోగి పరమాత్మునివలె సర్వజ్ఞుడగును. సృష్టిస్థితిలయములగూడ చేయగల్గును.

౨. కేవలము గాలిని పీల్చుకొనియే జీవించును. మలమూత్రములను గూడ విసర్జింపడు. ఇదే స్థితిలో మోక్షమును పొందును.

3. స్థూలశరీరమును సూక్ష్మముగా మార్చుకొని రాతిలో ప్రవేశించును. తత్కాలమే బయటకు వెడలును. స్థూలశరీరము ఎప్పటివలెనే యుండును. అనగా రాతిలో ప్రవేశించినప్పుడు శరీరమును సూక్ష్మము చేయును. రాయి అదే విధముగ నుండును ఏమి మార్పు ఉండదు. ప్రవేశించి బయటకు రాగానే శరీరము మొదటివలెనే స్థూలముగ నుండును.

౪. పృథివ్యాది పరమాణువులతో అనేక క్రొత్త శరీరములను, చిత్తములను నిర్మించుకొనును వాటిద్వారా భోగముల ననుభవించును.

★ ఒక విషయమున ధారణాధ్యానసమాధులు చేయబడుట సంయమము. (సంపా.)

౫. పిండి, నేయి, శర్కర లేకయే మిఠాయిలను నిర్మించును. తన శిష్యుల కిచ్చును. వెండి, బంగారము లేకయే సత్యసాయిబాబా తన భక్తులకు బంగారు ఉంగరములు, గడియారములు అప్పటి కప్పుడే చేసి యిచ్చునట: దీనిని అతని యోగసిద్ధి అందురు.

౬. సమాధిలోనున్న యోగి కాలునో చేయినో నరికినను, అతనికి తెలియదు.

౭. అహింసను పూర్ణముగ పాటించుటవలన యోగియెడ సమస్త ప్రాణులు వైరభావము త్యజించును.

౮. యోగి నోటిమాటతో అగ్నిని నీరుగ, నీటిని అగ్నిగ మార్చగల్గును.

౯. శిష్యుల తలలపై చేయి ఉంచి అప్పటికప్పుడే సమాధి సిద్ధింపజేయును. ఈశ్వరుని సాక్షాత్క రింపజేయును.

౧౦. వేదములను, వేదానుకూల ఆర్షగ్రంథములను చదువకయే కేవలము యోగాభ్యాసము ద్వారా ముక్తి లభించును.

యోగసిద్ధుల పేర ఇటువంటి మూఢనమ్మకము లనేకము వ్యాపించినవి. ఇందులో కొన్నిటిని ఖండించితిని. కొన్నింటినిగూర్చి ఇపుడు వ్రాయుచున్నాను-

ప్రశ్న:- 'యోగి క్రొత్తశరీరమును, క్రొత్త చిత్తమును ఏర్పరచుకొనును. దానితో వ్యవహరించును.' అని అనేక గ్రంథములలో వ్రాయబడినది.

ఉత్త:- క్రొత్త శరీరమును, క్రొత్త చిత్తమును నిర్మించుకొనును- అనగా ఈశ్వరునివలె పృథివ్యాది పరమాణువులద్వారా నిర్మించడు. కాని యోగాంగముల నభ్యసించి శరీరమును, చిత్తమును పరివర్తనము (మార్పు) చేసికొనును. వాటికి క్రొత్త రూప మిచ్చును. ఉదాహరణకు-''తత్ర ధ్యానజమనాశయమ్'' (యోగ. ౪-౬) అను సూత్రమునకు వ్యాసభాష్యమున ''**పంచవిధం నిర్మాణచిత్తం జన్మౌషధి మంత్ర తపః సమాధిజాః సిద్ధయ ఇతి। తత్ర యదేవ ధ్యానజం చిత్తం తదేవానాశయమ్॥**'' ఐదు విధములైన చిత్తనిర్మాణము పేర్కొనబడినది. ధ్యానమువలన ఉత్పన్నమైన చిత్తము వాసనారహిత మగును. ధ్యానజం అనగా యోగి ధ్యానబలముచే పరమాణువులద్వారా క్రొత్త చిత్తమును నిర్మించుకొనునని కాదు. ధ్యానాభ్యాసముద్వారా ఆ చిత్తమునే వాసనారహితము చేసికొనును అనియే దీని భావము. దీనినే ఉత్పన్న చిత్త మందురు. మిగతా విషయములను గూడ ఇదే విధముగ అర్థము చేసి కొనగలరు.

యోగి క్రొత్త శరీరమును, చిత్తాదులను నిర్మింపజాలడు. ఇందుకు ఋషి దయానందుని దివ్యమాటలే ప్రమాణము-

'ఎంతటి సిద్ధయోగియైనను శరీరాదుల రచనను సంపూర్ణముగ నెఱుగజాలడు.' (సత్యార్థ ప్ర. ౧౨వసము.) - దీనివలన యోగి శరీరాదుల రచనను సంపూర్ణముగ తెలిసికొనజాలడనుట స్పష్టము.

తెలియనివాడు పరమాణువులతో శరీరాదులను నిర్మించలేడు.

ఋషి దయానందుడిట్లు వ్రాసినాడు. ''మీరు మేము సాకారులము. శరీర ధారులము. పరమాణువులను, త్రసరేణువులను, అణువులను ప్రకృతిని స్వాధీనము చేసికొనజాలము. అట్లే స్థూల దేహధారియై యున్నచో పరమేశ్వరుడు గూడ సూక్ష్మ పదార్థములతో స్థూలజగత్తును నిర్మింపజాలడు'' (సత్యార్థ ప్ర. ౮వసము.) – దేహధారియైనచో ఈశ్వరుడుగూడ ప్రకృత్యాదులను వశపరచుకొనజాలడు. సూర్యాది గోళములను, శరీరములను నిర్మింపజాలడు. యోగి శరీరధారియే. అతడు పరమాణువులతో క్రొత్త శరీరమును, చిత్తమును ఎట్లు నిర్మించుకొనగల్గును? మనము పరమాణువు లతో సృష్టిని నిర్మింపజాలమని ఋషి యన్నాడు. యోగి నిర్మింపజాలునని ఋషి వ్రాసియుండెనేని మన మంగీకరించెడివారము. యోగి క్రొత్త శరీరమును, చిత్తమును నిర్మించుకొనగల్గు నననది ఋషి దయానందుని సిద్ధాంతము కాదు. అతడింకను ఇట్లు వ్రాసినాడు. ''నిమిత్త కారణము రెండు విధములు. ఒకటి ప్రకృతిలో సృష్టిని నిర్మించువాడు, ధరించి ప్రళయము చేయువాడు. ఉత్పన్నమైన పదార్థములను వ్యవస్థలో నుంచువాడు ప్రముఖ నిమిత్త కారణము ఈశ్వరరుడు. రెండు– ఈశ్వరుని సృష్టిలోని పదార్థముల ద్వారా అనేక వస్తువులను నిర్మించువాడు సామాన్య నిమిత్తకారణము జీవుడు.'' సత్యార్థ ప్ర. ౮వసము.) – ముఖ్య నిమిత్త కారణము ఈశ్వరుడని ఋషి స్పష్టముగ పేర్కొన్నాడు. ఈశ్వరుడు నిర్మించిన వస్తువులను గైకొని మానవుడు ఇతర వస్తువులను నిర్మించును. పరమాణువులను గైకొని క్రొత్త శరీరాదులను నిర్మించడు.

ప్రశ్న:- యోగి అనేక శరీరములను ధరించునను విషయమున మీ యభిప్రాయమేమి?

ఉత్త:- యోగియొక్క జ్ఞానమువలన, బలమువలన మనుష్య, పశు, పక్ష్యాది అనేక ప్రాణుల పాలన పోషణ జరుగు ననియే దీని అభిప్రాయము. ఉదాహరణకు ఋషి దయానందుని జ్ఞానమువలన, శారీరక బలమువలన వేలకొలది మనుష్యుల, పశు పక్షుల రక్షణ జరిగినది. యోగియొక్క జ్ఞానమువలన ఇతరుల అజ్ఞానము నశించును. జ్ఞానము పెంపొందును. అసత్యము, అన్యాయము నశించును. సత్యము వృద్ధిజెందును. వైరము క్షీణించును. ప్రీతి వికసించును. అందువలన అనేక ప్రాణుల పాలన, పోషణ, ధారణ జరుగును. కావున అతడు అనేక ప్రాణుల శరీరములను ధరించునని పేర్కొనబడినది. దీని అభిప్రాయము అతడు మనుష్య, పశు, పక్ష్యాదుల శరీరములను నిర్మించుకొని వ్యవహరించు నని కాదు. అతడు మానవశరీరమును వదలి పశు పక్ష్యాదుల శరీరములలో ప్రవేశించునని నమ్ముట ప్రమాణ విరుద్ధము. అసత్యము.

ఋషి దయానందుడు 'ఆర్యోద్దేశ్యరత్నమాల' లో జన్మ మొదలుకొని మరణ పర్యంత ముండునది 'జాతి' అని తెలిపినాడు. యోగి పశు పక్ష్యాదుల శరీరములను ధరించు నేని అతని శరీరము మరణపర్యంత మున్నట్లు కాదుగదా! మాట వరుసకు దీని నంగీకరించినను, యోగి ఒకే సమయమున అనేక శరీరములను సజీవముగా నుంచజాలడు. ఏకదేశి యగుటవలన అతడు ఏ శరీరమున నుండునో అదియే జీవించి యుండును. ఇతర శరీరములు నశించును. కావున అనేక శరీరముల నిర్మించి, ధరించు కొను ననుట అసత్యము.

ప్రశ్న:- యోగి పాషాణశిలలో ప్రవేశించును. వెంటనే పూర్వమువలె స్థూల శరీరము నేర్పరచు కొను నందురు. దీని అర్థ మేమి?

ఉత్త:- ఈ నమ్మకము నిరాధారమైనది. ఏలన శిలలో ప్రవేశించుస్థితి ఏర్పడు వరకే జీవనము సమాప్తమగును. అట్టిచో శిలలో ఎవరు ప్రవేశింతురు? ప్రవేశించునను కొందము. రసరక్తాదులతో కూడి అప్పటికప్పుడే సూక్ష్మము, స్థూలము కాగల్గు క్రొత్త శరీరము ఏర్పడుట అసంభవము. ఇది సృష్టి క్రమమునకు విరుద్ధము. కావున త్యజింపదగినది. శిలలోపలి విషయమును బుద్ధితో ఆలోచింపవచ్చును. దీనినే లోన ప్రవేశించెనని అనవచ్చును. శరీరముతో కాదు.

మోక్షప్రాప్తికి ఈ సిద్ధులన్నియు అనివార్యములా అని ఆలోచించి చూడ, కావనియే నిర్ధారణ యగుచున్నది. ఇందుకు ప్రమాణములు-

''ప్రాప్త వివేకజ్ఞానస్యాప్రాప్త వివేకజ్ఞానస్య వా'' సంయమమువలన ఎవరికైనను వివేకజ్ఞానము కలుగవచ్చును, కలుగకపోవచ్చును, **''సత్త్వపురుషయోః శుద్ధి సామ్యే కైవల్యమితి.''** ఈ సూత్రాభిప్రాయము- సంయమమువలన సాధ్యమగు సిద్ధులు లభించినను, లభించకున్నను, ప్రకృతిపురుషుల- ఆత్మపరమాత్మల సరియైన జ్ఞానము కలిగినపుడు మోక్షము లభించును.

''ఏతస్యామవస్థాయాం కైవల్యం భవతీశ్వరస్యానీశ్వరస్య వా వివేకజ్ఞానభాగిన ఇతరస్య వా'' (యోగ. 3-౫౫ వ్యా. భా.) - వివేకజ్ఞానమున సిద్ధి లభించినను, లభించకపోయినను, ఇతరసిద్ధులు లభించినను, లభించకున్నను ఈ స్థితిలో కైవల్యము ప్రాప్తించును. దీనివలన సిద్ధులు- విభూతులు అన్నియు మోక్షమునకు అనివార్యములు కావని స్పష్టమగుచున్నది.

మోక్షప్రాప్తికి అభ్యాస వైరాగ్యముల ద్వారా వృత్తులను నిరోధించు సిద్ధి అనివార్యమే. **''అభ్యాస వైరాగ్యాభ్యాం తన్నిరోధః''** (యోగ.౧-౧౨). కంఠకూపమున సంయమమువలన కొంతకాలమువరకు ఆకలిదప్పులు శాంతించు సిద్ధి అవసరము కాదు. ప్రాణముపై కొంత అదుపు అవసరమే. కాని దానిని ౧౦,౧౫ నిమిషములవరకు ఆపగల్గుట అనివార్యము కాదు. ప్రాణాయామవిషయమున స్వామీ ధీరేంద్ర బ్రహ్మచారి వ్యాసము ప్రచురించబడినది. అందు రెండు దినములవరకు ప్రాణము (శ్వాస)ను ఆపగల్గనంతవరకు ఎవడును యోగి కాజాలడని★ వ్రాయబడినది.

ఇది ప్రమాణ విరుద్ధమగుటవలన పూర్తిగా అసత్యము. ఋషి దయానందుడు సత్యార్థ ప్రకాశము ౯వ సముల్లాసమున ముముక్షువు ప్రతిదినము కనీసము రెండు గంటలు ధ్యానము చేయు టవసరమని తెలిపినాడు. దీనిని ప్రాతః సాయంకాలములందు విభజించిన, ఒక్కొక్క గంటవరకు వరుసగా ధ్యాన

★ మహాత్మా నారాయణ స్వామి ''యోగరహస్య'' మను పుస్తక భూమికలో యోగము గురించి వ్రాసినాడు. అందు ఒక గంట ౨౬ నిమి. ౨౫ సెకన్లు పూరకము చేయ గలిగినపుడు సమాధిస్థితి ఆరంభమగు నని పేర్కొన్నాడు. నేను విద్యార్థిగా నున్నపుడు దీనిని చదివి అంతసేపు నేను ప్రాణము నాపలేనని, అట్లు ఆపలేనిచో యోగము సిద్ధింపదని యోగమునే వదలుకొంటిని. నావలె ఎందరు వదలివేసినారో! ఇంకెందరు వదలు కొందురో తెలియదు. నిరాధారములైన ఇట్టి వ్రాత లెందుకు వ్రాయుదురో అర్థము కాకున్నది.-(సంపా.)

ము చేయవలసి యుండును. దీని వలన ప్రతిదినము రెండు గంటలు ధ్యానము చేయుచుండుట వలననే మోక్షము లభించునని ఋజువగుచున్నది. ముక్తి కొరకు ఆఱు లేదా పద్దెనిమిది గంటల ధ్యానము అనివార్యము కాదు. దీనిద్వారా మోక్షమునకు గంటల తరబడి ప్రాణాయామము అవసర మనునది ఖండితమగుచున్నది.

వ్యవహారములో యమనియమములను పాటించుట, ప్రతిదినము రెండుగంటలు సమాధిస్థుల గుట మోక్షమునకు అనివార్యము. కాని సిద్ధులను సంపాదించుట అనివార్యము కాదు.

'యోగి ఈశ్వరునివలె సర్వజ్ఞుడు, సర్వశక్తి మంతు డగును. సృష్టిని నిర్మించి లయము చేయజాలును.' అను మూఢనమ్మకములను కొందరు వ్యాపింపజేయగా, అజ్ఞానమునకు లోనై అనేకులు మోక్షానందమునుండి వంచితులైనారు. అనేకులు స్వార్థపరులై యోగి ఈశ్వరునికి సమానుడని, అతనిని ఉపాసించిన మోక్షము కలుగునని అసత్యసిద్ధాంతములను ప్రచారము చేసినారు. తాము యోగులు కావున తమను ఉపాసించుడని ప్రేరేపించినారు. తమకు ఇష్టమైన కార్యములను అజ్ఞానులచే చేయించుకొని మానవ జాతిని పెడదారి పట్టించినారు. దీనివలన ప్రపంచమున కెంతయో హాని కలిగినది. ఇంకను కలుగుచున్నది.

సిద్ధుల గురించిన మూఢనమ్మకములవలన గూడ గొప్పకీడు వాటిల్లినది. జనులు ఏ మాత్రము ఆలోచింపకయే మోక్షప్రాప్తికి సిద్ధులన్నింటిని పొందుట అనివార్యమని ప్రచారము చేయుదురు. దీనివలన అనేకులు తమకు యోగము నభ్యసించుట సాధ్యము కాదని, దానిని వదలివేయుదురు. ఏలన 'ఆరు గంటలు ఒకే ఆసనముపై స్థిరముగా కూర్చొనజాలము. ఋషి దయానందు నంతటి బలమును సంపాదింపజాలము. ౧౮ గంటలు సమాధిస్థులము కాలేము. సంయమముద్వారా లభ్యమగు సిద్ధులను పొందజాలము. కావున యోగమునభ్యసించి ముక్తిని పొందగలమను ఆశను వదలుకొనుటయే ఉత్తమము'. అని వారు భావింతురు. ఈ మూఢనమ్మకములవలన ఇట్లెన్నియో విధములుగ హాని సంభవించినది.

యోగము పేర వ్యాపించియున్న సిద్ధులన్నియు సత్యము కావని, నిజమైన సిద్ధులన్నియు మోక్షమునకు అవసరము కావని నిరూపించితిని. ఈ భ్రాంతులను విడిచి తనుమనోధనములతో మోక్షము కొరకు ప్రయత్నించగలరు.

★★★

౧౩. ప్రచలిత యోగపద్ధతులన్ని సత్యమేనా? వాటివలన మోక్షము లభించునా?

ప్రపంచమున ప్రతిప్రాణియు సమస్తదుఃఖములనుండి, బంధనములనుండి విడివడి పూర్ణ సుఖమును పొందగోరును. కాని సమస్త దుఃఖముల నివృత్తి, పూర్ణసుఖ ప్రాప్తి వాస్తవిక యోగాభ్యాసము లేకుండ సంభవము కాదు.

మానవుని జీవితలక్ష్యమును సఫలముచేయు యోగమును తెలిసికొనుట ఈనాడు కఠినమైపోయి నది. యోగ జిజ్ఞాసువులు ఒక విఘ్నమును దూరము చేయగానే మరొక విఘ్నము ఎదురగుచున్నది. యోగసాధనలో ఎదురగు కొన్ని సమస్యలకు సమాధానములను పూర్వము వ్రాసితిని. ప్రస్తుతము మరొక సమస్యకు పరిష్కారము సూచింప యత్నింతును. ఈనాడు ప్రపంచమున ఈశ్వరభక్తి పేర పండలకొలది పద్ధతులు కానవచ్చుచున్నవి. అవి పరస్పర విరుద్ధములు. వాటిని గురించి బుద్ధిమంతునికి సందేహము కలుగును. ఈశ్వరునికి ఆకారమే లేనపుడు అతని విగ్రహమును ఏర్పరచి ఎందుకు పూజింతురు? ఒకడు ఈశ్వరుని నిరాకారునిగా భావించి భక్తిని ప్రదర్శించును. మరొకడు అతనిని సాకారునిగ భావించును. ప్రాణులన్నింటియెడ వైరభావమును త్యజించి ప్రేమతో వ్యవహరించినచో ఈశ్వరుడు ముక్తి నొసగునని ఒకడనును. వేరొకడు ఆయా ప్రాణులను ఈశ్వరునిపేర చంపి వాటి మాంసమును భక్షించినచో ఈశ్వరుడు ముక్తి నొసగు ననును. కొందరు ఈశ్వరుని సర్వవ్యాపకుడని భావించి ఉపాసింతురు. మరికొందరు ఈశ్వరుడు పరమధామము, ఏడవ ఆకాశము మున్నగు స్థానములందుండునని భావించి, అతని నుపాసింతురు. ఇట్లు జనుల సాధ్యములో, సాధనములలో పరస్పర విరోధము లెందుకున్న వను ప్రశ్న ఉదయించును.

కొందరు 'ప్రచలిత యోగపద్ధతు లన్నియు సత్యమే. ఏ పద్ధతి ననుసరించినను ముక్తి లభించును. కాని భక్తునికి తన ఉపాస్య దైవమునందు పూర్ణ విశ్వాసముండుట వసర' మందురు. ఉదాహరణకు-కలకత్తాలోని కాళీ మాతను పూజించదలచినవారు దృఢవిశ్వాసముతో పూజించవలెను. అపుడే కాళీమాత తప్పక ముక్తి నివ్వగలదు. అట్లే ఒకడు ఒకరాతి ముక్కను తన ఇంటిలో స్థాపించి పూర్ణ విశ్వాసముతో నియమపూర్వకముగ దానిని పూజించుట-స్నానము చేయించుట, దీపధూపనైవేద్యము లర్పించుట, స్తుతిప్రార్థనోపాసనల చేయుట వలన ఆ రాయి గూడ అతనిని తరింపజేయును. కావున యోగమార్గము లన్నియు సత్యమే. ఏ ఒకదానినైనను పూర్ణవిశ్వాసముతో అనుసరించిన, తరింతురని అందురు.

పై మాటలను ఆలోచింపక అనేకులు గ్రుడ్డిగా అనుసరింతురు. అట్టివారు స్వయముగా దుఃఖసాగరములో మునుగుదురు. తమ పరివారమును, అనుయాయులను విరుద్ధ మార్గమున నడిపింతురు. మానవుని ముఖ్యలక్ష్యమైన ముక్తినుండి వారిని వంచితుల నొనర్తురు. యోగమార్గము లన్నియు సత్యమైనవి లేదా అసత్యమైనవి అని అన్నంత మాత్రమున సత్యాసత్యములు తెలియవు. కావున యుక్తి ప్రమాణములద్వారా వీటిని పరీక్షించు టవసరము.

ప్రచలిత యోగపద్ధతులన్నియు సత్యము కావు. ఏలన వీని సాధ్యములోను, సాధనములలోను పరస్పరవిరోధము కలదు. ఒక విషయమున పరస్పర విరుద్ధములైన రెండు మాటలు ఎన్నటికిని సత్యము కాజాలవు. ఒకడు కారణము లేకుండ కార్యము కాదనును. ఉదాహరణకు మట్టిలేనిదే కుండ, బంగారము లేనిదే ఆభరణములు కావు. మరొకడు భగవంతునిమీద భక్తి ఉన్నచో ఇసుక శర్కరగ, నీరు నేయిగా మారుననును. సత్యసాయిబాబా ఏ వస్తువులు లేకుండగనే బంగారు ఉంగరములు, గడియారములు నిర్మించుననును. ఈ విధముగ కారణము లేకున్నను కార్యము కాగల దనును. ఒకే విషయమున పరస్పర విరుద్ధములైన రెండు సిద్ధాంతము లెన్నటికిని సత్యము కాజాలవు.

ప్రచలిత యోగపద్ధతులన్ని సత్యమేనా?

యోగమార్గములన్నియు సత్యము లనువారికి ఈశ్వరుని విషయములో, ముక్తి విషయములో పరస్పర విరోధము గలదు. ఉదాహరణకు- ఋషి దయానందుడు ఈశ్వరుని సర్వవ్యాపకుడనును. వేదముగూడ ''స పర్యగాత్...'' (యజు.౪౦-౮) ఆ పరమేశ్వరుడు సర్వవ్యాపకుడు. ''స ఓతః ప్రోతశ్చ విభూః ప్రజాసు'' (యజు. ౩౨-౮) 'ఆ యీశ్వరుడు వస్త్రములో దారమువలె ప్రకృత్యాది పదార్థములన్నింట వ్యాపించియున్నాడు' అని ఘోషించుచున్నది. ఈ సిద్ధాంతమునకు పూర్తి విరుద్ధముగ బ్రహ్మకుమారీ మతస్థులు ప్రపంచమునకు దూరముగ పరమధామములో నున్నాడందురు. మహమ్మదీయులు ఏడవ ఆకాశముపై నున్నాడందురు. క్రైస్తవులు నాల్గవ ఆకాశముపైన ఉన్నాడందురు. వీరందరు ఈశ్వరుని ఏకదేశీయుడని అందురు. ఈశ్వరుడు సర్వవ్యాపకుడైనచో అతనిని ఏకదేశీయు డనువారు అసత్యము. ఈశ్వరుడు ఏక దేశీయు డైనచో సర్వవ్యాపకు డనువారు అసత్యము.

ఋషి దయానందుడు, మహర్షి పతంజలి, మహర్షి గౌతముడు (న్యాయదర్శ కర్త) ఈశ్వర జీవ ప్రకృతులను అనాది యని, భిన్న భిన్న పదార్థములని నమ్ముదురు. వేదమున గూడ ''ద్వాసుపర్ణా...'' (ఋ.౧-౧౬౪-౨౦) అను మంత్రమున ఈశ్వర జీవ ప్రకృతులు అనాది పదార్థములని ప్రతిపాదింపబడినది. ఋషి దయానందుడు ఈ మంత్రమునకు వ్రాసిన వ్యాఖ్యానమును సత్యార్థ ప్రకాశము, ఎనిమిదవ సముల్లాసమున చూడగలరు.

యోగాభ్యాసముచేయు శంకరాచార్యుల అనుయాయులు ఒక బ్రహ్మమాత్రమే అనాది యని, జీవ ప్రకృతులు రెండును అనాది కావని నమ్ముదురు. జైనులు గూడ అతి కఠోరమైన తపశ్చర్యలతో యోగము నభ్యసింతురు. కొందరు యాత్రలో వాహనములనుగూడ ఆశ్రయింపక దూరదూరము వరకు కాలినడకనే పయనింతురు. కొందరు జైనులు వస్త్రహీను (దిగంబరు) లై యోగము నభ్యసింతురు. వీరిని అందరికన్న గొప్ప సిద్ధయోగులని కొందరు భావింతురు. జైనులు జీవ ప్రకృతుల రెండింటినే అంగీకరింతురు. ఈశ్వరు నంగీకరింపరు.

అనాది పదార్థములు మూడు అని నమ్మువారి మతము సత్యమైనచో, అవి ఒకటి లేదా రెండే అని నమ్మువారి మతము అసత్యము. అనాది పదార్థములు ఒకటి లేదా రెండు అని నమ్మువారి మతము సత్యమగుచో, మూడు అనువారి మతము అసత్యము. అంతే కాని ఇరువురి మతములు సత్యము కావు.

ఋషి దయానందుడు 'ఈశ్వరుడు సృష్టిస్థితిలయకారుడు, అతనిలో జ్ఞానాది గుణము లెన్నియో కలవు' అని విశ్వసించినాడు. జీవుని అస్తిత్వమును గూడ అంగీకరించినాడు. కాని యోగేశ్వరానందుడు ఈశ్వరుని సృష్టికర్తగా అంగీకరింపడు. ఈశ్వరునిలో ఏ గుణములును లేవనును. జీవుని అస్తిత్వమును గూడ అంగీకరింపడు. ఆర్యసమాజకు లనబడు కొందరు ఇతనిని మహాయోగి యని, తమకు యోగగురువని చెప్పుదురు. వ్యాసమహర్షి ఈశ్వరుని సృష్ట్యుత్పత్తిస్థితిలయకర్త యని అంగీరించును. ''జన్మాద్యస్య యతః'' (వేదాంత. ౧-౧-౨). ఋషి దయానందుడు, వ్యాసమహర్షి యోగులైనచో స్వామీ యోగేశ్వరానందుడు యోగి కాడు. స్వామీ యోగేశ్వరానందుడు యోగి యైనచో వీరిరువురు యోగులు కారు వీరందరు యోగులు కానేరరు.

ఇట్లే ముక్తి విషయమునను విరోధము కలదు. 'ముక్తిలో జీవుడు బ్రహ్మలో కలిసిపోవును. తన అస్తిత్వమును కోల్పోవును' అని కొంద రందరు. మరికొందరు జీవుడు తన అస్తిత్వమును కోల్పోడం దురు. ముక్తి తర్వాత పునర్జన్మ ఉండునని కొందరందురు. ముక్తిని పొందిన జీవునికి మళ్లీ జన్మయే ఉండదని మరికొంద రందురు. ముక్తజీవుడు ఈశ్వరునివలె సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడగును. సృష్ట్యుత్పత్తి స్థితిలయములను గూడ చేయును అని కొంద రందురు. స్వామిదయానంద సరస్వతి దీనిని అసత్యమ న్నాడు. ఇట్లు యోగము నభ్యసించువారికి సాధ్యములైన ఈశ్వరుడు మోక్షము విషయములో పరస్పర విరోధము గలదు.

అన్ని యోగ పద్ధతులు సత్యమే అనువారి మరొక దోషము- సాధ్యములైన ఈశ్వర, మోక్షవిష యమున పరస్పర విరోధము లున్నటులనే, వాటి సాధనము లందును పరస్పర విరోధము గలదు. ఉదా హరణకు-వేదానుయాయులు **''తమేవ విదిత్వాఽతిమృత్యుమేతి...''** (యజు.౩౧-౧౮). ఆ ఈశ్వరుని తెలిసికొనియే జీవుడు జన్మమరణరూప దుఃఖమునుండి తరింపగలడు. ఈ దుఃఖమునుండి తరించుటకు మరొక ఉపాయమే లేదందురు. జైనులు జీవుడు తప్ప ఈశ్వరుడు లేడని, ముక్తికి ఈశ్వ రుని తెలిసికొనవలసిన అవసరము లేదందురు. స్వామీ శంకరాచార్యుని అనుయాయులైన నవీన వేదాం తులు జీవుడు తననే బ్రహ్మగా భావించి యోగము నభ్యసించినచో వెంటనే ముక్తి లభించు నందురు. స్వామీదయానందుడు, మహర్షి పతంజలి ఈశ్వర జీవ ప్రకృతులు వేరువే రనుజ్ఞానము కలిగి యోగము నభ్యసించినపుడే మోక్షము లభించు నందురు.

మహర్షి పతంజలి అభ్యాసవైరాగ్యములను యోగసాధనములుగా పేర్కొన్నాడు. వ్యాసమహర్షి దీనినే సమర్థించినాడు. యోగీంద్రుడైన శ్రీకృష్ణుని అభిప్రాయముగ అభ్యాసవైరాగ్యములు ఏకాగ్రత కు సాధనములని చెప్పబడినవి.

అసంశయం మహాబాహో మనో దుర్నిగ్రహం చలం।
అభ్యాసేన తు కౌంతేయ వైరాగ్యేణ చ గృహ్యతే॥ భగవద్గీ. ౬-౩౫॥

హృషీకేశ్‌లో దూరదర్శనములో ప్రసారమైన యోగి అనబడు మహేశ్ వ్యాఖ్యానము ననుసరించి 'యోగమునకు అభ్యాసవైరాగ్యము లేమాత్రము అవసరము లేదు. ప్రాచీన గ్రంథములలో అభ్యాసవైరా గ్యములు యోగమునకు సాధనములుగా పేర్కొనబడినవి. వాటిని తొలగించవలెను'.

మహమ్మదీయులు నిరపరాధ ప్రాణులను చంపి వాటి మాంసమును తినుట ముక్తికి సాధన మం దురు. జైనులు జీవులను చంపుటకు మిక్కిలి భయపడుదురు. జీవులు చచ్చునను భయముతో నీటిని వేడిచేయరు. శ్వాసపీల్చుకొన్నపుడు జీవులు చనిపోగూడదని ముక్కుపైన, నోటిపైన బట్టకట్టుకొం దురు. ఇట్లు జీవులు చావకుండ జాగ్రత్త పడకున్నచో ముక్తి లభించ దందురు. పూర్ణబ్రహ్మచర్యము పాటించకున్న ముక్తి లభించదని యోగదర్శనములో గలదు. యమనియమాదులను పాటించుట అని వార్యమని తెలుపబడినది. **''జాతిదేశకాలసమయానవచ్ఛిన్నాః సార్వభౌమా మహావ్రతమ్''** (యోగ. ౨-౩౧) (అర్థము ౩౦వ పుటలో). కాని దీనికి విరుద్ధముగా బ్రహ్మచర్య నాశనమువలన ముక్తి

లభించునని ఆచార్య రజనీశ్, చార్వాకులు మొదలగువారు నమ్ముదురు. ★ ఇదేవిధముగ సారాయి మున్నగు మత్తు పదార్థముల సేవనము, అన్యాయముద్వారా ధనము సంపాదించుట, బీదలకు, బలహీనులకు దుఃఖము కలిగించుటవలన ముక్తి లభించదని కొందరందురు. దీనికి విరుద్ధముగా వ్యవహరించుచు కొందరు యోగము నభ్యసించుచున్నారు.

పైన పేర్కొన్న మోక్ష సాధనములు పరస్పర విరుద్ధములు. ఒకదానిని సత్యమని అంగీకరించినచో రెండవది అసత్యమగును.

యోగ విషయమున గల ఈ యంధవిశ్వాస పరంపరవలె ధర్మముపేర గూడ 'అన్ని ధర్మములు సత్యములే. దేనిని ఖండించగూడదు. సమర్థించగూడదు.' అను అంధపరంపరను ఋషి దయానందుడు ఎదుర్కొనవలసివచ్చెను. అతడు దీనిని తీవ్రముగా ఖండించెను. అప్పుడతనికి దిగువ ప్రశ్న ఎదురయ్యెను.

ప్రశ్న:- మీరు అందరిని ఖండించుచున్నారు. తమతమ ధర్మమున అందరును మంచివారే. ఎవరి మతమును ఖండింపగూడదు. ఖండింతురేని మీరు వారి కన్న విశేషమేమి తెలుపుచున్నారు?

ఉత్త:-ధర్మము అందరికి ఏకమా? అనేకమా? అనేకమందురేని అవి పరస్పర విరుద్ధములా? అవిరుద్ధములా? విరుద్ధములందురేని అందులో నుండి ఒకటే ధర్మమగును. మిగిలినవి కాజాలవు. అవిరుద్ధములందురేని అవి వేరువేరుగా నుండుట వ్యర్థమే.

'కావున ధర్మము మరియు అధర్మము ఒక్కొక్కటే గాని అనేకములు కాజాలవు. మేము విశేషించి చెప్పునది ఇదియే. సమస్త సంప్రదాయముల ఉపదేశముల నన్నిటిని ఏ రాజైనను ఒకచోట సమకూర్చినచో అవి ఒక వేయికన్న తక్కువేమి కావు. ★★ కాని వీని ముఖ్యవిభాగములు పురాణీ, పని కిరానీ, జైనీ, కురానీ అను నాలుగే, ఎందుకన ఈ నాల్గింటిలో సంప్రదాయము లన్నియు ఇమిడిపోవును.' (సత్యార్థ ప్ర. ౧౧వసము.)

ధర్మము గురించి ఋషి దయానందుడు చెప్పిన మాట యోగమునకు గూడ వర్తించును. ధర్మము, అధర్మము ఒక్కొక్కటే- అనగా ధర్మము ఒకటే. అనేకము కాదు. అధర్మముగూడ ఒకటే. అనేకము కాదు. అట్లే యోగముగూడ ఒకటే. అనేకము కాదు. అయోగముగూడ ఒకటే. అనేకము కాదు.

యోగమార్గము లన్నిటిని సత్యమను వారు తమ వాదమును నిరూపించుటకు ఒక దృష్టాంతము నిత్తురు. ''యోగసాధకులందరి మార్గములు భిన్నములుగ కనిపించినను వారి లక్ష్యమొకటే.

★ బ్రహ్మచర్యమును ముక్తికి సాధనమని భావించువారు జీవితాంతము బ్రహ్మచర్యమును శ్రద్ధతో పాటింతురు. మహమ్మదీయులు జీవితాంతము బ్రహ్మచారిగా నుండుట అనుచిత మందురు. ఈనాడు కొందరు పాశ్చాత్య చికిత్సకులు బ్రహ్మచర్యమును పాటించినచో కురుపులు, గడ్డలు పుట్టునందురు. అందుకే బ్రహ్మచర్యమును నష్టము చేయుట అవసర మందురు. (సంపా.)

★★ ఇప్పుడు స్వామీదయానందుని కాలములోకన్న వీటిసంఖ్య చాల పెరిగినది. (సంపా.)

ఎట్లన రోహతక్‌నుండి ఢిల్లీలో నున్న ఎఱ్ఱకోటకు ఇద్దరు వ్యక్తులు వేర్వేరు మార్గములద్వారా ప్రయాణము చేయుదురు. ఒకడు గుడ్‌గాంవ్‌ద్వారా ఢిల్లీ ఎఱ్ఱకోట చేరును. రెండవవాడు బహాదుర్‌గఢ్‌ద్వారా చేరును. వీరిరువురి మార్గములు వేరైనను, ఎఱ్ఱకోట చేరుకొను లక్ష్యము సిద్ధించినది. కావున యోగ సాధకు లందరు ఒకే మోక్షసిద్ధిని బడయుటవలన యోగమార్గము లన్నియు సత్యమే.

యోగమార్గము లన్నియు సత్యమనుటకు చూపబడిన ఈ దృష్టాంతము వారి మాన్యతనే ఖండించు చున్నది. ఎట్లన ఎఱ్ఱకోట స్వరూపము, ఉనికి ఇరువురికి ఒకే విధముగా నున్నది. భిన్నముగా లేదు కాని యోగమార్గము లన్నియు సత్యము అనువారి లక్ష్యమైన ఈశ్వరుడు, మోక్షము పరస్పర విరుద్ధములుగ నున్నవి. ఉదాహరణకు – పూర్వము తెలిపినట్లు ఒకడు ఈశ్వరుడు సర్వవ్యాపకు డనును. వేరొకడు పరమధామమున నుండు ననును. మరొకడు ఏడవ ఆకాశమున నుండు ననును. ఒకడు ఈశ్వరుని సాకారు డనును. మరొకడు నిరాకారు డనును. ఇట్లెన్నియో విరోధములు కనబడును.

ఎఱ్ఱకోట చేరుటకై పయనించు విభిన్నవ్యక్తుల దిశ పరస్పరము అనుకూలమైనది. అందు వలన వారిరువురు ఒకే అభీష్టస్థలమును చేరుకొనగలరు. రోహతక్ నుండి ఎఱ్ఱకోట చేరుకొనుటకై బయలుదేరిన వారు ఎఱ్ఱకోటకు విరుద్ధదిశలో పయనించినచో అనంత జన్మములలో గూడ వారు ఎఱ్ఱకోటను చేరుకొనజాలరు. ఇదే విధముగా యోగాభ్యాసము చేయువారి దిశ విరుద్ధముగా నున్నది. కావున వారందరు ఒకే గమ్యమును చేరుకొనజాలరు. లక్ష్యము మరియు సాధనములు పరస్పర విరుద్ధము లైనందున వీరిచ్చు ఈ దృష్టాంతము అజ్ఞానజనితమైనది.

ప్రశ్న:- ఈ మాన్యతవలన నష్టమేమి?

ఉత్త:- ౧. వేలకొలది జనులు తమ తను మనోధనములను ముక్తికొరకు అర్పింతురు. దాని పరి ణామముగ వారికి దుఃఖమే లభించును. ఏలన ముక్తి మార్గము కానిదానిని వారు ముక్తిప్రద మనుకొను చున్నారు. ౨. ఈ పరస్పర విరుద్ధ మాన్యతలను చూచి అనేకులు యోగాభ్యాసము, ఈశ్వరుడు, పున ర్జన్మ మున్నగువానిని త్యజించి నాస్తికు లగుదురు. ★ 3. కొందరు బుద్ధిమంతులు వీరి యీ మూఢనమ్మ కములను గాంచి ఆ సమాజమునే ★★ వదలి వేయుదురు. ఏలన మూర్ఖులకును బుద్ధిమంతుల కును పరస్పరము సంధి పొసగదు. ౪. యుక్తి ప్రమాణములకు నిలువజాలని మాన్యతల ననుసరించుట వలన జ్ఞానము వికసించదు. ఇట్టి వారందరు జడబుద్ధులగుదురు. దీనికి నిదర్శనము కుంభమేళలో చూడవచ్చును. ఇట్టి నష్టము లనేకము గలవు. మచ్చునకు కొన్ని పేర్కొనబడినవి.

★ ఆధునికపద్ధతిలో చదివిన అనేకులు ఇందుకు నిదర్శనము. (సంపా.)

★★ ఉదాహరణకు – ౧. వైదిక ధర్మము యొక్క వికృత రూపమును చూచి దానినే వాస్తవిక వైదిక ధర్మ మనుకొని బుద్ధుడు వైదికధర్మమును వదలివేసెను. వైదిక ధర్మమున కాధారమైన ఈశ్వరుని వదలివేసెను. ౨. భీమ రావు అంబేడ్కర్ వైదిక ధర్మముయొక్క వికృత స్వరూపమునే వాస్తవమైన వైదిక ధర్మమనుకొని దానిని వీడి బౌద్ధము నాశ్రయించెను. (సంపా.)

ప్రశ్న:- ఈ సమస్యకు సమాధాన మేమి?

ఉత్త:- సత్యమైన యోగవిద్య నెఱిగిన వ్యక్తికే యోగశిక్షణ నొసగు అధికారము లభించవలెను. ఇతరులకు లభించగూడదు.

ప్రశ్న:- సత్యమైన యోగవిద్య నెట్లు తెలిసికొనవచ్చును?

ఉత్త:- యోగదర్శన కర్తయైన పతంజలి ఋషి యోగస్వరూపమును తెలిపినాడు. దాని కనుకూల మైనది సత్యము, విరుద్ధమైనది అసత్యము.

ప్రశ్న:- యోగదర్శనకర్త చూపిన యోగస్వరూపమే సత్యమని నమ్ముటెట్లు?

ఉత్త:-అది వేదానుకూలము. + కావున సత్యము. వేదము సర్వజ్ఞుడైన ఈశ్వరుని జ్ఞానము. అందు దోషము లుండవు. సృష్ట్యాది నుండి ఋషి దయానందుని పర్యంతము కోట్లకొలది ఋషులు మహర్షి పతంజలి చూపిన ఈ యోగపద్ధతినే సత్యమని విశ్వసించినారు. అనుసరించినారు. ఇది సృష్టిక్రమమునకు అనుకూలము. కావున సత్యము. సమస్త విద్వాంసులు, రాజులు కలిసి ప్రపంచ మందలి యోగపద్ధతుల నన్నిటిని క్రోడీకరించవలెను. వాటి ననుసరించువారిని ఒకచోట సమావేశ పరచవలెను. వారిచే ప్రేమపూర్వకముగ శాస్త్రార్థము జరిపించవలెను. అది కేవలము సత్యాసత్యమును తెలిసికొనుటకే జరుగవలెను. జయాపజయముల కొరకు, నొప్పించుటకు కాగూడదు. న్యాయదర్శ నము ననుసరించి శాస్త్రార్థము జరుగవలెను. సత్యములని ఋజువైనవాని నన్నిటిని అందురు అంగీకరిం పవలెను. అసత్యములైనవానిని త్యజింపవలెను. ఇట్లు సత్యములని ఋజువైన యోగపద్ధతులనే విద్యా లయములలో ప్రవేశపెట్టవలెను. యోగమును అర్థముచేసికొనుటకు వేదములను, వేదానుకూల ఆర్ష గ్రంథములను చదువుట, చదివించుట అత్యావసరము. భారతదేశ మాజీ ప్రధానమంత్రి శ్రీ మొరార్జీ దేశాయి తన ఉపన్యాసములో యోగప్రచారము కేవలము రాజులవలననే కాజాలదని. ఇందుకు ప్రజల సహకారము గూడ అవసరమని అనుట ముదావహము. ఇది అతని ఉపన్యాస సారాంశమే. అతని శబ్ద ములు కావు యోగశిక్షణ నొసగు విద్వాంసులు, శిక్షణను ఇప్పించు రాజులు ఋషికృత గ్రంథముల నాధారముగా గొని యోగ శిక్షణ నొసగకున్నచో పరిణామము భాగుగా నుండదు. యోగమును నేర్పు వారును, నేర్చుకొనువారును మహాంధకారమున మునిగి నానావిధ కష్టముల ననుభవింతురు. దీనివలన యోగముగూడ కళంకితము కాగలదు. కావున సర్వహితముగోరి యోగశిక్షణలో పూర్వోక్త నియమము లను పాటించుట అనివార్యము.

'యోగమార్గము లన్నియు సత్యమే. దేని ననుసరించినను ముక్తిలభించు' నను మిథ్యా మాన్య తను ఖండించితిని. యోగ ప్రచారమునకై కొన్ని సూచనల నొసగితిని. బుద్ధిమంతులు వీనివలన తాము లాభము పొందగలరు, ఇతరులకు లాభము కలుగజేయగలరు.

★★★

+ ఈశ్వరుడు, జీవుడు, ప్రకృతి, ప్రళయము, కర్మ, కర్మఫలము, బంధము, మోక్షము, యోగము అహింస మొదలగు విషయములలో వేదములో, యోగశాస్త్రములో సమానత కలదు. (సంపా.)

౧౪. విదేహ ప్రకృతి లయ యోగుల గుఱించిన భ్రాంతి

విదేహ, ప్రకృతి లయ యోగులు శరీరము నశించిన పిదప ప్రకృత్యాది జడపదార్థములను ఆత్మగా భావించి ఉపాసింతురా? వారు అనేక సంవత్సరములవరకు ముక్తిలోవలె అనుభూతిని పొందుదురా?

యోగదర్శనమున సంప్రజ్ఞాత, అసంప్రజ్ఞాతములని ముఖ్యముగా రెండు విధములైన సమాధులు పేర్కొనబడినవి. అసంప్రజ్ఞాత సమాధిలో భవప్రత్యయము, ఉపాయప్రత్యయము అను రెండు భేదములు పేర్కొనబడినవి. **''భవప్రత్యయో విదేహప్రకృతిలయానామ్''** (యోగద. ౧-౧౯)-విదేహ, ప్రకృతిలయ యోగులకు సిద్ధించు సమాధి భవప్రత్యయ (**అసంప్రజ్ఞాత**) మన బడును.

పం. వాచస్పతి మిశ్ర మాన్యతలు:- ౧-**''భవంతి జాయంతేఽస్యాం జంతవ ఇతి భవోఽవిద్యా''**-దేనియందు జంతువులుత్పన్నమగునో అది అవిద్య. ప్రత్యయ మనగా కారణము.

భూతేంద్రియములను ఆత్మగా భావించి ఉపాసించువారు విదేహులు. ఇంద్రియముల నుపాసించువారు శరీరము విడిపోయిన తర్వాత ఇంద్రియములలో లీనమై సమాధి స్థితిలో పదిమన్వంతరములవరకు మోక్షములో వలె సుఖము ననుభవింతురు. అట్లే భూతముల నుపాసించువారు శరీరపాతానంతరము భూములలో లీనమై సమాధి స్థితిలో నూరు మన్వంతరములవరకు మోక్షములోవలె సుఖము ననుభవింతురు.

మరణానంతరము ప్రకృతి, మహత్తత్త్వము, అహంకారము, తన్మాత్రలు- వీనిలో ఏదే నొక దానిని ఆత్మగా భావించి ఉపాసించువారు ప్రకృతిలయులు. వీరు మరణానంతరము సమాధ్యవస్థలో విదేహులకన్న దీర్ఘకాలమువరకు మోక్షములోవలె సుఖము ననుభవింతురు.

అనేక టీకాకర్తలు గూడ పం. వాచస్పతిమిశ్ర మాన్యత ననుసరించినారు. కొందరు 'మరణానంతరము సమాధి స్థితిలో' అను అంశమును వదలి మిగతా విషయములో వాచస్పతి మాన్యతనే అంగీకరించినారు.

పం. వాచస్పతి మిశ్రమొదలగువారి యీ మాన్యత సత్యమా? అసత్యమా? అని వివేచింతము.

వాచస్పతి భవశబ్దమునకు అవిద్య అని వ్రాసినాడు. అవిద్యా కారణమున కలిగిన అసంప్రజ్ఞాత సమాధియే భవప్రత్యయ సమాధి యని పేర్కొన్నాడు. ఈ సమాధికి ఉపాయము అవిద్య యని అతని యభిప్రాయము. ఆశ్చర్యము! అవిద్య అసంప్రజ్ఞాత సమాధికి ఉపాయ మెన్నటికిని కాజాలదు. వివేకవైరాగ్యములవలననే ఈ సమాధి సిద్ధించును. వాచస్పతి వ్రాసిన అర్థము యోగదర్శనమునకు విరుద్ధము.

యోగదర్శనములో ఈశ్వర జీవ ప్రకృతుల వాస్తవిక జ్ఞానము మఱియు పరవైరాగ్యమువలన అసం

ప్రజ్ఞాత సమాధి సిద్ధించునని వ్రాయబడినది. వాచస్పతి మరియు పతంజలి మహర్షి సిద్ధాంతములు పరస్పర విరుద్ధము లగుటచే రెండును సత్యము కాజాలవు. అందు ఒక్కటి మాత్రమే సత్యమగును. పతంజలి మహర్షి ''విపర్యయో మిథ్యాజ్ఞానమతద్రూపప్రతిష్ఠమ్'' (యోగ. ౧-౮) అన్నాడు. విపర్యయము = మిథ్యాజ్ఞానము సమాధిలో బాధకము. మనుష్యుడు జడమును చేతనముని, చేతనమును జడమని భావించుచున్నంతవరకు సమాధిని పొందజాలడు. విపర్యయము ఒక వృత్తి. అది విపరీత జ్ఞానము. ఈ విపర్యయ జ్ఞానము సమాధి యందు బాధకము. అది ఉండగా సమాధి సిద్ధింపజాలదని మహర్షి పతంజలి చెప్పినాడు.

వ్యాస మహర్షి ''తస్య పరవైరాగ్యముపాయః'' - అసంప్రజ్ఞాత సమాధికి ఉపాయము పరవైరాగ్యమన్నాడు. పరవైరాగ్యము వాస్తవిక జ్ఞానమువలననే కలుగును. అజ్ఞానమువలన కలుగదు.

''ఋతంభరా తత్ర ప్రజ్ఞా'' (యోగ. ౧-౪౮) సంప్రజ్ఞాత సమాధి పరిపక్వమైనపుడు బుద్ధి సత్యమునే గ్రహించును. అసత్యము నంగీకరింపదు. దీనికి వ్యాసమహర్షి వ్రాసిన భాష్యమిట్లున్నది-

''అన్వర్థా చ సా సత్యమేవ బిభర్తి న చ తత్ర విపర్యాస గంధోఽప్యస్తీతి''

ఆ ప్రజ్ఞ అర్థానుసారి. సత్యమునే గ్రహించును. అచట లేశమైనను అసత్యముండదు.

అసంప్రజ్ఞాత సమాధికి ముందు సంప్రజ్ఞాత సమాధిలో నైపుణ్య మవసరము. సంప్రజ్ఞాత సమాధికి యోగ్యుడుకానివానికి ఎన్నటికిని అసంప్రజ్ఞాతసమాధి లభించదు.

మహర్షి పతంజలి, వ్యాసమహర్షి అసంప్రజ్ఞాత సమాధికి కావలసిన యోగ్యతలను ఇట్లు పేర్కొన్నారు-

తత్పరం పురుషఖ్యాతేర్ గుణవైతృష్ణ్యమ్'' (యోగ. ౧-౧౬) దేనిలో జీవేశ్వరుల పరిజ్ఞానము వలన సత్త్వరజస్తమో గుణములనుండి జీవునికి ఆసక్తి తొలగునో అది పరవైరాగ్యము.

మొదట సంప్రజ్ఞాత సమాధి పరిపక్వమగును. ఆ పిదప జీవేశ్వరుల స్వరూప జ్ఞానము కలుగును. దాని వలన అసంప్రజ్ఞాత సమాధి సిద్ధించును.

భవప్రత్యయము మరియు ఉపాయప్రత్యయము అనబడు అసంప్రజ్ఞాత సమాధికి జీవేశ్వర ప్రకృతుల వాస్తవిక జ్ఞానము మరియు పరవైరాగ్యమే ఉపాయము.

వాచస్పతి భవప్రత్యయ మనబడు అసంప్రజ్ఞాత సమాధికి అవిద్యయే ఉపాయమని వ్రాసినాడు. ఇది ఋషుల సిద్ధాంతమునకు విరుద్ధము, త్యాజ్యము. అతని మాన్యత వేదవిరుద్ధము. అతడు ప్రకృతి మహత్తత్త్వాది జడపదార్థములను ఆత్మగా భావించి ఉపాసించువారు ముక్తి వంటి సుఖము ననుభవింతురని వ్రాసినాడు. ఇది వేద విరుద్ధము. చూడుడు-

అంధం తమః ప్రవిశంతి యేఽసంభూతిముపాసతే।

తతోభూయ ఇవ తే తమో య ఉ సంభూత్యాం రతాః॥ యజు. ౪౦-౯॥

'ప్రకృతి నుపాసించువారు అజ్ఞాను లగుదురు, క్లేశముల ననుభవింతురు. ప్రకృతినుండి ఉత్పన్న మైన మహత్తత్త్వ, అహంకార, తన్మాత్ర, పృథివ్యాదులను ఉపాసించువారు అంతకన్న ఎక్కువ అజ్ఞానములో మునుగుదురు. దుఃఖము ననుభవింతురు. ప్రకృతి మున్నగు జడపదార్థములను ఆత్మగా భావించి ఉపాసించువారు ముక్తివంటి సుఖమును ఎన్నటికిని అనుభవించజాలరు.

పతంజలి మహర్షి అవిద్యయే సమస్తదుఃఖములకు కారణమని యోగదర్శనము (౨-౪) లో వ్రాసి నాడు. కావున అవిద్య సుఖమునకు ఉపాయము కాజాలదు.

'విదేహ, ప్రకృతిలయ యోగులు పది మన్వంతరములు మొదలుకొని పదివేల మన్వంతర ముల వరకు సమాధి స్థితిలో నుందురు. ముక్తివంటి సుఖము ననుభవింతు'రని వాచస్పతి వ్రాసి నాడు. దీనికి ప్రమాణము లేదు. కావున అసత్యము. వేదములందు, వేదానుకూల ఆర్షగ్రంథము లందు ఈ యభిప్రాయమును సమర్థించు వాక్యములు లేవు.

<u>పం. వాచస్పతిమిశ్ర మాన్యతలకు ఆధారము పురాణము</u>– జీవునికి రెండు స్థితులు గలవని ఋషులు పేర్కొన్నారు. ఒకటి మోక్షస్థితి. రెండవది జన్మమరణస్థితి. మోక్షార్హులైన జీవులకు ఈశ్వరుడు మోక్షము నిచ్చును. మిగతా జీవులు జన్మమరణ స్థితిలోనే ఉందురు. అటు మోక్షము సిద్ధింపక, ఇటు జన్మమర ణములు లేక దీర్ఘకాలము వరకు ముక్తివంటి సుఖము ననుభవించి తిరిగి జన్మమరణముల ననుభవించు మూడవ స్థితియే లేదు. వాచస్పతి ద్వారా పేర్కొనబడి ఈ మూడవస్థితి ఊహాజనితమే– దీనికి వాయు పురాణము ఆధారమని తోచుచున్నది. ఏలన అతడు వాయుపురాణ వచనములనే తన భాష్యమున ఉల్లే ఖించినాడు.

మరణించిన పిదప శరీరము లేకున్నను సమాధి సిద్ధించునని వాచస్పతి పేర్కొనుట నిరాధా రము. ప్రత్యక్షవిరుద్ధము. అత్యంత రుగ్ణావస్థలో మనుష్యుడు స్పృహకోల్పోవును. తాను ఎక్కడున్నది అతనికి తెలియదు. అట్లే బలమైన దెబ్బతగిలినపుడు మూర్ఛితుడగును. మత్తుమందుచే మూర్ఛితుడైన వాని శరీరమును శస్త్రముతో కోసి ముక్కలు చేసినను అతనికేమాత్రము తెలియదు. ఆ స్థితిలో ఎంతటి సిద్ధయోగియైనను సమాధిని సాధింపజాలడు. శరీరమున్నపుడే ఇట్లైనచో శరీరము నశించిన పిదప సమాధిని సాధించుట అసంభవము.

''వ్యాధిస్త్యాన సంశయప్రమాదాఽలస్యాఽవిరతిభ్రాంతిదర్శనాలబ్ధ..........''
(యోగ.౧-30) వ్యాధి సమాధికి ప్రబలమైన శత్రువు. వ్యాధి ప్రబలమైనపుడు సమాధి భంగముగును. యోగములో ప్రవేశము లేనివారు, శాస్త్రములోని వాక్యములకు గల పరస్పర సంబంధము తెలి యనివారు యోగమును వ్యాఖ్యానించబూనుదురు. దానివలన తీరని నష్టము వాటిల్లును.

శరీరము నశించిన తర్వాతగూడ యోగులు దీర్ఘకాలము వరకు సమాధిలోనుందురని నేడనే కులు నమ్ముచున్నారు. ఈ మిథ్యావిశ్వాసములకు కారకులు శాస్త్రములకు విరుద్ధమైన భావములను రచించువారే. స్థూలశరీరములేనిదే లౌకిక కార్యముల సిద్ధిగాని సమాధి సిద్ధిగాని లభింపజాలదు.

భవప్రత్యయ, విదేహ, ప్రకృతిలయ శబ్దముల యథార్థము :- భవమనగా ప్రపంచము, ప్రత్య

యమునగా జ్ఞానము, ప్రపంచమున జన్మించిన పిదప మానవుడు రోగము, వియోగము, భోగమువలన నానాదుఃఖముల ననుభవించును. దుఃఖముల నుండి ముక్తుడగుటకు మనోవాక్కాయములతో ప్రయత్నించును. దుఃఖములలో మృత్యుదుఃఖ మొకటి. మనుష్యుడు తానెన్నటికిని చావగూడదని, సదా జీవించి యుండవలెనని కోరుచుండును. నేటివరకు మరణించక సదా జీవించియుండగల ప్రాణి ఒక్కటైనను ఉత్పన్నము కాలేదు.

అతడింకను ఆలోచించును. అప్పు డతనికి మనుష్య, పశు, పక్ష్యాది ప్రాణులేగాక పృథివీ, చంద్ర, సూర్యాది లోకములు గూడ ఎప్పుడో ఒకప్పుడు తప్పక నశించునని తెలియును. ఇట్లు ప్రపంచము యొక్క ఉత్పత్తి వినాశ చక్రమును చూచి మృత్యువు మున్నగు దుఃఖములనుండి ముక్తుడగుటకు సత్యము నన్వేషించును. దాని కొరకు స్వామీ దయానందునివలె సర్వస్వము నర్పించును. స్వామీ దయానందుడు చెల్లెలి మృత్యువును చూచి తన మృత్యువు గురించి ఆలోచించసాగెను. పినతండ్రి మృత్యువును గాంచి ఎంతయో విలపించెను. ఈ మరణదుఃఖమును తప్పించుకొన దలచెను. అందుకై ధనసంపదల నన్నిటిని త్యజించెను. ఇల్లు వదలి సత్యము నన్వేషించుటకై బయలుదేరెను.

మనుష్యుడు జన్మమరణాది నానా దుఃఖముల ననుభవించును. అతనిలో ఈ ప్రపంచమునుదేమి? ఇది ఎల్లప్పు డిట్లే యుండునా? ఎప్పుడైన ఉత్పన్నమైనదా? ఇక ముందిట్లే యుండునా? లేక నశించునా? ఈ ప్రపంచమునకు స్వామి ఎవరు? మొదలగు ప్రశ్నలు ఉత్పన్నమగును. వీటికి సమాధానము తెలిసికొనుటకై రాత్రింబవళ్లు ఆలోచించుచుండును. దీని పరిణామముగ అతనికి ప్రకృతిజీవేశ్వరుల పరిజ్ఞానము కలుగును. దానివలన పరవైరాగ్య ముత్పన్నమగును. దానిద్వారా భవప్రత్యయ–అసంప్రజ్ఞాత సమాధి సిద్ధించును.

ప్రపంచముయొక్క వాస్తవిక స్వరూపము తెలియుటచే ఈ సమాధి సిద్ధించును. కావున ఇది భవ ప్రత్యయ మనబడును. ''భవాత్ ప్రత్యయః భవప్రత్యయః'' ఈ సమాధికి ముఖ్యకారణము భవము వలన కలిగిన జ్ఞానము. కావున దీనికి ఈనామ మేర్పడినది. భవశబ్దమునకు అర్థము అవిద్య అని భావించి దానివలన అసంప్రజ్ఞాత సమాధి సిద్ధించు ననుకొనుట యోగదర్శనమునకు విరుద్ధము. ఒకవేళ ఈ మాన్యత యోగదర్శనము దనియే అంగీకరించిన, యోగదర్శనకర్త 'వదతోవ్యాఘాత' దోషగ్రస్తుడగును. తన సిద్ధాంతమును తానే ఖండించినవాడగును. ఏలన యోగదర్శన కర్త అవిద్య సమాధిలో బాధకము అని తెలిపినాడు. అవిద్య యున్నచో సమాధి లభించదు. సమాధి లభించిన అవిద్య ఉండజాలదు.

విదేహ అనగా దేహముండియు దేహము లేనట్లుండుస్థితి. ఆత్మ వేరని, శరీరము వేరని, ఆత్మ నశించదని, శరీరము నశించునని యోగి తెలిసికొనును. ఆ స్థితిలో శరీరముండియు లేనట్లుగా నుండును. విదేహస్థితిని పొందుటకు మరొక కారణము– జీవుడు ఈ శరీరముయొక్క అద్భుత రచనను చూచును. తాను దానిని రచింపలేనని, పోషింపలేనని తెలిసికొనును. అప్పుడు శరీరముతో జీవునికి స్వ స్వామి సంబంధము తొలగిపోవును. అతడీ శరీరమును ఈశ్వరుని దనుకొనును. దేహములో ఉండియు విదేహుడనబడును. మనుష్యునికి ఆత్మ, పరమాత్మ, ప్రకృతుల వాస్తవిక జ్ఞానము కలుగుచున్నకొలది అతడు దేహమును మరచిపోయినట్లుండు స్థితిని పొందును. క్రముముగా అతనికి తన బలసౌందర్యాదులందు

ఎట్టి అభిమానము లేకుండ పోవును. అతడు ఆర్యసమాజపు మొదటి నియమము ననుసరించి 'సమస్త పదార్థముల నిమిత్త కారణము = ఆదిమూలము పరమేశ్వరు' డనుకొనసాగును. విదేహ శబ్దమున కర్థ మిదియే. విదేహు డనగా దేహములేనివా డనుకొనుట యోగదర్శనమునకు విరుద్ధము.

ప్రకృతి, మహత్తత్త్వాదులను ఆత్మగా భావించి ఉపాసించువారు ప్రకృతిలయులని వాచస్పతి మొదలగువారు వ్రాసినారు. ఇది సరియైనది కాదు. ఏలన జడ పదార్థములను చేతనము లనుకొని ఉపాసించువారు ఎన్నటికిని సమాధిని పొందజాలరు. ప్రకృతియొక్క సూక్ష్మస్థితిని తల్లీనులై తెలిసికొన్నవారు ప్రకృతిలయులు. ఈశ్వర జీవ ప్రకృతుల స్వరూపమును తెలిసికొనుటకు మిక్కిలి శ్రమించవలసి యుండును. ఈ మూడింటి పరిజ్ఞానము అసాధారణ కార్యము. ప్రకృతిస్వరూపమును చక్కగా తెలిసికొన నంతవరకు మనుష్యుడు దానిని వదలి ఈశ్వరు నుపాసించజాలడు. ప్రకృతిలయు డనగా ప్రకృతియొక్క నిజస్వరూపమును తెలిసికొనుటకు తను మనో ధనములను అర్పించువాడు. దాని సూక్ష్మ, స్థూల వికారములను తెలిసికొనుటలో తల్లీనుడగువాడు. కపిలాచార్యుడు 'సత్త్వరజస్తమసాం...' (సాంఖ్య. ౧-౬౧) లోను, 'స్థూలాత్...' (సాంఖ్య. ౧-౬౨) నుండి 'తతః ప్రకృతేః...' (సాంఖ్య. ౧-౬౫) వరకు సూత్రములలోను సూక్ష్మమునుండి స్థూలమువరకు, స్థూలమునుండి సూక్ష్మము వరకు పరిశీలించవలెను.'' అని వ్రాసినాడు. దానివలన వివేకము లభించును. కావున ప్రకృతితో సంబద్ధుడై, దాని సూక్ష్మావస్థను అత్యంత శ్రమతో తెలిసికొనువాడు ప్రకృతిలయుడు.

ప్రశ్న:- **కైవల్యమువంటి అనుభూతిని పొందుట అనగా నేమి?**

ఉత్త:- సమాధిస్థితిలో నున్ననంతవరకు మనుష్యుడు ముక్తివంటి అనుభూతిని పొందును. ఈ స్థితి స్థూలశరీర మున్నపుడే ఉండును గాని, నశించిన పిదప ఉండదు. సమాధి స్థితియందు యోగి దుఃఖ రహితుడై సుఖము ననుభవించును. కావుననే కైవల్యమువంటి అనుభూతిని పొందు నందురు.

భవప్రత్యయము ఉపాయప్రత్యయము అని అసంప్రజ్ఞాతసమాధి రెండువిధములు. భవ ప్రత్యయమున కర్థము వ్రాసితిని. సమాధిని సిద్ధింపజేసికొనుటకు ఉపాయములను విశేషముగా అనుసరించును. కావున దీనికి ఉపాయప్రత్యయమని పేరు. మోక్షమునకు యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, శ్రద్ధా, వీర్య, స్మృతి, సమాధి మొదలగు ఉపాయములను అవలంబించును. కావున ఉపాయప్రత్యయ మను పేరు సార్థకము.

భవప్రత్యయ, ఉపాయప్రత్యయ, విదేహ, ప్రకృతిలయాది అనేక శబ్దముల గూర్చి తెలుప బడినది. ఈ శబ్దముల వాస్తవిక అభిప్రాయమును తెలుప యత్నించబడినది. విద్వాంసులు, మహానుభావులు గంభీరముగ ఆలోచించగలరు. ఇటువంటి అసంగతములైన మిథ్యావాదములను ఖండించగలరు. ఖండించుటలో తోడ్పడగలరు.

★★★

౧౫. హఠయోగము యోగమేనా?

ఈనాడు 'హఠయోగ ప్రదీపిక' ఒక పెద్ద యోగగ్రంథ మని యెంచబడుచున్నది. దీనిలో యోగ దర్శనమునకు, ఋషుల సిద్ధాంతమునకు అనుకూలమైన యోగము గలదని కొందరు భావింతురు. ప్రాచీనకాలమున ఋషులు దీనినే అనుసరించుచుండిరని, నేర్పుచుండిరని నమ్మెదురు. దీని రచయిత స్వాత్మరామ్. ఇచట పేర్కొనబడు టీకా రచయిత డా॥ చమన్‌లాల్ గౌతమ్. ఇపుడు పై మాన్యత సత్యమా? అసత్యమా? అని ఆలోచింతము.

౧. హఠయోగ ప్రదీపికలో యమనియమములు లేవు:- మహర్షి పతంజలి యోగమునకు ఎనమి దంగము లని పేర్కొన్నాడు. అతడు యమములకు మిక్కిలి ప్రాధాన్యత నిచ్చినాడు- **''జాతి దేశకాల సమయానవచ్ఛిన్నాః సార్వభౌమా మహావ్రతమ్''** (యోగ. ౨-౩౧) - యోగము నభ్యసించువాడు జాతి, దేశ, కాల, సమయములకు కట్టు బడక యమములను పాటించవలయు నని విధించినాడు. మనోవాక్కర్మలతో ఎల్లెడల, ఎల్ల విధముల యమములను పాటించనివాడు యోగి కాజాలడు. యమ ముల వలెనే నియమములను గూడ పాటించవలసి యుండును. యమనియమములను పాటించుట వలననే యోగము సిద్ధించును. లేకున్న సిద్ధించదు. కాని హఠయోగ ప్రదీపికలో యమనియమములు మొదటి రెండంగములుగా పేర్కొనబడలేదు. కావున ఇది పతంజలి మున్నగు ఋషుల కనుకూలము కాదని, విరుద్ధమని ఋజువగుచున్నది.

''హఠయోగ ప్రథమాంగత్వాదాసనం పూర్వముచ్యతే'' (ఉపదేశము ౧-౧౯) ఆసనము హఠయోగమునకు మొదటి అంగము. కావున మొదట ఆసనము గురించియే చెప్పబడును.

ప్రశ్న:- హఠయోగ ప్రదీపిక, ఉపదేశము ౧-౧౭, ౧౮ శ్లోకములలో★ యమనియమము లున్నవి గదా?

ఉత్త:- కాదు ఈ రెండు శ్లోకములను కొందరు విద్వాంసులు ప్రక్షిప్తము లన్నారు. వీని నంగీకరిం చినను, గ్రంథములోనే పరస్పరవిరోధమగును. ఇంతకు ముందే ఆసనమును యోగమునకు ప్రథమాంగ మన్నాడు. ఆసనము మొదటి అంగమైనచో, యమనియమములు మొదటి రెండు అంగములు కాజాలవు. ఒకవేళ యమనియమములు మొదటి యంగ మగుచో ఆసనము ప్రథమాంగము కాజాలదు. ఇట్లు గ్రంథ

★ అహింసా సత్యమస్తేయం బ్రహ్మచర్యక్షమాధృతిః।
దయార్జవం మితాహారః శౌచం చైవ యమా దశ॥
తపః సంతోష ఆస్తిక్యం దానమీశ్వరపూజనమ్।
సిద్ధాంతవాక్యశ్రవణం హ్రీ మతీ చ తపో హుతమ్॥
నియమా దశ సంప్రోక్తా యోగశాస్త్ర విశారదైః।

అర్థము:- అహింసా, సత్యము, అస్తేయము, బ్రహ్మచర్యము. క్షమా, ధృతి, దయ, సరళత, మితాహారము, శౌచము అనునవి పది యమములు. తపస్సు, సంతోషము, అస్తిక్యము, దానము, ఈశ్వర పూజనము, సిద్ధాంత

కర్త మాన్యత సహజముగనే ఖండిత మగుచున్నది. కావున వాస్తవమున ఈ గ్రంథములో యమనియమములను యోగాంగము లని అంగీకరింప లేదు. ★

౨. వజ్రోలీముద్ర :- (ఉపదేశము 3-౮3 నుండి ౮౬) ★★ టీక- వజ్రోలీముద్రను తెలిసిన యోగి యోగశాస్త్రనియమములను పాటించక విచ్చలవిడిగా వ్యవహరించినను సిద్ధిని పొందును. వజ్రోలీని సాధించుటకు ప్రతివానికి దుర్లభములైన వస్తువులను తెలుపుచున్నాను. ఒకటి పాలు. రెండవది అదుపులో నుండు స్త్రీ. పురుషుడు గాని స్త్రీగాని బిందువు పడిపోకుండ ఆపుటకు లేదా ఆకర్షించుటకు నెమ్మదిగా అభ్యసించవలెను. వజ్రోలీముద్ర సిద్ధించును. ఉపస్థ (స్త్రీయోని, పురుషుని మూత్రేంద్రియ) ఛిద్రములో వాయుసంచారము చేయించుటకై మండుటకు అగ్నిని ఊదినట్లు గాజు నళికలో నెమ్మదిగా ఊదవలయును.

(ఉపదేశము 3-౮౭) + టీక- ''యోనిలో పడనున్న బిందువును అభ్యాసము ద్వారా పైకి

వాక్యములను వినుట, లజ్జ, బుద్ధి, తపస్సు, ఆహుతి అనునవి యోగశాస్త్ర నిపుణులు తెలిపిన పది నియమములు.

(మహర్షి పతంజలి. వ్యాసమహర్షి యమనియమము లైదేసి యన్నారు. కాని ఈ శ్లోకకర్త పది అని వ్రాయుట విచిత్రము! యమములలో అపరిగ్రహ మొకటి కాని ఈ శ్లోకకర్త అపరిగ్రహమునే మరచిపోయినాడు. హ్రీ, లజ్జ, మతి అనునవి ఏవిధముగా యోగమునకు అంగములో అర్థము గాకున్నది. తపస్సును రెండుసార్లు వ్రాయుట గూడ అర్థము గాకున్నది. క్షమా, తపస్సు రెండింటిని వేరువేరుగా వ్రాయ[illegible]లో తెలియదు. సత్యములో ఆర్జవములో భేదమేమిటో తెలియకున్నది (సంపా.)

★ ఇప్పుడు హఠయోగమును నేర్పువారు కొందరు ''మొదట యోగములో యమనియమములు లేకుండెను. కేవలము ఆసనము మొదలుకొని ఆరంగములు మాత్రమే యుండెను. కొంతకాలము తర్వాత యమనియమములను కలిపి అష్టాంగములుగ చేసినా రని వ్యాఖ్యానింతురు. (సంపా.)

★★ స్వేచ్ఛయా వర్తమానోఽపి యోగోక్తైర్నియమైర్వినా।
వజ్రోలిం యో విజానాతి స యోగీ సిద్ధిభాజనమ్॥ ౮3॥
తత్ర వస్తుద్వయం వక్ష్యే దుర్లభం యస్య కస్య చిత్।
క్షీరం చైకం ద్వితీయం తు నారీ చ వశవర్తినీ ॥ ౮౪॥
మేహనేన శనైః సమ్యగూర్ధ్వాకుంచనమభ్యసేత్।
పురుషోఽప్యథవా నారీ వజ్రోలీ సిద్ధిమాప్నుయాత్॥ ౮౫॥
యత్నతః శస్తనాలేన ఫూత్కారం వజ్రకందరే।
శనైః శనైః ప్రకుర్వీత వాయుసంచారకారణాత్॥ ౮౬॥

+ నారీ భగే పతద్బిన్దుమభ్యాసేనోర్ధ్వమాహరేత్।
చలితం చ నిజం బిందుమూర్ధ్వమాకృష్య రక్షయేత్॥ ౧-౮౭॥

ఆకర్షించుకొనవలెను.'' ఈశ్లోకములలో యోగస్థితికి కావలసిన వజ్రోలీముద్ర యొక్క విధి తెలుపబడినది. దీని ననుసరించువాడు యోగదర్శనములో తెలుపబడిన అఖండబ్రహ్మచర్యము నెన్నటికిని పాటించలేడు. అంతేకాదు తప్పనిసరి ఆచారహీనుడగును. యోగసిద్ధికొరకు వజ్రోలీముద్రను వ్రాసినవాడు యోగవిద్య తెలిసినవాడు కాజాలడు. యోగవిద్య నెఱుగనివాడు, విషయభోగలాలసుడే. ఇట్లు వ్రాయగలడు. ఇతరులు వ్రాయలేరు. 'యోగదర్శనములోని నియమములను పాటించని వాడు యోగసిద్ధిని పొందు' నను హఠయోగి మాన్యత నిరాధారము. ఈ వజ్రోలీ ముద్ర ద్వారా లక్షలకొలది స్త్రీపురుషులు ఆచారహీనులుగా మార్చబడుచున్నారు. దీనిద్వారా యోగము సిద్ధించునని ప్రచారము చేయబడుచున్నది. దీనివలన యోగము సిద్ధించదు. కాని అనుచితమైన విషయభోగము మాత్రము సిద్ధించగలదు. ఈ ముద్రను చేయువాడు మనస్సును వశపరచుకొనలేడు. మనస్సు అదుపులో నుండకున్న యోగమెట్లు సిద్ధించ గలదు? ఈ ముద్ర నభ్యసించు యువకు డొకడు ఢిల్లీలో తటస్థించెను. ఈ ముద్రను ఎంతకాలము నుండి అభ్యసించుచుంటి వని నేనతని నడిగితిని. పది సంవత్సరములనుండి అభ్యసించుచుంటినని అతడు తెలిపెను. దానివలన ఏమి లాభము కలిగిన దని అడిగితిని. మూత్రేంద్రియమున నలికవేసి బయట నుండి నీటిని పీల్చుకోగల రనెను. ఇదెంతటి అజ్ఞానము! ఒక యువకుడు పదేండ్లు ఆశుభకర్మ నభ్యసించును. బ్రహ్మచర్యమును నష్టముచేయును. ఫలితము మూత్రేంద్రియము ద్వారా నీటిని పీల్చుకొనుటయేనా? అతడీ పది సంవత్సరములు వేదమును చదువుటకు, యమనియమములను పాటించుటకు శ్రమించియుండిన, విద్వాంసుడు, బలవంతుడు, సదాచారి ఐయుండెడివాడు. తనను గొప్పవానిగా నిర్మించుకొన్నవ్యక్తి లక్షలమందికి మేలు చేయగలుగును. వజ్రోలీముద్రచేయువాడు తన జీవితమును నష్టభ్రష్టము చేసికొనుటేగాక, వేలకొలది వ్యక్తుల జీవితములను కూడ నాశనము చేయును. ఈ ముద్ర మానవజాతిని నాశనము చేయునది. కావున దీని నెన్నడును చేయగూడదు.

3 వేదశాస్త్రముల నింద- (ఉపదేశము ౪ - ౩౫,౩౬) ★ టీక - ''వేదములు, శాస్త్రములు, పురాణములు అన్నియు సామాన్య వేశ్యవంటివి. శాంభవీముద్రయే కుల స్త్రీ వలె గోపనీయమైనది.'' ఈ శ్లోకములలో వేదశాస్త్రపురాణములు వేశ్యతో సమానమని చెప్పబడినది. యోగ దర్శనములో పేర్కొనబడిన ఐదు నియమములలో స్వాధ్యాయ మొకటి. దీనికి వ్యాసభాష్య మిట్లున్నది - ''స్వాధ్యా

★ వేదశాస్త్రపురాణాని సామాన్య గణికా ఇవ।
ఏకైక శాంభవీముద్రా గుప్తా కులవధూరివ॥ ౩౫॥

అంతర్లక్ష్యం బహిర్దృష్టిర్నిమేషోన్మేషవర్జితా।
ఏషా సా శాంభవీ ముద్రా వేదశాస్త్రేషు గోపితా॥ ౩౬॥

య: ప్రణవాది పవిత్రాణాం జపో మోక్షశాస్త్రాధ్యయనం వా'' (యోగ. ౨-౧ వ్యా. భా.) మోక్ష శాస్త్రములు అనగా వేదములు, వేదానుకూల ఆర్షగ్రంథములు - ఇవి మోక్షస్వరూపమును తెలుపును. వీటి అధ్యయనము, మరియు ప్రణవము= ఓంకార జపము స్వాధ్యాయ మనబడును. ఋషి దయానం దుడు ఈ సూత్రమునకు వ్రాసిన అర్థము- ''(స్వాధ్యాయము) అనగా మోక్ష విద్యావిధాయకములైన వేదశాస్త్రములను చదువుట, చదివించుట మరియు ఓంకారము గురించి ఆలోచించి ఈశ్వరుని నిశ్చయించుట, నిశ్చయింపజేయుట.'' (ఋ.భా.భూ. ఉపాసనావి.) మనుమహర్షి ''నాస్తికో వేద నిందకః'' వేదమును నిందించువాడు నాస్తికుడని అన్నాడు. ఇట్లు లక్షల, కోట్ల సంవత్సరముల నుండి విద్వాంసులైన యోగులు వేదములను, వేదానుకూల గ్రంథములను చదువుచున్నారు. చదివించుచు న్నారు. వేద మార్గమున నడచుటవలననే లౌకికోన్నతి మరియుయోగసిద్ధి లభించు నని నమ్ముచున్నారు. బోధించుచున్నారు. కాని హఠయోగప్రదీపిక రచయిత వేదశాస్త్రములను వేశ్యకు సమాన మనుచు న్నాడు. ఇట్లు వ్రాయుటకు అతని కేమాత్రము సిగ్గులేక పోయెను.

(ఉపదేశము ౪-౪౦) ★ టీక - ''ఆగమజాలముచే గాని, నిగమఫలముచే గాని మోహితుల గువారు తారకము నెఱుగరు.'' ఈ శ్లోకమున ఆగమము వల యని తెలుపబడినది. నిగమఫలము లందు మోహితులైయుండువారు తారకము నెఱుగ రని తెలుపబడినది. నిగమ, ఆగమ శబ్దములు రెండును సత్యజ్ఞాన భండారములైన వేదశాస్త్ర వాచకములు. ఈ వేదశాస్త్రములను జాలము (వల) లనువాడు ఎంత మోసగాడో ఊహింపవచ్చును. వేదశాస్త్రముల జ్ఞాన మేమాత్రము లేనివారు గురువులు కాదలం తురు. వారు 'మమ్ము ఎవరైన వేదశాస్త్రముల గురించి అడిగిన మేమేమియు చెప్పజాలము. కావున వేద ములను ఖండించుట లాభసాటి యనుకొందురు. ఇట్టివారు వేదములను జాలములని తమనుఆచా ర్యులుగా ప్రకటించుకొన యత్నింతురు.

౪. యోగసిద్ధికొరకు ★★ 'కుండలి' మిథ్యాకల్పనః- (ఉపదేశము ౩-౧) టీక - ''పర్వ తములతో, వనములతో కూడిన ఈ భూగోళమును సర్పరాజు ధరించియున్నట్లే సంపూర్ణ యోగ తంత్రములను కుండలి ధరించును.'' సమస్త యోగముల కాధారము కుండలి అని తెలుపుట అజ్ఞానుల మిథ్యాకల్పనయే. ఏలన దీనికి ప్రమాణమే లేదు. ★★★

★ కేచిదాగమజాలేన కేచిన్నిగమసంకులైః।
కేచిత్తర్కేణ ముహ్యన్తి నైవ జానాతి తారకమ్ ॥౪౦॥

★★ సశైలవనధాత్రీణాం యథా ధారోఽహి నాయకః।
సర్వేషాం యోగతంత్రాణాం తథా ధారోఽహి కుండలీ॥

★★★ సర్పము భూగోళమును ధరించుచున్నదని అనుట విజ్ఞానవిరుద్ధము. (సంపా.)

(ఉపదేశము ౩-౧౦౫,౧౦౬,౧౦౭) ★ టీక - తాళముచెవిద్వారా హఠముతో తలుపులు తెరువబడినటులనే యోగులు కుండలిద్వారా మోక్షద్వారములను తెఱతురు. నిరామయబ్రహ్మ స్థానమును చేర్పుమార్గము యొక్క ద్వారమును కప్పియుండునటుల ఆ పరమేశ్వరీ నిదురించుచుండును. కందోర్ధ్వభాగమున నిదురించియుండు కుండలి ఉనికి యోగులకు మోక్షనిమిత్తమే. అది మూఢులకు బంధనము. దానిని తెలిసికొన్న వాడే యోగము నెఱిగినవాడు.

ఈ శ్లోకములలో కుండలి మోక్షసిద్ధికి ఆధారమని తెలుపబడినది. అది మోక్షప్రాప్తికి ఆధారముగుచో వేదములలో, వైదిక దర్శనములలో, ఈశాది దశోపనిషత్తులలో దీనివర్ణన తప్పక లభించెడిది. కాని ఈ గ్రంథములలో యోగ సందర్భమున కుండలి వర్ణన ఎచ్చటను కనిపించదు. యోగదర్శనములోను, దాని వ్యాసభాష్యములోను దీని పేరుగూడ కానరాదు. యోగము కొరకు కుండలి సాధనమే యైనచో మహర్షి పతంజలి దీనిని తప్పక పేర్కొనెడివాడు. ఋషిదయానందుడు యజుర్వేద మంత్రమున + కిట్లు భాష్యము వ్రాసినాడు- ''విద్య, అవిద్యల స్వరూపమును ఒకేసారి ఎఱుగువాడు అవిద్య అనగా కర్మోపాసన ద్వారా మృత్యువును లంఘించి, విద్య అనగా యథార్థజ్ఞానము ద్వారా మోక్షమును పొందును. అనగా పవిత్ర కర్మ, పవిత్రోపాసన, పవిత్రజ్ఞానము ద్వారానే మనుష్యుడు ముక్తిని పొందును. ఈశాది దశోపనిషత్తులలో ఈశ్వర స్వరూపము, దాని ప్రాప్తికి సాధనములు వర్ణింపబడియున్నవి. కాని కుండలి సాధన మని ఎచ్చటను వర్ణింపబడలేదు. కపిలాచార్యుడు సాంఖ్యశాస్త్రములో మోక్షప్రాప్తికి పురుషప్రకృతుల వివేక జ్ఞానము. వైరాగ్యము, అభ్యాసము మొదలగు వాటిని పేర్కొన్నాడు. ★★ కాని కుండలి యోగమునకు సాధనమని ఎక్కడను తెలుపలేదు. కణాదుడు ఆఱుపదార్థముల ★★★ యథార్థజ్ఞానము మోక్షమునకు సాధన మన్నాడు. కుండలి కాదు. న్యాయశాస్త్రములో

★ ఉద్ఘాటయేత్కపాటం తు యథా కుంచికయా హఠాత్।
కుండలిన్యా తథా యోగీ మోక్షద్వారం విభేదయేత్॥ ౧౦౫॥
యేన మార్గేణ గన్తవ్యం బ్రహ్మస్థానం నిరామయం।
ముఖేనాచ్ఛాద్య తద్ద్వారం ప్రసుప్తా పరమేశ్వరీ ॥ ౧౦౬॥
కందోర్ధ్వం కుండలీ శక్తిః సుప్తా మోక్షాయ యోగినామ్।
బంధనాయ చ మూఢానాం యస్తాం వేత్తి స యోగవిత్ ॥ ౧౦౭॥

+ విద్యాంచా ఽ విద్యాం చ యస్తద్వేదోభయం సహ।
అవిద్యయా మృత్యుం తీర్త్వా విద్యయా ఽ మృతమశ్నుతే ॥యజు. ౪౦-౧౪॥

★★ ''వివేకాన్నిశ్శేషదుఃఖనివృత్తౌ కృతకృత్యో నేతరాన్నేతరాత్'' (సాంఖ్య. ౩-౮౪)
''తత్ర ప్రాప్త వివేకస్యానావృత్తి శ్రుతిః'' (సాంఖ్య. ౧-౮౫)
''రాగవిరాగయోర్యోగః సృష్టిః'' (సాంఖ్య. ౨-౯); ''జ్ఞానాన్ముక్తిః'' (సాంఖ్య ౩-౬౩);
''బంధో విపర్యయాత్'' (సాంఖ్య. ౩-౨౪)

★★★ ధర్మ విశేషప్రసూతాద్ ద్రవ్య గుణ కర్మ సామాన్య విశేష సమవాయానాం పదార్థానాం సాధర్మ్యవైధర్మ్యాభ్యాం తత్త్వజ్ఞానాన్నిః శ్రేయసమ్.'' (వై శే. ౧-౧-౪)

గోతముడు ౧౬ పదార్థముల + స్వరూపజ్ఞానము వలన ముక్తి లభించు నన్నాడు. కుండలిని మోక్ష సాధన మనలేదు.

(ఉపదేశము 3-౧౧౮, ౧౨౦) ★ టీక- ''కావున ప్రతిదిన అభ్యాసముద్వారా సుఖపూర్వ కముగ నిదురించు అరుంధతిని నడిపించవలెను. దానిని నడిపించినంత మాత్రముననే యోగి సమస్త రోగములనుండి ముక్తుడగును. శక్తి సంచాలనమొనర్చిన యోగి సిద్ధికి అర్హుడు. అధికముగా చెప్పవలసిన దేమి? అతడు కాలమును గూడ సునాయాసముగ జయించును.

అరుంధతి అనగా కుండలి ఈ శ్లోకములో కుండలి ఫలితములు వర్ణింపబడినవి. ఇందేమాత్రము నిజము లేదు. ఈనా డనేకులకు కుండలీచాలన విధి నేర్పబడుచున్నది. కుండలీచాలనముద్వారా సమాధి లభించు నని దంభములు గూడ చెప్పబడు చున్నవి. కుండలి జాగృతము కాగానే శరీరమున అశాంతి ఏర్పడును. మనుష్యుడు ఇటునటు ఎగురసాగును అని ఈ కుండలిని నేర్పువా రందురు. వీరి శిష్యులు తమ కుండలి జాగృతమైనట్లు ప్రకటించుటకై తమ శరీరమున అశాంతి యున్నట్లు నటింతురు. కుండలి జాగృతము కానివారు అయోగ్యులని భావింపబడుదురు. కొందరు తమను అయోగ్యతనుండి తప్పించు కొనదలచి తమకు కుండలి జాగృతమైనట్లు నటింతురు. ఏలన కుండలి జాగృతమైనవానికి వెంటనే 'సిద్ధయోగి' అను ఉపాధి లభించును. ఇట్లు వేలకొలది మంది 'కుండలి' వలలో చిక్కుకొని తమ జీవితములను, ఇతరుల జీవితములను నష్టభ్రష్టము చేయుచుందురు. కుండలిద్వారా సిద్ధిని నమ్ము వారి మధ్య ఘోరవిరోధ మున్నట్లు తెలియుచున్నది. స్వామీ విద్యానంద విదేహ 'పరమ యోగము' అను పుస్తకమును రచించెను. అందు స్త్రీలశరీరములో కుండలి ఉండదని వ్రాసినాడు. కావున స్త్రీలు పరమ యోగినులు కాజాలరన్నాడు. దీనికి పూర్తి విరుద్ధముగ 'విద్యోత్తమా' సంన్యాసిని తన కుండలి జాగృత మైనట్లు ప్రకటించుచున్నదని వినికిడి. ఈ రెండు మాన్యతలు పరస్పర విరుద్ధములు. కావున సత్యములు కాజాలవు. వాస్తవమున ఈ రెండు మాన్యతలును అసత్యములే.

౫. జిహ్వామూలమున ఛిద్రము చేయుట-(ఉపదేశము 3-3౪,3౫,3౬) ★★ టీక- ''ఆకు వంటి పదునైన శస్త్రముతో జిహ్వామూలమున నున్న నాడిని వెంట్రుక మందము ఛేదించవలెను. ఉప్పు (సైంధ) కరక్కాయ పొడితో దానిపై రాపిడి చేయవలెను. ఇట్లు వారముదినములు రాపిడి చేయవలెను. తర్వాత మరల వెంట్రుకమందము ఛేదించవలెను. ఈ క్రమమును ఆరునెలలపాటు పాటించిన యెడల జిహ్వామూలమున గల శిరాబంధనము నశించును''.

+ ''ప్రమాణ ప్రమేయ సంశయ ప్రయోజన దృష్టాంతసిద్ధాంతావయవతర్కనిర్ణయ వాద జల్ప వితండా హేత్వాభాసచ్ఛల జాతి నిగ్రహస్థానానాం తత్త్వజ్ఞానాన్నిః శ్రేయసమ్'' (న్యాయ. ౧-౧-౧)

★ తస్మాత్సంచాలయేన్నిత్యంసుఖసుప్తారుంధతీం।
తస్యాః సంచాలనేనైవ యోగీ రోగైః ప్రముచ్యతే ॥౧౧౮॥
యేన సంచాలితా శక్తిః సః యోగీ సిద్ధిభాజనం॥
కిమత్ర బహునోక్తేన కాలం జయతి లీలయా॥౧౨౦॥
★★ స్నుహీపత్రనిభం శస్త్రం సుతీక్ష్ణం స్నిగ్ధనిర్మలం।
సమాదాయ సతస్తేన రోమమాత్రం సముచ్ఛినేత్ ॥3౪॥

యోగసిద్ధికి జిహ్వామూల నాడిని ఛేదించు విధానమును పతంజలి మొదలగు యోగజ్ఞులు ఎక్కడను వ్రాయలేదు. ఈ విధానము లోకులను భ్రాంతిలో పడవేయును. యోగసిద్ధి లభించు టటుండ, ఎన్నియో అనర్థములు వాటిల్లును. కావున బుద్ధిమంతులు ఇట్టి వినాశకర క్రియలకు దూరముగా నుండవలెను. ఇతరులను రక్షించవలెను.

౬. ఖేచరీముద్ర- (ఉపదేశము ౩-౩౭,౪౧) ★ టీక- '' ఇట్లు ఛేదనాది ఉపాయములద్వారా జిహ్వ వృద్ధి చెందిన పిదప దానిని వెనుకకు త్రిప్పి మూడు నాడుల మార్గమున పెట్టవలెను. ఇది ఖేచరీ ముద్ర. దీనినే వ్యోమచక్ర మందురు. ఈ ముద్ర ద్వారా చిత్తము భ్రుకుటి (కనుబొమ్మల) మధ్య ఆకాశమున విచరించును. సిద్ధపురుషులు దీనినే ఖేచరీముద్ర యన్నారు.''

ఖేచరీముద్ర ఫలము :- (ఉపదేశము ౩-౪౨,౪౩,౪౪) ★★ టీక- ఖేచరీముద్ర ద్వారా తాలువుపైనగల వివరమును కప్పివేసినవానికి కామిని స్పర్శవలన కూడ అతని వీర్యము చలించదు. వీర్యము చలించి యోనిమండలము చేరినను, అది వజ్రోలీ బంధముద్వారా ఆకర్షితమై పైకేగును. జిహ్వను వెనుకకు త్రిప్పి తాలు ఛిద్రమున చేర్చిన యోగి, సోమపానము చేయుచు అర్ధమాసముననే మృత్యువును జయించును.

ఖేచరీముద్ర యోగసిద్ధి యని వేదములోగాని, వేదానుకూల గ్రంథములలోగాని ఎచ్చటను కనిపించదు. అనుభూతము కాదు. అమాయకులను మోసగించుటకు ఖేచరీ ముద్ర యను వలను పన్నినారు. 'ఖేచరీముద్ర సిద్ధించినవానికి కామిని స్పర్శవలన వీర్యము స్రవించదు. స్రవించినను వజ్రోలీ ద్వారా అది పైకి ఆకర్షింపబడును'. అను మాటలవలన హఠయోగ ప్రదీపికలో స్పష్టముగ వ్యభిచారమును ప్రోత్సహించి నట్లగుచున్నది. ఎవడైనను వ్యభిచార నేరమున పట్టుబడినచో అతడు 'నేను ఖేచరీ ముద్రను సిద్ధింపజేసికొన్నాను. కావున నా వీర్యము ఎన్నటికిని ఖండితము కాజాలదు. ఒకవేళ ఖండితమై

తతః సైంధవపథ్యాభ్యాం చూర్ణితాభ్యాం ప్రఘర్షయేత
పునః సప్తదినే ప్రాప్తే రోమమాత్రం సముచ్ఛినేత ॥ ౩౫॥
ఏవం క్రమేణ షణ్మాసం నిత్యం యుక్తః సమాచరేత్।
షణ్మాసాద్రసనా మూలశిలాబంధః ప్రణశ్యతి॥ ౩౬॥

★ కలాం పరాఙ్ముఖీం కృత్వా త్రిపథే పరియోజయేత్।
సా భవేత్ ఖేచరీముద్రా వ్యోమచక్రం తదుచ్యతే॥౩౭॥

చిత్తం చరతి ఖే యస్మాజ్జిహ్వా చరతి ఖే గతా।
తేనైషా ఖేచరీ నామ ముద్రా సిద్ధైర్నిరూపితా ॥ ౪౧॥
★★ ఖేచర్యా ముద్రితం యేన వివరం లంబికోర్ధ్వతః।
న తస్య క్షరతే బిందుః కామిన్యాశ్లేషితస్య చ ॥ ౪౨॥

చలితోఽపి యదా బిందుః సంప్రాప్తో యోని మండలం।
వ్రజత్యూర్ధ్వం హృతః శక్త్యా నిబద్ధో యోనిముద్రయా ॥౪౩॥

నను వజ్రోలీద్వారా దానిని పైకి ఆకర్షించుకొందును. కాన నేను దోషిని కాను. మా మతమున ఇవి ఉత్తమకార్యములు. వీనిని చేయకుండ మమ్మెవరును నిరోధింపజాలరు.' అని వాదింతురు. ఈ విధముగా ఖేచరీముద్ర, వజ్రోలీల చాటున అనేకులు తమ కామ వాంఛలను తీర్చుకొనుచున్నారు. ఇతరులకుగూడా ఇదే మార్గమును చూపుచున్నారు.

<u>ఖేచరీముద్రకు మరొక ఫలము</u> - నాలుకను త్రిప్పి తాలువునందు చేర్చిన యోగికి రసము లభించును. ఈ రసప్రాప్తి నూటికి నూరుపాళ్లు అసత్యము. అనుభవ సిద్ధమైన నిజమేమన, యోగము నభ్యసించువాడు ఈశ్వరుని ధ్యానించినపుడు రసము లభించును. కాని ధ్యానస్థితిలో నాలుకను త్రిప్పి తాలువునందు చేర్చగానే ఆ రసము నశించును. ఈ ఖేచరీముద్రలవారు లక్షలాది జనులను ఈశ్వరుని ఆనందమునుండి వంచితుల నొనర్చినారు. కావున యోగజిజ్ఞాసువులు ఈ ముద్రలవారికిని, ముద్రలకును దూరముగా నుండవలయును.

౭. **ముద్రలను నేర్పువాడు సాక్షాత్తు ఈశ్వరుడే** - (ఉపదేశము 3-౧౨౯) + టీక- ''ముద్రలను పరంపరగ ఉపదేశించువాడే శ్రీ గురువు. స్వామీ. సాక్షాత్తు ఈశ్వరుడు.''

ఈ ముద్రల ప్రచారకులు గురువు సాక్షాత్తు ఈశ్వరుడని ఋజువు చేయ యత్నించినారు. వీరు తమను ఈశ్వరులుగా, సిద్ధులుగా ప్రకటించుకొందురు. ఛల కపటములద్వారా జనుల ధనసంపదలను హరింతురు. విషయభోగములందు మునిగి యుండ గోరుదురు.

౮. **ప్రాణాయామము**- (ఉపదేశము. ౨-౧౧) ★ **టీక**- ''ప్రాతఃకాలము, మధ్యాహ్నము, సాయంకాలము, మధ్యరాత్రి ఎనుబది, ఎనుబది కుంభకములను నాల్గుసార్లు నెమ్మదిగా అభ్యసించవలెను.

ఈ ప్రాణాయామ విధి అయుక్తము. ఏలన ప్రాతఃకాలము, మధ్యాహ్నము, సాయంకాలము, మధ్యరాత్రి ప్రాణాయామము చేసిన, మనుష్యుడు జీవించుట కఠినము. ఏలన శరీరమును, మనస్సును, ఆత్మను సురక్షితముగా నుంచుటకు అన్న పానములకు, నిద్రాదులకు వలసినంత సమయ ముండవలెను. తాము జీవించుచు ఇతరులకు ఉపకరించు టవసరము. ఏలన మనుష్యుడు తన రక్షణ కొరకు అనేక విధములుగా ఇతరుల సహాయమును పొందును. రాత్రింబవళ్లు ప్రాణాయామము చేయుచుండు నేని, అతడు తన ఉన్నతినిగాని, ఇతరుల ఉన్నతినిగాని సాధింపలేడు ఈ అతి ప్రాణాయామము వలన వ్యక్తి దుర్బలుడు, రోగియై మరణించవచ్చును. ఋషులు ప్రాణాయామములో బాటు యమనియమ

ఊర్ధ్వ జిహ్వః స్థిరో భూత్వా సోమపానం కరోతి యః॥
మాసార్ధేన న సందేహో మృత్యుం జయతి యోగవిత్ ॥౪౪॥

\+ ఉపదేశం హి ముద్రాణాం యో దత్తే సాంప్రదాయికం
స ఏవ శ్రీ గురుః స్వామీ సాక్షాదీశ్వర ఏవ సః॥ ౧౨౯॥

★ ప్రాతర్మధ్యన్దినే సాయమర్ధరాత్రే చ కుంభకాన్।
శనైర శీతిపర్యంతం చతుర్వారం సమభ్యసేత్॥ ౧౧॥

ములను పాటించుట అవసరమని తెలిపినారు. కేవలము శ్వాసను అదుపులో నుంచుకొన్నంత మాత్ర మున ఎవ్వడును యోగికాజాలడు. యోగి యగుటకు ఈశ్వర జీవ ప్రకృతి వికృతుల వాస్తవిక జ్ఞానము, శుద్ధమైన కర్మలు, శుద్ధమైన ఉపాసనయే ఆధారము. నాల్గు సమయముల ప్రాణాయామముల సంఖ్య ఒక్కొక్కసారి ఎనుబది చొప్పున ప్రతిదినము ౩౨౦ అగుచున్నది. ఇంత అధిక సంఖ్యలో ప్రాణాయా మము చేయుటవలన రూక్షత పెరుగును. ఒక్కొక్కప్పుడు మూర్ఛగూడ వచ్చును. అనేకవిధమైన రోగము లుత్పన్న మగును. ఈ విధివిపరీత ప్రాణాయామమువలన బుద్ధి భ్రష్టమగును. మహేంద్రగఢ్ (హరియాణా) నివాసి ఒక యువకుడు అధిక ప్రాణాయామమువలన తన బుద్ధి చెడిపోయిన దని నాకు తెలిపినాడు.

సంస్కారవిధి, గృహాశ్రమ ప్రకరణములో ఋషి దయానందుడు ''ఇదే విధముగ కనీసము మూడు, అధికాధికము ౨౧ ప్రాణాయామములు చేయవలెను.'' అని వ్రాసినాడు. ఇట్లు రెండు సమయముల ప్రాణాయామముల సంఖ్య ౪౨ అగుచున్నది. బలిష్ఠుడైన వ్యక్తి దీనికి రెండింతలు చేసినను ౮౪ ప్రాణా యామము లగును. హఠయోగ ప్రదీపికలో ప్రతివ్యక్తి ప్రతిదినము ౩౨౦ ప్రాణాయామములు చేయ వలె నని వ్రాయబడినది. ఇది అత్యంత హానికరము. ★

౯. వ్రేళ్లతో ముక్కును పట్టుకొనుట- (ఉపదేశము ౨-౬౪) ★★ టీక- ''మధ్యమా, చూపుడు

★ చరక సంహితలో ఆరోగ్యమునకు ' ఆహారము, నిద్రా, బ్రహ్మచర్యము, అనునవి మూడు స్తంభము లని వ్రాయబడినది. ఆహారమువలెనే నిద్రవలన గూడ శరీరమునకు బలము లభించును. రాత్రి ౯ నుండి ౩ గంటల మధ్యలో ౬ గంటల తప్పనిసరిగా నిదురించవలెను. నిద్ర శరీరమునకు, ఇంద్రియములకు, మనస్సు నకు, బుద్ధికి విశ్రాంతి నిచ్చి, బలము నిచ్చును. ఆహారము లేకుండ మానవుడు కొన్ని దినము లుండగలడు. కాని నిదుర లేక ఉండలేడు. ఒక రాత్రి నిదుర లేకున్న, మనోవాక్కాయములపై అదుపు ఉండదు.

౮౦ ప్రాణాయామములకు దాదాపు రెండు గంటల సమయ మవసరము. సాయంత్రం ౬ నుండి ౮ వరకు ప్రాణాయామము చేయును. ప్రాణాయామము చేసిన ఒక గంట తరువాత భోజనము చేయవలసియుండును. భోజనము చేసి కనీసము ఒకటి రెండు గంటల తర్వాత నిదురించవలయును. అనగా దాదాపు ౧౧ గంటల ప్రాంతమున నిదురించవలసి యుండును. మధ్యరాత్రి ౧౨ గంటలకు ప్రాణాయామము నారంభించుటకు కనీ సము అరగంట మొదలు లేవవలసి యుండును. పూర్వప్రాణాయామమువలన కలిగిన అలసట తొలగనే లేదు. మధ్యరాత్రి ప్రాణాయామము ఆరంభమగుచున్నది. మధ్యరాత్రి ౧౨ నుండి ౨ వరకు ప్రాణాయామము చేయ వలసి యుండును. తర్వాత దాదాపు ఒక గంటవరకు అనగా ౩ గంటల వరకు నిద్రరావటము కఠినమే. ఒకవేళ ౩ గంటలకు నిదురించినను ఒక గంట తర్వాత మేలుకొను టవసరము. వాస్తవముగ ౩ గంటల నుండియే బ్రాహ్మ ముహూర్తము ప్రారంభ మగును. ఒక గంట నిదురించి, ౪ గంటలకు మేలుకొని నిత్యకర్మలు చేసికొని, మళ్లీ ప్రాణాయామము చేయవలసినదే. ఇది యోగాభ్యాసమో లేక జీవితమును నాశనము చేయడమో? ఈ పుస్తకములను వ్రాయువారికి, నమ్మువారికి తెలియదనుకొనవచ్చును. ఒకవేళ ఎవడేని దీనిని నమ్మి ఎండ కాలములో ప్రాణా యామము చేయ ప్రయత్నించెనేని, వారము దినములు కూడ జీవించియుండడేమో! ఇటువంటి పుస్తకముల ముద్రణపైన, పఠనముపైన ప్రతిబంధక ముండవలయును - (సంపా.)

★★ యథోదరం భవేత్పూర్ణమనిలేన తథా లఘు।
ధారయేన్నాసికాం మధ్యతర్జనీభ్యాం వినా దృఢమ్॥౬౪॥

వ్రేలు తప్ప మిగతా మూడు వ్రేళ్లతో నాసికామధ్యమును గట్టిగా పట్టుకొని కుంభకము చేయవలెను. ఎడమ నాసికతో రేచకము చేయవలెను.''

వ్రేళ్లతో నాసికను పట్టుకొని ప్రాణాయామము చేయుట ఋషుల మాన్యతకు విరుద్ధము. ఋషి దయానందుడు సంస్కారవిధి, గృహాశ్రమ ప్రకరణమున ''నాసికను చేతితో పట్టుకొనగూడదు. బుద్ధితో ఆపవలయును. దీనిని ప్రాణాయామ మందురు'' అని వ్రాసినాడు. పతంజలి, వ్యాసుడు గూడ యోగ దర్శనమున వ్రేళ్లతో నాసికను పట్టుకొనుమని వ్రాయలేదు. వ్రేళ్లతో ముక్కును పట్టుకొని ప్రాణాయామము చేయువాడు శక్తికి మించి ప్రాణమును నిలుపును. దానివలన అనేక రోగము లుత్పన్న మగును. మూర్ఛగూడ వచ్చును. మానసిక శాంతి భంగమగును. ఇట్లు ప్రాణాయామము చేయుచు ఈశ్వరుని ధ్యానించుట అసాధ్యము. ఏలన బలపూర్వకముగ ప్రాణమును నిలిపిన బాధ కలుగును. ప్రసన్నత నశించును. ధ్యానము సిద్ధింపదు. కావున ఈ పద్ధతి హానికరము.

౧౦. **ఆసనము లన్నియు యోగాంగములేనా:-** హఠయోగ ప్రదీపికలో ఆసనములన్నియు యోగాంగములని పేర్కొనబడినది. ''స్థిరసుఖమాసనమ్'' (యోగ.౨-౪౬; సాంఖ్య.౩-౩౪) అనునది ఆసన లక్షణము. హఠయోగ ప్రదీపికలో ఆసన పరిభాషయే లేదు. అందు ౮౪ ఆసనములు యోగాంగములుగ స్వీకరింపబడినవి. అందు పెక్కు ఆసనములు అత్యంత కఠినములు. ఈ యాసనము లందు వ్యక్తి దీర్ఘకాలమువరకు సుఖపూర్వకముగ కూర్చుండలేడు. ఎగురవలసి, దుముకవలసి యుండును. ఈ యాసనములను వేయుచు సాధకుడు మనస్సును నిలుపజాలడు. ఆసనము సిద్ధింపకున్నచో ప్రాణాయామము సరిగా చేయలేడు. అని పతంజలి సిద్ధాంతము. ★ అతడు స్థిరముగ, సుఖపూర్వకముగ, దీర్ఘకాలమువరకు కూర్చుండగల్గునది ఆసనమన్నాడు. ఆ ఆసనముననే ప్రాణాయామము చక్కగా చేయగల్గును. అదియే యోగాంగము. ప్రతి ఆసనము కాజాలదు. కాన మహర్షి కపిలుడు సుఖదాయకమైన ఆసనమునే కర్తవ్యమన్నాడు. విశేష ఆసనము వలననే యోగము సిద్ధించునను ★★ నియమమేదియు ఏర్పరచలేదు.

౧౧. **'హఠయోగ ప్రదీపిక' మోక్షములో ఆటంకము:-** హఠయోగ ప్రదీపిక ననుసరించి సాధన చేయువారు చాల కాలమువరకు ప్రాణమును నిలుప నేర్పుదురు. అనేక విధములైన ఆసనములను నేర్పింతురు. నేతి, ధౌతి మొదలగు షట్కర్మలను చేయింతురు. ఆచారహీనుల జేయు వజ్రోలీవంటి కుకర్మలను చేయింతురు. దీనినే యోగ మందురు. దీనివలన మోక్షము లభించు నందురు. ఈనాడు యోగాచార్యులగుటకు ఎంతోకాలము పట్టదు. విశేషముగా విద్యనభ్యసించు అవసరము లేదు. యమనియమములను పాటించవలసిన అవసర ముండదు. అన్నపానాదులలో ఏ నియమముండదు. మద్యపానము, మాంస భక్షణము, వ్యభిచారము మొదలగునవి యోగమునకు అనుకూల మందురు. ఈ కుకర్మలను చేయువాడు యోగాచార్యులగుదురు. వీరికి ధనసంపదలు, సమ్మానము గూడ పుష్కలముగ లభించు

★ 'స్థిరసుఖమాసనమ్' (యోగ. ౨-౪౬; సాంఖ్య. ౩-౩౪);
'తస్మిన్ సతి శ్వాసప్రశ్వాసయోర్గతివిచ్ఛేదః ప్రాణాయామః (యోగ.౨-౪౯).

★★ స్థిరసుఖమాసనమితి న నియమః (సాంఖ్య. ౬-౨౪)

ను. ఇటువంటి దురాచారమును యోగ మనుటవలన విశుద్ధ యోగము కలంకిత మగును. ఋషి దయానందుడు సత్యార్థప్రకాశము 3వ సముల్లాసమున ఈ హఠయోగ ప్రదీపిక పరిత్యాజింపదగినదని వ్రాసినాడు. ★ దీనిని కపోలకల్పిత మిథ్యాగ్రంథ మన్నాడు. ఇది నిజముగా యోగ స్వరూపమును తెలుపు గ్రంథ మగునో ఋషి దయానందునివంటి యోగి దీనిని ఖండించెడివాడు కాడు. ఆయన సత్యగ్రాహి.

ప్రశ్న:– హఠయోగ ప్రదీపిక ఇంత హానికరమైనచో వేలకొలది జనులు దీని నెందు కంగీకరింతురు?

ఉత్త:– దీని కనేక కారణము లున్నవి. ౧. వేదములను, దర్శనములను, యోగవిద్యను ఎఱిగిన వారి కొరత ఏర్పడినప్పుడు స్వార్థులు, యోగవిద్యను తెలియని వారు ఇటువంటి గ్రంథములను వ్రాసినారు. ప్రచారము చేసినారు.

౨. వేదవిద్యను, యోగవిద్యను ఎఱుగని రాజులు అధికార దాహములో మునిగి ఈ మిథ్యా యోగుల నాదరించినారు. అన్ని విధముల సహాయపడినారు.

3. ఈ హఠయోగము ననుసరించువారికి అన్నపానాదుల, బ్రహ్మచర్యాది నియమముల కట్టుబాటు లేవియు లేవు. విషయలోలురకు విషయభోగమునకు కావలసిన సమస్త సౌకర్యములు లభించును.

౪. అసత్యవాది, ఛలకపటములు గలవాడు, త్రాగుబోతు, ఆచారహీనుడుగూడ కొద్దికాలములో ఆచార్యపదవిని సంపాదించగలడు. అతని కన్ని విధముల గౌరవము లభించును.

౫. ఈ మిథ్యాయోగ ప్రచారము జేయువారికి పుష్కలముగా ధనము లభించును. వారు దీనిని ధనమునకు వ్యాపారముగా జేసికొన్నారు.

౬. ఈ యోగనామధారులకు విద్యనభ్యసించు అవసర ముండదు సంయమము పాటించు అవసరముండదు. పాపము లెన్ని చేసినను మోక్షము లభించు ననుకొందురు.

ఇట్టి అనేక కారణముల వలన హానికరమైన ఈ గ్రంథమును యోగజిజ్ఞాసువులు ఆదరించినారు. అందువలన దీనికి సమ్మానము లభించినది. ప్రచారము జరిగినది.

ప్రశ్న:– కొందరు ‘యోగదర్శనములో చూపబడిన యోగము ఈనాటివారికి కఠినము. హఠయోగ ప్రదీపికలో యోగము సులభము చేయబడినది. కావున జనులు సులభముగా యోగము నభ్యసించి యోగులు కాగల్గుదు’ రందురు.

ఉత్త:– హఠయోగప్రదీపికలో యోగము చాల కఠినము చేయబడినది. ★★ తత: సైంధవ పథ్యాభ్యాం చూర్ణితాభ్యాం ప్రఘర్షయేత్।

★ ఇక పరిత్యజింపవలసిన గ్రంథములు సంక్షేపముగా పేర్కొనబడును.....
యోగములో ‘హఠయోగ ప్రదీపికాదులు’....

★★ హఠయోగప్రదీపికలో యోగము కాన్పించదు. యోగమునకు విరుద్ధమే కాననగును. (సంపా.)

పునః సప్తదినే ప్రాప్తే రోమమాత్రం సముచ్ఛినేత్ ॥ ౩౪॥

దీని ననుసరించువాడు లక్షలజన్మల నెత్తినను యోగి కాజాలడు. దీనిని సరళ మనుకొనువారు యోగము యొక్క వాస్తవిక స్వరూపమును తెలియనివారు. దేని ననుసరించుట వలన వ్యక్తి అజ్ఞాని, ఆచారహీనుడు, నిర్బలుడు, రోగి, స్వార్థపరుడు అగుచున్నాడో ఆ యోగము సరళ మెట్లు కాగలదు? హఠయోగము ననుసరించువాడు వాస్తవిక యోగస్వరూపమును ఎన్నటికిని అర్థము చేసికొనజాలడు. దీని పరిణామముగ అజ్ఞానము, అన్యాయము, బలహీనత, క్లేశములు పెంపొందుచున్నవి. అనర్థకర మైన ఈ మిథ్యా యోగమును అరికట్టుట, వాస్తవిక యోగమును ప్రచారము చేయుట ప్రతివాని ముఖ్య కర్తవ్యము. హఠయోగప్రదీపికలో తెలుపబడిన యోగము పతంజలి మున్నగు ఋషులకు విరుద్ధము. ఇది సహేతుకముగ, సప్రమాణముగ నిరూపించబడినది. కావున స్త్రీపురుషులు హఠ యోగము ననుసరించి తమ తనుమనోధనములను నష్టభ్రష్టము చేసికొనకుందురు గాక! పాతంజలయోగము ననుసరించి తరింతురు గాక! ఇతరులను తరింపజేయుదురు గాక!

★★★


౫౨. ధర్మోరక్షతి రక్షితః 1.50
౫౩. వేదమాత 2.00
౫౪. ఈశ్వరప్రాప్తి 1.00
౫౫. కలియుగము 1.50
౫౬. పునర్జన్మము 1.50
౫౭. స్వర్గంలో సమ్మె 5.00
౫౮. పితృయజ్ఞము 1.50
౫౯. జీవేశ్వరుల సంబంధము 1.50
౬౦. ఆదిహిందూసభ 1.50
౬౧. ఆర్య ప్రతినిధి సభ ఆంధ్రప్రదేశ్ యొక్క మరియు ఆర్యసమాజ నియమములు, ఉపనియమములు 10.00
౬౨. యోగేశ్వర శ్రీకృష్ణుడు 2.00
౬౩. మీరెవరు ? 2.00
౬౪. అగ్నిహోత్ర సమాలోచనము
౬౫. మహర్షి దయానందసూక్తులు
౬౬. మనుస్మృతి మహిళాస్థానము 2.50
౬౭. కర్మఫలచక్రము 2.50
౬౮. వైదిక బాలశిక్ష 10.00
౬౯. పండిత్ నరేంద్రజీ సంక్షిప్త జీవితచరిత్ర 20.00
౭౦. నవయుగ నిర్మాత మహర్షి దయానంద (రంగస్థలనాటకము) 15.00
౭౧. విద్యార్థి జీవిత విజయరహస్యం 30.00
౭౨. కాటేస్తున్న కాలుష్యము 2.50
౭౩. వేదమధు- భక్తిగీతాలు- దేశభక్తిగీతాలు 20.00

లోయినపల్లి సమాజము వారి

౭౪. గ్రుడ్డు విషయంలో ౧౦౦ తథ్యములు 3.50
౭౫. మాంసాహారము ౧౦౦ తథ్యములు 4.00
౭౬. మద్యపానము దుష్ఫలములు 4.00
౭౭. అమాయకప్రాణులు రక్తసిక్తమైన ఈ అనాగరిక కోరికలు 2.50
౭౮. శాకాహారము ౧౦౦ తథ్యములు 8.00
౭౯. కహియుగ్గహోటు ౧౦౦ తథ్యములు 14.00
౮౦. వేదోద్ధారకుడు మహర్షి దయానందుడు 4.00
౮౧. వేదవిజ్ఞానము ౧వ భాగము 30.00
౮౨. మనదేశ అవనతి దాని కారణములు 5.00
౮౩. ఆంగ్లేయులు మనకు దేశద్రోహమును ఎందుకు ఏవిధముగా నేర్పిరి ? 8.00
౮౪. మహర్షి దయానందుడు 5.50
౮౫. తొలివిమాన నిర్మాత 3.80
౮౬. మీరు గ్రుడ్డు తింటున్నారా ? ఆ గ్రుడ్డే మిమ్మల్ని తింటుంది. 1.50
౮౭. ఋషి దయానందుడు 1.50
౮౮. వైదికసృష్టి విజ్ఞానము 1.50
౮౯. ఈశ్వరస్వరూపము-మనకర్తవ్యము 3.50
౯౦. ఆచార్యవేదవ్రతమీమాంసక సంక్షిప్త ఆత్మ కథ 7.00
౯౧. స్వామి సత్యపతి పరివ్రాజక సంక్షిప్త ఆత్మకథ 3.50
౨౨. కర్మ-ఫల చక్రము 2.50
౯౩. ఆర్యోద్దేశ్య రత్నమాల 1.00

డా. కోడూరు సుబ్బారావ్ రచనలు

౯౪. క్రాంతి దయానందుడు 6.00
౯౫. వైదిక అర్థనీతి బ్రహ్మచర్యవిజ్ఞానము 15.00
౯౬. వేదములు చెప్పు ధర్మమేమి
౯౭. దగాపడిన హిందూ సోదరా
౯౮. దయానందుని ఆదర్శరాజ్యము
౯౯. మనుధర్మశాస్త్రము యెడ ద్వేషమెందుకు
౧౦౦. జననీజన్మభూమి 5.00
౧౦౧. యుగపురుషుడు శ్రీకృష్ణుడు 15.00
౧౦౨. అగ్నిహోత్రము-వైజ్ఞానికస్వరూపము 15.00
౧౦౩. వైదిక వైజ్ఞానిక సంస్కృతి 15.00
౧౦౪. మానవ ధర్మము



శ్రీ కోటికె లక్ష్మయ్య గారు

జననము 1937 శ్రీ కృష్ణజన్మాష్టమి